సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 18 | సంచిక: 325

SUNDAY Special | ఆదివారం 15-2-2026

SIMULTANEOUSLY PRINTED AT TIRUPATHI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | VISAKHAPATNAM | WARANGAL

ఆయన జగం.. ఆమె సగం

స్త్రీ పురుషులు కలిస్తేనే పరిపూర్ణత. వారిలో ఎక్కువ తక్కువలు లేవు. ఇరువురూ సమానమేనని వేదకాలం నుంచే నిరూపించిన స్వరూపం అర్ధనారీశ్వర రూపం.

IV లో



భారత్ X పాకిస్తాన్

టి20 ప్రపంచకప్‌లో భాగంగా నేడు కొలంబోలో జరిగే పోరులో దాయాది జట్లు తల పడుతున్నాయి. ఈ మెగా టోర్నీలో గెలుపోటముల రికార్డులో భారత్ 7–1తో పాక్‌పై ఆధిక్యంలో ఉంది.

12 లో

'సూపర్ సిక్స్'లు ఔట్!

మూడో బడ్జెట్‌లోనూ నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్లు, రైతులు, పొదుపు మహిళల సున్నా వడ్డీకి మంగళం

ఈ పథకాలు ఇక అమలు చేయబోరని అసెంబ్లీ సాక్షిగా సుస్పష్టం

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, దీపం పథకాలకు కోతలతో సరి

ఆరోగ్యశ్రీ బకాయిల ఊసు లేదు.. ఆసరా సాయం ఎగనామం.. ఫీజు బకాయిలు రూ.8,900 కోట్ల

పరిస్థితి అగమ్యగోచరం.. ఉద్యోగ వర్గాలకూ వంచనే.. రూ.40 వేల కోట్ల బకాయిలు

పేదల ఇళ్లు కాగితాలపైనే.. సంపద సృష్టి, సూపర్ సిక్స్ జాడలేని దగా బడ్జెట్

అభివృద్ధి, సంక్షేమం తిరోగమనమే.. వచ్చే ఏడాది మరో రూ.లక్ష కోట్ల అప్పులు

పన్నేతర, పన్నుల బాదుడుతో ప్రజల జేబులు ఖాళీ.. పన్నేతర ఆదాయం ఏకంగా రూ.11,473 కోట్లు.. పన్నుల ఆదాయం అదనంగా రూ.27,820 కోట్లు

ఇప్పటికే ఐదున్నర లక్షల పింఛన్ల కోత.. కేటాయింపులు బట్టి మరో 8 లక్షల మందికి పింఛన్ దూరం.. అంటే మొత్తం 13.5 లక్షల పింఛన్లకు మంగళం

2 లో

బడ్జెట్ స్వరూపం

మొత్తం వార్షిక బడ్జెట్ రూ.3.32 లక్షల కోట్లు

రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం
రూ.2.56 లక్షల కోట్లు	రూ.48,697 కోట్లు
రెవెన్యూ లోటు	**ద్రవ్య లోటు**
22,002 కోట్లు	రూ.75,866 కోట్లు

ఈ పథకాలకు అరకొర విదిలింపులే

తల్లికి వందనం (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	13,112.82
ఈ బడ్జెట్‌లో కేటాయింపు	8,457.07
కోత	4,655.75

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 24,504.39 కోట్లు

అన్నదాత సుఖీభవ (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	10,717
ఈ బడ్జెట్‌లో కేటాయింపు	6,600
కోత	4,117

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 20,865 కోట్లు

ఉచిత బస్సు (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	3,500
ఈ బడ్జెట్‌లో కేటాయింపు	1,420
కోత	2,080

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 8,040 కోట్లు

దీపం పథకం (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	4,083.48
ఈ బడ్జెట్‌లో కేటాయింపు	2,601
కోత	1,482.48

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 6,183 కోట్లు

బడ్జెట్ సాక్షిగా ఈ పథకాలు ఇక లేనట్టే..

ఆడబిడ్డ నిధి (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	32,400
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 97,200 కోట్లు

నిరుద్యోగ భృతి (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	7,200
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 21,600 కోట్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	9,600
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 28,800 కోట్లు

డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ (రూ.కోట్లలో)

ఏడాదికి అవసరం	5,000
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం

మూడు బడ్జెట్లలో ఎగ్గొట్టింది ₹ 15,000 కోట్లు

గుట్టుగా గ్యారెంటీ అప్పులు!

బడ్జెట్‌లో దాచేసిన బాబు సర్కారు

ప్రభుత్వ గ్యారెంటీ అప్పు.. 2025 చివరి నాటికి రూ.3.11 లక్షల కోట్లు

- రంగాలవారీగా ఆదాయ వివరాలపైనా దాగుడు మూతలు
- కూటమి సర్కారు చేసిన అప్పులపై తప్పుడు లెక్కలతో బడ్జెట్
- ఫిబ్రవరి 3వతేదీ నాటికే బడ్జెట్ అప్పులు రూ.97,571 కోట్లు
- ఆర్థిక మంత్రి లెక్కల్లో రూ.79,456 కోట్లుగా సవరణ అంచనాలు
- ప్రస్తుత ఆర్థిక ఏడాది బడ్జెట్ సవరించిన అంచనాల్లో భారీగా కోతలు
- మూలధన వ్యయంపై తప్పుడు గణాంకాలతో సవరణ అంచనాలు
- జీఎస్‌డీపీలో అప్పులు 35 నుంచి 36 శాతానికి పెరుగుదల

భృతి లేదు.. గతి లేదు	పెట్టుబడి సాయం.. మాయాజాలం
ఆడబిడ్డ నిధి.. అమ్మతోడు లేదది	ఆరోగ్యానికి అంతంతే..
తల్లికి 'వంచన'	విద్యుత్ వెలుగుల్లేవ్..

కాకి లెక్కలు.. పచ్చి అబద్ధాలు

- వాస్తవాలకు దూరంగా ఊహాజనిత సిద్ధాంతాలు
- అప్పులెంతో చెప్పలేని అపార అనుభవజ్ఞులు
- విశ్లేషణ లేని బడ్జెట్ బుక్‌లు
- పెరిగిన ఆదాయం 3.4 శాతం
- లెక్కల్లో చూపింది మాత్రం 45 శాతం
- సూపర్ సిక్స్ హామీలకు మంగళం
- ఉద్యోగులు, రైతులకు అంతులేని వంచన
- బడ్జెట్‌లో అడుగడుగునా అసత్యాలు
- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన ధ్వజం
- మీది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదు.. మీ ఇంటెలిజెన్స్ ఆర్టిఫిషియల్ అంటూ చంద్రబాబుపై వ్యంగ్యోక్తులు

బడ్జెట్‌పై పూర్తి కథనాలు 2,6,7,8 పేజీల్లో..

నేటి గుడ్డు & చికెన్ తిరుపతి జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	95 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	177 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	122 కిలో	స్కిన్ లెస్	201 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదంజగత్

నిజంగా జరిగి ఉంటే ఇంకెంత ఊహించేవారో!!

సీ-130జె హెర్క్యులస్ విమానం నుంచి దిగుతున్న ప్రధాని మోదీ

ఈఎల్ఎఫ్‌పై ల్యాండైన మోదీ

- లాంఛనంగా జాతికి అంకితం
- ఈశాన్యంలో తొలి హైవే–రన్‌వే
- గర్వించదగ్గ క్షణాలివి: ప్రధాని

11లో

ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్

అనుమానాస్పద మృతి

- పాలేరు రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు
- కారు నడిపిన వ్యక్తి ఒడ్డుకు చేరాక పరారవడంపై అనుమానాలు
- పవన్ రాజకీయ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ పుస్తకాన్ని రచించిన బొగ్గుల

13 లో





గాడి తప్పిన పాలనతో రాష్ట్రం కుదేలు

ప్రభుత్వం గాడి తప్పింది కాబట్టి రాష్ట్రమే కుదేలవుతోంది. రైతు ఆత్మహత్యల్ని ఆపలేని ప్రభుత్వం.. బడ్జెట్‌లో కనీసం వారి కుటుంబాల్ని ఆదుకునేందుకు కూడా ప్రయత్నించలేదు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు చూపించారు. గత ప్రభుత్వ లెక్కల ప్రకారం 54 లక్షల మంది రైతులకు ఈ పథకం అందించాలంటే రూ.10,200 కోట్లు కేటాయించాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్లు కేటాయిస్తే.. మీరు రూ.300 కోట్లు ఇచ్చి చేతులు **దులుపుకున్నారు.**

– కురసాల కన్నబాబు, వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి

3 కోట్ల మందికి మూడోసారీ మోసాలే..

‘సూపర్ సిక్స్’లు ఔట్!

బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

కీలక హామీలకు కేటాయింపులు సున్నా ● నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధికి మంగళం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1.80 లక్షల మంది మహిళలకు చంద్రబాబు ‘ఆడబిడ్డ నిధి’ ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక్కొక్కరికీ ఏటా రూ.18 వేలు చొప్పున మూడేళ్లలో దాదాపు రూ.లక్ష కోట్లు ఇవ్వాలి. కానీ.. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఇచ్చింది మాత్రం సున్నా. 20 లక్షల మంది నిరుద్యోగులకు భృతి ఇస్తామన్నారు. నెలకు రూ.3 వేలు చొప్పున మూడేళ్లలో నిరుద్యోగ యువతకు రూ.21,600 కోట్లు ఇవ్వాలి. కానీ.. ఇచ్చింది గుండు సున్నా. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మందికి పెన్షన్ హామీని నెరవేర్చకుండా మూడేళ్లలో రూ.28,800 కోట్లు ఎగనామం పెట్టారు. సున్నా వడ్డీ పథకానికి తూట్లు పొడిచి దాదాపు కోటి మంది పొదుపు మహిళలతోపాటు రైతులనూ దగా చేశారు. సూపర్ సిక్స్, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మూడు కోట్ల మందికిపైగా మహిళలు, రైతులు, యువతకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. మూడో బడ్జెట్‌లోనూ వాటి ప్రస్తావనే లేకుండా చేసి ఇక ఆ పథకాలను అమలు చేయబోమని విస్పష్టంగా అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినట్లైంది. తల్లికి వందనం పథకానికి రూ.13,112 కోట్లు కావాల్సి ఉంటే ఈ బడ్జెట్‌లో ఇచ్చింది రూ.8,457 కోట్లే! మొదటి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి రెండో ఏడాది కోతలతో సరిపుచ్చారు. అన్నదాతా సుఖీభవ కింద పాత బకాయిలతో కలిపి రూ.27,455 కోట్లు ఇవ్వాల్సి ఉంటే బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు రూ.6,600 కోట్లు మాత్రమే. దీపం పథకం అమలుకు ఏటా రూ.4,200 కోట్లు అవసరం కాగా బడ్జెట్లో ప్రతిపాదించింది కేవలం రూ.2,601 కోట్లే! ‘దీపం’ పథకం కింద బకాయిలతో కలిపి రూ.6,300 కోట్లు ఎగనామం పెట్టారు. మహిళలకు ఉచిత బస్సు హామీని తొలి ఏడాది నెరవేర్చకుండా రూ.3,200 కోట్లు ఎగ్గొట్టారు. రెండో ఏడాది నుంచి అనేక ఆంక్షలతో అరకొరగా అమలు చేస్తున్నారు. ఇక ఉద్యోగుల బకాయిలు దాదాపు రూ.40 వేల కోట్లు ఉండగా పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ఎప్పుడు అందుతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఇలా అన్ని వర్గాలను మోసం చేస్తూ రూ.3.32 లక్షల కోట్లతో 2026–27 వార్షిక బడ్జెట్‌ను టీడీపీ కూటమి సర్కారు బడ్జెట్‌ను శనివారం అసెంబ్లీకి సమర్పించింది. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి అనేది బడ్జెట్‌లో ఎక్కడా లేకపోగా ప్రభుత్వ గ్యారెంటీ రుణాలను దాచి పెట్టింది. భారీ అప్పులు, పన్నులు, పన్నేతర వాతలు మాత్రం బడ్జెట్‌లో ప్రస్ఫుటంగా కనిపించాయి. పది సూత్రాల సూక్తులు మినహా కార్యాచరణ బడ్జెట్‌లో కానరాలేదు.



పేదల ఇళ్లపై కక్ష..

పేదల ఇళ్ల నిర్మాణంపై చంద్రబాబు సర్కారు కక్షగట్టినట్లు వ్యవహరిస్తోంది. కాగితాలపై కేటాయింపులు మినహా ఖర్చు చేయడం లేదు. గత రెండు బడ్జెట్లలో కేటాయింపులు, వాస్తవ వ్యయం తీరే దీనికి నిదర్శనం. 2024–25లో పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.4,012 కోట్లు కేటాయించగా కేవలం రూ.1,611 కోట్లు మాత్రమే వెచ్చించారు. 2025–26లో రూ.6,317 కోట్లను కేటాయించగా సవరించిన అంచనాల్లో వ్యయం కేవలం రూ.2,017 కోట్లుగా పేర్కొన్నారు. ఈసారి రూ.6,357 కోట్లు కేటాయించినట్లు చూపిస్తున్నా ఈ ప్రభుత్వానికి వ్యయం చేసే ఉద్దేశం లేదని గత రెండు బడ్జెట్ల ద్వారా స్పష్టమవుతోంది.

అదనంగా రూ.27,820 కోట్ల పన్నుల భారం

ఒకవైపు ప్రైవేట్‌కు సంపద సృష్టిస్తూ వేగంగా అడుగులు వేస్తున్న చంద్రబాబు సర్కారు మరోవైపు పన్నేతర, పన్ను ఆదాయాల ద్వారా రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపింది. పన్నుల ఆదాయం అదనంగా రూ.27,820 కోట్లు వస్తుందని అంచనా వేయడం గమనార్హం. అంటే పన్నుల రూపంలో ప్రజలపై భారీగా వడ్డించనున్నట్లు స్పష్టమవుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ ద్వారా ప్రజలపై భారం మోపనున్నారు. పన్నుల రూపంలో ఆదాయం సమకూర్చుకోవాలని ప్రతిపాదించినా సూపర్ సిక్స్ హామీలకు మాత్రం పూర్తి స్థాయిలో కేటాయింపులు చేయకపోవడం గమనార్హం. 2025–26లో సవరించిన రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ.98,025 కోట్లు కాగా, 2026–27లో సొంత పన్ను ఆదాయం రూ.1,25,845 కోట్లుగా అంచనా వేశారు. ఇక పన్నేతర ఆదాయంపై బాబు సర్కారు తిమ్మిని బమ్మిని చేసింది. 2025–26 బడ్జెట్ అంచనాల్లో పన్నేతర ఆదాయం రూ.19,119 కోట్లు కాగా సవరించిన అంచనాల్లో రూ.14,324 కోట్లకు తగ్గించారు. అయితే వాస్తవంగా కాగ్ డిసెంబర్ వరకు విడుదల చేసిన గణాంకాల మేరకు పన్నేతర ఆదాయం కేవలం రూ.4,142 కోట్లు వచ్చింది. ఇక 2026–27 బడ్జెట్‌లో పన్నేతర ఆదాయం రూ.11,473 కోట్లుగా అంచనా వేశారు. అంటే పన్నేతర రూపంలో కూడా ప్రజలపై బాదనున్నారు.

సంపద సృష్టి శూన్యం.. ప్రైవేట్‌కు ఫండింగ్

సంపద సృష్టించి సంక్షేమం, అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు ప్రభుత్వ రంగంలో పోర్టులు, వైద్య కళాశాలల నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. పీపీపీలో విధానంలో భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు బడా సంస్థలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కింద బడ్జెట్‌లో ఏకంగా రూ.1,500 కోట్లు కేటాయింపులు చేశారు.

మరో రూ.లక్ష కోట్ల అప్పులు..

వచ్చే ఏడాది మరో రూ.లక్ష కోట్ల మేర అప్పులు చేయనున్నట్లు బడ్జెట్‌లో చంద్రబాబు సర్కారు వెల్లడించింది. ప్రజా రుణం పేరుతో రూ.97,315.41 కోట్ల మేర అప్పులు చేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ అంతర్గత రుణం కింద రూ.78,182 కోట్లు, కేంద్రం నుంచి రూ.19,133.41 కోట్లు అప్పులు చేయనున్నట్లు బడ్జెట్‌లో స్పష్టం చేశారు.

జనంపై బాదుడు.. భారీ అప్పులే లక్ష్యం..

పన్నుల రూపంలో ప్రజలపై భారీగా బాదుడు, భారీ అప్పులే లక్ష్యంగా రూ.3.32 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.2.56 లక్షల కోట్లు, మూలధన వ్యయం రూ.48,697 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లు ఉంటుందని, ఇది జీఎస్‌డీపీలో 1.11 శాతమని వెల్లడించారు. ద్రవ్యలోటు రూ.75,868 కోట్లుగా ఉంటుందని, ఇది జీఎస్‌డీపీలో 3.84 శాతంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ద్రవ్యలోటు, రెవెన్యూ లోటు తగ్గుతున్నట్లు అంకెల గారడీతో మోసపుచ్చేందుకు బడ్జెట్‌లో బాబు సర్కారు ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది.

తల్లులకు బాబు వంచన..

తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలను బడికి పంపిస్తే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. యూడైస్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 87,41,885 మంది పిల్లలు బడుల్లో చదువుతున్నారు. రూ.15 వేల వంతున ఏడాదికి రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. 2025–26లో 67,27,124 మందికి రూ.10,090 కోట్లు తల్లికి వందనం కింద పంపిణీ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. కానీ.. ఇప్పటికి 66 లక్షల మందికి రూ.6,377 కోట్లను మాత్రమే చెల్లించారు. అంటే... ఒక్కొక్కరికి రూ.8 వేలు, రూ.9 వేలు.. రూ.పది వేలు చొప్పున చెల్లించినట్లు స్పష్టమవుతోంది. ఆ అరకొర సొమ్మును కూడా 21 లక్షల మందికి ఎగ్గొట్టారు. ఇలా రెండేళ్లలో ఇప్పటికే తల్లులకు రూ.19,848.64 కోట్లకుపైగా సీఎం చంద్రబాబు బకాయిపడ్డారు. ఇక ఇప్పుడు బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకుండా కోతలు పెట్టారు.

రైతులకు వెన్నుపోటు..

పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాతా సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.10,716.53 కోట్లు అవసరం. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. 2025–26లో 46,85,838 మంది రైతులకు రూ.పది వేల చొప్పున రూ.4,685.54 కోట్లు మాత్రమే విదిల్చారు. 6,72,428 మంది రైతులకు పూర్తిగా ఎగనామం పెట్టారు. రెండేళ్లలో రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా ఒక్కో రైతుకు రూ.30 వేలు బకాయి పడ్డారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు సీఎం చంద్రబాబు ఇప్పటికే రెండేళ్లలో రూ.16,747.52 కోట్లు బకాయిపడ్డారు. తాజా బడ్జెట్‌లోనూ అరకొరగా కేటాయింపులు చేసి రైతులకు దాదాపు రూ.21 వేల కోట్ల మేర ఎగ్గొట్టారు.

తుస్సుమన్న గ్యాస్..

దీపం పథకం కింద రాష్ట్రంలో 1,59,20,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సిలిండర్ ధర రూ.855. ఈ లెక్కన ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వాలంటే రూ.4,083.48 కోట్లు అవసరం. కానీ.. తొలి ఏడాది ఒక సిలిండర్‌కు మాత్రమే రూ.865 కోట్లు మాత్రమే ఇచ్చారు. అంటే.. రూ.3,218.48 కోట్లు ఎగ్గొట్టారు. గత బడ్జెట్‌లో ఆ పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించారు. అంటే.. రెండో ఏటా రూ.1,482.48 కోట్లు బకాయిపడ్డారు. దీపం పథకం కింద రెండేళ్లలో మహిళలకు రూ.4,700.96 కోట్లను సీఎం చంద్రబాబు ఎగ్గొట్టారు. బకాయిలతో కలిపి తాజాగా రూ.6,300 కోట్లు ఎగనామం పెట్టారు.

మహిళలకు మరో మోసం..

రాష్ట్రమంతటా మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీని అమలు చేయాలంటే ఏడాదికి రూ.3,200 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలి. 2024–25లో ఆ హామీని అమలు చేయలేదు. అంటే.. తొలి ఏడాది ఉచిత బస్సు హామీ కింద రూ.3,200 కోట్ల మేర సీఎం చంద్రబాబు మహిళలకు బకాయిపడ్డారు. 2025–26 ఆగస్టు 15 నుంచి పథకాన్ని అమలు చేసినట్లు ప్రకటించారు. ఆర్టీసీలో 16 రకాల సర్వీసులు ఉండగా ఐదు సర్వీసుల్లో మాత్రమే ఉచిత బస్సును అమలు చేస్తున్నారు. తొమ్మిది రకాల సర్వీసులకు ఉచిత బస్సు పథకాన్ని వర్తింపజేయడం లేదు.

పంచ సూత్రాలతో వ్యవ‘సాయం’

- వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్ రూ.53,752.12 కోట్లు
- 15 శాతం వార్షిక వృద్ధిరేటు లక్ష్యంగా కేటాయింపులు
- ‘అన్నదాత సుఖీభవ’కు రూ.6,600 కోట్లు
- వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: స్వర్ణాంధ్ర–2047 లక్ష్య సాధనలో భాగంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రీ టెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచ సూత్రాల అమలుతో వ్యవసాయ రంగానికి ఊపిరి పోస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. శనివారం అసెంబ్లీలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.53,752.**12** కోట్లతో ప్రతిపాదించిన వ్యవసాయ బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లుగా నమోదు కాగా, అందులో వ్యవసాయ రంగం వాటా 33.2 శాతం (రూ.5.39 లక్షల కోట్లు)గా ఉందన్నారు. దేశ వ్యవసాయ రంగం వృద్ధి రేటు 0.80 శాతం కాగా, ఏపీలో 7.83 శాతంగా నమోదైందన్నారు. దేశ వ్యవసాయ ఉత్పత్తిలో ఏపీ వాటా 10 శాతంగా ఉందన్నారు. ఈ రంగం వృద్ధిరేటు పరంగా 3.91 శాతంగా నమోదైందని, 15 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించే లక్ష్యంతో 11 పంటలను గ్రోత్ ఇంజన్లుగా గుర్తించామన్నారు. ‘అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు, విత్తన రాయితీకి రూ.240 కోట్లు, ప్రకృతి సాగుకు రూ.208 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.139.65 కోట్లు, వడ్డీ లేని రుణాల పథకం కోసం రూ.250 కోట్లు, స్వచ్ఛంద పంటల బీమాకు రూ.250 కోట్లు, ఎన్ఎంఈఓ–ఓపీ(ఆయిల్‌పామ్)కు రూ.204 కోట్లు, ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు, ఎన్‌పీడీడీ (డెయిరీ డెవలప్‌మెంట్)కి రూ.202.62 కోట్లు, వేట నిషేధ భృతికి రూ.260 కోట్లు, పీఎంఎంఎస్‌వైకి రూ.398 కోట్లు, వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం కోసం రూ.500 కోట్లు, వ్యవసాయ.. ఉద్యాన, పశువైద్య, మత్స్య వర్సిటీలకు రూ.804.31 కోట్లు కేటాయించాం’ అని తెలిపారు. రంగాల వారీగా తీసుకుంటే వ్యవసాయ రంగానికి రూ.12,152.32 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.1,123.86 కోట్లు, పట్టు పరిశ్రమ రంగానికి రూ.95.87 కోట్లు, మార్కెటింగ్ శాఖకు రూ.515.39 కోట్లు, సహకార శాఖకు రూ.209.30 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.1,121.26 కోట్లు, మత్స్య శాఖకు రూ.523.52 కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకానికి రూ.13,722 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.14,276.89 కోట్లు కేటాయించామని వెల్లడించారు.

ఎనిమిది లక్షల పింఛన్లకు కోత?

- తగిన నిధులు కేటాయించని బాబు సర్కార్
- ఫిబ్రవరి గణాంకాల ప్రకారం వార్షికంగా రూ.31,584 కోట్లు అవసరం
- కానీ బడ్జెట్ కేటాయించింది కేవలం రూ.27,719 కోట్లు
- ప్రస్తుత పింఛన్లలో 8 లక్షల కోత పెడితేనే ఈ నిధులు సరిపోయే అవకాశం

సాక్షి, అమరావతి: బాబు సర్కార్ బడ్జెట్ ప్రకారం 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది లక్షల పింఛన్లకు కోత పడే పరిస్థితి నెలకొంది. గత 20 నెలలుగా గొప్పగా ప్రచారం చేసుకుంటున్న పింఛన్ల పథకానికీ ప్రభుత్వం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం దీనికి కారణం. 2026 ఫిబ్రవరిలో ప్రభుత్వం పింఛన్ లబ్ధిదారులకు రూ.2,632.04 కోట్లు (రూ. 2,724.09 కోట్లు పంపిణీ చేస్తామని ముందు ప్రకటించింది) పంపిణీ చేసింది. ఈ లెక్కన ఏడాదికి రూ.31,584 కోట్లు నిధుల అవసరం ఉంటుంది. తాజా బడ్జెట్‌లో కేవలం 27,719 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే అవసరానికన్నా 4 వేల కోట్లు తక్కువ. దీంతో ఇప్పుడు పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల సంఖ్య ఇకపై 8 లక్షలు తగ్గితేనే ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

50 ఏళ్లకే పింఛన్.. ‘హామీకే సరి’

ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన ‘50 ఏళ్లకే పింఛన్’ హామీ.. కేవలం ప్రకటనలకే పరిమితమని బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం 60 ఏళ్లు దాటిన వారు వృద్ధాప్య పింఛన్లకు అర్హులు. అయితే చంద్రబాబు ఎన్నికల ముందు ఎస్సీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు అన్న హామీని ప్రకటించారు. తాజా కేటాయింపులు చూస్తే ఈ హామీ అమలు లేనట్లేనని తేలిపోయింది.

కొత్త పింఛన్లకు ఆన్‌లైన్ ప్రక్రియ నిలిపివేత

- ➔ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత 20 నెలల్లో 60 ఏళ్లు నిండిన నిరుపేదలకు, వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు కాకపోగా, కనీసం పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశమూ లేకుండా పోయింది.
- ➔ కొత్త పింఛన్ల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ నిలిచిపోయింది.
- ➔ గత జగన్ ప్రభుత్వ హయాంలో అర్హులు ఏడాదిలో ఏ రోజైన తమ ఊరిలోని గ్రామ వార్డు సచివాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండేది.
- ➔ ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని గ్రామ,వార్డు సచివాలయాల్లో ఆ సేవలు నిలిచిపోయాయి. సచివాలయాల్లో గానీ, మండల కార్యాలయాల్లో గానీ నేరుగా దరఖాస్తు అందజేయాలన్నా వీలుకాని పరిస్థితి.
- ➔ 2024 జనవరి ఆరంభంలోనూ అప్పటి ప్రభుత్వం అర్హులైన అవ్వాతాతలకు కొత్త పింఛన్లు మంజూరు చేసింది.
- ➔ ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వరకు సైతం ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో కొత్త పింఛన్ల మంజూరు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది.
- ➔ అప్పట్లో ప్రభుత్వానికి అందిన రెండున్నర లక్షల మంది పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

జగన్ హయాంలోకంటే ఇప్పటికే ఐదున్నర లక్షల పింఛన్లు కోత

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంతో పోల్చితే ప్రస్తుతం రాష్ట్రంలో పింఛన్ లబ్ధిదారుల సంఖ్య ఐదు లక్షలకు పైగా తగ్గిపోయింది. జగన్ ప్రభుత్వంలో దేశంలో మరే రాష్ట్రంలో లేనట్టుగా అత్యధికంగా 66,34,742 మంది లబ్ధిదారులు పింఛన్ పొందారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో ఈ సంఖ్య ప్రతి నెలా తగ్గుతూనే ఉంది. ఈ ఫిబ్రవరిలో పంపిణీ జరిగిన 60.19 లక్షలు చూస్తే, చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఏకంగా ఐదున్నర లక్షల దాకా పింఛన్ల సంఖ్య తగ్గిపోయినట్టు అర్థమవుతోంది. లక్ష వరకు దివ్యాంగుల పింఛన్లు కోత పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ‘రీ వెరిఫికేషన్’ నిర్వహిస్తోందన్న విమర్శలున్నాయి.

బాబు భజనకే సరి

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 1.13 గంటల బడ్జెట్ ప్రసంగం తీరిది..
- మూడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ 13 సార్లు గత ప్రభుత్వమంటూ ప్రస్తావన
- అదే సమయంలో 16 సార్లు సీఎం చంద్రబాబును పొగుడుతూ భజన
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి రెండేళ్లు సరిపోలేదు..
- అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేస్తున్నామంటూ ప్రకటన
- ఇది రాష్ట్ర భవిష్యత్తు ఆర్థిక గమనాన్ని నిర్దేశించే బడ్జెట్ అన్న మంత్రి



సాక్షి, అమరావతి: వరుసగా మూడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నా.. చేసిన ‘గొప్ప’ పనులు చెప్పుకోలేక గత ప్రభుత్వాన్ని విమర్శించడానికి, బాబు భజన చేయడానికే బడ్జెట్ ప్రసంగమంతా సరిపోయింది. రాష్ట్ర శాసన సభలో 2026–27 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ప్రవేశపెట్టారు. మొత్తం గంటా పదమూడు నిమిషాలపాటు సాగిన ప్రసంగంలో మంత్రి 13 సార్లు గత ప్రభుత్వం అంటూ విమర్శనాత్మకంగా మాట్లాడగా.. అదే సమయంలో చంద్రబాబును పొగుడుతూ 16 సార్లకు పైగా భజన చేశారు. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి రెండేళ్ల సమయం సరిపోలేదని, అప్పులు చెల్లించడానికే కొత్త అప్పులు చేయాల్సి వస్తోందంటూ సూత్రీకరించారు. క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ 20 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం గణనీయమైన వృద్ధిని నమోదుచేసినట్లు చెప్పారు. 2024–25 బడ్జెట్‌లో రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయగా, 2025–26 బడ్జెట్ స్వర్ణాంధ్ర దిశగా నడిచిందని, ఈసారి అభివృద్ధి–సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ మూడో బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. 2024–25లో 11.75 శాతం వృద్ధి రేటు నమోదైతే.. 2025–26లో అంతర్జాతీయంగా పలు ఒడిదుడుకులున్నా 10.75 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక ఒత్తిళ్లు వచ్చినప్పటికీ భారతీయుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రధాని మోదీ ప్రపంచానికి గట్టి సంకేతాలు ఇచ్చారన్నారు. సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్‌ఫండ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌ను కేటాయిస్తున్నట్లు పయ్యావుల తెలిపారు. వివిధ దేశాలు సావరిన్ ఫండ్ ద్వారా ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతున్న తరహా విధానాన్నే ఏపీ అమలు చేస్తోందన్నారు.

రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్..

రాష్ట్ర భవిష్యత్తు ఆర్థిక గమనాన్ని నిర్దేశించే విధంగా 2026–27 సంవత్సరానికి రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను సభ ముందు ఉంచుతున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు కాగా.. మూలధన వ్యయం రూ.53,915 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్యలోటు రూ.75,868 కోట్లుగా అంచనా వేశారు. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక మంత్రి అసెంబ్లీలోని తన కార్యాలయంలో మంత్రులు, అధికారులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్ పలువురు అధికారులు పాల్గొన్నారు. శాసన మండలిలో బడ్జెట్‌ను మంత్రి వంగలపూడి అనిత సమర్పించారు.

కాకి లెక్కలు.. పచ్చి అబద్ధాలు

వాస్తవాలకు దూరంగా ఊహాజనిత సిద్ధాంతాలు

- బడ్జెట్‌లో అడుగడుగునా అసత్యాలు
- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ ధ్వజం

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌ పచ్చి అబద్ధాలు, కాకి లెక్కలు, ఊహాజనిత సిద్ధాంతాలతో నిండి ఉందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ ఆక్షేపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత పదేళ్ల ఆదాయ, వ్యయాల విశ్లేషణ లేకుండా దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి బడ్జెట్‌ రూపొందించలేదంటూ తూర్పారబట్టారు. అధికారంలోకి రాకముందు రూ.10 లక్షల కోట్ల అప్పు అని మట్కా నంబర్లు చెప్పిన వారు, ఇప్పుడు వాస్తవాలు రాస్తే తమ బండారం బయటపడుతుందని అసలు అప్పు ఎంతో బడ్జెట్‌లో పేర్కొనలేదంటూ దెప్పిపొడిచారు. ప్రభుత్వ ఆదాయ లెక్కలు చూస్తుంటే ప్రపంచ వ్యాప్తంగా అవార్డులు ఇవ్వాలని బుగ్గన ఎద్దేవా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల్లో కేవలం రూ.67,459 కోట్ల ఆదాయం వస్తే, మిగిలిన మూడు నెలల్లో ఏకంగా రూ.44,407 కోట్లు వస్తుందని చూపడం నమ్మశక్యమా? అంటూ నిలదీశారు. వాస్తవానికి ఆదాయ వృద్ధి రేటు కేవలం 3.4 శాతమే ఉన్నా.. వచ్చే ఏడాదికి 45 శాతం పెరుగుదల చూపడం ప్రజలను మోసం చేయడమే అని తేల్చిచెప్పారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోవిడ్‌ ఉన్నా తొమ్మిది శాతం వృద్ధి రేటు సాధించామని గుర్తుచేశారు. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఇంకా గత ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటని బుగ్గన మండిపడ్డారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 1.30 లక్షల ఉద్యోగాలివ్వడం, 10 వేల విలేజ్‌ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు, 17 కొత్త ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలు, పోర్టులు, ఫిషింగ్‌ హార్బర్లు నిర్మించడం విధ్వంసమా? అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా ద్వారా పేదలకు నేరుగా నగదు అందించడం మీకు గాయాలు కలిగించిందా?' అని నిలదీశారు. సూపర్‌ సిక్స్‌ హామీల అమలులో చంద్రబాబు కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆయన గణాంకాలతో సహా నిలదీశారు. రాష్ట్రంలో అవినీతి పరాకాష్టకు చేరిందని, ఇసుక, భూములే కాకుండా చివరకు కోడి వ్యర్థాల నుంచి కూడా అధికార పార్టీ నేతలు దండుకుంటున్నారని బుగ్గన ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వంలో పబ్లిసిటీ పీక్స్‌ తప్ప.. పర్ఫార్మెన్స్‌ మాత్రం పూర్‌ అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అబద్ధపు లెక్కలు మానేసి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. మీది ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ కాదు.. మీ ఇంటెలిజెన్సే ఆర్టిఫిషియల్‌ అంటూ చంద్రబాబుపై వ్యంగ్యోక్తులు విసిరారు. బుగ్గన ఇంకా ఏమన్నారంటే..

అప్పులపై మీరిచ్చిన వాస్తవాలివిగో..

మా ప్రభుత్వ హయాం పూర్తయ్యేసరికి రూ.9.74 లక్షల కోట్లు అప్పు మిగిల్చామని అబద్ధాలు చెబుతున్నారు. సీఏజీ రిపోర్టు, ఆర్బీఐ లెక్కలు, లెజిస్లేచర్‌ లెక్కలు అన్నీ తప్పు చెబుతాయి, మీరు చెప్పింది మాత్రమే నిజమని నమ్మించే యత్నం చేస్తున్నారు. అసెంబ్లీలో బూచేపల్లి శివప్రసాద్‌ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆకేపాటి అమర్నాథ్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు రాసిన ప్రశ్నకు బదులిచ్చినదాని ప్రకారం మీరు 02–06–2014 నాడు పునర్‌వ్యవస్థీకరణ జరిగినప్పుడు రాష్ట్ర అప్పు రూ.1,07,852 కోట్లు, మీ ప్రభుత్వం దిగిపోయి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చేటప్పటికి అప్పు రూ.3,06,952 కోట్లకు చేరింది. మరలా 2024లో మా ప్రభుత్వం దిగిపోయినప్పటికీ మీరిచ్చిన లెక్కల ప్రకారమే రాష్ట్ర అప్పు రూ.6,46,531 కోట్లు. అంటే మా హయాంలో కేవలం రూ.3.39 లక్షల కోట్లు అప్పు మాత్రమే జరిగింది. మీ హయాంలో 2014–19 వరకు 22 శాతం అప్పు పెంచితే మా హయాంలో కేవలం 13 శాతం మాత్రమే అప్పు పెరిగింది.

బాధ్యత లేని బడ్జెట్‌

కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ రశీదులు రూ.2,34,140 కోట్లు కాగా అప్పు రూ.98,065 కోట్లు, రెండూ కలిపి రూ.3,32,205 కోట్లుగా ఉంది. ఖర్చు అంతే ఉంది. ప్రజాస్వామ్యంలో పాలకులకు ఉన్న అత్యంత బాధ్యత బడ్జెట్‌ రూపకల్పన. కానీ ఏపీ బడ్జెట్‌ చూస్తే గతేడాది ఏం ఉందో ఇప్పుడూ అదే ఉంది. అన్నీ బొమ్మలు, సూత్రాలు, ఆలోచనలు, దీనికి ఇంత ఖర్చు పెట్టబోతున్నామన్న ఊహాజనిత థియరీ తప్ప.. విశ్లేషణాత్మక వాస్తవాలెక్కడా ఈ బడ్జెట్‌లో కనిపించలేదు. చివరకు అప్పు ఎంత ఉందన్నదీ ఎక్కడా చెప్పలేదు. కారణం అధికారంలోకి రాకముందు నుంచే రూ.12 లక్షలు, రూ.11 లక్షలు, రూ.10 లక్షల కోట్లు అప్పు అని మట్కా నంబర్లు మాదిరిగా పదే, పదే చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు వాస్తవాలు రాస్తే తాము చెప్పింది తప్పు అవుతుంది కాబట్టి అప్పు ఎంత ఉందన్నది కూడా చెప్పలేదు.

మూలధన వ్యయంపైనా అసత్యాలే

2025–26లో మొదటి తొమ్మిది నెలల్లో ప్రభుత్వం చేసిన అప్పులు తీసుకుంటే రూ.81,597 కోట్లు. ఇంకా మూడు నెలలు మిగిలి ఉంది. కానీ మీరు మాత్రం రూ.80,500 కోట్లు అప్పులు చూపిస్తున్నారు. రెండేళ్లలో మీరు చేసిన మొత్తం అప్పు రూ.3.20 లక్షల కోట్లు. చేసిన ఆ అప్పు కూడా చూపించడం లేదు. 2025–26లో మూలధన వ్యయం కింద బడ్జెట్‌లో పెట్టిన అమౌంట్‌ రూ.40,635 కోట్లు కాగా.. సవరించిన అంచనాల ప్రకారం రూ.33,134 కోట్లు చూపిస్తున్నారు. కానీ ఇంతవరకు తొమ్మిది నెలలుగా మీరు పెట్టిన ఖర్చు మాత్రం కేవలం రూ.19,224 కోట్లు మాత్రమే. అంటే బ్యాలెన్స్‌ దాదాపు రూ.14 వేల కోట్లు. ఇప్పుడు కేవలం మూడు నెలల్లో ఖర్చుపెట్టడం సాధ్యమవుతుందా? పైగా రూ.48,075 కోట్లు రానున్న ఏడాది ఖర్చుపెట్టబోతున్నామని చెబుతున్నారు. ఎక్కడ రూ.19వేల కోట్లు, ఎక్కడ రూ.48 వేల కోట్లు? ఇది ప్రజలను మోసం చేయడం కాదా? 2024 జూన్‌ నుంచి నేటి వరకూ విధ్వంసం నుంచి వికాసం దిశగా.. అంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఇప్పటివరకు మీరు చేసిన అప్పులు రూ.3,20,450 కోట్లు. 2024–25లో రూ.81,622 కోట్లు అప్పు చేశారు. ఇప్పుడు మీరు చూపించిన అప్పు రూ.85,272 కోట్లు ఉంది, ఇది కాకుండా ఆఫ్‌ బడ్జెట్‌ బారోయింగ్‌ ఆర్బీఐ ద్వారా స్టేట్‌ డెవలప్‌మెంట్‌ లోన్‌ కింద జనవరి నుంచి ఫిబ్రవరి వరకు రూ.12,300 కోట్లు అప్పు చేశారు. పౌరసరఫరాల కింద రూ.7,000 కోట్లు, మార్క్‌ ఫెడ్‌ కింద రూ.19,900 కోట్లు అప్పు చేసి.. రైతుల వద్ద నుంచి ఏ పంటలూ కొనలేదు. ఏపీఎండీసీ రూ.9వేల కోట్లు, పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ రూ.9,600 కోట్లు, డిస్కమ్స్‌ రూ.12,110 కోట్లు, ఎయిర్‌ పోర్టు డెవలప్‌మెంట్‌ సంస్థ ద్వారా రూ.1,000 కోట్లు తెచ్చారు, జలజీవన్‌ మిషన్‌ కింద రూ.10 వేల కోట్లు అప్పు చేసి.. అవి దేనికి వాడారో తెలియదు. కేంద్ర బడ్జెట్‌లో గతేడాది దేశవ్యాప్తంగా రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టామని చెబితే.. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రూ.10 వేల కోట్లు ఎలా ఖర్చు పెట్టారు? ఎక్కడ ఈ డబ్బులు వాడారు? ఈ డబ్బంతా ఎక్కడికి పోయింది. దీనిపై మీరు శ్వేతపత్రం విడుదల చేయాలి. ఏపీఐఐసీ రూ.8,500 కోట్లు, టిడ్కో రూ.4451 కోట్లు, అమరావతి కోసం రూ.47,900 కోట్లు అప్పు చేశారు. ఇది కాకుండా జీఎస్‌డీపీ లెక్కలు చూస్తే.. మీరు 11.7 శాతం పెరిగిందని చెబుతుంటే కేంద్రం మాత్రం 10 శాతం లోపే అని చెబుతారు. అలాంటప్పుడు కేంద్రానికి తొమ్మిది శాతం ఆదాయం వస్తుంటే మీకు మాత్రం రెండు శాతం కూడా రావడం లేదు. ఇదెక్కడి లెక్క?

కూటమి పాలనలో ఉద్యోగులకూ టోకరా

ఉద్యోగులను కూడా చంద్రబాబు మోసం చేశారు. 2024 జూలై నుంచి నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ, ఐఆర్‌ ఊసే ఎత్తలేదు. 2024 జూన్‌ నుంచి రిటైర్డ్‌ ఉద్యోగులకు గ్రాట్యుటీ లేదు. ఈఎల్‌ ఎన్‌క్యాష్‌మెంట్‌ 2024 నుంచి లేదు. పోలీసులకు 2024 నుంచి 5 ఏఎస్‌ఎల్, ఎస్‌ఎల్‌ పెండింగ్‌లో ఉన్నాయి. 16 నెలల నుంచి టీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంప్లాయిస్‌ హెల్త్‌ స్కీం అటకెక్కింది. ఒకటో తారీఖున జీతాలు లేవు. ఇష్టమొచ్చినట్లు బకాయిలు పెట్టారు. 30–07–2024న ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు అని చెప్పారు. ఏ ఒక్క ఇంటికీ ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన 3 లక్షల ఇళ్లు తప్ప ఒక్కటీ లేదు. ఇవన్నీ అడిగితే మీకు కోపం వస్తుంది. ప్రజల తరఫున మేం ప్రశ్నిస్తాం. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అన్న పెద్ద మనిషి కనిపించడు, పార్టీ పెట్టి ఆయనకు గ్యారంటీ ఇచ్చిన వ్యక్తీ కనిపించడు.

20 నెలల్లో 60 విజయాలంటూ తప్పుడు ప్రచారం

20 నెలల్లో 60 విజయాలు సాధించామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వ పెద్దలు సూపర్‌ సిక్స్, సూపర్‌ సెవెన్‌ లాంటి ఓ ఆరేడు కూడా సాధించలేదు. 20 లక్షల మంది నిరుద్యోగులకు 2026–27 ఆర్థిక సంవత్సరంతో కలిపి రూ.21,600 కోట్లు ఎగ్గొట్టారు. ఆడబిడ్డ నిధి కింద అక్కచెల్లెమ్మలకు రూ.92,700 కోట్లు బాకీ ఉన్నారు. 20 లక్షల మంది 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.28,800 కోట్లు పింఛన్‌ బాకీ పడ్డారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 20.865 కోట్లు ఎగ్గొట్టారు. సుమారు 6 లక్షలపై చిలుకు ఉన్న కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ ఎగ్గొట్టారు. దీపం పథకం కింద రూ.6,183 కోట్లు ఎగ్గొట్టారు. తల్లికి వందనం పథకం కింద 24,504.39 కోట్లు ఎగ్గొట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు దాదాపు రూ.8వేల కోట్లు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదు.

అవినీతి, కక్ష, మోసం, రెడ్‌ బుక్‌ సహా మీది పది సూత్రాల ప్రణాళిక

తాను నాటిన చెట్లు నీడలో తాను ఎప్పుడూ కూర్చోలేనని తెలిసినా మొక్కలు నాటారంటూ ఆర్థికమంత్రి సీఎం గురించి చెబుతున్నది నిజమే. చంద్రబాబు ఎప్పుడూ వేరొకరు నాటిన చెట్ల నీడనే కూర్చొంటారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు నియంత పాలన సాగించారు. అవినీతి, పక్షపాతం, కక్ష, అబద్ధాలు, మోసం, పారదర్శకత లేకపోవడం, శాంతిభద్రతలు విఫలం, రెడ్‌ బుక్‌ రాజ్యాంగం, డైవర్షన్‌ పాలిటిక్స్, క్రెడిట్‌ చోరీ అనే ఈ పది సూత్రాల ప్రాతిపదికన దుర్మార్గ పాలన సాగిస్తున్నారు.

క్లుప్తంగా...

ప్రజలందరిపై పరమశివుడి అనుగ్రహం ఉండాలి

తెలుగు ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'పరమశివుడి లింగోద్భవానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండగ.. పరమభక్తికి నిదర్శనం. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఆచరించే ఉపవాసం, జాగరణ నిష్ఠాగరిష్టతను చాటుతాయి' అని వైఎస్‌ జగన్‌ అన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం మల్లన్న స్వామివారి ఆలయం కొలువై ఉన్న పవిత్ర ప్రదేశం మన రాష్ట్రమని అభివర్ణించారు. మహాశివరాత్రి పర్వదినాన ఉపవాసం, జాగరణ చేసే భక్తులు భక్తి శ్రద్ధలతో శివార్చన, పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించిన వైఎస్‌ జగన్‌.. రాష్ట్ర ప్రజలందరిపై ఆ పరమశివుడి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.

దామోదరం సంజీవయ్యకు వైఎస్‌ జగన్‌ నివాళి

సాక్షి, అమరావతి: తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. 'అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ఆయన. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్‌ జగన్‌ శనివారం 'ఎక్స్‌'లో పోస్టు చేశారు.

రేపటి నుంచి విశాఖలో గవర్నర్‌ పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్‌ జస్టిస్‌ అబ్దుల్‌ నజీర్‌ సోమవారం నుంచి 20వ తేదీ (శుక్రవారం)వరకు విశాఖలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 16న రాత్రి 9 గంటలకు గవర్నర్‌ విశాఖకు చేరుకుంటారు. 17న సాయంత్రం విశాఖకు వస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతారు. అనంతరం రాష్ట్రపతి ఇచ్చే విందులో పాల్గొంటారు. 18న ఉదయం ఇంటర్నేషనల్‌ ఫ్లీట్‌ రివ్యూ (ఐఎఫ్‌ఆర్‌)లో పాల్గొంటారు. సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్న రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. 20న మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయం నుంచి విజయవాడ బయలుదేరుతారు.

సోమవారం ఐచ్ఛిక సెలవు

సాక్షి, అమరావతి: మహాశివరాత్రి మరుసటి రోజు అంటే సోమవారం ఐచ్ఛిక సెలవుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్‌ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ మూల్యాంకనం కేసు దర్యాప్తునకు 'సిట్‌'

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ జవాబు పత్రాల మూల్యాంకనంపై నమోదు చేసిన కేసు దర్యాప్తునకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌)ను నియమించింది. సీఐడీ డీజీ రవిశంకర్‌ అయ్యన్నార్‌ నేతృత్వంలోని ఈ సిట్‌ లో ఎస్పీ(సీఐడీ) కె.చక్రవర్తి సభ్యుడిగా ఉన్నారు. మార్చి 26లోగా సిట్‌ తన నివేదికను హైకోర్టుకు సమర్పించాల్సి ఉందని ప్రభుత్వం శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇల్లు చేతికొచ్చాకే ఈఎంఐ

అన్విత గ్రూప్‌ చైర్మన్‌ అచ్యుతరావు వెల్లడి

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ప్రముఖ రియల్టీ సంస్థ అన్విత గ్రూప్‌ తాజాగా 10/90 స్కీమ్‌ ప్రకటించింది. దీని ప్రకారం ఫ్లాట్‌ ధరలో ముందస్తుగా 10 శాతం చెల్లిస్తే చాలు. ఇల్లు చేతికి వచ్చాకే కస్టమర్‌కు ఈఎంఐ ప్రారంభం అవుతుందని అన్విత గ్రూప్‌ చైర్మన్‌ బొప్పన అచ్యుతరావు తెలిపారు. సంస్థ బ్రాండ్‌ అంబాసిడర్‌ నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా శనివారం ఈ స్కీమ్‌ను ప్రకటించారు. 'చాలా మంది కస్టమర్లకు ఇతర లోన్స్‌ ఉంటాయి. ఇల్లు చేతికి రాక పూర్వమే ఈఎంఐ చెల్లించాల్సి రావడం అదనపు భారం అవుతుంది. కొనుగోలుదారులకు గృహం అందించే వరకు ఆ భారాన్ని కంపెనీ తీసుకుంటుంది. ఈ సౌలభ్యంతో ఎక్కువ మంది ఇల్లు తీసుకునేందుకు ముందుకు వస్తారు' అని అచ్యుతరావు చెప్పారు. అన్విత ఖాతాలో ప్రస్తుతం 1 కోటి చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా, వీటి కింద 4,200 యూనిట్లు రానున్నాయి. అన్విత 'హై–9' ప్రాజెక్టులో దేశంలో తొలిసారిగా అన్ని టవర్లను కలుపుతూ 31వ అంతస్తులో 1.6 కిలోమీటర్ల స్కైవాక్‌ ఏర్పాటవుతోంది. ఇక వివిధ అనుమతుల దశల్లో 2 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో మూడు, వైజాగ్, విజయవాడలో ఒక్కో ప్రాజెక్ట్‌ ఏర్పాటు కానుంది. ఈ అయిదు ప్రాజెక్టులకుగాను 11,000 యూనిట్లు కొలువు దీరనున్నాయి.

వేధించి లంచాలు తీసుకున్నారు

- ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ అవినీతి లెక్కలను విచారణాధికారికి అందించిన హోటళ్ల యజమానులు!

సాక్షి, అమరావతి: లంచాల కోసం తమను వేధించిన ఓ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ను రక్షించడానికి ప్రభుత్వంలో ప్రయత్నాలు జరగడం విజయవాడ హోటళ్లు, రెస్టారెంట్ల యజమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ విజయవాడలో పనిచేసినప్పుడు లంచాల కోసం తీవ్రంగా వేధించారని హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌ (డీపీహెచ్‌) నిర్వహించిన విచారణలో హోటళ్ల యజమానులు లంచాలకు సంబంధించిన ఆధారాలు ఇచ్చినట్లు సమాచారం. ఆ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ లంచాల కోసం ఆయనే ఫిర్యాదులు లేవనెత్తి తనిఖీల పేరిట వేధించారని, తనిఖీల్లో ఆహార నాణ్యతపై తప్పుడు నివేదిక రూపొందిస్తున్నానని బెదిరించి మరీ పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారని వారు చెప్పినట్లు తెలిసింది. విజయవాడ ఎంజీ రోడ్డు పటమటలోని స్వీట్‌ షాప్‌లో రూ.35 వేలు, లబ్బీపేటలోని హోటల్‌లో రూ.30 వేలు, మొగల్రాజపురంలోని ప్రముఖ స్వీట్‌షాప్‌లో రూ.20 వేలు, ఎంజీ రోడ్డులో బెంజ్‌సర్కిల్‌ సమీపంలో ఉన్న రెస్టారెంట్‌ నుంచి రూ.25 వేలు, సిద్ధార్థ డిగ్రీ కాలేజ్‌ మదర్‌ థెరిస్సా సెంటర్‌లోని ప్రముఖ రెస్టారెంట్‌లో రూ.25 వేలు.. ఇలా విజయవాడలోని ఏయే హోటల్‌ నుంచి ఎంతెంత వసూలు చేశారనే దానిపై చిట్టాను అధికారులకు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్‌ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన వ్యవహారంలో శాఖాపరమైన చర్యల నుంచి బయటపడాలని ప్రయత్నిస్తున్న రాష్ట్రస్థాయి అధికారి.. ఆ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ విజయవాడలో వసూళ్ల దందా సాగించిన సమయంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ఫుడ్‌ సేఫ్టీ అధికారిగా వ్యవహరించారు. ఈ క్రమంలో ఈ లంచాల బాగోతంలో ఆ అధికారికి కూడా భాగం ఉందన్న ఆరోపణలున్నాయి. డీపీహెచ్‌ విచారణ ఆధారంగా ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్‌ చేయడంతోపాటు, రాష్ట్రస్థాయి అధికారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని (చార్జెస్‌ ఫ్రేమ్‌ చేయాలని) ఉన్నతాధికారులు నిర్ణయించిన ఫైల్‌ను సచివాలయంలోని వైద్యశాఖ సెక్షన్‌లో తొక్కిపెడుతున్నారని విశ్వసనీయ సమాచారం.

ముమ్ముందు మెరుగైన బడ్జెట్‌ పెడతాం

సీఎం చంద్రబాబునాయుడు



సాక్షి, అమరావతి: ఇప్పుడున్న పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌నే ప్రవేశపెట్టామని, వచ్చే రెండు, మూడు సంవత్సరాల్లో ఇంకా మంచి బడ్జెట్‌ పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఇప్పటికి ఇదే సమతుల్యమైన, ముందుచూపుతో పెట్టిన బడ్జెట్‌ అని తెలిపారు. అసెంబ్లీ లాబీలో శనివారం బడ్జెట్‌పై ఆయన మీడియాతో ముచ్చటించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని.. ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువగా ఉండడం వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాల్సి ఉందని, సేవా రంగంలోనూ అది పెరగాలన్నారు. రెండేళ్లలో అమరావతికి ఒక స్పష్టమైన రూపు వస్తుందని చంద్రబాబు తెలిపారు. అమరావతి రహదారులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తున్నామని.. పశ్చిమ బైపాస్‌ నిర్మాణంతో రాజధానికి యాక్సెస్‌ పెరిగిందని చంద్రబాబు చెప్పారు. ఇన్నర్, ఔటర్‌రింగు రోడ్లతో మరింత కనెక్టివిటీ వస్తుందన్నారు. ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు ఇస్తున్నానని వారు మారకపోతే ఇబ్బందిపడతారని స్పష్టంచేశారు. లోకేశ్‌ బాగా పనిచేస్తున్నాడని కితాబిచ్చారు. బిల్‌ గేట్స్‌ను ఏపీకి తీసుకొచ్చిన ఘనత తనదేనన్నారు.

తిరుమల లడ్డూ వ్యవహారంలో..
ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది

- ఆరోపణలు చేసిన వారు త్వరలోనే ఫలితాలు అనుభవిస్తారు
- మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారిపై నిందలు మోపిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు డిఫెన్స్‌లో పడిందని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌ వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీలకు హెరిటేజ్‌ సంస్థతో ఉన్న సంబంధాలు ఇప్పుడు బయటపడుతున్నాయన్నారు. కొంత మంది ధనార్జన కోసం ఆ దేవదేవుడి పేరునే వాడుకుని ఆరోపణలు చేశారని మండిపడ్డారు. వారు చేసిన ఆరోపణలన్నిటికీ త్వరలోనే ఫలితాలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన ఇందాపుర్, భోలేబాబా తదితర సంస్థలతో హెరిటేజ్‌కి సంబంధంలేదని బుకాయిస్తున్నారని.. కానీ, ఆ సంస్థల వెబ్‌సైట్లలో వారికి వ్యాపార సంబంధాలు ఉన్నట్లు, ఎంఓయూలు ఉన్నాయని బొత్స చెప్పారు. హెరిటేజ్‌ తాలూకు వెబ్‌సైట్‌లో ఈ సమాచారం ఉంది. రూ.300 ఉన్న నెయ్యిని రూ.700కి కొనిపించేందుకే ఆ సంస్థల ద్వారా దోపిడీకి బరితెగించారని ఆయన ఆరోపించారు.

ఒక్క కౌలు రైతుకైనా నష్టపరిహారం ఇచ్చారా?

చంద్రబాబు సర్కారు ఇరవై నెలల్లో ఇరవై లక్షల గుర్తింపు కార్డులు ఇచ్చామని చెప్పుకుంటోందని.. కానీ, ఒక్క కౌలు రైతుకైనా నష్టపరిహారం అందించారా? అని బొత్స ప్రశ్నించారు. ఈ బడ్జెట్‌వల్ల ఏ ఒక్క వర్గానికీ ఉపయోగంలేదని, రాబోయే రోజుల్లో ఈ అంశాలపై పోరాడతామని బొత్స స్పష్టంచేశారు. 'మండలి'లో ప్రభుత్వాన్ని నిలదీసి సమాధానాలు రాబడతామన్నారు.

ఆత్మస్తుతి, పరనింద.. అదే ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌..

'అసెంబ్లీలో ఇవాళ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్‌ని చూస్తే అంతా ఆత్మస్తుతి, పరనింద తప్ప ఏమీలేదు. వాళ్లను వాళ్లు పొగుడుకోవడం, గత ప్రభుత్వం పేరుతో మా మీద నిందలు వేయడం చేశారు. బడ్జెట్లో 100 సార్లు చంద్రబాబు పేరు, 75–80 సార్లు లోకేశ్‌ పేరు, 20 సార్లు పవన్‌కళ్యాణ్‌ పేరు ప్రస్తావించారు. గతేడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతు ఓ పంట వేస్తే ప్రభుత్వం ఆదుకుంటుందనే ధైర్యం, స్థైర్యం పోగొట్టారు. డ్వాక్రా సంఘాల సున్నా వడ్డీ రుణాలకు కేటాయింపులు కూడా చేయడం మానేశారు. మరి ఇంటింటికీ పారిశ్రామికవేత్తను ఎలా తయారుచేస్తారో చంద్రబాబే చెప్పాలి. రాష్ట్ర అప్పు రూ.9.46 లక్షల కోట్లు ఉన్నట్లు బడ్జెట్‌లో చెప్పారు. కానీ, మా ప్రభుత్వ హయాంలో రూ.3.21 లక్షల కోట్లు మాత్రమే అప్పుచేశామని చెప్పాం. కాబట్టి ప్రభుత్వం చెబుతున్న లెక్క తప్పు. ఇంకా రూ.97 వేల కోట్లు లోటు బడ్జెట్‌ చూపించారు. రాష్ట్ర చరిత్రలో మూడో వంతు లోటు బడ్జెట్‌ ఉండటం ఇదే తొలిసారి. నిరుద్యోగ భృతిలేదు.. ఆడబిడ్డ నిధి లేదు. పథకాలకూ నిధుల కేటాయింపులు సక్రమంగా లేవు. ఈ రెండేళ్లలో ఒక్క కౌలు రైతుకూ రైతుభరోసా ఇవ్వలేకపోయారు. ఈ బడ్జెట్‌వల్ల వీసమెత్తు మేలు జరగలేదు. బడ్జెట్‌ మోసాలపై సభలోనే తేల్చుకుంటాం.' అని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు.

గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి

రఘునాథ్‌ (ఫైల్‌)

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలోని బుడతవలస గ్రామసచివాలయ విలేజ్‌ సర్వేయర్‌ పొట్నూరు రఘునాథ్‌ (50) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన శుక్రవారం జిల్లా పరిషత్‌లో జరిగిన జాయింట్‌ ఎల్‌పీఎం మీటింగ్‌కు హాజరయ్యారు. శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో శ్రీకాకుళంలోని ఇంట్లో ఆయనకు గుండెపోటు వచ్చింది. కుటుంబీకులు ఆయన్ను 108 వాహనంలో రిమ్స్‌కు తరలిస్తుండగా మధ్యలో మృతి చెందారు. రఘునాథ్‌ 2019లో లావేటిపాలెంలో గ్రామ సచివాలయ సర్వేయర్‌గా విధుల్లో చేరారు. 2024 నుంచి బుడతవలస సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. రఘునాథ్‌కు భార్య వరలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆ 'భోలే బాబా డెయిరీ'తో వ్యాపార సంబంధాలు లేవు

హెరిటేజ్‌ ఫుడ్స్‌ ప్రకటన

సాక్షి, అమరావతి: భోలేబాబా ఆర్గానిక్‌ మిల్క్‌ లిమిటెడ్‌తో తమకు ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని హెరిటేజ్‌ ఫుడ్స్‌ శనివారం తెలిపింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందిత సంస్థగా ఉన్న ఆ డెయిరీతో తమకు ఎటువంటి సంబంధాలు లేవని పేర్కొంది. ధోల్‌పూర్‌లోని భోలే బాబా మిల్క్‌ ఫుడ్‌ ఇండస్ట్రీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ అనే మరో సంస్థ హెరిటేజ్‌ ఫుడ్స్‌తోపాటు దేశంలోని వివిధ సంస్థలకు ఉత్పత్తులను సరఫరా చేస్తోందని చెప్పింది. భోలే బాబా మిల్క్‌ ఫుడ్‌ ఇండస్ట్రీస్‌ టీటీడీకి ఏనాడూ నెయ్యి సరఫరా చేయలేదని పేర్కొంది.

అప్పులే ఆధారమా?

సందర్భం



డా॥ తమ్మా కోటిరెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 2026–27 బడ్జెట్‌లో రెవెన్యూ – వ్యయం మధ్య అధిక వ్యత్యాసం, మూలధన కల్పన తక్కువగా ఉండటం; ఆరోగ్యం, సామాజిక సేవలకు వనరుల కేటాయింపు తక్కువగా ఉండటం; రుణాలు, కేంద్ర సహాయంపై అధికంగా ఆధారపడటం; సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధనకు అవసరమయిన చర్యలు లోపించడం కారణంగా సంతులనం లోపించింది. రాష్ట్ర సొంత రెవెన్యూ రాబడిలో వృద్ధి ఆశించినంతగా లేకపోవడం, మరోవైపు రెవెన్యూ లోటు, ఆర్థిక లోటు కారణంగా ప్రాధాన్యతా రంగాలపై పెట్టుబడి తగ్గుతుంది. తద్వారా స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి క్షీణించడంతో పాటు ప్రభుత్వానికి రుణభారం పెరిగి అభివృద్ధి ప్రాజెక్టులపై వ్యయం తగ్గుతుంది.

కొరవడిన ఆర్థిక క్రమశిక్షణ

2024 జూన్ తర్వాతి కాలంలో ప్రభుత్వం రుణాలపై అధికంగా ఆధారపడటం, రెవెన్యూ సమీకరణలో నిర్మాణాత్మక బలహీనతలు, వ్యయ యాజమాన్యంలో విఫలమవడాన్ని సూచిస్తున్నది. పన్నేతర రాబడిలో తగ్గుదల, మూలధన వ్యయం తగ్గుదల, కమిటెడ్ వ్యయం (వేతనాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు)లో పెరుగుదలను ఇటీవలి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక స్పష్టపరుస్తున్నది. కాగ్ గణాంకాల ప్రకారం, 2025–26 ఆర్థిక సంవత్సరంలో 2025 నవంబర్ నాటికి రెవెన్యూ లోటు రూ. 54,355 కోట్లకు చేరుకుంది. 2026–27 బడ్జెట్‌లో మొత్తం వ్యయం రూ. 3,32,205 కోట్లుగా ప్రతిపాదించగా, ఈ మొత్తంలో రెవెన్యూ వ్యయం 77.1 శాతం కాగా, మూలధన వ్యయం 16.2 శాతం.

◆ మూలధన వ్యయం నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికంగా రుణాలపై ఆధారపడినట్లయితే భవిష్యత్తు బడ్జెట్‌లలో అధిక మొత్తాన్ని వడ్డీ చెల్లింపులపై వెచ్చించవలసి ఉంటుంది. తద్వారా నూతన మూలధన ప్రాజెక్టులు, సంక్షేమంపై వ్యయం తగ్గుతుంది.

మూలధన వ్యయాన్ని 2025–26 బడ్జెట్‌లో రూ. 40,636 కోట్లుగా అంచనా వేయగా, ప్రస్తుత 2026–27 బడ్జెట్‌లో రూ. 53,915 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన వ్యయం నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికంగా రుణాలపై ఆధారపడినట్లయితే భవిష్యత్తు బడ్జెట్‌లలో అధిక మొత్తాన్ని వడ్డీ చెల్లింపులపై వెచ్చించవలసి ఉంటుంది. తద్వారా నూతన మూలధన ప్రాజెక్టులు, సంక్షేమంపై వ్యయం తగ్గుతుంది.

రాష్ట్ర మొత్తం రుణం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019–24 మధ్య కాలంలో రూ. 2,61,302 కోట్ల నుండి రూ. 4,85,491 కోట్లకు చేరుకోగా, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 10 నెలల కాలం నాటికి (మార్చి 2025) ఈ మొత్తం రూ. 6,62,557 కోట్లకు చేరుకుందని ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాలు పార్లమెంటులో ప్రస్తావనకు రావడం జరిగింది. 2019–24 మధ్య అధికారంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ప్రాధాన్యతలుగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో సగటున రూ. 31,000 కోట్లను మూలధన వ్యయానికి కేటాయించింది. కోవిడ్–19 సమయంలో రెవెన్యూ రాబడి తగ్గినప్పటికీ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఒకవైపు సంక్షేమంపై వ్యయాన్ని పెంచుతూ మరోవైపు దీర్ఘకాల ఆర్థిక వృద్ధిని దృష్టిలో ఉంచుకొని మూలధన పెట్టుబడులను పెంచగలిగి, ఆర్థిక క్రమశిక్షణను పాటించడాన్ని గమనించాలి. మానవాభివృద్ధి, రైతుల సంక్షేమం, హౌసింగ్, ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ మరియు పట్టణాభివృద్ధి రంగాలకు 2019–24లో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన క్రమంలో జీఎస్‌డీపీ వృద్ధిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది.

మరోవైపు రుణాల వృద్ధిలోనూ తగ్గుదలను గమనించవచ్చు. వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యతల క్రమంలో పేదరిక స్థాయి 2015–16లో 11.77 శాతం నుండి 2023 నాటికి 4.2 శాతానికి తగ్గింది. మల్టీ డైమెన్షనల్ పావర్టీ స్కోర్ 2015–16లో 0.053 నుండి 2019–21లో 0.025కు మెరుగుపడింది. రాష్ట్రంలో నిరుద్యోగిత 2023–24లో 4.1 శాతానికి తగ్గింది.

ఆరోగ్యానికి అందింది అంతంత!

రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుదల వివిధ రంగాల ప్రగతితో పాటు, పెట్టుబడి స్థాయి, మౌలిక సౌకర్యాల అభివృద్ధి, మానవ మూలధనం, రెవెన్యూ సమీకరణ (పన్ను – పన్నేతర రాబడి), ఆర్థిక యాజమాన్యంపై ఆధారపడి ఉంటుంది. రెవెన్యూ రాబడిలో పెరుగుదల లేకుండా ఆర్థిక క్రమశిక్షణ లోపించినప్పుడు రాబోవు సంవత్సరాలలో జీఎస్‌డీపీ వృద్ధిలో క్షీణత ఏర్పడుతుంది.

2025–26 ఆర్థిక సంవత్సరంతో పోల్చినప్పుడు 2026–27లో రెవెన్యూ లోటు, ఆర్థిక లోటులో తగ్గుదలను ప్రతిపాదించినప్పటికీ రెవెన్యూ రాబడిలో తగ్గుదల కారణంగా తిరిగి బడ్జెట్ లోటులు పెరిగే అవకాశం ఉంది. రుణాలపై, కేంద్ర గ్రాంట్లపై అధికంగా ఆధారపడటం వలన స్వయం నిరంతర ఆదాయ వృద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది.

మానవాభివృద్ధిలో ముఖ్యాంశమైన ఆరోగ్య సంరక్షణకు బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించలేదు. 'యూనియన్ గవర్నమెంట్స్ చిల్డ్రన్ ఇన్ ఇండియా' 2025 నివేదిక ప్రకారం, ఏపీలో ఐదేళ్లలోపు పిల్లలలో పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడేవారు అధికం. ఉండాల్సినంత ఎత్తు లేనివారు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో 34.2 శాతం, పట్టణ ప్రాంతాలలో 23 శాతం. తక్కువ బరువుతో ఇబ్బంది పడే శిశువులు గ్రామీణ ప్రాంతాలలో 31.4 శాతం కాగా, పట్టణ ప్రాంతాలలో 25 శాతం.

ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం, వివిధ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ, 'ఆర్థిక బాధ్యత మరియు బడ్జెట్ నిర్వహణ చట్టం' నియమావళిని పాటిస్తూ, పన్నేతర రాబడిని పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా సంక్షేమ పథకాల అమలు లక్ష్యాన్ని సాధించడం, తప్పనిసరి వ్యయానికి సంబంధించి కాలానుగుణంగా సమీక్ష, అధిక వడ్డీతో కూడిన స్వల్పకాల రుణాల తగ్గింపు ద్వారా ఆర్థిక క్రమశిక్షణ సాధనకు కృషి చేయాలి.

వ్యాసకర్త వైస్ ఛాన్సలర్ (ఇన్‌ఛార్జి), ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్

కేటాయింపులు కాగితాలకే!

అభిప్రాయం



మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడవ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టారు. అంకెల గారడీ తప్ప ఆచరణ సాధ్యం కాని బడ్జెట్ ప్రవేశపెట్టారని చెప్పక తప్పదు. 3,32,205 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ వివిధ రంగాలకు కేటాయింపులు చేసినట్లు కనిపిస్తున్నా ఆచరణలో అసాధ్యమనే చెప్పాలి. వర్తమాన రాజకీయాలలో బడ్జెట్ కేటాయింపులు కూడా ఎన్నికల హామీల లాగానే మారిపోయాయి. అంటే ఓట్ల కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చినట్లు... బడ్జెట్ కేటాయింపులు కూడా చేస్తున్నారన్నమాట! కేటాయింపులలో మాకు అన్యాయం జరిగింది అన్న చర్చ కన్నా, అసలు బడ్జెట్ అంచనాలను అందుకోకపోతే చేసిన కేటాయింపులు కూడా అమలు కావు అన్నది గుర్తుపెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన గత రెండు బడ్జెట్‌లను పరిశీలిస్తే అంచనాలకూ, రాబడికీ చాలా వ్యత్యాసం ఉందని సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు మొదటి బడ్జెట్‌లో 'అన్నదాత సుఖీభవ'కు 5 వేల కోట్ల కేటాయింపు చేశారు. ఆచరణలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. అంటే బడ్జెట్ అంచనాలకు తగ్గట్లు రాబడి లేకపోతే కేటాయింపుల అమలు కాగితాలకు మాత్రమే పరిమితం అవుతుంది.

◆ కూటమి ప్రభుత్వ మొదటి బడ్జెట్‌లో 'అన్నదాత సుఖీభవ'కు 5 వేల కోట్లు కేటాయించారు. ఆచరణలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. బడ్జెట్ అంచనాలకు తగ్గట్లు రాబడి లేకపోతే కేటాయింపుల అమలు కాగితాలకు మాత్రమే పరిమితం అవుతుందని అర్థం చేసుకోవాలి.

అంచనాలు అందుకోలేక...

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ బడ్జెట్‌లలో వేసిన అంచనాలకు తగ్గ రాబడి వచ్చేది. ఫలితంగా బడ్జెట్ కేటాయింపులు దాదాపు పూర్తిగా అమలు చేయగలిగారు. అదే కూటమి ప్రభుత్వం అంచనాలకు తగిన రాబడి లేకపోవడం వల్ల కేటాయింపులను అమలు చేయలేకపోతున్నారు. ఉదాహరణకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో 2.18 లక్షల కోట్ల రాబడి అంచనా వేసిన ప్రభుత్వం తన సవరణ అంచనా ప్రకారమే 1.96 లక్షల కోట్లు వస్తుందని చెబుతోంది. అంటే తానే 22 వేల కోట్ల రూపాయలు అంచనాలు అందుకోలేమని స్పష్టం చేస్తోందన్నమాట. డిసెంబర్ నాటికి కేవలం రూ. 1.18 లక్షల కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. దీన్నిబట్టి ప్రభుత్వం సవరించిన అంచనానైనా అందుకుంటుందా అనే అనుమానం రాకమానదు. రాష్ట్ర పన్నుల ఆదాయం 1.66 లక్షల కోట్లు అయితే... డిసెంబర్ నాటికి 1.05 లక్షల కోట్లు, పన్నేతర ఆదాయం 13 వేల కోట్లకు గాను డిసెంబర్‌కు కేవలం 4 వేల కోట్లు మాత్రమే వచ్చింది. గత బడ్జెట్‌లో 3,22,359 కోట్ల అంచనా వేస్తే 3,00,534 కోట్లు వచ్చింది. మళ్ళీ ఈ బడ్జెట్‌లో 10 వేల కోట్లు పెంచి ప్రస్తుత బడ్జెట్ రాబడి అంచనా వేశారు.

ఎన్నికల సమయంలో కూటమి చేసిన ప్రధాన ప్రచారం ఏపీలో, ఢిల్లీలో ఒకే ప్రభుత్వం ఉంటే ఏపీకి లాభం జరుగుతుందని! మిగతా విషయాలు ఎలా ఉన్నా కేంద్రం నుంచి ఏపీకి ఏదైనా ప్రత్యేక సాయం చేసే అవకాశం ఉందంటే అది గ్రాంట్ ఇన్ ఎయిడ్ అనే చెప్పాలి. నడుస్తున్న బడ్జెట్ అంచనాలలో కేంద్ర గ్రాంట్ల ద్వారా 32,284 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఈ డిసెంబర్ నాటికి వచ్చింది కేవలం 8,772 కోట్లు మాత్రమే! కేంద్ర పన్నుల వాటాలో 40, 907 కోట్లు అంచనా వేశారు. డిసెంబర్ నాటికి వచ్చింది 27,814 కోట్లు మాత్రమే. అదే వైఎస్ జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చివరి బడ్జెట్‌లో కేంద్ర గ్రాంట్లు 45,803 కోట్లు అంచనా వేసి 34,698 కోట్లు రాబట్టుకోగలిగారు. మరి డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ఏపీకి ఏం ప్రయోజనం జరిగిందో ఆర్థిక మంత్రిగారే సమాధానం చెప్పాలి.

అప్పులపై అబద్ధాలు

అబద్ధం చెప్పినా అతికినట్లు ఉండాలంటారు పెద్దలు. కూటమి నాయకులు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన అబద్ధపు ప్రచారాల వంటివాటినే నేడు తాము అధికారంలో ఉన్నప్పటికీ ప్రచారం చేస్తున్నారు. అప్పులు రెండు రకాలు: బడ్జెట్ అప్పులు, ప్రభుత్వ గ్యారెంటీ అప్పులు. బడ్జెట్ అప్పులపై కూటమి అసత్యాలు ఏ స్థాయిలో ఉన్నాయి అంటే... కేశవ్ తాను ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోనే కూటమి మొదటి ఏడాది పూర్తి అయ్యే నాటికి ఏపీ బడ్జెట్‌లో అప్పు 5.68 లక్షల కోట్లు ఉందనీ, 26 మార్చికి 6.35 లక్షల కోట్లు, 27 మార్చి నాటికి 7.11 లక్షల కోట్లకు ఇది చేరుకుంటుందనీ చెప్పారు. బడ్జెట్‌లో అప్పులు గురించి ఇలా చెప్పి బయటికి మాత్రం 'దాదాపు 10 లక్షల కోట్లు అప్పులు మిగిల్చి వెళ్లారు' అని చెప్పడం ధర్మమా? మంత్రి గారి తీరు చూస్తుంటే... బహుశా వారు చెప్పిన దాదాపు 10 లక్షల కోట్ల అప్పు కూటమి పాలన పూర్తి అయ్యేనాటికి చేరుకోవచ్చు. అంటే ఉమ్మడి ఏపీ నుంచి వారసత్వంగా వచ్చిన దాదాపు 75 వేల కోట్లు, 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు చేసిన అప్పు, ఇప్పుడు ఈ ఐదు సంవత్సరాల పాటు చేయబోయే అప్పుకు కూడా జగన్‌మోహన్ రెడ్డే బాధ్యులు అన్నట్లు ఉంది.

జగన్ ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చడానికి తాము అప్పులు చేస్తున్నట్లు మరో అసత్యాన్ని చెబుతున్నారు. ఏ ప్రభుత్వం అయినా అప్పులను 7 సంవత్సరాల నుంచి 22 సంవత్సరాల నిడివితో చేస్తాయి. అంటే ప్రభుత్వాలు మొత్తం అప్పును ఒకేసారి తీర్చవు. జగన్ ప్రభుత్వ హయాంలో చేసిన దాదాపు 1.5 లక్షల కోట్ల బడ్జెట్ అప్పులు సుమారు 7 నుంచి 22 సంవత్సరాల వరకు తీర్చే విధంగా ఒప్పందం ఉంటుంది. ఏ ప్రభుత్వానికి అయినా ఇదే సూత్రం. కానీ కూటమి పార్టీలు మాత్రం మొత్తం జగన్ కాలంలో చేసిన అప్పులు ఈ ఐదు సంవత్సరాలలో తామే తీర్చబోతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. అందుకే తాము అప్పులు చేస్తున్నట్లు సూత్రీకరిస్తున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేయలేక, సంపద సృష్టి తాము చెప్పినట్లు సాధ్యం కాదు కనుక అప్పులు చేస్తున్నారన్న నిజాన్ని కప్పిపుచ్చుకునే విఫలయత్నంలో భాగంగానే ఈ దుష్ప్రచారం.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త

అన్నదాతను ఆదుకొనే యోచనే లేదు!

అభిప్రాయం

ఎమ్వీఎస్ నాగిరెడ్డి

'రైతు కన్నీరు దేశానికి మంచిది కాదు' అనే ఆకర్షణీయమైన నినాదంతో వ్యవసాయ శాఖా మంత్రి ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రైతులూ, అన్ని రకాల పంటలు పండించేవారూ కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వ ప్రకటనలు ఆకాశమంత ఎత్తులో ఉన్నా, వాస్తవ కేటాయింపులు రైతును ఆదుకునేలా లేవు.

రాష్ట్ర మొత్తం బడ్జెట్ రూ. 3,32,205.33 కోట్లు కాగా, అందులో వ్యవసాయానికి 53,752 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంలో సింహభాగం విద్యుత్ సబ్సిడీ (13,752 కోట్లు), పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ (14,277 కోట్లు) కేటాయింపులే ఉన్నాయి. రైతుకు నేరుగా అవసరమయ్యే విత్తన సబ్సిడీకి కేవలం 240 కోట్లు, యాంత్రికీకరణకు 139.65 కోట్లు మాత్రమే ఇచ్చారు. గత ఐదేళ్ల సగటుతో పోలిస్తే ఈ కేటాయింపులు చాలా తక్కువ. ప్రస్తుతం పెరుగుతున్న విత్తన ధరలకు ఈ నిధులు ఏమాత్రం సరిపోవని అర్థమవుతోంది.

కుదేలైన సాగు – బీమా లేని భరోసా

కూటమి పాలనలో గడిచిన రెండు ఖరీఫ్ సీజన్లను పరిశీలిస్తే, గత ఐదేళ్ల సగటు సాగు విస్తీర్ణం కంటే సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. గతంలో అమలైన ఉచిత పంటల బీమా పథకాన్ని తొలగించడంతో, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చివరకు రైతులు గతంలో చెల్లించిన ప్రీమియం సొమ్ము కూడా పరిహారం రూపంలో అందలేదు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు తమ సొంత ఖర్చుతో ప్రీమియం కట్టుకుందామన్నా ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు. ఈ బడ్జెట్‌లోనూ ఉచిత బీమా గురించి ప్రస్తావించ లేదు.

◆ గడచిన 20 నెలల పాలనలో సాగు తగ్గడం, దిగుబడులు పడిపోవడం, ధరలు లేకపోవడం వంటి అంశాలు రైతును సంక్షోభంలోకి నెట్టాయి. బడ్జెట్‌లో సాధారణ కేటాయింపులు తప్ప, కష్టాల్లో ఉన్న అన్నదాతను ఆదుకోవడానికి ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలూ లేవు.

ఎన్నికల సమయంలో రైతులకు ఏడాదికి 20 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ మొదటి ఏడాది ఆ ఊసే లేదు. ఈ బడ్జెట్‌లో 'పీఎం కిసాన్' నిధులతో కలిపి రెండు విడతల్లో 6,309.44 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను 6,600 కోట్లు కేటాయించారు. అయితే, మూడో విడత నిధులపై స్పష్టత లేదు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందిన 53.58 లక్షల మంది రైతులకు ఒక్కో కుటుంబానికి 20 వేల చొప్పున ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వమే 10,716 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. అలాగే, కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పి, ఇప్పుడు బడ్జెట్‌లో వారిని విస్మరించారు.

రాష్ట్రంలో ప్రధాన పంటల పరిస్థితి దయనీయంగా ఉంది. గతేడాది మిర్చి, పొగాకు, మామిడి సాగుదారులు భారీగా నష్టపోయారు. ఈ ఖరీఫ్‌లో ఉల్లి, అరటి, చీనీ పండించిన రైతులకు ధరలు లేక పెట్టుబడులు కూడా రాలేదు. వేరుశనగ సాగు, దిగుబడి గణనీయంగా పడిపోయాయి. ముఖ్యంగా పత్తి రైతులు మునుపెన్నడూ లేనంతగా నష్టపోయారు. ఎకరాకు 4–5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రాగా, దానికి క్వింటాలుకు 5–6 వేల రూపాయల ధర మాత్రమే దక్కుతోంది. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ. 2,400 రూపాయలు ఉంటే, రైతు మార్కెట్‌లో 15–18 వందలకే అమ్ముకోవాల్సి వస్తోంది. సజ్జల పరిస్థితి కూడా అంతే. మినుము, పెసర, కంది పంటల ధరలపై ప్రభుత్వం ఎక్కడా దృష్టి పెట్టినట్టు కనిపించదు.

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గతేడాది ధాన్యం ఉత్పత్తి 78.5 లక్షల టన్నులు కాగా, ఈ ఏడాది అది 70 లక్షల టన్నులకు పడిపోయింది. ప్రభుత్వం భారీగా కొనుగోళ్లు చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నా, క్వింటాలుకు 300 రూపాయల చొప్పున నష్టానికి రైతులు అమ్ముకుంటున్నారని పత్రికా కథనాలే చెబుతున్నాయి. మొంథా తుపాన్ ధాన్యం రైతును కోలుకోలేని దెబ్బ కొట్టింది. దీనికి తోడు రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా సంక్షోభం నెలకొంది.

రబీలో 8 జిల్లాల్లో ప్రధాన పంట శనగ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. గతేడాది నిల్వలు ఇంకా కోల్డ్ స్టోరేజీల్లోనే ఉన్నాయి. ఈ ఏడాది కనీస మద్దతు ధర రూ. 5,650 కాగా, మార్కెట్లో కేవలం 5 వేల రూపాయలకే కొంటున్నారు. పంటల సేకరణ (ప్రొక్యూర్‌మెంట్)పై ప్రభుత్వం ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. గడిచిన 20 నెలల పాలనలో సాగు తగ్గడం, దిగుబడులు పడిపోవడం, ధరలు లేకపోవడం వంటి అంశాలు రైతును సంక్షోభంలోకి నెట్టాయి. బడ్జెట్‌లో సాధారణ కేటాయింపులు తప్ప, కష్టాల్లో ఉన్న అన్నదాతను ఆదుకోవడానికి ఏ ప్రత్యేక ప్రణాళికలూ లేవు. అట్టహాసపు ప్రకటనల మధ్య అల్లాడుతున్న రైతుకు ఈ బడ్జెట్ నిరాశనే మిగిల్చింది.

వ్యాసకర్త వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్

నూరేళ్లయినా స్వర్ణాంధ్ర రాదు!

విశ్లేషణ

వి. వెంకటేశ్వర్లు

'ఇది పద్దుల ప్రకటన కాదు, ఐదు కోట్ల ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన బడ్జెట్... అంతిమంగా స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా సాగుతున్న బడ్జెట్' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2026–27 బడ్జెట్ ప్రవేశ పెడుతూ మాట్లాడారు. కానీ మాటలు కోటలు దాటినా పద్దులు గడప దాటలేదన్నట్లుంది ఈ బడ్జెట్.

2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూ. 3,32,205 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. గతంలో ఏనాడూ లేనంతగా ద్రవ్య లోటు రూ. 75,868 వేల కోట్లు, రెవిన్యూ లోటు రూ. 22,002 వేల కోట్లు వెరసి 30% లోటుతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ లోటు పూడ్చడానికి సంబంధించిన వివరాలు ప్రస్తావించనే లేదు. దీనిని బట్టి రానున్న కాలంలో 'అప్పు చేసి పప్పు కూడు' అన్నట్లు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై లక్షల కోట్లు అప్పు మోపే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది. 2047 నాటికి రూ. 350 లక్షల కోట్లతో స్వర్ణాంధ్ర దిశగా పయనిస్తామనీ, సగటు ఆదాయం 55 లక్షల రూపాయలకు చేరుకుంటామనీ గవర్నర్ ప్రసంగం ద్వారా చెప్పారు. కానీ బడ్జెట్‌లో ఎక్కడా ఆ లక్ష్యం కనిపించలేదు.

2024 ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడానికి ఎటువంటి భరోసా, కేటాయింపులు బడ్జెట్‌లో కనిపించలేదు. యువతకు గుండె నిబ్బరాన్ని ఇచ్చిందని చెబుతున్నా... ప్రతి నిరుద్యోగికీ రూ. 3,000 భృతి చెల్లిస్తామన్న మాటే లేదు. ప్రతి ఆడపడుచుకూ ఏడాదికి రూ. 18,000 ఇస్తామన్న వాగ్దానాన్ని నిజం చేసే ఊసే లేదు. విశాఖ ఉక్కు అభివృద్ధి, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం మాటే లేదు. ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా చెప్పుకుంటున్న పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేస్తామని గొప్పగా చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం కేటాయించింది కేవలం రూ. 6,105 కోట్లు మాత్రమే. ఈ డబ్బు గేట్లు పెట్టడానికి కూడా సరిపోవు. అంటే మరో రెండేళ్లపాటు నిర్వాసితులను గోదావరిలో ముంచడానికి కూటమి ప్రభుత్వం పూనుకున్నదన్నమాట!

రానున్న కాలంలో నిరుద్యోగ సమస్యను నిర్మూలిస్తామని చెప్తున్న ప్రభుత్వం యువతకు కేటాయించింది కేవలం రూ. 4,000 కోట్లు మాత్రమే. హరిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని నిర్మిస్తామని వ్యవసాయ రంగానికి కేవలం 13,598 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపులతో దాన్ని ఎలా సాధ్యం చేస్తారో మరి. 'ధరల స్థిరీకరణ నిధి' కోసం గత ఏడాది 300 కోట్ల కేటాయించి 1,200 కోట్లు ఖర్చు చేశాము, ఈ ఏడాది రూ. 500 కోట్లు కేటాయిస్తామని ఘనంగా ప్రకటించారు. ఈ నిధితో ధరలను ఎలా నియంత్రిస్తారు? పంట నష్ట పరిహారానికి ఎలా చెల్లిస్తారు? రైతు బజార్లను కూడా పీపీపీ విధానం కింద ప్రకటించడం అత్యంత దుర్మార్గం.

రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు అన్నం పెట్టే 'గ్రామీణ ఉపాధి హామీ' పథకానికి 125 రోజులు పని దినాలు పెంచామని మోదీ, బాబులు ఘనంగా చెబుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం రూ. 8,365 కోట్లు మాత్రమే కేటాయించాయి. ఈ డబ్బు సగటున కుటుంబానికి 40 రోజులు పని కల్పించడానికి కూడా సరిపోదు. ఉపాధి నిధులతో గోకులం షెడ్లు, పశుగ్రాసం పెంపకం, గోశాలలు నిర్మిస్తామని చెప్పడం కోటి కుటుంబాల పొట్ట కొట్టి కాంట్రాక్టర్లకు కట్టబెట్టడమే. వ్యవసాయ కార్మికులను వ్యవసాయ రంగం నుండి బయటికి నెట్టేయడానికి 100% సబ్సిడీతో యాంత్రికీకరణ ప్రవేశ పెట్టడానికి భూస్వాములకు రూ. 139 కోట్లు కేటాయించారు. రానున్న ఏడాది కాలంలో ఆరు లక్షల పక్కా గృహాలు నిర్మిస్తామని చెప్పి, కేటాయింపులు చేసింది మాత్రం 5,451 కోట్లు మాత్రమే. ఈ డబ్బుతో మూడు లక్షల ఇళ్లు కూడా పూర్తి కావు.

◆ ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు బడ్జెట్‌లో హక్కుగా రావాల్సినటువంటి సబ్ ప్లాన్ నిధుల ఊసెత్తకుండా సంక్షేమం – సబ్ ప్లాన్‌ను కలగాపులగం చేసి వేల కోట్లు కేటాయించినట్లు అంకెల గారడీ చేశారు.

ప్రపంచం అంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం చేస్తామని చెప్పి పెట్టుబడులు మౌలిక సౌకర్యాల కోసం కేటాయించింది కేవలం రూ. 1,283 కోట్లు మాత్రమే. తద్వారా లక్షలాది మందికి ఎలా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారో కూటమి ప్రభుత్వం చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు బడ్జెట్‌లో హక్కుగా రావాల్సినటువంటి సబ్ ప్లాన్ నిధుల ఊసెత్తకుండా సంక్షేమం – సబ్ ప్లాన్‌ను కలగాపులగం చేసి వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు అంకెలు గారడీ చేశారు. పేద పిల్లలు చదువుకునే గురుకులాలకు, హాస్టళ్లకు కేటాయించింది కేవలం 300 కోట్లు. రానున్న కాలంలో పేద పిల్లలను హాస్టళ్ల నుంచి బయటికి తరిమే ప్రమాదం కనిపిస్తోంది. ఇలాంటి బడ్జెట్ వల్ల 2047 నాటికి కాదు కదా... ఇంకా 100 సంవత్సరాలైనా 'స్వర్ణాంధ్ర'నే కాదు, కనీసం హరితాంధ్రను సాధించడం కూడా ఈ కూటమి ప్రభుత్వానికి సాధ్యం కాదు.

వ్యాసకర్త వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇప్పటికి పని కానిచ్చేద్దాం...

విశ్లేషణ

తలకోల రాహుల్ రెడ్డి

ఆర్థిక శాస్త్రంలో బడ్జెట్ అంటే కేవలం వాగ్దానాల జాబితా కాదు, ఒక ప్రభుత్వ ప్రాధాన్యాల బ్యాలెన్స్‌షీట్. 2026–27 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌ను సాంకేతికంగా పరిశీలిస్తే... వినియోగాన్ని పెంచుతూ, ఉత్పాదక సామర్థ్యం పెంచే మూలధన పెట్టుబడిని నిర్లక్ష్యం చేస్తున్న తత్త్వం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం సుమారు రూ. 2.56 లక్షల కోట్లు కాగా, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ కేవలం రూ. 48,697 కోట్లు మాత్రమే! అంటే మొత్తం ఖర్చులో దాదాపు ఆరు వంతులలో ఒక వంతు మాత్రమే దీర్ఘకాలిక ఆస్తుల సృష్టికి వెళుతోంది. మిగతా భాగం జీతాలు, సబ్సిడీలు, వడ్డీలు, పరిపాలనా ఖర్చుల వంటి తక్షణ వినియోగానికి వెళుతోంది. పునర్వ్యవస్థీకృత రాష్ట్రంగా, పరిపూర్ణ విద్యా– వైద్య, లోతైన పారిశ్రామిక బేస్, సమగ్ర రవాణా–లాజిస్టిక్స్ వ్యవస్థలు వంటివి ఇంకా అసంపూర్ణంగా ఉన్న సందర్భంలో ఇది ఆర్థికంగా ప్రమాదకర దృక్పథం.

మౌలిక వసతుల శాఖలో క్షీణత

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ శాఖకు కేటాయింపులు గత సవరణ బడ్జెట్‌తో పోలిస్తే తగ్గడం ఆందోళనకరం. గత ఆర్థిక సంవత్సరంలో ఈ శాఖకు సుమారు 921 కోట్లు ఉండగా, ఈసారి అది రూ. 719 కోట్లకు పడిపోయింది. ప్రపంచ నిధుల్ని, పరిశ్రమల్ని ఆకర్షిస్తామని చెప్పుకుంటూ, మౌలిక వసతుల శాఖలకే కత్తెర వేయడం పెట్టుబడిదారులకు తప్పు సంకేతం. పెట్టుబడిదారులు ప్రసంగాలపై కాదు, పోర్టుల సదుపాయం, పవర్ నమ్మదగినదా, లాజిస్టిక్స్ ఖర్చు తక్కువగా ఉందా అనే సూక్ష్మ సూచికలపై నిర్ణయాలు తీసుకుంటారు.

రాష్ట్రానికి ఉన్న అతిపెద్ద బలం సుదీర్ఘ తీరరేఖ. కానీ పోర్టుల రంగం 'నిర్మాణ వ్యాధి'తో కునారిల్లుతోంది. కాగితం మీద పోర్టుల మూలధన కేటాయింపులు రూ. 400.37 కోట్లుగా చూపించినా, గత ఏడాది వాస్తవంగా ఖర్చు చేసింది కేవలం రూ. 36.13 కోట్లు మాత్రమే. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ వ్యయానికి మధ్య ఉన్న ఈ భారీ వ్యత్యాసం క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదని చాటి చెబుతోంది. తీర ప్రాంత అభివృద్ధి ద్వారా దక్కాల్సిన చరిత్రాత్మక ఆర్థిక అవకాశాన్ని ప్రభుత్వం చేజేతులా జారవిడుచుకుంటోంది.

◆ ఈ బడ్జెట్ ఒక మౌలిక ప్రశ్నను రాష్ట్రం ముందుంచుతోంది. ఇది ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును సిద్ధం చేసే వృద్ధి బడ్జెట్టా, లేక కేవలం ప్రస్తుత ఖర్చులను నిర్వహిస్తూ, బాధ్యతలను భవిష్యత్తు తరాలపై తోసేస్తున్న ఖర్చు బడ్జెట్టా?

పారిశ్రామిక తిరోగమనం

పారిశ్రామిక రంగంలోనూ ఇదే దుఃస్థితి నెలకొంది. ఈ రంగంలో రెవెన్యూ ఖర్చు రూ. 1,743.91 కోట్లకు పెరగగా, పారిశ్రామిక ఆస్తుల కల్పనకు చేసే మూలధన పెట్టుబడి రూ. 910.99 కోట్ల నుంచి రూ. 756.61 కోట్లకు తగ్గింది. ఫ్యాక్టరీలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్లు, తయారీ వ్యవస్థలపై పెట్టాల్సిన నిధులను పథకాల నిర్వహణకు, వడ్డీల చెల్లింపులకు మళ్లించడం ఆందోళనకరం. పబ్లిక్ ఆస్తులను పీపీపీ పేరుతో భారీ ప్రోత్సాహకాలతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా అభివృద్ధి సాధించలేం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేని చోట ఏ ఇన్‌సెంటివ్‌లూ పెట్టుబడులను తీసుకురాలేవు.

బడ్జెట్‌లో చూపని 'గ్యారంటీలు' రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెను ముప్పుగా మారనున్నాయి. పవర్ యుటిలిటీలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు ఇచ్చిన గ్యారంటీలు ప్రస్తుతానికి ద్రవ్య లోటులో కనిపించవు. కానీ ఆ సంస్థలు అప్పులు కట్టలేని స్థితికి చేరగానే ఆ భారమంతా ప్రజలపైనే పడుతుంది. ఇది రేపటి రోజున విద్యుత్ ఛార్జీల పెంపు, ప్రజా సేవల కోతకు దారితీస్తుంది. నగరాల అభివృద్ధికి కేటాయించిన రూ. 7,561.85 కోట్లలో అధిక భాగం ఆస్తుల నిర్మాణం కోసం కాకుండా రుణాల రూపంలోనే ఉంది. పాత ప్రాజెక్టులే పూర్తికాని తరుణంలో, కొత్తగా అప్పులు పెంచడం అంటే ఆ నిధులు దారి మళ్లుతున్నాయని అర్థం.

ఈ బడ్జెట్ ఒక మౌలిక ప్రశ్నను రాష్ట్రం ముందుంచుతోంది. ఇది ఏపీ ఆర్థిక భవిష్యత్తును సిద్ధం చేసే వృద్ధి బడ్జెట్టా, లేక కేవలం ప్రస్తుత ఖర్చులను నిర్వహిస్తూ, బాధ్యతలను భవిష్యత్ తరాలపై తోసేస్తున్న ఖర్చు బడ్జెట్టా? ప్రభుత్వ ధోరణి చూస్తుంటే ఈ రోజు గడిపేస్తే చాలు, కట్టవలసిన బిల్లు మాత్రం ముందు తరాలూ, రాబోయే ప్రభుత్వాలే కడతాయిలే అన్నట్లు ఉంది.

వ్యాసకర్త ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనలిస్ట్

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

ఆకట్టుకుంటున్న శివపార్వతుల సైకత శిల్పం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ శివపార్వతుల సైకత శిల్పాన్ని రూపొందించారు. 15 అడుగుల వెడల్పు 3 యూనిట్ల ఇసుకతో 18 గంటల పాటు ఈ శిల్పాన్ని తీర్చిదిద్దారు. ఈ సైకత శిల్పంపై శివపార్వతుల ముఖచిత్రాలతో పాటు 'ఆది దంపతుల అన్యోన్యం ఆదర్శనీయం.. సేవ్ అవర్ కల్చర్' అనే నినాదాలు రూపొందించారు. – రంగంపేట

హంస-శుక వాహనాలపై ఆదిదంపతుల విహారం

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిఅమ్మవార్లు హంస, చిలుక వాహనాలపై పట్టణ పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో ఐదోరోజు నాగరాత్రిని పురస్కరించుకుని రాత్రి శేష-యాళి వాహనాలపై స్వామి, అమ్మవార్లు విహరించారు. ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, పండరి భజనలు, నృత్యాలు చేసుకుంటూ భక్త బృందాలు వాహనసేవ ముందు ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. భక్తులు ఉత్సవమూర్తులకు అడుగడుగునా కర్పూర హారతులు పడుతూ కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. – ఏర్పేడు

గజ వాహనంపై మల్లన్న

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శనివారం భ్రమరాంబా సమేతుడైన మల్లన్న గజవాహనంపై విహరించాడు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం గజవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించి క్షేత్రప్రధాన వీధుల్లోకి తోడ్కొని వచ్చి గ్రామోత్సవానికి తరలించారు. కళాకారుల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. – శ్రీశైలం టెంపుల్



మాజీ ఎమ్మెల్యే వరలక్ష్మి మృతి

ఈలి వరలక్ష్మి

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి (80) శనివారం మృతి చెందారు. ఆమె ఈ నియోజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లూ ఉప ఎన్నికల్లోనే విజయం సాధించడం గమనార్హం. ఈమె భర్త ఈలి ఆంజనేయులు ఎన్టీఆర్ మంత్రివర్గంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్దికాలం తర్వాత ఆయన హఠాన్మరణం చెందారు. 1983లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈలి వరలక్ష్మి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. 1987లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచారు. వరలక్ష్మి మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతికి నివాళులర్పించారు.

రాయలసీమ లిఫ్ట్ కోసం ఉద్యమం తీవ్రతరం

సజ్జల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ సాకారానికి ఉద్యమాన్ని మరింత విస్తృతంగా, పటిష్టంగా ముందుకు తీసుకెళ్లాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. పార్టీ రాయలసీమ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్లు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, వేంపల్లి సతీష్ రెడ్డి, డాక్టర్ సాకే శైలజానాథ్, లేళ్ళ అప్పిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులతో (కోఆర్డినేషన్) పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇటీవల నిర్వహించిన ఛలో రాయలసీమ లిఫ్ట్ కార్యక్రమం విజయవంతమైంది. ఉద్యమాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు మనం కార్యాచరణ సిద్ధం చేద్దాం. రాష్ట్రంలో నీటి హక్కులు, ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉంది. చంద్రబాబు హయాంలో రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దాం' అని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం తరహాలోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉద్యమాన్ని దీర్ఘకాలిక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు కార్యాచరణ చేపడదామని ఈ సందర్భంగా చెప్పారు.

నేడు కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవం

తరలిరానున్న లక్షలాది మంది భక్తులు | కొలువుదీరనున్న భారీ విద్యుత్ ప్రభలు


విద్యుత్ దీపకాంతులతో కోటప్పకొండ ఆలయం

నరసరావుపేట రూరల్: తిరునాళ్ల మహోత్సవానికి పల్నాడు జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండ సిద్ధమైంది. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం నిర్వహించే ఈ తిరునాళ్లకు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు జాగరణకు తరలిరానున్నారు. త్రికోటేశ్వర స్వామి వారికి ప్రభుత్వం తరపున విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. భక్తులకు ఉచిత, ప్రత్యేక, శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనం, అభిషేక దర్శనం కల్పించే విధంగా క్యూలైన్లు సిద్ధం చేసినట్లు అధికారులు చెప్పారు. క్యూలైన్లలో భక్తులకు అందజేసేందుకు ఆరు లక్షల వాటర్ బాటిళ్లు, లక్ష మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు, పాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. తిరునాళ్ల జాగరణకు ఈ ఏడాది 5 లక్షల మంది హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. వారి సౌకర్యార్థం ఆర్టీసీ కోటప్పకొండకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి 618 బస్సులను నడపనుంది. కొండ దిగువ నుంచి పైకి భక్తులను చేరవేసేందుకు తిరుమలకు చెందిన 120 బస్సులను అందుబాటులో ఉంచారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో మూడు వేల మంది సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

త్రికోటేశ్వర స్వామి

కొలువుదీరనున్న భారీ విద్యుత్ ప్రభలు

ప్రభల పండుగగా పేరుగాంచిన కోటప్పకొండ తిరునాళ్లలో ఈ ఏడాది 26 భారీ విద్యుత్ ప్రభలు కొలువుదీరనున్నాయి. వీటితో పాటు 50 చిన్న ప్రభలు, వందకు పైగా మొక్కుబడి ప్రభలు కొండకు తరలిరానున్నాయి. భక్తులకు విక్రయించేందుకు రెండు లక్షల లడ్డూలు, లక్ష అరిసె ప్రసాదాలను సిద్ధంగా ఉంచినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది భక్తులకు చిన్న లడ్డూలను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

శివ శివా.. ఇవేం ఏర్పాట్లు?

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో చేసిన ఏర్పాట్లను చూసి భక్తులు సిగ్గుతో తలదించుకుంటున్నారు. లింగాలగట్టులో ప్రణాళిక లేకుండా లో లెవల్, హై లెవల్ ఘాట్‌ల వద్ద తూతూమంత్రంగా ఏర్పాట్లు చేయడంతో స్త్రీలు బట్టలు మార్చుకునే గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు కృష్ణా నది నీటిలో మునిగాయి. పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు గత్యంతరం లేక చీరలను అడ్డుగా కట్టి దుస్తులు మార్చుకుంటున్నారు. అరకొరగా ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు కూడా నీటిలో మునిగిపోయాయి. ఈ పరిస్థితులను అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి కె.లలితాబాయి దృష్టికి భక్తులు తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాలేదు. – శ్రీశైలం ప్రాజెక్ట్

నీట మునిగిన స్త్రీలు దుస్తులు మార్చుకునే గది, తాత్కాలిక మరుగు దొడ్డు

'పచ్చ' మట్టి మాఫియాకు వ్యక్తి బలి

టిప్పర్ ఢీకొని దుర్మరణం
తిక్కవరం గ్రామస్తుల ఆందోళన
భారీగా నిలిచిపోయిన టిప్పర్లు

చిల్లకూరు: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తిక్కవరంలో శనివారం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరిన వ్యక్తి అర కిలోమీటరు దూరం కూడా వెళ్లకముందే పచ్చ మట్టి మాఫియా దాష్టీకానికి బలైపోయాడు. మట్టిని తరలించే టిప్పర్ మృత్యువు రూపంలో అతన్ని కబళించింది. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున రోడ్డుపైకి చేరి ఆందోళన చేపట్టారు. ఈ కారణంగా గంటల కొద్దీ, కిలోమీటర్ల మేర టిప్పర్లు, ఇతర వాహనాలు నిలిచి పోయాయి. స్థానికుల సమాచారం మేరకు.. తిక్కవరం గ్రామానికి చెందిన గారా గోపీ (45) బైక్‌పై గూడూరు బయలు దేరాడు. గ్రామ పొలిమేరలోకి వచ్చే సరికి రోడ్డుపై రెండు రోజులుగా మరమ్మతులతో నిలిచిన టిప్పర్‌ను తప్పించి పక్కకు వెళ్లే క్రమంలో తొణుకుమాల నుంచి చేడిమాల మీదుగా సాగరమాలకు మట్టిని తరలించే టిప్పర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. గోపీ తలపై నుంచి టిప్పర్ వెళ్లడంతో తల ఛిద్రమైంది. టిప్పర్ అదే వేగంతో రోడ్డుకు పక్కనే ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు, గోపీ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి న్యాయం చేయాలని కోరుతూ రోడ్డుపై నిరసనకు దిగారు. దీంతో గూడూరు నుంచి, చింతవరం నుంచి వచ్చే వాహనాలు రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర నిలిచి పోయాయి. మట్టి, గ్రావెల్ తరలించే టిప్పర్‌లు, లారీలు, అధిక లోడుతో అతి వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు గంటలకు పైగా మృతదేహంతో నిరసన చేపట్టారు. పోలీసులు గ్రామస్తులకు నచ్చ చెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, పరారైన టిప్పర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

భారీగా నిలిచిన వాహనాలు (ఇన్‌సెట్‌లో) గారా గోపీ (ఫైల్)

క్యాన్సర్ రోగులకు 'ఆసరా' ఇవ్వండి

పత్తికొండ: క్యాన్సర్ మహమ్మారి జీవించే ఆశలను హరిస్తుంటే.. అండగా నిలవాల్సిన ప్రభుత్వం 'ఆసరా' తొలగించి చావుకు దగ్గర చేస్తోందని క్యాన్సర్ బాధితుడు ఉప్పర నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలోని బీమా పాలసీలో కేటాయించిన నిధుల్లో క్యాన్సర్ వైద్యసేవల కోసం 80శాతం, మిగిలిన 20శాతం రోగి జీవనానికి 'ఆసరా'గా ఇవ్వాలని కోరుతూ కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన నాగరాజు శనివారం నుంచి తన ఇంటి ముందు రోజూ గంటపాటు నిరవధిక దీక్ష చేస్తున్నాడు. శరీరంలో సత్తువ లేకపోయినా, బతుకు దినదిన గండంగా మారిన తోటి క్యాన్సర్ బాధితుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పత్తికొండలోని టీచర్స్ కాలనీకి చెందిన కోసిగయ్య, వీరభద్రమ్మ దంపతుల చిన్న కుమారుడు ఉప్పర నాగరాజు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బోన్ క్యాన్సర్ సోకిన విషయం 4వ దశలో బయటపడింది. చికిత్సకు పేదరికం అడ్డొచ్చింది. యువస్పందన అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో పలువురు దాతలు ముందుకు వచ్చి అతనికి వైద్యం చేయిస్తున్నారు. అయితే ఆరోగ్యం విషమిస్తుండటంతో ప్రభుత్వ 'ఆసరా' కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ప్రభుత్వ సహకారం లేక క్యాన్సర్ రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వివరించడంతో పాటు ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. అయితే ఎలాంటి ఫలితం లేకపోవడంతో, తన ఇంటి ముందే రోజు నిరవధిక దీక్ష చేస్తున్నట్లు తెలిపాడు.

ఇంటి ముందు దీక్ష చేస్తున్న నాగరాజు

'ఆసరా' తొలగింపు అన్యాయం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో క్యాన్సర్ రోగులకు ఆసరా కింద రోజువారీ ఖర్చులకు రూ.220 ఇచ్చేవారు. 15 రోజులకు ఒకసారి చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లే సమయంలో వాహన ఖర్చులకు ఆసరా డబ్బులు వాడుకునేవాళ్లం. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత ఆసరాను పూర్తిగా నిలిపివేసింది. దీనిపై ఫిర్యాదు చేయడంతో జాబితాలో నా పేరును అన్యాయంగా తొలగించారు. ప్రభుత్వం స్పందించి నాలాంటి వాళ్లను ఆదుకోవాలని కోరుతున్నాను.

– ఉప్పర నాగరాజు, పత్తికొండ

మెడికల్ మాఫియాను అరికట్టకుంటే గోడౌన్లపై దాడులు: సీపీఐ

నిరసన ర్యాలీ చేపడుతున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: మెడికల్ మాఫియాను అరికట్టకుంటే గోడౌన్లపై దాడులకు దిగుతామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కె.నారాయణ చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా సీపీఐ నేతలు శనివారం తిరుపతి నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కె.నారాయణ పాల్గొని మాట్లాడారు. ఫార్మా యాజమాన్యాలు నాసిరకం మందులను సరఫరా చేస్తున్నాయని, తనిఖీలు చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోపు మెడికల్ మాఫియాను అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మెడిసిన్ గోడౌన్లపై దాడులు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు.

'గ్రామీణాభివృద్ధి' అంతంతమాత్రం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు బడ్జెట్‌లో రూ.21,624 కోట్లు కేటాయింపు

గత బడ్జెట్‌లో రూ.18,890 కోట్లు కేటాయించి.. రివైజ్డ్ బడ్జెట్‌లో రూ.15,244 కోట్లకే పరిమితం

ఈసారైనా కేటాయించిన నిధులను మొత్తం వినియోగిస్తారా ?



సాక్షి, అమరావతి: బడ్జెట్ రోజున కేటాయింపులు ఘనంగా ఉన్నా అమలుకు వచ్చేసరికి అధమం అన్నట్టు ఉంది ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిస్థితి. 2026–27 బడ్జెట్‌లో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.21,624 కోట్లు కేటాయింపులు చేసినా.. అవి కార్యరూపం దాల్చుతాయా లేదా అనేదానిపై అధికారులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ పెట్టిన రోజున పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.18,890 కోట్లు కేటాయింపులు చేసినట్టు ప్రకటించి.. వెంటనే రూ.15,244 కోట్లకు పరిమితం చేస్తూ రివైజ్డు కేటాయింపులను ప్రకటించడం ఆ అనుమానాలకు బలం చేకూర్చుతున్నాయి.

రివైజ్డు బడ్జెట్‌లో భారీ కోత

గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా సమగ్ర రక్షిత మంచినీటి పథకాల నిర్మాణంతో పాటు ఇంటింటికీ కొళాయిల ఏర్పాటుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ కార్యక్రమానికి 2025–26 బడ్జెట్‌లో మొదట ఘనంగా రూ.2,800 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించి, తీరా రివైజ్డ్ బడ్జెట్‌లో ఆ కేటాయింపులు రూ.524.41 కోట్లకు పరిమితం చేస్తున్నట్టు ప్రకటించారు. అంటే బడ్జెట్‌కూ, రివైజ్డు బడ్జెట్‌కూ మధ్యనే భారీ కోతలు పెట్టిన ఆ జలజీవన్ మిషన్ పథకానికే 2026–27 బడ్జెట్‌లో ఏకంగా రూ.4,000 కోట్లు కేటాయించారు.

గ్రామీణ రోడ్లకు గతం కన్నా తక్కువే

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సంబంధించి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి గత 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.2,239 కోట్లు కేటాయించి.. రివైజ్డ్ బడ్జెట్‌లో ఆ మొత్తాలను రూ.2,076 కోట్లకు పరిమితం చేశారు. మరోవైపు 2026–27 బడ్జెట్‌లో ఆయా కార్యక్రమాల ద్వారా రోడ్ల నిర్మాణానికి కేవలం రూ.1,883.57 కోట్లే కేటాయించారు.

కొత్త 'ఉపాధి' పథకానికీ రూ.8,365 కోట్లే

ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్‌జీ పథకానికి 2026–27 బడ్జెట్‌లో రూ.8,365 కోట్లు కేటాయింపులు చేశారు. ఈ పథకంలో కూలీల వేతనాలకు రూ.5,295 కోట్లు కాగా, మెటీరియల్ కేటగిరికి సంబంధించి రూ.3,570 కోట్లు కేటాయించారు. అయితే ఈ పథకంలో పని చేసే ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన అడ్మిన్ కేటగిరికి గత బడ్జెట్‌లో రూ.372 కోట్లు పెట్టి, రివైజ్డు బడ్జెట్‌లో రూ.357 కోట్లకు సవరించగా.. 2026–27 బడ్జెట్‌లో ఆ కేటాయింపుల మొత్తం రూ.100 కోట్లకే పరిమితం చేయడం గమనార్హం.

శాంతిభద్రతలపై శీతకన్ను

పోలీసుశాఖకు అరకొర కేటాయింపులే
బడ్జెట్ ప్రసంగంలో క్రెడిట్ చోరీకి యత్నం



సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ అమలుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి-భద్రతలపై శీతకన్ను వేసింది. మహిళల భద్రత, పోలీసుశాఖ ఆధునికీకరణ, డ్రగ్స్ మాఫియా కట్టడి వంటి అంశాలను గాలికివదిలేసింది. 2026–27 వార్షిక బడ్జెట్‌లోహోంశాఖకు కేవలం రూ.9,165 కోట్లు మాత్రమే కేటాయించింది. అందులో సింహభాగం పోలీసుశాఖ జీత భత్యాలు, సాధారణ నిర్వహణ ఖర్చులకే సరిపోనుంది.

కేటాయింపుల్లో ప్రధానమైనవి ఇలా..

- మహిళాభద్రత కోసం గత బడ్జెట్‌లో రూ.10.01 కోట్లు కేటాయించిన ప్రభుత్వం కేవలం రూ.3.20 కోట్లే వెచ్చించింది. ఈ ఏడాది కేటాయింపు కేవలం రూ.3.20కోట్లు కావడం గమనార్హం.
- రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ దందాను కట్టడి చేయడంపై ప్రభుత్వం ఆసక్తి చూపించలేదు. నార్కోటిక్స్ ఆపరేషన్లకు అవసరమైన వ్యవస్థ బలోపేతం కోసం గత బడ్జెట్‌లో రూ.61 కోట్లు కేటాయించి కేవలం రూ.22కోట్లే ఖర్చు చేసింది. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులే రూ.30 కోట్లకు పరిమితం చేసింది. – కేంద్ర నిధులకు మ్యాచింగ్ గ్రాంట్‌గా రాష్ట్రం కేటాయించాల్సిన నిధులపై ముఖం చాటేసింది. ఫోరెన్సిక్ విభాగానికి మౌలిక సదుపాయాల కల్పనకు కూడా నిధులు కేటాయించలేదు.

బడ్జెట్ ప్రసంగంలో క్రెడిట్ చోరీ

మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో కూటమి ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవడం విస్మయపరిచింది. రాష్ట్రంలో 5,757మంది పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి ప్రిలిమినరీ పరీక్షలు కూడా నిర్వహించింది. అప్పట్లో టీడీపీ ఆ నియామక ప్రక్రియకు వ్యతిరేకంగా తమ సానుభూతిపరులతో కోర్టుల్లో కేసులు వేయించింది. టీడీపీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ కేసులను ఉపసంహరించారు. దాంతో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. అవి కూడా తామే భర్తీ చేసినట్టు పయ్యావుల కేశవ్ చెప్పడం విడ్డూరంగా ఉంది.

- శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో కొత్తగా 4 ఏపీఎస్పీ బెటాలియన్ల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ ఘనత కూడా చంద్రబాబు ప్రభుత్వానిదేనని పయ్యావుల కేశవ్ క్రెడిట్ చోరీకి యత్నించారు.

రీ సర్వేకు కేవలం రూ.కోటి

కేంద్రం నుంచి రూ.500 కోట్లు ప్రోత్సాహం తీసుకున్న బాబు సర్కారు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విప్లవాత్మకంగా జరిగిన భూముల రీసర్వే క్రెడిట్‌ను చోరీ చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు బడ్జెట్‌లో కేవలం రూ.1 కోటి మాత్రమే నిధులు కేటాయించారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం మాజీ సీఎం జగన్ హయాంలో జరిగిన భూరీసర్వేను మెచ్చుకుంటూ రూ.500 కోట్ల మేర ప్రోత్సాహకాన్ని విడుదల చేస్తే.. చంద్రబాబు సర్కారు బడ్జెట్‌లో ఎంగిలి మెతుకులు విదిల్చినట్లు కూడా నిధులు కేటాయించలేదు. పైగా ఇప్పుడు తమ ప్రభుత్వమే భూముల సర్వే చేస్తుందని బుకాయిస్తూ అందుకు రూ.కోటి నిధులు కేటాయించడాన్ని బట్టి దానిపై చిత్తశుద్ధి లేదని చంద్రబాబే తన చిత్తశుద్ధిని బయటపెట్టుకున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
గార్డెన్ డిపార్ట్‌మెంట్, టీటీడీ, తిరుపతి
టెండరు ప్రకటన
ఫైల్.నం. TTD-48021/4/2026-GARDEN TPT-TTD, తేది: 11-02-2026
నమోదిత ఫార్మర్స్ సొసైటీస్ నుండి మాత్రమే ఒక సంవత్సర కాలవ్యవధి కోసం TTD గార్డెన్ డిపార్ట్‌మెంట్, తిరుపతికు నిత్య దిట్టమ్ ఫ్లవర్స్ & డెకరేషన్ ఫ్లవర్స్ సరఫరా కోసం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, TTD, తిరుపతి గారిచే సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి. దరఖాస్తుదారు నిర్దేశించిన షెడ్యూల్ ధర చెల్లింపు పై టెండరు షెడ్యూల్స్ స్వీకరణ కోసం ఫామ్ మేనేజర్ Gr-I, TTD, గార్డెన్ డిపార్ట్‌మెంట్, తిరుపతి గారిని సంప్రదించాలి. తదుపరి వివరాల కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 0877-2263420.
TTD-40021/10/2025-PRO SEC(Adv.No.397) Dt: 13.02.2026 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్







విద్యారంగానికి నిధులు సరిపోవు

పాఠశాల విద్యారంగానికి రూ.32,308 కోట్ల నిధులు సరిపో జజీ. మొత్తం బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాల్సింది. మోడల్ ప్రాథమిక విద్య వ్యవస్థను బలోపేతం చేయాలి. పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను తీర్చాలి. మన బడి, మన భవిష్యత్ కింద ఆగిపోయిన పనులను పూర్తి చేయాలి. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ నాణ్యతను పెంచేలా మరింత బడ్జెట్ కేటాయిస్తే బాగుండేది.

– సీవీ ప్రసాద్, ఏపీపీఎస్ హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు

బాబువన్నీ గ్యాస్ కబుర్లే

ఉచిత గ్యాస్ సిలిండర్లకు బడ్జెట్‌లో భారీగా నిధుల కోత

- అందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని ఎన్నికల వేళ చంద్రబాబు హామీ
- రాష్ట్రంలో మొత్తం 1.59 కోట్ల గ్యాస్ కనెక్షన్లు
- అందరికీ ఏడాదికి మూడేసి సిలిండర్లు ఇవ్వాలంటే రూ.4083.48 కోట్లు అవసరం
- రెండేళ్లలో మహిళలకు రూ.4700.96 కోట్ల బకాయి
- తాజాగా మరో రూ.1,482 కోట్లు తగ్గించి కేటాయింపులు
- మొత్తంగా రూ.6,183 కోట్లకు టోకరా పెట్టేందుకు బాబు ఎత్తుగడ

సాక్షి, అమరావతి: ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల వేళ ఊదరగొట్టిన చంద్రబాబు ఆ హామీనీ మెల్లగా అటకెక్కించేస్తున్నారు. మహిళలకు కుచ్చుటోపీ పెట్టేందుకు టక్కుటమార విద్యలు ప్రదర్శిస్తూ బడ్జెట్‌లో తూతూమంత్రంగా నిధులు కేటాయించారు. ఎన్నికలప్పుడు అక్కచెల్లెమ్మల ఓట్ల కోసం ఇష్టారాజ్యంగా హామీలిచ్చి... అధికారంలోకి వచ్చాక వాటికి అడ్డగోలుగా కోతలు పెడుతున్నారు. లబ్ధిదారులను ఏరి పారేస్తున్నారు. వాస్తవానికి ఏపీలో 1.59 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వాలంటే సుమారు రూ.4,083 కోట్లు అవసరం. కానీ, చంద్రబాబు 2026–27 బడ్జెట్‌లో మాత్రం దీపం 2.0 పథకం కింద ఉచిత గ్యాస్‌కు కేటాయించింది కేవలం రూ.2601 కోట్లు మాత్రమే!. ఈ బడ్జెట్ కేటాయింపులను బట్టి 98 లక్షల సిలిండర్లు మాత్రమే ఉచితంగా అందించడానికి వీలుంటుంది. మిగిలిన 60 లక్షల కనెక్షన్లకు ఉచిత గ్యాస్ సిలిండర్లు లేనట్టే. గడిచిన ఏడాదిన్నర కాలంలో దీపం 2.0 పథకం కొందరి ఇళ్లకే పరిమితమై 'గుడ్డి దీపం'గా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.6,183 కోట్లకు చంద్రబాబు ఎగనామం

2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత నవంబర్‌లో దీపం 2.0ను చంద్రబాబు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1.59 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తొలి ఏడాది ఒక్కో సిలిండర్ మాత్రమే ఉచితంగా ఇచ్చారు. ఇందుకు రూ.865 కోట్లు విడుదల చేశారు. మిగిలిన రెండు సిలిండర్లకు రూ.3218.48 కోట్లు ఎగ్గొట్టారు. ఆ తర్వాత ఏడాది (2025–26) మూడు సిలిండర్లకు రూ.2601 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక్కడ కూడా 1,482.48 కోట్లు ఎగ్గొట్టారు. తాజాగా 2026–27 బడ్జెట్‌లోనూ రూ.2601 కోట్లు కేటాయించడంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా 1,482.48 కోట్లు ఎగ్గొట్టారు. మొత్తంగా చూస్తే చంద్రబాబు రూ.6183 కోట్లు ఎగ్గొట్టి మహిళలకు టోకరా పెట్టారు. ప్రభుత్వ కేటాయింపులు సుమారు 90 లక్షల లబ్ధిదారులకే సరిపోగా... 60 లక్షలకుపైగా లబ్ధిదారులకు మొండి చేయి చూపుతున్నారు. ఫలితంగా లక్షలాది మంది లబ్ధిదారులు సబ్సిడీ కోసం గ్యాస్ ఏజెన్సీలు, గ్రామ–వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

పెట్టుబడి సాయం.. మాయాజాలం!

ఇదీ హామీ

వైఎస్ జగన్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 మాత్రమే ఇస్తోంది. ఇందులో రూ.6 వేలు కేంద్రమే ఇస్తోంది. అదే మాకు అధికారం ఇస్తే కేంద్రం ఇచ్చేది కాకుండా ఏటా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తాం.

- ఎన్నికల మేనిఫెస్టోలో, ఊరూరా చంద్రబాబు అండ్ కో ప్రచారం

ఆచరణలో వాస్తవం

అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పూర్తిగా రూ.20 వేలు ఎగ్గొట్టారు. రెండో ఏడాది కేంద్రం ఇచ్చే సాయంతో కలుపుకుని రూ.10 వేలు మాత్రమే అందించారు. అదీ కొంత మంది రైతులకే. కౌలు రైతులకైతే పైసా ఇవ్వలేదు. కానీ రైతులకు రూ.20 వేలు సాయం అందించామని బడ్జెట్ సాక్షిగా నిస్సిగ్గుగా ప్రచారం. మొత్తంగా రూ.30 వేలు బకాయి.

అన్నదాత సుఖీభవకు అడ్డగోలు కోతలు

ఏటా ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం చేస్తామని హామీ

- ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించాల్సిన మొత్తం రూ.10,717 కోట్లు
- వాస్తవంగా కేటాయించింది రూ.6,600 కోట్లు మాత్రమే
- పాత బకాయిలన్నీ కలిపి మొత్తం చెల్లించాల్సింది రూ.27,465 కోట్లు
- 2024–25లో 53.58 లక్షల మంది రైతులకు ఎగవేత
- రెండో ఏడాది రూ.10 వేల చొప్పున 46.85 లక్షల మందికి రూ.4,685.84 కోట్లే...
- కానీ బడ్జెట్‌లో మాత్రం రూ.6,309.44 కోట్లు చెల్లించేశామని వెల్లడి
- కౌలు రైతులకు తొలి రెండేళ్లూ పైసా పెట్టుబడి సాయం అందించని వైనం
- ఈ ఏడాది వారి ఊసెత్తకుండానే వ్యవసాయ బడ్జెట్ ప్రసంగం

సాక్షి, అమరావతి : తమకు అధికారం ఇస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి ఏడాది నుంచే ప్రతీ రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామంటూ ఎన్నికల సభల్లో హామీలు గుప్పించిన చంద్రబాబు.. తీరా అందలం ఎక్కాక అన్నదాతలకు పంగనామాలు పెడుతున్నారు. తొలి ఏడాది నిస్సిగ్గుగా పెట్టుబడి సాయానికి పూర్తిగా ఎగనామం పెట్టిందేకాక, రెండో ఏడాది అరకొరగా విదిల్చారు. కనీసం 2026–27లో అయినా పూర్తిగా ఇస్తారనుకుంటే అదీ లేదు. ఈ బడ్జెట్‌లో కూడా ఈ పథకానికి అరకొర కేటాయింపులతోనే సరిపెట్టి అన్నదాత నోట్లో మట్టికొట్టారు. కౌలు రైతుల ఊసే ఎత్తలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందిన 53,58,366 మంది రైతుల వరకు లెక్కలోకి తీసుకున్నా.. ఏటా రూ.20 వేల చొప్పున తొలి రెండేళ్లలో ఒక్కో రైతుకు రూ.40 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలి. ఈ లెక్కన రైతుల ఖాతాలకు రూ.21,433.46 కోట్లు జమ చేయాలి. తొలి ఏడాది (2024–25) బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.1,000 కోట్లు కేటాయించి, పైసా ఖర్చు చేయలేదు. నిస్సిగ్గుగా 53.58 లక్షల మందికి రూ.10,717 కోట్లు ఎగ్గొట్టారు. రెండో ఏడాది (2025–26) బడ్జెట్‌లో రూ.6,300 కోట్లు కేటాయించి, రెండు విడతల్లో కలిపి రూ.10 వేల చొప్పున మాత్రమే 46,85,838 మంది రైతులకు రూ.4,685.54 కోట్లు జమ చేసి చేతులు దులుపుకున్నారు. అంటే దాదాపు 7 లక్షల మందికి ఎగనామం పెట్టారు.

రూ.16,746 కోట్లు ఎగవేత

పీఎం కిసాన్ కింద కేంద్రం ఇస్తున్న సాయాన్ని తన ఖాతాలో వేసుకొని, రెండు విడతల్లో రూ.14 వేలు జమ చేశామని చంద్రబాబు ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. అంటే రెండేళ్లలో రైతులకు ఎగ్గొట్టిన మొత్తం రూ.16,746 కోట్లు. పైగా అర్హుల్లోనే లక్షలాది మంది రైతులు ఇంకా తమకు జమ కాలేదంటూ అర్జీలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదు. కానీ బడ్జెట్ ప్రసంగంలో మాత్రం 46.86 లక్షల మంది రైతులకు రూ.6,309.44 కోట్లు జమ చేసేశామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం విస్మయ పరుస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరంలోనైనా బకాయిలతో సహా పూర్తి స్థాయిలో కేటాయింపులు జరుపుతారనుకుంటే ఈసారీ అరకొరగానే విదిల్చారు. సూపర్ సిక్స్ హామీ మేరకు చూస్తే వాస్తవానికి ప్రతీ రైతుకు రూ.20 వేల చొప్పున 53.58 లక్షల మందికి ఏటా రూ.10,717 కోట్ల చొప్పున మూడేళ్లలో రూ.32,151 కోట్లు కేటాయింపులు జరపాలి. కానీ తొలి ఏడాది బడ్జెట్‌లో వెయ్యి కోట్లు, రెండో ఏడాది బడ్జెట్‌లో రూ.6,300 కోట్లు కేటాయించగా.. రెండో ఏడాది జమ చేసిన రూ.4,685.84 కోట్లు మినహాయిస్తే అన్నదాతలకు చెల్లించాల్సిన పెట్టుబడి సాయం ఇంకా రూ.27,465 కోట్లకు పైమాటే. కానీ బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.6,600 కోట్లు మాత్రమే.

కౌలు రైతుల ఊసెత్తని ప్రభుత్వం

రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలుదారులు ఉంటారని అంచనా. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా భూ యజమానులతో పాటు ప్రతి కౌలు రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని సూపర్ సిక్స్‌లో చంద్రబాబు అండ్ కో హామీ ఇచ్చింది. అయితే 2024–25లో భూ యజమానులతో పాటు కౌలు రైతులకూ ఎగ్గొట్టారు. రెండో ఏడాది 2025–26లో రెండు విడతల్లో రూ.10 వేలు అదీ భూ యజమానులకు మాత్రమే జమ చేశారు. రెండో విడత సాయం ఇచ్చే టప్పుడు కౌలు రైతులకు ఒకేసారి రెండు విడతల సాయం అందిస్తామని నమ్మబలికారు. ఆ తర్వాత సీసీఆర్సీ కార్డుల జారీ ప్రక్రియ పూర్తికాగానే నవంబర్‌లో జమ చేస్తామని చెప్పుకొచ్చారు. కానీ రబీ సీజన్ చివరి దశకు చేరుకున్నా, ఒక్క విడత సాయం కూడా కౌలు రైతులకు జమ చేసిన పాపాన పోలేదు. జారీ చేసిన సీసీఆర్సీ కార్డుల ప్రకారం చూసుకున్నా 2024–25లో 9.13 లక్షల మందికి, 2025–26లో 8.24 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున.. మొత్తంగా రూ.40 వేలు పెట్టుబడి సాయం అందించాలి. అంటే రెండేళ్లలో కలిపి కౌలు రైతులకు రూ.3,474 కోట్లు జమ చేయాల్సి ఉంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026–27లో చెల్లించాల్సింది కూడా కలుపుకుంటే రూ.6 వేల కోట్లకు పైమాటే. కానీ బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా మంత్రి అచ్చెన్నాయుడు కౌలు రైతుల ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

భృతి లేదు.. గతి లేదు

చంద్రబాబు హామీలు హుళక్కే.. ఉద్యోగం రాలేదు.. 'భృతి' అందలేదు!

- ముచ్చటగా మూడో బడ్జెట్లలోనూ నిరుద్యోగ యువతకు మొండిచెయ్యి
- ఎన్నికలప్పుడు నెలకు మూడు వేల నిరుద్యోగభృతి ఇస్తామని బూటకపు హామీ
- ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు
- రెండేళ్లుగా నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగుల నిరీక్షణ.. జాబ్ క్యాలెండర్ ఊసే గల్లంతు
- తాజా బడ్జెట్‌లోనూ నిరుద్యోగ భృతికి పంగనామం
- ఇలా మూడేళ్లలో నిరుద్యోగులకు రూ.21,600 కోట్లు ఎగ్గొట్టిన బాబు

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తికావస్తోంది. ముచ్చటగా మూడో బడ్జెట్ ప్రవేశపెట్టింది. అయినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. పరిశ్రమలూ తేలేదు. నిరుద్యోగ భృతి ఊసేలేదు. జాబ్ క్యాలెండర్ అడ్రస్సే లేదు. నోటిఫికేషన్లకు అసలే దిక్కులేదు.

దేశానికి ఆయువుపట్టు యువశక్తి. ఏపీలో ఉండే యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తా. పరిశ్రమలు తెస్తా. ఉద్యోగాలు ఇస్తా. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తెలుగుదేశం పార్టీది. యువతకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తా. ఇప్పుడు చెప్పండి యువతను నిర్వీర్యం చేసిన పార్టీ ఏదీ? మిమ్మల్ని ఆదుకునే పార్టీ ఏదీ?..

- మే 28, 2023న రాజమహేంద్రవరంలో టీడీపీ మహానాడులో చంద్రబాబు దగాకోరు మాటలు

"ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. రికార్డు చేసుకో.. డేటు, టైము రాసుకో.. జగన్‌లాగా పారిపోయే బ్యాచ్ కాదు నేను."

- 2024 ఫిబ్రవరి 13న యువగళం సభలో మంత్రి నారా లోకేశ్ బీరాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు మరోసారి నిరుద్యోగ యువతను నిండా ముంచేసింది. ముచ్చటగా మూడో బడ్జెట్‌లోనూ మొండి చెయ్యి చూపించింది. ఎన్నికల సమయంలో అధికార పీఠం కోసం నిరుద్యోగ యువతను నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లు నయవంచనకు గురి చేశారు. ఆయువుపట్టుపై దెబ్బకొట్టారు. తాజాగా 2026–27 బడ్జెట్‌లోనూ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి 'సూపర్ సిక్స్‌లో.. బాబుమార్క్' దగాకోరు రాజకీయాన్ని ప్రదర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మూడు వార్షిక బడ్జెట్లలోనూ నిరుద్యోగుల ఊసే లేకుండా చేశారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు, లేకుంటే ఉద్యోగం వచ్చే వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని అటకెక్కించేశారు. రెండేళ్ల చంద్రబాబు సర్కారు ఒక్కో నిరుద్యోగికి ఏడాదికి రూ.36 వేల చొప్పున రెండేళ్లలో రూ.72 వేలు ఇవ్వకుండా మోసం చేసింది. ఇలా 20 లక్షల మందికి చూస్తే దాదాపు రెండేళ్లలో రూ.14,400 కోట్లు బకాయిపడింది. ఈ ఏడాది బడ్జెట్‌లో అసలు నిరుద్యోగ భృతి ప్రస్తావన లేకపోవడంతో మరో రూ.7,200 కోట్ల చెల్లింపులకు ఎగనామం పెట్టింది. అంటే, చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగులకు రూ.21,600 కోట్లు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డారని స్పష్టమవుతోంది.

ఇంకెంతకాలం ఈ మోసం బాబూ!

2014 ఎన్నికల ముందు నిరుద్యోగులను బుట్టలో వేసుకుని రూ.2 వేలు నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి, నాలుగున్నరేళ్లకుపైగా ఆ ఊసే ఎత్తేలేదు. 2017–18లో రూ.500 కోట్లు కేటాయించినా.. పైసా కూడా ఖర్చు చేయలేదు. నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను తొలుత 12 లక్షలు అని చెప్పి, చివరికి 2.10 లక్షల మందే అర్హులన్నారు. తీరా 1.62 లక్షల మందికే ఇస్తామని, ఈ–కెవైసీ లింక్ పెట్టారు. చివరకు అందులోనూ కొంత మందికే నిరుద్యోగ భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు మొత్తానికి బరితెగించి ఇవ్వను పొమ్మని నిరుద్యోగులను బెదిరిస్తున్నారు.

బాబు పాలనలో ఉద్యోగాల భర్తీ ఊసే లేదు

బాబు పాలనలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై వివాదాలు సృష్టించడం, వాటిని అడ్డంపెట్టుకుని భర్తీ నిలిపివేయడం పరిపాటి. ఈసారీ అదే సూత్రాన్ని సర్కారు పాటిస్తోంది. గతంలో జారీ అయిన నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మంది అభ్యర్థుల జీవితాలతో చంద్రబాబు ప్రభుత్వం ఆటలాడుతోంది. దాదాపు 21 నోటిఫికేషన్లకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి 2024 డిసెంబర్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇచ్చిన నోటిఫికేషన్లలో 19 నోటిఫికేషన్ల ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా 150 గ్రూప్–1 పోస్టులు సృష్టిస్తున్నట్టు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇప్పటికే ఇచ్చిన గ్రూప్–1 నోటిఫికేషన్‌లో పోస్టులు భర్తీ చేయకుండా, ఆయా శాఖల్లో కేడర్ ఖాళీలు ఎన్ని ఉన్నాయో తెలుసుకోకుండా 150 పోస్టులు, మరో 4,300 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తామనడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్ జగన్ హయాంలో ఉద్యోగాల విప్లవం

- వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో ఉద్యోగాల విప్లవం సృష్టించారు.
- గ్రామ/వార్డు సచివాలయాలను ప్రవేశపెట్టి 1.30 లక్షల శాశ్వత ఉద్యోగాలు కొత్తగా కల్పించారు. 2.66 లక్షల వలంటీర్లను గత ప్రభుత్వంలో నియమించారు.
- ఆప్కాస్ ద్వారా 96వేల ఉద్యోగాలు భర్తీ చేశారు.
- ఆర్టీసీ విలీనం ద్వారా 58వేల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేశారు.
- మొత్తం ఐదేళ్లలో 6,31,310 ఉద్యోగాలిచ్చారు.
- చంద్రబాబు కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు విడుదల చేసిన 2023–24 సామాజిక ఆర్థిక సర్వేలో పేర్కొన్న ప్రకారమే.. లార్జ్ అండ్ మెగా ఇండస్ట్రీస్‌లో 1.02 లక్షల మందికి , ఎంఎస్‌ఎంఈ రంగంలో 32,79,970 మందికి వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగాలు ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది.
- గవర్నమెంట్, లార్జ్ అండ్ మెగా, ఎంఎంఎస్ఈ సెక్టార్‌లో 40,13,552 మందికి ఉద్యోగాలు ఇచ్చారు.

ఆడబిడ్డ నిధి.. అమ్మతోడు లేదది!

19-59 ఏళ్లున్న మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని హామీ

ఏటా రూ.18 వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా తొలి రెండేళ్లూ ఎగవేత

- మూడోసారి బడ్జెట్‌లోనూ ఈ పథకం ఊసే లేదు
- ఈ పథకం అమలైతే అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.32,400 కోట్ల లబ్ధి
- ఈ ఏడాది కూడా అమలు చేసే ఉద్దేశం లేదని స్పష్టత
- ఫలితంగా మూడేళ్లలో రూ.లక్ష కోట్లు నష్టపోయిన మహిళలు

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్‌లో ఒకటైన ఆడబిడ్డ నిధి పథకం అమలు విషయంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం మూడో ఏడాది కూడా మోసం చేసింది. ఈ పథకానికి సంబంధించి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనం. 19–59 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏటా రూ.18,000 ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రచారం చేశారు. ఈ హామీ గురించి మేనిఫెస్టోలోనూ పెట్టారు. నాడు ప్రతి ఇంటా ప్రచారం చేస్తూ.. 'నీకు నెలకు రూ.1,500, ఏడాదికి రూ.18,000 అంటూ ఆశ పెడుతూ ఓట్లు వేయించుకున్నారు. తీరా గద్దె నెక్కాక ఈ పథకం ఊసే ఎత్తడం లేదు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు 1.80 కోట్ల మంది. వీరికి నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలను ఆడబిడ్డ నిధి కింద ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు చేయాలంటే ఏడాదికి రూ.32,400 కోట్లు అవసరం. కానీ.. 2024–25, 2025–26 బడ్జెట్‌లతో పాటు ఈ బడ్జెట్ అంటే 2026–27లో కూడా ఒక్క పైసా కేటాయించలేదు. గత 20 నెలల కాలంలో ఆడబిడ్డ నిధి రూపంలో సుమారు రూ. 54 వేల కోట్ల మేర మహిళలు నష్టపోయారు. 2027 మార్చి నెలాఖరు వరకు ఈ పథకం అమలు కాదని తెలుస్తున్న నేపథ్యంలో మిగిలిన 14 నెలలకు మరో రూ. 37,800 కోట్లు కలిపి దాదాపు లక్ష కోట్ల దాక మహిళలు నష్టపోనున్నారు.

నాడు హామీ ఇలా..

- 19–59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు.. ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అందరికీ అందజేస్తాం.
- 2024 మార్చి 13న 'కలలకు రెక్కలు' నినాదంతో వెబ్‌పోర్టల్‌లో పేర్ల నమోదు కార్యక్రమంలో చంద్రబాబు హామీలు ఎలా నిలబెట్టుకుంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు అడుగుతున్నారు. అలాంటి వారందరికీ మీ లోకేశ్ ఒకటే సమాధానం ఇస్తున్నాడు. జగన్ అప్పుల అప్పారావు అయితే, మా చంద్రన్న సంపద సృష్టికర్త. మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు తెలిసి మా చంద్రన్న మహాశక్తి ప్రకటించారు. అందులో మొదటిది ఆడబిడ్డ నిధి. 19–59 ఏళ్ల వయసున్న తెలుగింటి ఆడపడుచులకు నెలకు రూ.1500, ఏటా రూ.18 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.90 వేలు వారి అకౌంట్లలో మన చంద్రన్న వేయబోతున్నాడు.

– ఎన్నికల ప్రచార సభల్లో నారా లోకేశ్

- రాష్ట్ర ప్రజల నేటి అవసరాలను తీరుస్తూ.. రేపటి ఆకాంక్షలను సాకారం చేసేలా రూపొందించిన మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తాం.
- 2024 ఏప్రిల్ 30న ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేస్తూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్

పూర్‌పాలన

పట్టణాల్లో మౌలిక వసతులకు అరకొర కేటాయింపులే.. విశాఖ, విజయవాడ, తిరుపతి కార్పొరేషన్లకు కేటాయింపులు శూన్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో చంద్రబాబు సర్కారు పురచెయ్యి చూపింది. అరకొరగా విదిల్చింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 2026–27 బడ్జెట్‌లో రూ.14,538.67 కోట్లు కేటాయించింది. ఇందులో రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6 వేల కోట్ల విదేశీ రుణం చేయనున్నట్లు వెల్లడించింది. ఇక రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ), టిడ్కో, నెల్లూరు కార్పొరేషన్‌ల రుణాలు చెల్లించేందుకు రూ.1,808.22 కోట్లు కేటాయించింది. దీన్ని బట్టి చూస్తే.. మిగతా రూ.6,730.45 కోట్లను మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలలో మౌలిక సదుపాయాల కల్పన, ఉద్యోగుల వేతనాలకు అన్నింటికీ కలిపి కేటాయించిందన్నది స్పష్టమవుతోంది. ఇందులోనూ కేంద్ర ప్రాయోజిత పథకమైన అమృత్ 2.0 కింద రూ.724 కోట్లు, ఆర్థిక సంఘం నిధులు రూ.1,562 కోట్లు వస్తాయని అంచనా వేసింది. దీన్ని బట్టి చూస్తే రాష్ట్ర ఖజానా నుంచి పట్టణాభివృద్ధికి అరకొరగా నిధులు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. ఇక విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలను మహానగరాలుగా అభివృద్ధి చేస్తామని పదే పదే చెబుతున్న ప్రభుత్వం.. వాటికి బడ్జెట్‌లో ఎలాంటి నిధులూ కేటాయించకపోవడం గమనార్హం.

ఆర్టీసీపై అప్పుల భారం

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఏడాదికి రూ.3,500 కోట్లు అవసరం

బడ్జెట్‌లో కేటాయింపు రూ.1,420 కోట్లే

ıబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ– బస్సుల పేరిట రాష్ట్రంలోని 12 ఆర్టీసీ డిపోలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు నిర్ణయించిన ప్రభుత్వం మరోవైపు మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అరకొరగానే నిధులు కేటాయించింది. ఈ పథకంతో ఆర్టీసీపై ఏడాదికి రూ.3,500కోట్ల భారం పడుతోంది. కానీ 2026–27 బడ్జెట్‌లో కేవలం రూ.1,420కోట్లే కేటాయించడం గమనార్హం. అంటే మిగిలిన భారం ఆర్టీసీ మోయాల్సిందే. ఇక గతేడాది (2025–26)లో ఉచిత బస్సు పథకం కోసం ప్రభుత్వం కేవలం రూ.1,040 కోట్లే విడుదల చేసింది. ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అరకొర నిధులు కేటాయింపే ఆర్టీసీపై ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే ఆర్టీసీ ఆర్థికంగా కుదేలవడం ఖాయమని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఈ బస్సు ముసుగులో ప్రై'వేటే'

పీఎం ఈ–బస్ పథకం అమలు కోసం ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా విదల్చలేదు. 750 ఈ– బస్సులను ప్రవేశపెడుతున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ పథకం కోసం కేంద్రం నిధులు ఇవ్వనుంది. అయితే మౌలిక సదుపాయాల కింద సివిల్ ఇంజినీరింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం గమనార్హం.అంటే ఈ బస్సులు నిర్వహించే ప్రైవేటు సంస్థలకు 12 ఆర్టీసీ డిపోలను ధారాదత్తం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టేనని ఉద్యోగులు మండిపడుతున్నారు.

కేవలం రూ.5,792.48 కోట్లు కేటాయింపు

ప్రభుత్వం 2026–27 వార్షిక బడ్జెట్‌లో ఆర్టీసీకి కేవలం రూ.5,792.48 కోట్లు కేటాయించింది. ఆర్టీసీ ఉద్యోగుల జీతాలకే ఏడాదికి దాదాపు రూ.4వేల కోట్లు వెచ్చించాలి. మిగిలిన రూ.1,792 కోట్లు ఆర్టీసీ సాధారణ నిర్వహణ వ్యయానికే సరిపోదు. ఇక మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త డీజిల్ బస్సుల కొనుగోలు వంటి ప్రతిపాదనలను అటకెక్కించినట్టేనని స్పష్టమవుతోంది.





కాగితాలపై కాకి లెక్కలు

టీడీపీ కూటమి బడ్జెట్ కాగితాలపై కాకి లెక్కలు వేసినట్టే ఉంది. బడ్జెట్‌ను చూస్తే అప్పులు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆదాయం పాతాళంలో ఉంది. గత ఏడాది రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టారు. నిజంగా సంపద సృష్టి జరిగితే ఈ సారి ఆదాయం పెరగాలి కదా. నిజానికి పెరిగింది అప్పులే. 50 ఏళ్లకే పింఛన్ పథకం ఊసే లేదు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సరైన కేటాయింపులు లేవు. గత బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ.40,635 కోట్లు అన్నారు. తరువాత సవరించి రూ.33,134 కోట్లు చేశారు. ద్రవ్యలోటులో దేశంలో ఏపీ టాప్‌లో ఉంది. ఆదాయం 3 శాతం లోపే, అప్పులు 30 శాతంపైనే ఉన్నాయి. – తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, యర్రగొండపాలెం

తల్లికి వంచన

మరోసారి మహిళలను మోసం చేసిన చంద్రబాబు సర్కారు

తల్లికి వందనం కింద మూడేళ్లలో రూ.24,504.39 కోట్లు ఎగవేత

- ఈ బడ్జెట్‌లో రూ.9,668 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటన
- కానీ, బడ్జెట్ ప్రతుల్లో మాత్రం రూ.8,457.07 కోట్లకు మాత్రమే ప్రతిపాదన
- ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున చెల్లించాలంటే రూ.13,112.82 కోట్లు అవసరం
- గత బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించినా.. ఇచ్చింది మాత్రం రూ.6,377 కోట్లే
- ఫలితంగా 67.27 లక్షల మందికే పథకం వర్తింపు
- అది కూడా రూ.8 వేల నుంచి రూ.10 వేల లోపు మాత్రమే చెల్లింపులు
- తాజా 2026-27 బడ్జెట్ కేటాయింపుల్లోనూ తల్లికి వందనంలో కోత తప్పదు..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థుల తల్లులను చంద్రబాబు సర్కారు మరోసారి మోసం చేసింది. బడ్జెట్‌లో 'తల్లికి వందనం' అంటూనే వారిని వంచన చేస్తూ అంకెల గారడీని ప్రదర్శించింది. ఎన్నికల్లో అధికారం కోసం అడ్డగోలుగా అబద్ధపు హామీలిచ్చిన చంద్రబాబు ఇలా ఏటా బడ్జెట్‌లో మోసాన్ని పునరావృతం చేస్తుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది 87,41,885 మంది పిల్లలు పాఠశాలల్లో చదువుతుంటే కేవలం 67.27 లక్షల మందికి మాత్రమే 'తల్లికి వందనం' అమలుచేసి నిస్సిగ్గుగా గొప్పలు చెప్పుకున్నారు. మరోవైపు శనివారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలోనూ 'తల్లికి వంచన' ప్రస్ఫుటంగా బయటపడింది. 2026–27 బడ్జెట్‌లోనూ ఎంతమంది పిల్లలకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నారో చెప్పకుండా రూ.9,668 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం అనుమానాలకు తావిస్తోంది. ఎందుకంటే.. మంత్రి ప్రకటనకు, బడ్జెట్‌లో కేటాయింపులకు మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఆర్థిక మంత్రి రూ.9,668 కోట్లు పలికితే.. బడ్జెట్ ప్రతుల్లో రూ.8,457.07 కోట్లని పేర్కొన్నారు.

మళ్లీ కొందరికే 'వందనం'..

తల్లికి వందనం పథకంపై చంద్రబాబు సర్కారు కాకిలెక్కలు చెబుతోంది. ఎన్నికలప్పుడు అధికారమే పరమావధిగా ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే వాళ్లందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తామని విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది ముఖం చాటేశారు. 2024–25లో రూ.5,387 కోట్లు కేటాయిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అలాగే, 2025–26 బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించింది. ఇచ్చింది మాత్రం కేవలం రూ.6,377 కోట్లే. అంటే.. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లులకు రూ.8 వేలు, రూ.9 వేలు, రూ.10 వేలు చొప్పున మాత్రమే ఇష్టానుసారం ఖాతాల్లో వేసి మమ అనిపించింది. ఈ అరకొర సొమ్మును కూడా దాదాపు 21 లక్షల మందికి ఎగ్గొట్టింది. ఇప్పుడు కూడా మళ్లీ పాత సీన్‌నే పునరావృతం చేస్తూ తాజా బడ్జెట్‌లో రూ.9,668 కోట్లను కేటాయించింది.

వాస్తవ వ్యయానికి దూరంగా..

నిజానికి.. 87.41 లక్షల మంది విద్యార్థుల తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలంటే రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. కానీ, చంద్రబాబు సర్కారు ఎప్పటిలాగే అరకొరగా కేటాయించడం చూస్తుంటే ఈసారి కూడా తల్లులకు వంచన తప్పదని స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకంటే.. ఇప్పుడు కేటాయించిన బడ్జెట్‌ను ఉన్నది ఉన్నట్లు అమలుచేస్తే 65 లక్షల మంది పిల్లలకు మాత్రమే సరిపోతుంది. మిగిలిన విద్యార్థులకు కోత ఖాయం. ఇప్పటికే చంద్రబాబు తొలి ఏడాది తల్లికి వందనం పథకం ఎగ్గొట్టిన విషయం తెలిసిందే. రెండో ఏడాది అరకొరగా పంపిణీ చేశారు. ఇక ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన మేరకు పూర్తిస్థాయిలో ఇచ్చినా రూ.3,444.82 కోట్లు ఎగ్గొట్టినట్లు అవుతుంది. మొత్తం మీద మూడేళ్లకు కలిపి రూ.24,504.39 కోట్లు తల్లికి వందనం రూపంలో తల్లులకు ఎగ్గొట్టారు.

పాఠశాల విద్యకు వ్యయంలోనూ వెనకడుగే..

2026–27 బడ్జెట్‌లో పాఠశాల విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం రూ.32,308.31 కోట్లు కేటాయించింది. ఇవన్నీ నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలకు సరిపోతాయి. అయితే, 2025–26 బడ్జెట్‌లో రూ.31,805.65 కోట్లు ప్రతిపాదించగా... సవరించిన అంచనా తర్వాత ఖర్చు దగ్గరకు వచ్చేసరికి ఆ మొత్తం రూ.30,175.13 కోట్లకు తగ్గిపోయింది. అంటే.. పాఠశాల విద్యకు కేటాయింపులే తక్కువ అనుకుంటే ఈ ప్రభుత్వం అందులో చేస్తున్న ఖర్చు ఇంకా తక్కువగా ఉండటం విస్తుగొలుపుతోంది.

'మనబడి-మన భవిష్యత్తు' గాలికి..

'నాడు–నేడు' వంటి బృహత్తర కార్యక్రమంతో గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేశారు. రెండు విడతల్లో దాదాపు రూ.8 వేల కోట్ల బడ్జెట్‌తో 23 వేల ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీలను అత్యాధునిక విద్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు సంకల్పించారు. గత ప్రభుత్వంలోనే రూ.4 వేల కోట్ల పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు పూర్తవ్వాలంటే మరో రూ.4 వేల కోట్లు అవసరం. కానీ, చంద్రబాబు ప్రభుత్వం అక్కసుతో ఆ పథకం పేరును 'మనబడి–మన భవిష్యత్తు'గా మార్చింది తప్ప పైసా ఖర్చు చేయలేదు. 2024–25 బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించింది గానీ ఆ డబ్బులతో ఒక్క ఇటుక కూడా వేయలేదు. అలాగే, 2025–26 బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు చూపించినా ఆ తర్వాత దానిని రూ.772 కోట్లకు కుదించింది. ఇప్పుడు మళ్లీ రూ.1,500 కోట్లు కేటాయించినా దానితో పాఠశాలల రూపురేఖలు పెద్దగా మారే పరిస్థితిలేదు. మరోవైపు.. గతంలో పూర్తయిన పనులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులే సుమారు రూ.1,200 కోట్లు ఉన్నట్లు అంచనా. ఇక ప్రభుత్వ బడులకు 'స్టార్ రేటింగ్' పేరుతో చంద్రబాబు హడావుడి చేయడం తప్ప అక్కడ మౌలిక వసతులు క్షీణిస్తున్నాయి. చంద్రబాబు తీసుకొచ్చిన స్టార్ నిబంధనల ప్రకారం పాఠశాలలు ఉండాలంటే సుమారు రూ.12 వేల కోట్ల బడ్జెట్ అవసరమని తెలుస్తోంది.

బడ్జెట్ తగ్గిపోతోంది..

ఇదిలా ఉంటే.. గత మూడు బడ్జెట్‌లు చూస్తే చంద్రబాబు పాలనలో పాఠశాల విద్య కేటాయింపులు కుచించుకుపోతున్నాయి. 2024–25 రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లతో ఉంటే.. ఇందులో పాఠశాల విద్యకు రూ.29,909.31 (10.15 శాతం) నిధులు కేటాయించారు. ఖర్చు పెట్టింది మాత్రం రూ.28,560.64 కోట్లే. అలాగే, 2025–26లో రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రకటించినా పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు (9.86 శాతం) కేటాయించారు. ఇక 2026–27కి వచ్చేసరికి 3.32 లక్షల కోట్ల బడ్జెట్‌లో పాఠశాల విద్య వాటా రూ.32,308.31 (9.75 శాతం) కోట్లకు పరిమితమైంది.

సున్నా వడ్డీకి ఎగనామం!

ద్వాక్రా మహిళలను మోసం చేసిన బాబు

రుణాలు సకాలంలో చెల్లించినా పొదుపు సంఘాలకు అందని వడ్డీ రాయితీ

ఎన్నికల హామీ ప్రకారం పథకం అమలుకు దాదాపు రూ. 5వేల కోట్లు అవసరం

2026-27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో కేవలం రూ.100 కోట్లే కేటాయింపు

సాక్షి, అమరావతి: డ్వాక్రా సంఘాలను నేనే ఏర్పాటు చేశాను.. మహిళలను ఆర్థిక వేత్తలుగా తీర్చిదిద్దుతాను.. అందుకు ప్రోత్సాహం అందిస్తానని ఊదర గొట్టిన చంద్రబాబు శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వారికి మొండి చేయి చూపారు. కొత్త పథకాల ఊసు లేకపోయినా.. ఇచ్చిన హామీ అమలుకు కూడా నిధులు విదల్చలేదు. పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకానికి పంగనామం పెట్టే చర్యలు కొనసాగిస్తోంది. ఎన్నికల ముందు చంద్రబాబు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ ఇస్తామని ప్రకటించారు. దాని ప్రకారం ఈ పథకానికి ఏడాదికి దాదాపు రూ.5000 కోట్ల నిధులు అవసరం కాగా.. శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించడంతో అక్కచెల్లెమ్మలు అవాక్కవుతున్నారు.ఇక 2025–26 వార్షిక బడ్జెట్‌లోనూ వంద కోట్లు కేటాయించినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో పెట్టిన వంద కోట్ల కేటాయింపుల పరిస్థితి ఇలానే ఉండవచ్చని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

కోటి మంది మహిళలకు వడ్డీ రాయితీ అందించిన వైఎస్ జగన్

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించిన కోటిమందికి పైగా పొదుపు సంఘాల మహిళలకు గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సున్నావడ్డీ పథకాన్ని రంచన్‌గా అమలు చేసింది. ఒక్కో ఆర్థిక సంవత్సరం ప్రాతిపదికన ఏప్రిల్–మార్చి మధ్య ఏడాది పాటు ప్రతి నెలా డ్వాక్రా మహిళలు చెల్లించిన వడ్డీ డబ్బును 'సున్నావడ్డీ' పథకంలో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ఆ ఐదేళ్లలో సున్నా వడ్డీ పథకం ద్వారా పొదుపు సంఘాల మహిళలకు భరోసా కల్పించారు.

20 నెలలుగా ఎదురుచూపులు

2024 ఎన్నికల సమయంలో మహిళల ఓట్లు కొల్ల గొట్టడానికి చంద్రబాబు ఒక్కో డ్వాక్రా సంఘానికి రూ.10 లక్షల వరకూ రుణాలు ఇవ్వడంతో పాటు సున్నా వడ్డీ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఇంత వరకూ సున్నా వడ్డీ ఊసేఎత్తలేదు. దీంతో రుణాలు సకాలంలో చెల్లించిన డ్వాక్రా మహిళలు వడ్డీ రాయితీ కోసం ఎదురు చూస్తున్నారు. అంటే దాదాపు రెండేళ్లకు చంద్రబాబు ప్రభుత్వం సున్నా వడ్డీ కింద పొదుపు సంఘాల మహిళలకు దాదాపు రూ.10 వేల కోట్లు బకాయి పడింది. అలాంటిది 2026–27 బడ్జెట్‌లో కేవలం రూ.100 కోట్లు కేటాయింపులు చేశారు.ఈ కేటాయింపులు చూసి సున్నా వడ్డీకి ఎగనామం పెడుతున్నారని మహిళలు మండిపడుతున్నారు.

• బడ్జెట్‌కు సుస్తీ

ఆరోగ్యానికి అంతంతే

ఆరోగ్య ఆసరాకు పైసా కూడా విదల్చని బాబు సర్కారు



సాక్షి, అమరావతి: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ బడ్జెట్‌లో చంద్రబాబు ప్రభుత్వం భారీగా కోతలు విధించింది. 2025–26 బడ్జెట్‌లో రూ.19,264 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినట్టు చూపిన టీడీపీ కూటమి సర్కారు.. ఖర్చుల్లో రూ.1,626 కోట్ల మేర కోత పెట్టింది. ఈ విషయాన్ని సవరించిన గత ఏడాది బడ్జెట్ స్పష్టం చేసింది. 2026–27 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయింపులు అవసరమని వైద్య శాఖ ప్రతిపాదించగా.. ప్రభుత్వం భారీగా కోత పెట్టింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.19,306 కోట్లు కేటాయిస్తున్నట్టు చూపింది. గత ఏడాది కేటాయించిన మొత్తంలో రూ.1,626 కోట్లు కోత పెట్టిన దృష్ట్యా.. ఈ ఏడాది బడ్జెట్‌లో మరింత ఎక్కువ మొత్తం కోత పెడతారనే భయాందోళన వ్యక్తమవుతోంది. మందుల కొనుగోళ్లకు రూ.820 కోట్లకు పైగా అవసరమని.. సర్జికల్స్‌కు రూ.320 కోట్లు కావాలని ప్రతిపాదించగా.. మందుల బడ్జెట్‌లో రూ.220 కోట్లు, సర్జికల్స్‌కు రూ.100 కోట్ల పైగానే కోత విధించి అరకొర నిధులనే విదిల్చింది.

ఆసరా సాయానికి 'సున్నా'

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఆరోగ్య ఆసరా సాయానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులే లేకుండా చేశారు. అనారోగ్యం బారినపడి ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగులకు కోలుకునే సమయంలో ఆర్థికంగా చేదోడుగా నిలిచేలా 'ఆరోగ్య ఆసరా' పథకాన్ని గత వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. చంద్రబాబు గద్దెనెక్కిన వెంటనే ఆరోగ్యశ్రీ స్థానంలో బీమాను ప్రవేశపెడతామని ప్రకటించారు. అప్పుడే ఆరోగ్య ఆసరాకు ఉద్వాసన పలకాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 2024 నుంచే ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగులకు ఆసరా చెల్లింపులను నిలిపివేశారు. ఈ పథకానికి 2025–26 బడ్జెట్‌లో కేవలం రూ.లక్ష మాత్రమే కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఏకంగా కేటాయింపులే లేకుండా ఇకపై ఆసరా అమలు చేసే ఉద్దేశమే లేదని, తాను పేదల వ్యతిరేకినని మరోమారు చంద్రబాబు రుజువు చేసుకున్నారు. వాస్తవానికి ఈ పథకం కోసం ప్రభుత్వం ఏటా రూ.450 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. పథకానికి ఉద్వాసన పలికి పేదలకు రెండేళ్లలో రూ.900 కోట్లకు పైగా సాయాన్ని చంద్రబాబు ఎగ్గొట్టారు. వాస్తవానికి ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగులకు వైద్యులు సూచించిన విశ్రాంత సమయానికి నెలకు గరిష్ఠంగా రూ.5 వేల చొప్పున ఆసరా సాయం అందించాల్సి ఉంది. ఇప్పుడు ఆసరాతో పాటు ఆరోగ్యశ్రీకి కూడా చంద్ర గ్రహణం పట్టుకుంది. గతంలో రోగి/బంధువు ఖాతాల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన 24 గంటల్లో ఆసరా సాయాన్ని జమ చేసేవారు. ఇలా 2019–24 మధ్య వైఎస్ జగన్ పాలన ఐదేళ్లలో 24,59,090 మందికి రూ.1,465.67 కోట్ల మేర ఆర్థిక సాయం అందించారు. కానీ బీమా రాగం అందుకున్న బాబు నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేశారు. ఆరోగ్యశ్రీ చికిత్స అందించిన ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.3 వేల కోట్లకు పైగా బకాయి పడింది. బకాయిలను చెల్లించేలా బడ్జెట్‌లో అదనపు నిధులను కేటాయించకపోవడం గమనార్హం.

ఆరోగ్యశ్రీ బకాయిల మాటేమిటి?

ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన బకాయిలే రూ.3 వేల కోట్లు ఉంటే.. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయించడంపై ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఏపీ ఆశా) ఆందోళన వ్యక్తం చేసింది. తమ బకాయిలు చెల్లించడానికి ఎటువంటి నిర్దిష్ట, దిద్దుబాటు చర్యలు ప్రభుత్వం చేపట్టడం లేదని శనివారం ఒక ప్రకటనలో మండిపడింది. దీనివల్ల రాష్ట్రంలోని స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని తెలిపింది. బకాయిల చెల్లింపుపై స్పష్టమైన రోడ్ మ్యాప్ ఇవ్వాలని ఇటీవలే హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేసింది. ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతూ ప్రజలకు సేవలు అందించడం అసాధ్యమని పేర్కొంది. బకాయిలను దశల వారీగా, నిర్ణీత సమయంలో విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

కొత్త వైద్య కళాశాలల ఊసేదీ..?

2026–27 బడ్జెట్‌లో కొత్త వైద్య కళాశాలల ఊసే లేకుండా చేశారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన 10 వైద్య కళాశాలలను పీపీపీలో ప్రైవేట్‌కు కట్టబెట్టాలని చంద్రబాబు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే 4 కళాశాలలకు టెండర్లు పిలవగా సరైన స్పందన రాలేదు. కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టాలన్న ప్రభుత్వ కుట్రలతో 2024–25లో 700 ఎంబీబీఎస్ సీట్లు, 2025–26లో 1,450 చొప్పున రెండేళ్లలో 2450 ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్ర విద్యార్థులు కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో 10 వైద్య కళాశాలల ప్రారంభంపై ఈ బడ్జెట్‌లోనైనా స్పష్టత వస్తుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూశారు. అయితే.. బడ్జెట్‌లో కొత్త వైద్య కళాశాలల ప్రస్తావనే లేకుండా పోయింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.8,480 కోట్ల అంచనాలతో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2024 ఎన్నికల నాటికి వైద్య కళాశాలల్లో రూ.3 వేల కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అప్పటికే కొన్ని కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఏడాదికి రూ.వెయ్యి కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రభుత్వ రంగంలోనే కళాశాలలన్నీ అందుబాటులోకి వస్తాయి. ఈవెంట్లు, మంత్రులు, సీఎం విలాసాలు, ఇతర కార్యక్రమాలకు రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం వైద్య కళాశాలలకు మాత్రం నిధులు లేవంటూ ప్రైవేట్‌కు కట్టబెడుతోంది.

పేదలను వంచించడమే..

దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగానికి నిధులు 10 శాతానికి పెరుగుతున్నాయి. రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం నిధులు తగ్గిస్తోంది. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 5.8 శాతం నిధులు మాత్రమే ఆరోగ్య రంగానికి కేటాయించారు. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందనడానికి ఈ కేటాయింపులే నిదర్శనం. వైద్య రంగానికి నిధులు తగ్గించడం పేద ప్రజలను వంచించడమే.

– డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్, విజయవాడ

బాబు బీమాయ

2025-26లో చంద్రన్న బీమాకు రూ.300 కోట్ల కేటాయింపు	ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని వైనం	ఈ ఏడాది రూ.735 కోట్లు కేటాయింపు	అంకెలకే పరిమితమని కార్మిక లోకం మండిపాటు

సాక్షి, అమరావతి: బడ్జెట్ సాక్షిగా కార్మిక వర్గానికి చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసం బహిర్గతమైంది.అంకెల గారడీ తప్పా.. ఆ ఫలాలు కార్మికవర్గం దరి చేరనివ్వలేదు. శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గణాంకాలే బాబు మాయను వెల్లడించాయి.

కార్మికులకు దక్కని భరోసా

ఎన్నికలకు ముందు 'డ్రైవర్ సాధికార సంస్థ ఏర్పాటు చేస్తాం. ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, రుణాలు అందిస్తాం... ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీలిచ్చారు. గద్దెనెక్కిన తర్వాత నిలువునా దగా చేస్తున్నారు. చంద్రన్న బీమా పథకం కింద సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.10 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. 2024–25 తరహాలోనే 2025–26లోనూ చంద్రన్న బీమా పథకానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

చంద్రబాబు మోసం వెల్లడి

2025–26 బడ్జెట్‌లో చంద్రన్న బీమా పథకం కోసం రూ.300 కోట్లు కేటాయించినట్టు చూపించారు. శనివారం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌లో కార్మికశాఖకు రూ.735 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. ఇదే సమయంలో గతేడాది కేటాయించిన రూ.300 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ప్రభుత్వం ఒప్పేసుకుంది. 2024–25 బడ్జెట్‌లో రూ.280 కోట్లు కేటాయించినా నయాపైసా కూడా ఖర్చు పెట్టలేదు.

కార్మికుల ఆరోగ్యంపై చిన్న చూపు

రాష్ట్రంలో అసంఘటితరంగ కార్మికులు 1.8 కోట్ల మంది ఉన్నట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఇప్పటి వరకూ ఈ–శ్రమ్ పోర్టల్‌లో 81 లక్షల మందికిపైగా నమోదయ్యారు. వీరిలో 56 శాతం మహిళలు, 44 శాతం పురుషులు ఉన్నారు. కార్మిక శాఖ గుర్తించని వారు లక్షల్లోనే ఉంటారు. 2025–26లో కార్మిక శాఖకు రూ.732 కోట్లు కేటాయించినట్టు చెప్పినా అందులో రూ.301 కోట్లు మాత్రమే వెచ్చించింది. కార్మికుల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాల్సిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విభాగానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లు కేటాయించి, రూ.214 కోట్లే ఖర్చు పెట్టారు. కార్మికుల ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సిన నిధుల్లో ఏకంగా రూ.130 కోట్ల మేర కోత విధించారు.

'టోలు'మందం సర్కారు

పీపీపీ పెడదారి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రధాన రోడ్ల నిర్మాణం ప్రైవేటు–ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే చేపడతామని ప్రభుత్వం బడ్జెట్లో స్పష్టం చేయడం వాహనదారులపై టోల్ ఫీజుల భారం తప్పదని చెప్పకనే చెప్పినట్టైంది. 2026–27 బడ్జెట్‌లో ఆర్అండ్‌బీకి రూ.9,856 కోట్లే కేటాయించినట్టు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కాగా గత ఏడాది బడ్జెట్‌లో రూ.8,785 కోట్ల కేటాయింపులతో కనికట్టు చేసిన ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఖర్చు చేయడంలో బాగా వెనుకబడింది. ఈ ఏడాది కూడా సర్కారు తీరు అలానే ఉంటుందన్నది స్పష్టమైంది. కీలకమైన జిల్లా, రాష్ట్ర ప్రధాన రహదారులకు నిధులు కేటాయించిన తీరే ఈ విషయాన్ని బట్టబయలు చేసింది.

- రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులన్నీ పీపీపీ విధానంలో రూ.620 కోట్లతో నిర్మిస్తామని ప్రభుత్వం బడ్జెట్‌లో వెల్లడించింది. అంటే ఇక జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలను అనుసంధానించే రాష్ట్ర రహదారులపై ప్రయాణించినా టోల్ ఫీజు భరించాల్సిందేనని సంకేతాలిచ్చింది.
- రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా గత బడ్జెట్‌లో రూ.700 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూ.182 కోట్లే ఖర్చు చేసింది. ఈ ఏడాది కేవలం రూ.130 కోట్లే కేటాయించడం విస్తుగొలుపుతోంది.
- జాతీయ రహదారుల పనులకు గత బడ్జెట్‌లో రూ.1,024 కోట్లు కేటాయించినట్టు చెప్పిన ప్రభుత్వం కేవలం రూ.867 కోట్లే వెచ్చించింది. ఇక ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.901 కోట్లే ప్రకటించింది.
- ఆర్ఐడీ కింద మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి నిధులు, ఎన్‌డీబీ రుణ సహాయం, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, గ్రామీణ రోడ్లు, ఎన్ఆర్ఈజీపీ నిధులతో రోడ్ల నిర్మాణం కోసం 2026–27 బడ్జెట్‌లో రూ.802.16 కోట్లు కేటాయించారు. ఇది గత ఏడాది కేటాయించిన రూ.820.96 కోట్ల కంటే తక్కువ.

బాబు బడ్జెట్‌లో
పేదలకు స్థలం లేదు

2026-27 బడ్జెట్‌లో పేదలకు ఇళ్ల స్థలాల ప్రస్తావనే లేదు	ఎన్నికల ముందు పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున స్థలాలు ఇస్తామని చంద్రబాబు హామీ	వరుసగా మూడో బడ్జెట్‌లోనూ మొండి చేయి	వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లనే తమ ఖాతాలో వేసుకుని బాబు సర్కారు గొప్పలు

పేదలందరికీ నాణ్యమైన ఇళ్ళు

- గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం మంజూరు చేస్తాం
- ఇప్పటివరకు మంజూరై పట్టాలు పొందిన వారికి ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం

పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు ఇస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న భాగం

సాక్షి, అమరావతి: 'పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలాలు పంపిణీ చేస్తాం. పక్కా ఇళ్లు నిర్మిస్తాం..' అని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు... మరోసారి పేదలను నిలువునా మోసం చేశారు. శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌లోనూ పేదలకు 'స్థలం' లేకుండా చేశారు. తమ 20 నెలల పాలనలో రాష్ట్రంలో ఎక్కడా పేదలకు సెంటు స్థలం, ఒక్క ఇంటిని కొత్తగా మంజూరు చేయని చంద్రబాబు ప్రభుత్వం... రానున్న రోజుల్లో అయినా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామనే భరోసా కల్పించలేదు. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచితంగా మహిళల పేరిట స్థలం ఇచ్చి నిర్మించిన ఇళ్లను తామే నిర్మించినట్లు ఈ బడ్జెట్‌లో గొప్పగా చెప్పుకోవడం గమనార్హం. తమ ప్రభుత్వం మూడు లక్షల ఇళ్లు నిర్మించిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం అందరినీ ఆశ్చర్యపరిచింది. చంద్రబాబు గద్దెనెక్కిన నాటి నుంచి పేదలకు సెంటు స్థలం పంపిణీ చేయలేదని, ఒక్క ఇల్లు మంజూరు చేయలేదని, అయినా మూడు లక్షల ఇళ్లు ఎక్కడ కట్టారు? అని జనం ప్రశ్నిస్తున్నారు.

ఒకసారి నవ్వులపాలైనా... మళ్లీ అదే పాట

వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసి, నిర్మించిన ఇళ్లకే స్టేజ్‌లు అప్‌గ్రేడ్ చేసి మూడు లక్షల ఇళ్లు కట్టేశామని, ఆర్భాటంగా ప్రకటించి గతేడాది చంద్రబాబు సర్కార్ నవ్వులపాలైంది. వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను తామే నిర్మించామంటూ సీఎం చంద్రబాబు అన్నమయ్య జిల్లాలో లబ్ధిదారులకు తాళాలు అందజేయడం అప్పట్లో రాజకీయంగానూ దుమారం రేపింది. అయినా మళ్లీ తమ ప్రభుత్వం 3 లక్షల ఇళ్లు నిర్మించిందని పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో చెప్పడం గమనార్హం.

ఉద్యోగులకు బకాయిల వివరాలు (దాదాపు రూ.కోట్లలో)

డీఏ	14,000
పీఆర్సీ బకాయిలు	12,000
సరెండర్ లీవులు	4,000
జీపీఎఫ్	1,900
ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్	3,500
గ్రాట్యుటీ	3,400
ఇతర బకాయిలు	1,000
మొత్తం బకాయిలు	39,800

అమరావతి చుట్టూ తిరుగుతున్న రాష్ట్ర బడ్జెట్

అమరావతి నిర్మాణమే అన్ని సమస్యలకు పరిష్కారమని రాష్ట్ర బడ్జెట్ తేల్చేసింది. అందుకే బడ్జెట్ ఆద్యంతం అమరావతి చుట్టూ తిప్పి, రూ.3.32 లక్షల కోట్లతో కనికట్టు చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు కేటాయింపులలో మొండిచేయి చూపి వేర్పాటు వాదానికి బీజం వేశారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా.. నీళ్లు లేకుండా రాయలసీమను హార్టికల్చర్ హబ్ అంటూ హడావుడి చేస్తున్నారు.

– కేవీ రమణ, ఉపాధ్యక్షుడు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి.. అప్పులతో నడిపిస్తామన్నట్టు ఉంది

అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇప్పుడు అంకెల గారడీతో ప్రజలను మోసగిస్తోంది. సంపద సృష్టిస్తానన్న సీఎం చంద్రబాబు వరుసగా మూడో ఏడాదీ రూ.75 వేల కోట్ల ద్రవ్యలోటుతో బడ్జెట్ ప్రవేశపెట్టించారు. హామీల అమలుకు రూ.3.30 లక్షల కోట్ల కేటాయింపులు చూపించి.. ఆదాయం మాత్రం అందులో సగం రూ.1.50 లక్షల కోట్లు మాత్రమే చూపారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి.. అప్పులతో నడిపిస్తామన్న చందంగా బడ్జెట్ ఉంది.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు

వెలుగొండకు కేటాయింపులు దారుణం

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు అన్యాయం జరిగింది. వెలుగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.412 కోట్లు కేటాయించారు. 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెబుతున్న ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం దారుణం. నిర్వాసితులను తరలించడానికే రూ.1,300 కోట్లు అవసరం. కానీ ఈ రకంగా నిధులు కేటాయిస్తే వెలిగొండ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో. కొత్తగా ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లాకు బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించపోవడం గమనార్హం.

– బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు

తిరోగమన బడ్జెట్

చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టింది తిరోగమన బడ్జెట్. ఇది రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, సామాజిక న్యాయానికి తోడ్పడే విధంగా లేదు. సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. మొత్తం మీద ఈ బడ్జెట్ తిరోగమనం దిశగా ఉంది. అభివృద్ధి విషయంలో విఫలమైన ప్రభుత్వం ఆ బాధ్యతను పీపీపీ పేరుతో ప్రైవేటు రంగంపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. విద్యుత్ రంగానికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.14 వేల కోట్లకు తగ్గించడం ఛార్జీలు పెంచడానికే అని స్పష్టమవుతోంది. బడ్జెట్‌లో విద్యకు 10.8 నుండి 10.5 శాతానికి తగ్గింది. సంక్షేమానికి 17.3 శాతం నుండి 16 శాతానికి తగ్గింది. అంగన్‌వాడీ, ఆశా తదితర స్కీం వర్కర్స్ జీతాల పెంపుదలపై మాట్లాడలేదు.

– వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

బడాయి బడ్జెట్..

టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడాయి బడ్జెట్‌గా ఉంది. సంక్షేమం, అభివృద్ధికి సమతుల్యత లోపించింది. సూపర్ 6 హామీల అమలుకు ఇంకా కదలిక లేకపోయింది. మిగిలిన హామీల అమలు ప్రస్తావనేలేదు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, ఉద్యోగులను ఈ బడ్జెట్ మోసగించింది. ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేల ప్రస్తావనే లేదు. నిరుద్యోగ భృతి, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల చొప్పున ఈ రెండేళ్లల్లో 8 లక్షల ఉద్యోగాల హామీని గాలికి వదిలేశారు. జాబ్ క్యాలెండర్ లేదు. ప్రభుత్వ ఉద్యోగులను నిరాశ పరిచింది. 12వ పీఆర్సీపై కేటాయింపులు లేవు. ఐఆర్ ప్రకటించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మోసగించారు.

– గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

విద్యారంగాన్ని విస్మరించిన బాబు సర్కారు

చంద్రబాబు కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించింది. ఫీజుల విషయంలో విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసింది. గత బకాయిలే రూ.8,900 కోట్లు ఉండగా.. కేవలం రూ.3,836 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారు. ఉన్నత విద్యకు కేవలం రూ.2,566 కోట్లు కేటాయించారు. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి ఇవి ఏమాత్రం సరిపోవు.

– పానుగంటి చైతన్య, రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం

తల్లికి వందనం నేటికీ ఇవ్వలేదు

తల్లికి వందనం కింద గత ఏడాది చెల్లించాల్సిన మొత్తాలు ఇప్పటికీ ఇవ్వలేదు. 80 లక్షల మందికి ఇవ్వాల్సి ఉండగా.. ఈ బడ్జెట్‌లో 67 లక్షల మందికే ఇస్తున్నట్టు చంద్రబాబు ప్రభుత్వం పేర్కొంది. బడ్జెట్‌లో కేవలం రూ.9,668 కోట్లు కేటాయించి లబ్ధిదారుల్ని కుదించింది. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు చేసిన రూ.300 కోట్ల కేటాయింపులు ఏ మూలకు సరిపోతాయి ?

– ఎ.రవిచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం

కౌలు చట్టం ప్రస్తావన ఏదీ?

కొత్త కౌలు చట్టం తెస్తామంటూ రెండేళ్లుగా మాటలు చెప్పడమే తప్ప చేతల్లో కన్పించడం లేదు. కనీసం మూడో బడ్జెట్‌లో అయినా ఆ ప్రస్తావన లేదు. ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లతో సరిపెట్టారు. రెండేళ్లుగా ఏ ఒక్క పంటకు ఏ ఒక్క రైతుకు మద్దతు ధర దక్కలేదు. ఈ బడ్జెట్ కౌలు రైతులను దగా చేసింది. కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి కౌలు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలి.

– వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, సీపీఎం అనుబంధ ఏపీ కౌలు రైతుల సంఘం నేతలు

గుట్టుగా గ్యారెంటీ అప్పులు!

బడ్జెట్‌లో దాచేసిన చంద్రబాబు సర్కారు

ప్రభుత్వ గ్యారెంటీ అప్పు.. 2025 చివరి నాటికి రూ.3.11 లక్షల కోట్లు

- రంగాల వారీగా ఆదాయ వివరాలపైనా దాగుడు మూతలు
- కూటమి సర్కారు చేసిన అప్పులపై తప్పుడు లెక్కలతో బడ్జెట్
- ఫిబ్రవరి 3వతేదీ నాటికే బడ్జెట్ అప్పులు రూ.97,571 కోట్లు
- ఆర్థిక మంత్రి లెక్కల్లో రూ.79,456 కోట్లుగా సవరణ అంచనాలు
- ప్రస్తుత ఆర్థిక ఏడాది బడ్జెట్ సవరించిన అంచనాల్లో భారీగా కోతలు
- మూలధన వ్యయంపై తప్పుడు గణాంకాలతో సవరణ అంచనాలు
- జీఎస్‌డీపీలో అప్పులు 35 నుంచి 36 శాతానికి పెరుగుదల

సాక్షి, అమరావతి: అప్పులపై వాస్తవాలను చంద్రబాబు సర్కారు మరోసారి కప్పిపుచ్చింది. కూటమి సర్కారు గ్యారెంటీతో చేసిన అప్పులను బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో చూపకుండా దాచేసింది. ఇలా అసంపూర్తి లెక్కలతో బడ్జెట్ ఇన్ బ్రీఫ్ ఇవ్వడం చంద్రబాబు సర్కారుకు ఇది రెండోసారి కావడం గమనార్హం. గత బడ్జెట్‌లోనూ ఐదేళ్ల అప్పుల వివరాలు ఇవ్వకుండా ఎగరగొట్టిన విషయం తెలిసిందే. బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో కేవలం బడ్జెట్ అప్పులను మాత్రమే చంద్రబాబు సర్కారు పేర్కొంది. బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన అప్పుల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం. ఓపెన్ మార్కెట్, కేంద్రం ఇచ్చినవి, చిన్న మొత్తాలతో పాటు ప్రభుత్వ గ్యారెంటీ అప్పులను బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో వెల్లడించడం సర్వ సాధారణం. అయితే చంద్రబాబు సర్కారు గ్యారెంటీ అప్పులు, చిన్న మొత్తాలు తదితరాల అప్పులను బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో చూపకుండా దాచిపెట్టింది. ఇందుకు ప్రధాన కారణం.. బడ్జెట్ బయట ప్రభుత్వ గ్యారెంటీలతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేయడమే. బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో రంగాల వారీగా ఆదాయ వివరాలు, వ్యయాలను చూపిస్తారు. ఈసారి వాటిని కూడా కూటమి సర్కారు ఎగరగొట్టింది. దాని స్థానంలో ప్రజా రుణం జీఎస్‌డీపీలో శాతం పేరుతో గ్రాఫిక్స్‌తో సరిపుచ్చింది. అప్పుల లెక్కలపై వాస్తవాలు బయట పడతాయనే భయంతోనే ఇలా చేసినట్లు ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అప్పులపై కూడా తప్పుడు గణాంకాలతో చంద్రబాబు సర్కారు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి 3వతేదీ నాటికే బడ్జెట్ అప్పులు రూ.97,456 కోట్లు కాగా.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 2025–26 అప్పులు రూ.79,456 కోట్లుగా సవరించిన అంచనాల్లో పేర్కొనడం గమనార్హం. మరో పక్క బడ్జెట్‌ను పూర్తిగా అమలు చేయలేక చంద్రబాబు సర్కారు చతికిల పడింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది బడ్జెట్ సవరించిన అంచనాల్లో భారీగా కోత పెట్టారు. 2025–26 బడ్జెట్‌ను రూ.3,22,359 కోట్లుగా ప్రతిపాదించగా ఇప్పుడు సవరించిన అంచనాల్లో రూ.3,00,534 కోట్లకు కుదించారు. అంటే ఏకంగా రూ.21,825 కోట్లు కోత విధించారు.
- ప్రస్తుత ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.14,182 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో రూ.13,081 కోట్లకు తగ్గించారు. గ్రామీణాభివృద్ధి రంగానికి రూ.18,890 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో రూ.15,244 కోట్లకు కుదించారు. సాధారణ విద్యకు రూ.34,825 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో రూ.32,694 కోట్లకు తగ్గించారు. ఆరోగ్య రంగానికి రూ.19,264 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో రూ.17,637 కోట్లకు తగ్గించారు. పట్టణాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.13,862 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల్లో రూ.11,252 కోట్లకు తగ్గించారు. ఇలా తగ్గించిన గణాంకాలతో, 2026–27లో అధికంగా కేటాయింపులు చేశామంటూ బాబు సర్కారు జబ్బలు చరుచుకోవడం గమనార్హం.
- మూలధన వ్యయంపై కూడా తప్పుడు గణాంకాలతో సవరణ అంచనాలను ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. 2025–26లో మూలధన వ్యయం రూ.40,635 కోట్లు ఉండగా సవరించిన అంచనాల్లో రూ.33,134 కోట్లుగా పేర్కొన్నారు. అయితే కాగ్ గణాంకాల మేరకు వాస్తవ మూలధన వ్యయం డిసెంబర్ నాటికి కేవలం రూ.19,224 కోట్లే. మూడు నెలల్లో ఏకంగా మరో రూ.13 వేల కోట్లకుపైగా వ్యయం చేస్తామనడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం అవుతోంది.
- కూటమి సర్కారు పాలనలో జీఎస్‌డీపీలో బడ్జెట్ అప్పులు 35 నుంచి 36 శాతానికి పెరిగాయి. జీఎస్‌డీపీలో అప్పులు 2023–24లో 35 శాతం ఉండగా చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మూడు బడ్జెట్లలో జీఎస్‌డీపీలో అప్పులు 36 శాతానికి ఎగబాకాయి.
- 2023–24 నాటికి బడ్జెట్ అప్పులు రూ.4.91 లక్షల కోట్లు ఉండగా 2026–27 మార్చి నాటికి ఏకంగా రూ.7.11 లక్షల కోట్లకు పెరగనున్నాయి. అంటే వచ్చే మార్చి నాటికి కూటమి సర్కారు బడ్జెట్ అప్పులే ఏకంగా రూ.2.20 లక్షల కోట్లు పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది.
- ఇక బడ్జెట్ బయట అప్పులకు కూటమి సర్కారు భారీగా గ్యారెంటీలు ఇచ్చింది. బడ్జెట్ డాక్యుమెంట్ వాల్యూమ్ 5 ప్రకారం వివిధ సంస్థల ద్వారా 2025 డిసెంబర్ నాటికి రూ.3.11 లక్షల కోట్ల అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీలు ఇచ్చింది. ఇందులో పౌరసరఫరాల సంస్థ, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ జెన్‌కో తదితర సంస్థలున్నాయి. బడ్జెట్ బయట అప్పులపై ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆధారపడుతోందని దీన్నిబట్టి స్పష్టం అవుతోంది.



‘ఫీజు’ బకాయిలు ఇక అంతే!

ఉన్నత విద్యలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను అటకెక్కించిన చంద్రబాబు సర్కారు!

బడ్జెట్‌లో రూ.3,836 కోట్లు మాత్రమే కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్నత విద్యా రంగాన్ని చంద్రబాబు సర్కార్ గాలికొదిలేసింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులను అసలు పట్టించుకోలేదు. తాజా బడ్జెట్‌లో ఉన్నత విద్యకు అరకొర కేటాయింపులతోనే సరిపెట్టింది. ఉన్నత విద్యకు సంబంధించి కేవలం యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థల్లో పని చేసే ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులకు రూ.2,566.80 కోట్లు ప్రతిపాదించింది. ఐటీఐ నుంచి సంప్రదాయ, సాంకేతిక ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అందించే పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్–ఎంటీఎఫ్)లకు రూ.3,836 కోట్లు కేటాయిస్తున్నట్లు లెక్కలు చూపించింది. కానీ, కొండలా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు సరిపడా నిధులు కేటాయించలేదు.

అరకొర కేటాయింపులే..

చంద్రబాబు ప్రభుత్వం 2025–26లో ఉన్నత విద్యా రంగానికి జీతాలు, నిర్వహణ ఖర్చుల కింద రూ.2,564 కోట్లు కేటాయించగా... చివరికి వచ్చే సరికి రూ.2,386 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తుండటం గమనార్హం. మళ్లీ 2026–27 బడ్జెట్‌లో రూ.2,566.80 కోట్లే కేటాయించారు. ఏటా ఉన్నత విద్యలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,800 కోట్లు, విద్యార్థులకు హాస్టల్ మెయింటినెన్స్ (వసతి దీవెన) కింద రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.3,900 కోట్లు వెచ్చించాలి. చంద్రబాబు 20 నెలల పాలనలో ఈ రెండింటినీ ఏనాడూ సక్రమంగా అమలు చేయలేదు. గత బడ్జెట్‌లో రూ.2,600 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.3,836 కోట్లు కేటాయింపులు చూపించారు. ఈ మొత్తం ఒక ఏడాది పూర్తి చెల్లింపులకు కూడా సరిపోవు. అయితే, ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపు రూ.5,600 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటికి తోడు ఈ ఏడాది ముగింపుతో కలుపుకొంటే రూ.3,300 కోట్లు వసతి దీవెన నిధులకు ఎగనామం పెట్టింది. వెరసి విద్యార్థులకు రూ.8,900 కోట్ల బకాయిలు చెల్లించాలి. కానీ, ఈ బకాయిలు చెల్లించేందుకు వీలుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు.

చంద్రబాబు ‘మాయా నేత’

చంద్రబాబు ఎన్నికల హామీ అమలులో మోసం

- చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు.. మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితమంటూ ఆర్భాటపు హామీ
- అధికారానికి వచ్చిన 9 నెలలకు జీవో..
- జీవో ఇచ్చి పది నెలలైన అమలుకాని వైనం
- ఏప్రిల్ 1 నుంచి అమలంటూ తాజా బడ్జెట్ ప్రకటన

సాక్షి, అమరావతి: అధికారంలోకి రాగానే చేనేత రంగానికి ఉచిత విద్యుత్ అందిస్తామని ఆర్భాటపు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన 9 నెలలకు 2025 మార్చిలో జీవో ఇచ్చారు. జీవో ఇచ్చి ఇప్పటికి పది నెలలైనా అమలుకు నోచుకోలేదు. ఏప్రిల్ 1నుంచి చేనేతకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని తాజా బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రకటించారు.

రూ.189 కోట్ల ప్రయోజనం కోల్పోయిన నేతన్న

పథకం అమలు చేస్తామంటున్న ఏప్రిల్ నాటికి దాదాపు 22 నెలల పాటు రాష్ట్రంలోని నేతన్నలు దాదాపు రూ.189కోట్ల ఉచిత విద్యుత్ లబ్ధిని కోల్పోయినట్లయ్యింది. ఇప్పుడు చేనేత, ఎస్సీ, ఎస్టీ, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, రైతులకు విద్యుత్ సబ్సిడీకి రూ.600 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్టు ప్రభుత్వం గొప్పగా పేర్కొంది. అయితే దాదాపు రెండేళ్లపాటు కోల్పోయిన రూ.189 కోట్ల ఉచిత విద్యుత్ లబ్ధి మాటేమిటని నేతన్నలు ప్రశ్నిస్తున్నారు.

ఎప్పుడూ మోసమే..

చేనేత రంగానికి ఇచ్చిన హామీలలో ఒక్కటంటే ఒక్కటి కూడా చంద్రబాబు ప్రభుత్వం సరిగా అమలు చేయలేదు. 2014 ఎన్నికల ముందు దాదాపు 25 హామీలను ఇచ్చి అమలు చేయలేదు. 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ఇదే దగా. ప్రధానంగా చేనేత మగ్గాలకు(హ్యాండ్లూమ్) నెలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు (పవర్‌లూమ్స్) 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్.. నేతన్న నేస్తం ఏడాదికి రూ.25వేలు.. జీఎస్టీ మినహాయింపు... వంటి అనేక హామీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో నేతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి అయినా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తారా? లేదా మరోసారి మోసం చేస్తారా? అన్న చర్చ తాజాగా సాగుతోంది. ఇటీవల మంత్రి సవిత తాజాగా చెప్పిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 93 వేల చేనేత మగ్గాలు, 10,534 మరమగ్గాలు కలిగిన నేతన్నలకు ఉచిత విద్యుత్ అందకపోవడంతో మరింత తీవ్రంగా నష్టపోయినట్టే.

నేతన్నకు ఏప్రిల్ వరకూ నష్టం తీరిది..

- అధికారం చేపట్టిన వెంటనే ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసి ఉంటే రాష్ట్రంలో చేనేత, మరమగ్గాలు కలిగిన మొత్తం 1,03,534 నేతన్న కుటుంబాలకు 22 నెలల కాలంలో రూ.189,02,66,400 లబ్ధి చేకూరేది.
- చేనేత మగ్గాలకు నెలకు రూ.720 (నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్) చొప్పున 22 నెలలకు రూ.15,840 చొప్పున నష్టపోయారు. ఈ లెక్కన మొత్తం 93 వేల కుటుంబాలు రూ.147,31,20,000 మొత్తాన్ని కోల్పోయాయి.
- మర మగ్గాలు కలిగిన వారికి నెలకు రూ.1,800 చొప్పున (నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్) 22 నెలలకు రూ.39,600 లబ్ధి దక్కకుండా పోయింది. మరమగ్గాలు కలిగిన మొత్తం 10,534 మంది రూ.41,71,46,400 నష్టపోయారు.

ఉద్యోగులకు రూ.40 వేల కోట్ల బకాయిల ఊసేది?

ఎన్నికల హామీలు బుట్టదాఖలు ● బడ్జెట్‌లో ఊసేలేని ఉద్యోగుల సమస్యలు

సాక్షి, అమరావతి: మాయమాటలతో ఊరడించడం తప్ప ఉద్యోగులకు వాస్తవంలో చేసేదేమీ లేదని చంద్రబాబు ప్రభుత్వం మరోసారి తేల్చేసింది. రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగుల సమస్యల ప్రస్తావనే లేకపోవడాన్ని బట్టి వారి ఆందోళనను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెప్పకనే చెప్పినట్లయింది. ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీల్లో ఒక్కదానినైనా నెరవేర్చాలని ఉద్యోగ సంఘాలు నిత్యం చేస్తున్న విజ్ఞాపనలను సైతం ప్రభుత్వ పెద్దలు పరిగణనలోకి తీసుకోలేదు. ప్రస్తుతం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు దాదాపు రూ.40 వేల కోట్లకు చేరిపోయినట్లు ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి.

జగన్ హయాంలో అందిన 11 డీఏలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 11 డీఏలు ఇవ్వగా, చంద్రబాబు 2014–19 మధ్య ఏడు డీఏలు మాత్రమే ఇచ్చారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు ఎప్పుడూ ఉద్యోగులను చిన్నచూపు చూస్తారనడానికి ఇదే ఉదాహరణని చెబుతున్నారు. మరోవైపు ‘జగన్ ఏర్పాటు చేసిన వ్యవస్థ’ అనే కారణంతో గ్రామ స్థాయిలో తలలో నాలుకలా పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులను చంద్రబాబు హీనాతిహీనంగా చూస్తూ బానిసలుగా మార్చివేయడం వారిని కలచివేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయకపోగా అసలు ఉద్యోగులను భయపెట్టి, బెదిరించేలా వ్యవహరించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం నాలుగు డీఏ బకాయిలు ఉద్యోగులకు ఇవ్వాలి

సరెండర్ లీవుల్లో పోలీసులకు రావాల్సింది రూ.400 కోట్లు

ఇతర బకాయిల్లో ఏపీజీఎల్ఐ, టీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్, లోన్లు మొదలైనవి ఉన్నాయి

గారడీ ప్రకటనలు..

- గత సంక్రాంతికి ఒక డీఏ ఇచ్చినట్లు ప్రకటించినా, అందులోనూ ప్రభుత్వం గారడీ చేసింది. వేల కోట్ల బకాయిలు ఉంటే కేవలం రూ.1,100 కోట్లు ఇచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అవి కూడా అందరు ఉద్యోగుల ఖాతాల్లో జమ కాలేదు.
- ఏడాది క్రితం పోలీసులకు ఇస్తానన్న రెండు సరెండర్ లీవులను విడతల వారీగా ఇస్తామన్నా, అది కూడా సరిగా ఇవ్వలేదు.
- ఎన్నికల్లో చెప్పిన మేరకు ఉద్యోగులకు ఐఆర్ ఇవ్వడానికి కూటమి ముందుకు రావడం లేదు.
- డీఏ ఇచ్చేందుకు నిరాకరించడం, 12వ పీఆర్సీ నియమించేందుకే ముందుకు రాకపోవడాన్ని బట్టి ఈ ప్రభుత్వానికి తమను పట్టించుకునే ఆలోచన లేదని వారు వాపోతున్నారు.
- తాజా బడ్జెట్‌ను చూస్తే ఉద్యోగులకు ఈ ఏడాది కూడా ఇచ్చేది ఏమీ ఉండదని తేలింది.

బాబు.. పరి‘శ్రమ’లేని బడ్జెట్..

గత బడ్జెట్ ప్రతిపాదనలకంటే ఈసారి రూ.242.99 కోట్లు తగ్గింపు

పరిశ్రమల శాఖకు రూ.100 కోట్లు తగ్గించి రూ.2,281.96 కోట్లు కేటాయింపు

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు రూ.1,141.25 కోట్లకే పరిమితం

సాక్షి, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో పారిశ్రామికరంగానికి చంద్రబాబు ప్రభుత్వం మొండి చేయి చూపుతోంది. ప్రోత్సాహకాల విడుదల దగ్గర నుంచి ప్రాజెక్టుల కేటాయింపుల వరకు నామమాత్రంగా విదిల్చింది. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో కూడా భారీ కోత పెట్టేసింది. 2025–26 బడ్జెట్‌లో పారిశ్రామికరంగ పెట్టుబడులు రూ.2,382.57 కోట్లు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదనలను ఏకంగా రూ.242.99 కోట్లు తగ్గించి.. రూ.2,139.58 కోట్లకు పరిమితం చేస్తూ బడ్జెట్‌ను సవరించడం పారిశ్రామికరంగం పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. అంతేకాకుండా వచ్చే ఏడాది 2026–27 సంవత్సరానికి కూడా కేవలం రూ.2,281.96 కోట్లు మాత్రమే కేటాయించింది. పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనకు కేటాయింపులను రూ.873.15 కోట్ల నుంచి రూ.668 కోట్లకు పరిమితం చేసింది. కాకినాడ పోర్టుకు రూ.37 కోట్లు, మచిలీపట్నం పోర్టుకు రూ.150 కోట్లు, భావనపాడు పోర్టుకు రూ.100 కోట్లు, కాకినాడ సెజ్ పోర్టుకు రూ.50 కోట్లు, రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు నామమాత్రపు కేటాయింపులు చేశారు. అలాగే విజయవాడ ఎయిర్‌పోర్టుకు రూ.30 కోట్లు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు రూ.215.73 కోట్లు కేటాయించారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు టోపీ..

పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద సుమారు రూ.12,000 కోట్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.1,141.25 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.2 వేల కోట్లకు పైగా ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.229.36 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.900 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.200 కోట్లు కేటాయించడం ద్వారా మరోసారి ప్రభుత్వం వారి నెత్తిన టోపీ పెట్టింది. డిజిటల్ ఇన్‌ఫ్రా, క్వాంటమ్ వ్యాలీకి తూతూమంత్రంగా రూ.638 కోట్లు కేటాయించింది.

What is "El Dorado" in South America famous for?

CHAPTER - III
THE MAKING OF A GLOBAL WORLD

KEY POINTS

- In ancient times, people travelled long distances for knowledge, trade, or safety.
- Seashells were once used as money.
- The Silk Routes were important old trade routes.
- These routes linked Asia, Europe, and North Africa.
- Buddhism started in India and spread through the Silk Routes.
- Noodles travelled from China to Europe and became spaghetti.
- Arab traders carried pasta to Sicily in Italy.
- Foods like potato, tomato and maize were unknown to the world before 500 years.
- America includes North America, South America and the Caribbean.
- American Indians were the first people of the Americas.
- Potatoes helped Europe's poor to live healthier lives.
- Poor peasants in Ireland depended heavily on potatoes.
- Silver from Peru and Mexico increased Europe's wealth.
- Many explorers searched for the gold city called El Dorado.
- The Portuguese and Spanish conquered and settled in America.
- Europeans won because of better weapons and diseases like smallpox.
- Native Americans had no immunity due to long isolation.
- Smallpox killed large numbers of people.
- John Winthrop was the first governor of Massachusetts Bay colony.
- A dissenter is a person who does not accept established beliefs.
- Until the 18th century, India and China were the richest nations.
- Trade flows included goods like cloth and wheat.
- Labour flows meant people migrated for work.
- Capital flows meant money invested across countries.
- Corn Laws were laws that restricted the import of corn.
- The British built canals in West Punjab to grow wheat and cotton.
- Between 1820 and 1914, world trade grew 25 to 40 times.
- Smithfield in London had one of the oldest livestock markets.
- Trade and markets expanded greatly in the late 19th century.
- In 1885, European powers met in Berlin to divide Africa.
- Many countries like Britain, France, Germany and the US became colonial powers.
- Stanley was a journalist and explorer sent by the New York Herald.
- He mapped and explored many regions in Africa.
- In the 1890s, a cattle disease called rinderpest spread in Africa.
- Rinderpest reached Africa in the late 1880s.
- It spread to Africa's Atlantic coast by 1892.
- Rinderpest killed 90% of Africa's cattle.
- Indian indentured workers were sent to Trinidad, Guyana, Surinam, Mauritius and Fiji.

1 MARK QUESTIONS

1. What is the good example of vibrant pre-modern trade and cultural links between distant parts of the world?
A. The silk routes.
2. In which year indentured labour system was abolished?
A. 1921.
3. Name the cattle disease that devastated Africa in the 1890s.
A. Rinderpest.
4. Name the fabled city of gold?
A. El Dorado.
5. What is "El Dorado" in South America famous for?
A. Gold.
6. Give some examples of goods that travelled along the silk routes.
A. Potatoes, soya, groundnuts, maize, tomatoes, chillies.
7. What was the period of the First World War?
A. 1914-18.
8. Mention the Allies countries.
A. Britain, France and Russia (later joined by the US).
9. Mention the Central Power countries.
A. Germany, Austria-Hungary and Ottoman Turkey.
10. Who adopted assembly line method for mass production in industries?
A. The Ford car manufacturer Henry Ford.
11. Who thought that Indian gold exports promoted global economic recovery? / who said that Indian gold exports promoted global economic recovery after the Great Depression
A. The famous economist John Maynard Keynes
12. Expand IMF.
A. International Monetary Fund.
13. Expand IBRD.
A. The International Bank for Reconstruction and Development
14. What is the other name of IBRD.
A. World Bank.
15. What were the Axis power countries?
A. Nazi Germany, Japan and Italy.
16. What were the Allies countries?
A. Britain, France, the Soviet Union and the US.
17. Expand NIEO.
A. New International Economic Order.
18. Which food crop introduced from the Americas became very important in Ireland?
A. Potato
19. "El dorado" was famous for?
A. Gold.
20. What is the aim of IMF?
A. To deal with external surpluses & deficits of its member nations.
21. Why was the World Bank set up?
A. To finance postwar reconstruction.
22. Fill the second pair based on the relationship given in the first pair. (Italy : Rome :: Germany : _______?)
A. Berlin.
23. Arrange the countries from east to West. (India, China, Japan, USA.)
A. Japan – China – India – USA.
24. City in which the first German Parliament held?
A. Frankfurt
25. Disease spread from Europe to America in 16th century is ?
A. Smallpox
26. Who were indentured labourers?
A. Workers who signed contracts to work for a fixed period under harsh conditions.
27. 'La partie' means?
A. The fatherland.
28. Cattle plague is also known as?
A. Rinderpest
29. The First train in India was started From where to where?
A. From Bombay (Mumbai) to Thane in 1853.
30. In which country did the Great Depression start?
A. USA

2 MARKS QUESTIONS

1. For what the travellers, traders, priests and pilgrims travelled vast distances in the ancient times?
A. 1. For knowledge.
2. For opportunity.
3. For spiritual fulfilment.
4. To escape persecution.

2. What is corn law? Explain.
A. 1. The laws that restricted the imports of corn were called as the Corn Laws.
2. Industrialists and urban dwellers forced to abolish the Laws.
3. Due to the force the Corn Laws were scrapped.
4. Later food was imported into Britain more cheaply.

3. What are MNCs?
A. 1. Multinational corporations (MNCs) are large companies that operate in several countries at the same time.
2. The first MNCs were established in the 1920s.

4. What is indentured labour? Explain.
1. A bonded labourer under contract to work for a specific amount of time, to pay off his passage to a new country.
2. Recruitment was done by agents.
3. Agents tempted the migrants by providing false information.
4. Often agents even forcibly abducted less migrants.

5. What is G-77. / Write a short note on G77 countries.
1. The developing countries organised Group of 77

Continued on next page..

The trade routes that linked India to the world at the end of the seventeenth century.

Observe the map and analyse it.

1. The map shows old trade routes across Asia, Africa, and the Indian Ocean.
2. Goods were moved between important ports like Surat, Goa, Muscat, Malacca, and Canton.
3. Traders traveled by sea and land to exchange spices, cloth, and other products.
4. These routes connected India with East Asia, Southeast Asia, the Middle East, and Africa.

to demand a new international economic order (NIEO).
2. It is called G-77.

6. What is New International Economic Order.

A. A system that would give them real control over their natural resources, more development assistance, fairer prices for raw materials, and better access for their manufactured goods in developed countries' markets.

7. What are the types of exchange rates?
1. Fixed exchange rate
2. Flexible or floating exchange rates.

8. Write about the Great Depression.
1. The Great Depression began around 1929.
2. Agricultural incomes declined.
3. Farms could not sell their harvests.
4. Households were ruined.
5. Businesses collapsed.
6. Unemployment soared.

9. What were the effects of the World War II?
1. World War II waged for six years on many fronts.
2. Death and destruction was enormous.
3. About 3% of the world's population have been killed.
4. Millions more were injured.
5. Many civilians than soldiers died from war-related causes.
6. The US emerged as the dominant economic, political power.

10. What are the consequences of the Great Depression.
1. Factories closed.
2. Farmers and workers lost money.
3. People lost jobs.
4. Trade between countries reduced.
5. Poverty increased everywhere.

11. What are flexible or floating exchange rates?

A. These rates fluctuate depending on demand and supply of currencies in foreign exchange markets, in principle without interference by governments.

12. Explain the causes of the Great Depression.
1. Money supply was almost stopped.
2. Demand for goods was decreased.
3. Industries were closed.
4. Production and prices of the goods were declined.
5. Unemployment was increased.

13. Write about the rinderpest spread in Africa.
1. Rinderpest, also known as Cattle plague.
2. The disease affected the African cattle.
3. It spread like forest fire in Africa.
4. Rinderpest killed 90 % of the cattle.
5. It destroyed the African economy.
6. In this situation Europeans conquered and subdued Africa.

14. Explain what is referred to as the G-77 countries. In what ways can G-77 be seen as a reaction to the activities of the Bretton Woods twins?
1. G-77 is a group of 77 developing countries.
2. These countries wanted a new world economic system.
3. They wanted more control over their own natural resources.
4. These institutions mainly served the needs of rich countries.
5. So, the developing countries formed the G-77 group.

15. What are the Bretton Woods Institutions / Bretton Woods twins?/Which Institutions are called Bretton wood twins?
1. The IMF
2. The World Bank.

16. Write about India during the Great Depression.
1. Prices in India also plunged.
2. Peasants and farmers suffered more than urban dwellers.
3. Gunny exports collapsed.
4. The price of raw jute crashed more than 60 per cent.
5. Peasants fell deeper into debt.

17. Write about the spread of Smallpox in America.
1. America had been isolated for a long time.
2. Thus, local Americans had no immunity against the diseases.
3. Smallpox proved a deadly killer.
4. Smallpox spread deep into the American continent.
5. Smallpox killed and decimated whole communities.

18. The decision of MNCs to relocate production to Asian countries.
1. It stimulated the world trade and capital flows.
2. They relocated on account of low-cost and lower wages.
3. It also benefitted the Asian countries.
4. Employment was increased in the Asian countries.
5. It resulted in quick economic transformation as well.

19. Give examples to the successors of the indentured labour migrants from India.
1. Nobel Prize-winning writer V. S. Naipaul
2. West Indies cricketer Shivnarine Chanderpaul.
3. West Indies cricketer Ramnaresh Sarwan.

20. Describe the importance of the Silk route.
1. Silk routes are a good example of vibrant pre-modern trade.
2. Silk routes linking Asia with Europe and northern Africa.
3. Buddhism emerged in India and spread on the silk routes.
4. Potatoes, soya, groundnuts, maize, tomatoes, chillies, and so on were not known to our ancestors until about 5 centuries ago.

21. Write about the disease Rinderpest or the Cattle Plague.
1. Cattle plague also known as rinderpest
2. Rinderpest arrived in Africa in the late 1880s.
3. Reached Africa's Atlantic coast in 1892.
4. It had a terrifying impact on people's livelihoods.
5. Rinderpest killed 90 per cent of the cattle.

22. Give two examples of different types of global exchanges which took place before the seventeenth century, choosing one example from Asia and one from the Americas.
1. Textiles and spices were exchanged by China and India.
2. In return they exchanged gold and silver from Europe.
3. Gold, potatoes, soya were exported from the Americas to Europe.

23. Explain how the global transfer of disease in the pre-modern world helped in the colonisation of the Americas.
1. Smallpox largely helped the Europeans.
2. Americans had no immunity because of long isolation.
3. Once introduced the germs spread deep into the continent.
4. It decimated whole communities.
5. It paved the way for Conquest.

24. Effects of the Great Depression on the Indian economy.
1. The depression affected Indian trade.
2. India was exporting agricultural goods.
3. India was importing manufactured goods.
4. India was closely integrated into the global economy.
5. As international prices crashed, so did the prices in India.
6. From 1928 to 1934, wheat prices in India fell by 50%.

25. What is meant by the Bretton Woods Agreement? Bretton Woods is in New Hampshire, USA.
1. The Bretton Woods Agreement was concluded in July 1944.
2. By that agreement IMF and World Bank were established.
3. These institutions must stabalise the global economy.
4. These institutions financed post-war reconstructions.

26. Which factors helped the European conquest in Africa?
1. Superior firepower.
2. The germs such as smallpox.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. In India, indentured labours were hired under contracts which promised return travel to India after they had worked for ___ years on their employer's plantation.

A) Ten B) Three
C) Five D) Two

2. ___ routes are a good example of vibrant pre-modern trade and cultural links between distant parts of the world.

A) Rice B) Gold
C) Silk D) Jute

3. ___ were introduced new crops:

A) Kings and ministers
B) Artists and singers
C) Traders and travellers
D) Poets and writers

4. The First World War was fought mainly in:

A) Asia B) Europe
C) America D) Africa.

5. Migrants from ___ went to Ceylon, Malaya.

A) Andhra Pradesh
B) Odisha
C) Tamil Nadu
D) Karnataka

ఈఎల్ఎఫ్‌పై ల్యాండైన మోదీ

లాంఛనంగా జాతికి అంకితం | **ఈశాన్యంలో తొలి హైవే-రన్‌వే** | **గర్వించదగ్గ క్షణాలివి: ప్రధాని**

శనివారం దిబ్రూగఢ్‌లో నిర్మించిన హైవే-రన్‌వేపై ఏరియల్ షోను వీక్షిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు

గువాహటి/మోరాన్: ఈశాన్య భారతదేశంలో నిర్మితమైన తొలి హైవే-రన్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో మోరాన్ సమీపంలో నేషనల్ హైవే 37పై సిద్ధం చేసిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్)పై వాయుసేనకు చెందిన సీ-130జె రవాణా విమానంలో ప్రధాని దిగారు. అనంతరం దాన్ని లాంఛనంగా జాతికి అంకితం చేశారు. ఈశాన్య భారతదేశానికి తొలి ఈఎల్ఎఫ్ సదుపాయం అందుబాటులోకి రావడం నిజంగా గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రాకృతిక విపత్తులు తదితర సమయాల్లో ఈ సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వెలిబుచ్చారు.

అబ్బురపరిచిన ఏరియల్ షో

మోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం అస్సాం చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి ఆయన చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, రాష్ట్ర మంత్రులు తదితరులు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం సీ-130జె హెర్క్యులస్ విమానంలో ఆయన ఈఎల్ఎఫ్‌కు చేరుకున్నారు. రన్‌వేపై దిగాక సమీపంలో సిద్ధం చేసిన వేదికకు చేరుకున్నారు. అనంతరం ఈఎల్ఎఫ్‌పై వాయుసేన నిర్వహించిన ప్రత్యేక ఏరియల్ షోను వీక్షించారు. 20 నిమిషాలకు పైగా సాగిన ఈ షో ఆహూతులకు కనువిందు చేసింది. యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పైలట్లు ఈఎల్ఎఫ్‌పై కచ్చితత్వంతో ల్యాండింగ్, టేకాఫ్‌తో పాటు పలు విన్యాసాలు నిర్వహించారు. స్థానికులు భారీ సంఖ్యలో వాటిని వీక్షించారు. తొలుత సుఖోయ్-30 ఎంకేఐ, దాని వెనకే రఫేల్ ఈఎల్ఎఫ్ నుంచి టేకాఫ్ అయ్యాయి. తర్వాత ఏఎన్-32 హెలికాప్టర్ టచ్ అండ్ గో విన్యాసాలు ప్రదర్శించింది. తర్వాత మూడేసి చొప్పున తొలుత సుఖోయ్, తర్వాత రఫేల్ యుద్ధ విమానాలు ప్రత్యేక విన్యాసాలతో అలరించాయి. విపత్తుల వేళ చేపట్టే సహాయక చర్యల సన్నద్ధతను ప్రత్యేకంగా తయారు చేసిన అధునాతన దేశీయ హెలికాప్టర్లు (ఏఎల్‌హెచ్) కళ్లకు కట్టాయి. అనంతరం ప్రధాని గువాహటి చేరుకున్నారు.

ఎన్నోవిధాలుగా కీలకం

అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో నిర్మించిన ఈఎల్ఎఫ్ వ్యూహాత్మకంగా ఎన్నోవిధాలుగా అత్యంత కీలకమైనది. ఈ ఈఎల్ఎఫ్ చైనాకు 300 కి.మీ., మయన్మార్‌కు కేవలం 200 కి.మీ. దూరంలో ఉంటుంది. 4.2 కి.మీ. పొడవైన ఈ హైవే-రన్‌వేను రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించారు. సైనిక, పౌర అవసరాలు రెండింటికీ పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా వాయుసేన సహకారంతో దీన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. పొరుగు దేశాలతో ఘర్షణల వేళ ప్రత్యర్థులు సమీపంలోని వైమానిక స్థావరాలపై దాడులు చేస్తే బలగాల తరలింపు తదితరాలకు తక్షణ సదుపాయంగా ఈఎల్ఎఫ్ కీలకపాత్ర పోషిస్తుంది. విపత్తులు, ఎమర్జెన్సీ సమయాల్లో దిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా కూడా పని చేస్తుంది. దిబ్రూగఢ్-మోరాన్ జాతీయ రహదారి-37పై నిర్మించిన ఈఎల్ఎఫ్‌పై అన్నిరకాల యుద్ధ, రవాణా విమానాలనూ సులువుగా దించవచ్చు. రఫేల్, సుఖోయ్‌తో పాటు పలు భారీ రవాణా విమానాలు కూడా దీనిపై విజయవంతంగా ట్రయల్ రన్స్ నిర్వహించాయి. 40 టన్నుల బరువైన యుద్ధ విమానాలతో పాటు ఏకంగా 74 టన్నుల రవాణా విమానాలు కూడా దీనిపై సునాయాసంగా దిగవచ్చు. భారత్‌లో తొలి ఈఎల్ఎఫ్ రాజస్తాన్‌లోని బార్మేర్ జిల్లాలో 2021లో నిర్మితమైంది. అనంతరం మధ్య, ఉత్తర భారతంలో కూడా పలు ఈఎల్ఎఫ్‌లు అందుబాటులోకి వచ్చాయి.

ఈశాన్యంలో చొరబాట్లు...
కాంగ్రెస్ పుణ్యమే!

వారిని కాపాడుతూ వచ్చింది | **గువాహటి సభలో మోదీ ధ్వజం**

గువాహటి: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''ఈశాన్య భారతదేశంలో అభివృద్ధిని దశాబ్దాలుగా కాంగ్రెస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అంతేగాక ఈ ప్రాంతంలో చొరబాట్లను విపరీతంగా ప్రోత్సహించింది''అంటూ దుయ్యబట్టారు. చొరబాటుదారులను కాపాడిన, కాపాడుతున్న చరిత్ర ఆ పార్టీదేనని ఆక్షేపించారు. అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు బీజేపీ కంకణం కట్టుకుందని చెప్పారు. అస్సాంలో ఒక్క రోజు పర్యటనలో భాగంగా శనివారం గువాహటిలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. కాంగ్రెస్ తన హయాంలో దేశ భద్రతను నిత్యం ప్రమాదంలో నెట్టిందంటూ మండిపడ్డారు. ఆ పార్టీ పాలనలో అస్సాంలో నిత్యం భయం, అభద్రతలే రాజ్యమేలాయని ఆరోపించారు. ''కాంగ్రెస్ నిత్యం సమాజంలో విభజనను ప్రోత్సహించింది. ఓటుబ్యాంకు రాజకీయాల్లో మునిగి తేలింది. దేశ భద్రతను గాలికొదిలేసింది. చివరికి ఆయుధాల కొనుగోళ్లలో కూడా భారీ కుంభకోణాలకు పాల్పడింది. గతంలో ముస్లిం లీగ్ వల్ల దేశ విభజన జరిగింది. కానీ ఇప్పుడు మావోయిస్టులు, ముస్లిం లీగ్, కాంగ్రెస్ (ఎంఎంసీ)లతో దేశానికి ముప్పు పొంచి ఉంది. వీటిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి''అని ప్రధాని సూచించారు.

'డబుల్ ఇంజన్'కే ఓటెయ్యండి

వచ్చే ఐదేళ్ల కాలం అస్సాంకు చాలా కీలకమని మోదీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీజేపీని గెలిపించి డబుల్ ఇంజన్ సర్కారును కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడం ఒక్కటే బీజేపీ లక్ష్యం కాదని, ప్రజల హృదయాలు గెలవడం తమకు ముఖ్యమని చెప్పారు. ''70 ఏళ్లలో బ్రహ్మపుత్ర నదిపై కాంగ్రెస్ కేవలం మూడు వంతెనలు నిర్మించింది. మేం పదేళ్లలోనే ఐదు బ్రిడ్జిలు కట్టి చూపించాం. మా ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతోంది. అస్సాంను వేగంగా అభివృద్ధి చేసేందుకు, అన్ని రంగాల్లోనూ రాష్ట్ర అస్తిత్వాన్ని, సంప్రదాయాలను పరిరక్షించేందుకు బీజేపీ కంకణం కట్టుకుంది. 2014 నుంచి ఈశాన్యానికి చెందిన 125 మంది పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు''అని మోదీ చెప్పారు. బీజేపీకి కార్యకర్తలే ప్రాణవాయువని, పార్టీకి ఎనలేని బలమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల వేళ ప్రతి పౌరునికీ చేరువ కావాలని కార్యకర్తలకు సూచించారు. ''మేం విశ్వసించేది వ్యవస్థాగతమైన బలాన్నే. నేను బీజేపీ కార్యకర్తను. అది నాకు గర్వకారణం. అదే నా అతి పెద్ద అర్హత. అస్సాం ప్రజలు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. దానికి అభివృద్ధి రూపంలో వడ్డీతో సహా బదులు చెల్లించుకుంటాను''అని ప్రకటించారు.


బ్రహ్మపుత్ర నదిపై శనివారం మోదీ ప్రారంభించిన అత్యాధునిక వంతెన (ఇన్‌సెట్లో) రాత్రిపూట విద్యుద్దీపాల వెలుగుల్లో మెరిసిపోతున్న వంతెన

పలు ప్రాజెక్టులు ప్రారంభం

కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అస్సాంలో రూ.5,500 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. వీటిపై బ్రహ్మపుత్రా నదిపై భారీ వంతెన, ఐఐఎం, డేటా సెంటర్ తదితరాలున్నాయి. ఐఐఎం-గువాహటిని గువాహటి సమీపంలోని పలాస్‌బరిలో, హైటెక్ డేటా సెంటర్‌ను కామరూప్ జిల్లాలోని అమీన్‌గావ్‌లో నిర్మించారు. వీటితో పాటు పీఎం-ఇబస్ సేవా పథకం కింద మంజూరైన 225 ఎలక్ట్రిక్ బస్సులను కూడా మోదీ జెండా ఊపి ప్రారంభించారు.

బ్రహ్మపుత్రపై భారీ బ్రిడ్జి

బ్రహ్మపుత్రా నదిపై రూ.3,030 కోట్లతో నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును మోదీ ప్రారంభించారు. అనంతరం బ్రిడ్జిపై నడుస్తూ దాన్ని పరిశీలించారు. అప్రోచ్ రోడ్లు, ఫ్లై ఓవర్లతో కలిపి ఇది 7.75 కి.మీ. పొడవుంటుంది. సువిశాలమైన ఈ ఆరు లేన్ల బ్రిడ్జి వల్ల గువాహటి, ఉత్తర గువాహటి నడుమ ప్రయాణ సమయం ఇకపై కేవలం ఏడు నిమిషాలకు తగ్గనుంది. ప్రస్తుతం సరాయ్ ఘాట్ బ్రిడ్జి మాత్రమే వాటిని అనుసంధానిస్తోంది. దానిపై బ్రహ్మపుత్రను దాటేందుకు కనీసం 30 నిమిషాలు పడుతుంది. కొత్త బ్రిడ్జిని భారీ భూకంపాలను కూడా తట్టుకునేలా ఎక్స్‌ట్రా డోస్డ్ ప్రీ స్ట్రెస్డ్ కాంక్రీట్‌తో నిర్మించారు. ఈశాన్య భారతదేశంలో ఈ టెక్నాలజీతో నిర్మించిన తొలి బ్రిడ్జి ఇదే. దీని నిర్మాణానికి 2019లో మోదీయే శంకుస్థాపన చేశారు. 2020 లో నిర్మాణ పనులు మొదలయ్యాయి.

పట్టణాలకు మహర్దశ

లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్
- కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర
- పట్టణ ప్రగతికి భారీ ఊతం
- ప్రాజెక్టు వ్యయంలో 25% కేంద్ర సాయం
- కనీసం 50% మార్కెట్ సమీకరణలు

సాక్షి, న్యూఢిల్లీ: నగరాలు, పట్టణాలను ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజిన్లుగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, వాటి అభివృద్ధి కోసం అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం శనివారం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ పథకానికి కేంద్ర సాయంగా ఏకంగా రూ.లక్ష కోట్లను కేటాయించింది! ఈ పథకం 2025-26 నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరం దాకా ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. అనంతరం అవసరాన్ని బట్టి మరింతకాలం పొడిగిస్తారు.

అప్పు తెస్తే కేంద్రం సాయం!

నగరాలు తమ కాళ్లపై తాము నిలబడేలా, మార్కెట్ నుంచి నిధులు సమీకరించుకునేలా యూసీఎఫ్‌ను కేంద్రం రూపొందించింది. ఇందులో భాగంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేపట్టే పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల్లో 25% నిధులను యూసీఎఫ్ కింద కేంద్రం ఇస్తుంది. ఇందుకోసం ప్రాజెక్టు నిధుల్లో కనీసం 50 శాతాన్ని రాష్ట్రాలు మార్కెట్ నుంచి సమీకరించాల్సి ఉంటుంది. మున్సిపల్ బాండ్లు, బ్యాంక్ రుణాలు లేదా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) వాటిని సమకూర్చుకోవాలి. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, లేదా స్థానిక సంస్థలు భరించాలి. యూసీఎఫ్‌తో రాబోయే ఐదేళ్లలో దేశ పట్టణాభివృద్ధి రంగంలో ఏకంగా రూ.4 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులు వెల్లువెత్తుతాయని కేంద్రం అంచనా వేస్తోంది. పట్టణాభివృద్ధిలో గ్రాంట్ ఆధారిత విధానం స్థానంలో మార్కెట్, సంస్కరణల ఆధారిత విధానానికి ఇది నాంది పలుకుతుందని ఒక ప్రకటనలో పేర్కొంది.

చిన్న పట్టణాలకు రూ.5,000 కోట్ల నిధి

యూసీఎఫ్ పథకంలో భాగంగా పోటీతత్వానికి కేంద్రం తెర తీసింది. పారదర్శకంగా, సంస్కరణలు అమలు చేసే నగరాలకే ప్రాధాన్యమిస్తారు. పాలనలో డిజిటల్ విధానాలు, ఆర్థిక క్రమశిక్షణ, అర్బన్ ప్లానింగ్ సంస్కరణలు అమలు చేసే నగరాలు రేసులో ముందుంటాయి. అంతేగాక టైర్2, టైర్3 నగరాలు, ముఖ్యంగా లక్ష లోపు జనాభా ఉన్న చిన్న పట్టణాల కోసం రూ.5,000 కోట్లతో ప్రత్యేక కార్పస్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు, కొండ ప్రాంతాల్లో లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాలు మార్కెట్ రుణాలు పొందడానికి కేంద్రం 'క్రెడిట్ రీపేమెంట్ గ్యారంటీ'ఇస్తుంది. దీనికింద తొలిసారి రుణాలకు రూ.7 కోట్లు లేదా రుణ మొత్తంలో 70% దాకా కేంద్రమే గ్యారంటీగా ఉంటుంది.

మూడు రంగాలపై ఫోకస్

యూసీఎఫ్ ద్వారా మూడు రకాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తారు...
- నగరాల విస్తరణ, ఆర్థిక కారిడార్లు, రవాణా వ్యవస్థ మెరుగుదల
- పాత బస్తీలు, హెరిటేజ్ ప్రాంతాల ఆధునీకరణ, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, విపత్తుల నుంచి రక్షణ
- తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ (స్వచ్ఛత), నీటి వనరుల రక్షణ

ఎవరికి వర్తిస్తుంది?
- 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాజధానులు
- లక్ష జనాభా దాటిన పారిశ్రామిక నగరాలు
- చిన్న పట్టణాలు (గ్యారెంటీ స్కీమ్ కింద)

కేబినెట్ ఇతర నిర్ణయాలు

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. వేల కోట్ల రూపాయలతో కూడిన పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ వాటిని మీడియాకు వెల్లడించారు...
- తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్రల్లో రూ.11 వేల కోట్ల రోడ్డు ప్రాజెక్టులకు అనుమతి
- అస్సాంలో రూ.18,662 కోట్లతో బ్రహ్మపుత్ర నది కింద దేశంలోనే తొలి అండర్ వాటర్ రైల్, రోడ్డు ట్విన్ టన్నెల్ ప్రాజెక్టు. దీన్ని గోహ్‌పూర్-నుమాలిగఢ్ నడుమ 34 కి.మీ. పొడవున నిర్మించనున్నారు
- కసారా-మన్మాడ్, ఢిల్లీ-అంబాలా, బళ్లారి-హోస్పేట నడుమ మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణం నిమిత్తం రూ.18,509 కోట్లతో మూడు భారీ ప్రాజెక్టులు
- రూ.10 వేల కోట్లతో తలపెట్టిన స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం
- నోయిడా మెట్రో రైల్ ప్రాజెక్టు 11.56 కి.మీ. మేరకు విస్తరణ.
- ప్రధాని కార్యాలయాన్ని రైసినా హిల్స్‌లోని సౌత్ బ్లాక్ నుంచి నూతనంగా నిర్మించిన సేవా తీర్థ్‌లోకి మార్చడం పట్ల కేంద్ర మంత్రివర్గం హర్షం వెలిబుచ్చింది. శుక్రవారం సౌత్‌బ్లాక్ కార్యాలయంలో జరిగిన చివరి మంత్రివర్గ భేటీలో ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. ''సేవా తీర్థ్ చరిత్ర, భవిష్యత్తుల కూడలి. గతకాలపు బానిసత్వం నుంచి భవిష్యత్ వికసిత భారత్ దిశగా వేసిన ముందడుగు''అని అభివర్ణించింది.

ఇండియా ఏఐ సదస్సు
రేపటి నుంచే

40 మంది సీఈఓలతో మోదీ భేటీ

న్యూఢిల్లీ: కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఏఐ సదస్సు సోమవారం నుంచి ఢిల్లీలో ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు సాగే ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, ముఖ్య నేతలతో పాటు దిగ్గజ ఏఐ కంపెనీల సీఈఓలు తదితరులు పాల్గొంటున్నారు. సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 40 మందికి పైగా సీఈఓలతో భేటీ కానున్నారు. వీరిలో శామ్ ఆల్ట్‌మన్ (ఓపెన్‌ఏఐ), బిల్ గేట్స్, డేరియో అమొదెయ్ (ఆంత్రోపిక్) తదితరులున్నారు. భారత్‌లో పెట్టుబడి ప్రణాళికలను గురించి వీరంతా తమ ఆలోచనలను ప్రధానితో పంచుకోనున్నారు. ఈ సదస్సు సందర్భంగా పలు రంగాల్లో ఏకంగా 100 బిలియన్ డాలర్ల మేరకు ఏఐ పెట్టుబడులకు ఒప్పందాలు కుదురుతాయని అంచనా. వచ్చే నాలుగేళ్లలో భారత్‌లో ఏకంగా రూ.15 లక్షల కోట్ల మేరకు పెట్టుబడి ప్రణాళికలను మైక్రోసాఫ్ట్ గత డిసెంబర్లో ప్రకటించడం తెలిసిందే. ఏఐ మౌలిక సదుపాయాలు, క్లౌడ్ సామర్థ్య పెంపు, అత్యాధునిక డిజిటల్ నైపుణ్యాల్లో లక్షలాది మంది యువతకు శిక్షణ తదితరాలపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఇందులో పాల్గొనేందుకు ఇప్పటికే ఏకంగా 2 లక్షల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారు. గత ఏఐ సదస్సులు పారిస్, సియోల్ తదితర నగరాల్లో జరిగాయి.

శాంతిభద్రతలను పరిరక్షిస్తా

బీఎన్‌పీ చైర్మన్ తారిఖ్ రెహ్మాన్
- భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణకు కృషి !
- ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించే ఛాన్స్

తారిఖ్ రెహ్మాన్

ఢాకా: దాదాపు 18 నెలలుగా కొనసాగుతున్న అరాచకత్వ, అనిశ్చితికి చరమగీతం పాడుతూ ఇకపై తమ పరిపాలనలో శాంతిభద్రతకు పెద్దపీట వేస్తామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రకటించారు. తాజాగా జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో మూడింట రెండొంతుల స్థానాలను కైవసంచేసుకుని ఘనవిజయం సాధించిన బీఎన్‌పీ పార్టీ త్వరలోనే అధికార పగ్గాలు చేపట్టనున్న నేపథ్యంలో రెహ్మాన్ శనివారం ఢాకాలో తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. ''దేశంలో శాంతిభద్రతల స్థాపన కోసం ఎందాకైనా వెళ్తాం. ఇందుకోసం ప్రతి ఒక్కరి సహకారం మాకు కావాలి. అప్పుడే మేం సురక్షితమైన, మానవీయ బంగ్లాదేశ్‌ను సాకారంచేయగలం. ఎంతటి భారీమూల్యం చెల్లించైనాసరే శాంతిభద్రతలను పరిరక్షిస్తాం. అందరి భాగస్వామ్యంతో ఫాసిజంరహిత దేశ ప్రగతి ప్రయాణం ఆరంభమైంది. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి అభిప్రాయానికి విలువనిస్తాం. సుస్థిర బంగ్లాదేశ్‌ను నిర్మిస్తాం''అని అన్నారు.

4 రోజుల్లో ప్రమాణస్వీకారం

ప్రధానిగా తారిఖ్‌తో పాటు కేబినెట్ మంత్రుల ప్రమాణస్వీకారోత్సవం మరో నాలుగు రోజుల్లో జరగే అవకాశం ఉందని బీఎన్‌పీ నేత మొహమ్మద్ షాహబుద్దీన్ చెప్పారు. ప్రెసిడెన్షియల్ ప్యాలెస్(బంగభవన్)లో తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవం ఉంటుందని కేబినెట్ కార్యదర్శి షేక్ అబ్దుర్ రషీద్ చెప్పారు. ఫిబ్రవరి 16 లేదా 17వ తేదీన ప్రమాణస్వీకారం ఉండొచ్చని బీఎన్‌పీ సీనియర్ నేత ఒకరు అన్నారు.

భారత్‌తో బంధంపై..

తారిఖ్ తల్లి, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కాలంలో భారత్, బంగ్లాదేశ్ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఈ నేపథ్యంలో త్వరలో ప్రధాని హోదాలో ఆయన భారత్‌లో ఎలా మెలగాలనుకుంటున్నారని మీడియా ప్రశ్నించింది. ''మా దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూనే భారత్‌తో విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తాం. దక్షిణాసియాలో అతిపెద్ద శక్తులైన భారత్, చైనా, పాకిస్తాన్‌లతో సమస్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తాం. వీటిల్లో ఏ ఒక్క దేశాన్ని మాకు గురువుగా పరిగణించబోం. దేశ అత్యుత్తమ ప్రయోజనాలు, దేశ ప్రజల మార్గదర్శకత్వంలోనే మా విదేశాంగ విధానం రూపుదిద్దుకోబోతోంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. ''ఢిల్లీలో తలదాచుకున్న మా దేశ మాజీ మహిళా ప్రధాని షేక్ హసీనాను తిరిగి అప్పగించడం అనేది చట్టపరమైన ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. సార్క్ పునరుజ్జీవానికి కృషి చేస్తా'' అని అన్నారు.

ప్రధాని మోదీకి ఆహ్వానం!

భారత్, బంగ్లా సంబంధాల మెరుగుదల కోసం బీఎన్‌పీ ప్రయత్నిస్తోంది. ఇందుకు తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవ సందర్భాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. ప్రధానిగా తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవానికి భారత ప్రధాని మోదీని ఆహ్వానించాలని బీఎన్‌పీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. చైనా, పాకిస్తాన్ అగ్రనేతలకూ ఆహ్వానాలు పంపాలని పార్టీ ఉన్నత వర్గాలు యోచిస్తున్నాయి. షేక్ హసీనా కాలంలో భారత్-బంగ్లాదేశ్ బంధం బలంగా ఉండేది. ఆ బంధం చిరకాలం పటిష్టంగా కొనసాగాలంటే తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీ హాజరు కావడమే ఉత్తమమనే మాటా వినవస్తోంది.

రష్యా చమురు కొనబోమని భారత్ హామీ: రూబియో

- మావెప్పుడూ స్వతంత్ర నిర్ణయాలే
- మంత్రి జైశంకర్ నర్మగర్భ వ్యాఖ్యలు

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని భారత్ హామీ ఇచ్చిందని అమెరికా పునరుద్ఘాటించింది. వాణిజ్య ఒప్పందం దిశగా ఇరుదేశాల నడుమ జరిగిన చర్చల్లో భారత్ ఈ మేరకు స్పష్టత ఇచ్చినట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. శనివారం మ్యూనిక్‌లో సెక్యూరిటీ సదస్సు సందర్భంగా ఆయన ఈ మేరకు పేర్కొన్నట్టు రష్యా వార్తా సంస్థ టాస్ తెలిపింది. అయితే, చమురుతో సహా అన్ని అంశాల్లోనూ భారత్ ఎప్పుడూ స్వతంత్ర నిర్ణయాలే తీసుకుంటుందని అదే సదస్సు వేదికగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొనడం విశేషం. ''ప్రపంచ చమురు మార్కెట్లు అతి సంక్లిష్టమైనవి. కనుక చమురు కంపెనీలు చాలా అంశాలను మదింపు చేసిన మీదట తమ అత్యుత్తమ ప్రయోజనాలకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతాయి'' అంటూ ఆయన కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగాక ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లను భారత్ భారీగా పెంచుకోవడం తెలిసిందే. అందుకు నిరసనగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు టారిఫ్‌లు విధించారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కీలక ముందడుగు పడ్డ నేపథ్యంలో వాటిని తాజాగా రద్దు చేశారు. రష్యా చమురు కొనుగోళ్లను ఆపేస్తానని భారత్ స్పష్టమైన హామీ ఇచ్చిందని ఆ సందర్భంగా ట్రంప్ కూడా చెప్పుకొచ్చారు. రష్యా మాత్రం ఈ వార్తలను తోసిపుచ్చుతూ వచ్చింది. కొనుగోళ్లు నిలిపేస్తామంటూ భారత్ తమకు అధికారికంగా వర్తమానం ఇవ్వలేదని పలుమార్లు స్పష్టం చేసింది. కేంద్రం కూడా ఈ విషయంలో మొదటినుంచీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ఇప్పటిదాకా అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

ఆయన 'నరేంద్ర సరెండర్ మోదీ'

పత్తి రైతులకు, జౌళి ఎగుమతిదారులకు తీవ్ర నష్టం: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలో పత్తి రైతులు, జౌళి ఎగుమతిదారులను మోదీ ప్రభుత్వం నిలువునా దగా చేస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందం వల్ల ఆయా రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఒప్పందాన్ని తప్పుపట్టారు. ఇది అమల్లోకి వస్తే మనదేశంలో పత్తి సాగు పూర్తిగా నిలిచిపోతుందని, ఎగుమతులు ఆగిపోతాయని, కోట్లాది మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ శనివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. అమెరికా ప్రభుత్వం మన ఉత్పత్తులపై 18 శాతం టారిఫ్‌లు ప్రకటించిందని, మోదీ సర్కార్ మాత్రం అమెరికా ఉత్పత్తులపై సున్నా టారిఫ్‌లకు అంగీకరించిందని వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గ సభ్యులు అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన రైతులు, ఎగుమతిదారులు కచ్చితంగా నష్టపోతారని తేల్చిచెప్పారు. అమెరికా నుంచి పత్తి దిగుమతి చేసుకోవాలన్న షరతుతో బంగ్లాదేశ్ వస్త్రాలపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సున్నా టారిఫ్‌లు ప్రకటించిందని గుర్తుచేశారు. భారతీయ వస్త్రాలపై 18 శాతం టారిఫ్‌లను ఖరారు చేసిందని పేర్కొన్నారు. మన వస్త్రాలపై కూడా సున్నా టారిఫ్‌లు కావాలంటే అమెరికా నుంచి పత్తి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని మోదీ ప్రభుత్వం దాచి పెడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మన వస్త్రాలపై సున్నా టారిఫ్‌లు కావాలంటే అమెరికా నుంచి పత్తి దిగుమతి చేసుకోవాలని, దానివల్ల మన రైతులు నష్టపోతారని తెలిపారు. అమెరికా ఎదుట ప్రధాని మోదీ లొంగిపోయారని రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రిని 'నరేంద్ర సరెండర్ మోదీ'గా అభివర్ణించారు.

నిత్యం అబద్ధాలేనా?

రాహుల్ గాంధీపై అమిత్ షా ధ్వజం

కారైకల్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిత్యం అబద్ధాలు చెప్పడం అనే కొత్త సంప్రదాయాన్ని రాహుల్ ప్రారంభించాడని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని మండిపడ్డారు. గొంతు చించుకొని గట్టిగా అబద్ధం చెప్పడం, దాన్ని పునరావృతం చేయడం, అబద్ధాన్ని నిజంగా నమ్మించాలని చూడడం రాహుల్ విధానంగా మారిపోయిందని విమర్శించారు. రాహుల్ అబద్ధాల ఫ్యాక్టరీ వెనకున్న అసలు బాగోతాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. యూకే, ఈయూ, అమెరికాలతో కుదుర్చున్న వాణిజ్య ఒప్పందాలతో మన రైతులకు, మత్స్యకారులకు, పాడి పరిశ్రమకు లాభమే తప్ప ఎలాంటి నష్టం ఉండదన్నారు. అయినప్పటికీ రాహుల్ తప్పుడు ప్రచారంతో వారిని భయోత్పాతానికి గురి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రైతులు, మత్స్యకారుల ప్రయోజనాలను మోదీ ప్రభుత్వం తప్పనిసరిగా కాపాడుందన్నారు. విదేశాలతో వాణిజ్య ఒప్పందాల గురించి క్షుణ్నంగా తెలుసుకొని మాట్లాడాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. శనివారం పుదుచ్చేరిలోని కారైకల్‌లో నిర్వహించిన బీజేపీ ఎన్నికల బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. విదేశాలతో వాణిజ్య ఒప్పందాల విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని తేల్చిచెప్పారు. మన ప్రయోజనాలు 100 శాతం కాపాడుకొనేలా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని వివరించారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని అమిత్ షా ఉద్ఘాటించారు. పుల్వామా దాడి తర్వాత ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడులు చేసిన ఘనత మోదీ నిర్ణయాత్మక నాయకత్వానిదేనని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్‌తో ముష్కర మూకలకు గట్టిగా బుద్ధి చెప్పామని అన్నారు. పుదుచ్చేరి అభివృద్ధి జరగాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అమెరికాలో కర్నాటక విద్యార్థి అదృశ్యం

న్యూయార్క్/బెంగళూరు: అమెరికాలోని కాలిఫోర్నియాలో పీజీ చదువుకునే భారతీయ విద్యార్థి ఒకరు కనిపించకుండా పోయారు. కర్నాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య(22) అమెరికాలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ బర్కిలీలో కెమికల్, బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ పీజీ చేస్తున్నాడు. మద్రాస్ ఐఐటీ నుంచి ఇతడు 2025లో కెమికల్ ఇంజనీరింగ్ పట్టా అందుకున్నాడు. సాకేత్ మంగళవారం చివరిసారిగా డ్వైట్ వేలోని 1700 బ్లాక్ వద్ద కనిపించినట్లు పోలీసులు తెలిపారు. ల్యాప్‌టాప్, పాస్‌పోర్టు తదితరాలున్న సాకేత్ బ్యాగు లేక్ ఆంజా ప్రాంతంలోని పార్క్‌హిల్స్‌లో ఓ ఇంటి ఆవరణలో పడి ఉండగా గుర్తించారు. ఈ విషయాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ ధ్రువీకరించింది. సాకేత్ అదృశ్యంపై ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆచూకీ కనుగొనే విషయమై స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, కర్నాటకలోని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని శనివారం వెల్లడించింది. ఈ నెల 9వ తేదీ నుంచి సాకేత్ కనిపించకుండాపోయాడంటూ అతడి రూమ్మేట్ బనీత్ సింగ్ ఈ నెల 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అన్ని చోట్లా వాకబు చేసిన తను ఎటువంటి ఫలితం కనిపించకపోవడంతో పోలీసులకు తెలిపినట్లు బనీత్ తెలిపాడు.

ప్రభుత్వానికి సాకేత్ తండ్రి వినతి

అమెరికాలో గల్లంతైన తమ కుమారుడిని కనుగొనేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞాపన అందజేసినట్లు తండ్రి శ్రీనివాసయ్య తెలిపారు. చివరిసారిగా తమ కుమారుడితో ఈ నెల 9వ తేదీన ఫోన్‌లో మాట్లాడామన్నారు. 12వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ అతడి రూమ్మేట్ తమకు తెలిపాడన్నారు. కుమారుడి కోసం అమెరికా వెళ్లే విషయమై తాము ఆలోచిస్తున్నామన్నారు. సాకేత్ విషయంలో కాలిఫోర్నియాలోని భారత కాన్సులేట్ అధికారులు అక్కడి పోలీసులతో మాట్లాడాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కర్నాటక ప్రభుత్వం శనివారం కేంద్ర విదేశాంగ శాఖను కోరింది.

ఐఎస్ఎల్‌లో మోహన్ బగాన్ శుభారంభం

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ సీజన్-12 శనివారం ప్రారంభమైంది. కోల్‌కతాలో జరిగిన తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు 2-0 గోల్స్ తేడాతో కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. మోహన్ బగాన్ తరఫున మెక్లారెన్ 36వ నిమిషంలో, ఆల్‌డ్రెడ్ (90+7వ నిమిషంలో) చెరో గోల్ నమోదు చేశారు. గోవా వేదికగా ఎఫ్‌సీ గోవా, ఇంటర్ కాశీ ఎఫ్‌సీ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగిసింది. గోవా తరఫున 84వ నిమిషంలో పెనాల్టీ ద్వారా డ్రేజిక్ గోల్ నమోదు చేయగా, ఇంటర్ కాశీ ఆటగాళ్లలో ప్రశాంత్ (45+2వ నిమిషం) ఏకైక గోల్ సాధించాడు. ఎన్నో అవాంతరాల తర్వాత ఎట్టకేలకు మళ్లీ మొదలైన ఐఎస్ఎల్‌లో ఈ సీజన్‌నుంచి కీలక మార్పు చేస్తూ తొలిసారి 'రెలిగేషన్' పద్ధతిని ప్రవేశపెట్టారు. సీజన్‌లో చివరగా నిలిచే జట్టు రెండో స్థాయి టోర్నీ ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్ (ఐఎఫ్ఎల్)కు పడిపోతుంది. ఐఎఫ్ఎల్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న టీమ్ తర్వాతి సీజన్‌లో ఐఎస్ఎల్‌లో బరిలోకి దిగుతుంది. నేడు జరిగే మ్యాచ్‌లలో జంషెడ్‌పూర్‌తో మొహమ్మదాన్, బెంగళూరుతో ఢిల్లీ స్పోర్టింగ్ క్లబ్ తలపడతాయి.

అసలు సమరానికి సమయం

టి20 ప్రపంచకప్‌లో నేడు భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్

జోరు మీదున్న టీమిండియా ● ప్రతీకారంపై పాక్ గురి
● వర్షం ఆటంకం కలిగించే అవకాశం!
● రా.గం.7.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రసారం

ఫిబ్రవరి 1...టి20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన పాకిస్తాన్...
ఫిబ్రవరి 5...మాకు అవన్నీ తెలీదు...మా కొలంబో ఫ్లయిట్ బుక్ అయిపోయిందన్న సూర్యకుమార్...
ఫిబ్రవరి 9...భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మేం సిద్ధమంటూ పాకిస్తాన్ ప్రభుత్వ ప్రకటన...
ఫిబ్రవరి 15...భారత్, పాక్ మధ్య కొలంబోలో మ్యాచ్‌కు రంగం సిద్ధం...

ప్రపంచకప్‌లో దాయాది జట్ల మధ్య సమరం అంటే ఏ ఫార్మాట్‌లో అయినా కనిపించే ఆసక్తి, ఉత్సాహమే వేరు...1992 నుంచి అభిమానులు ఇది చూస్తూనే వచ్చారు... ఫలితం ఎలా ఉన్నా, ఏకపక్షంగా సాగినా ఈ మ్యాచ్‌కు ఉండే ఆకర్షణ ఏమాత్రం తగ్గడం లేదు. దీనిపై సాగే సుదీర్ఘ వ్యాఖ్యలు, విశ్లేషణల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇలాంటి స్థితిలో ఇరు జట్ల మధ్య మ్యాచ్ లేదంటే సహజంగానే పెద్ద చర్చే జరిగింది. కానీ ఇప్పుడు అంతా మారిపోయింది...కొలంబో వెళ్లే ఫ్లయిట్ టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతుంటే హోటళ్లలో ఎంత డబ్బు ఇచ్చేందుకు సిద్ధమైనా ఖాళీ లేదనే సమాధానం వచ్చేస్తోంది. మైదానంలోనే ఉండి జట్టుకు మద్దతుగా నిలవాలనుకునే వేలాది మంది మాత్రమే కాదు...తమ ఇళ్లనుంచి కన్నార్పకుండా ప్రతీ బంతిని చూసే ఫ్యాన్స్ సంఖ్యకు లెక్కే లేదు. ఈ నేపథ్యంలో మరో వరల్డ్ కప్ పోరుకు ఇరు జట్లు సై అంటున్నాయి. ఇటీవల ఆసియా కప్‌లో 3-0తో పాక్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా ఈ సారి ఎలాంటి ప్రదర్శనతో చెలరేగుతుందో చూడాలి.

బాబర్, సల్మాన్

కొలంబో: టి20 వరల్డ్ కప్‌లో మరోసారి తాడోపేడో తేల్చుకునేందుకు భారత్, పాకిస్తాన్ సిద్ధమయ్యాయి. 2012 నుంచి వరుసగా ప్రతీ టి20 వరల్డ్ కప్‌లో తలపడుతున్న ఇరు జట్లు ఈ సారి కూడా తటస్థ వేదికపై తమ సత్తాను పరీక్షించుకోనున్నాయి. ప్రేమదాస స్టేడియంలో నేడు (ఆదివారం) జరిగే గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను భారత్ ఎదుర్కొంటుంది. రెండు జట్లూ తమ తొలి రెండు మ్యాచ్‌లు గెలిచి జోరు మీదున్నాయి. దాయాదిపై తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకునేందుకు అన్ని అస్త్రాలతో టీమిండియా బరిలోకి దిగుతుండగా...ఇటీవలి వరుస ఓటముల తర్వాత ఈ సారైనా గెలిచి బదులు తీర్చుకోవాలని పాక్ భావిస్తోంది.

కుల్దీప్‌కు అవకాశం...

భారత బ్యాటింగ్ లైనప్‌కు సంబంధించి ఎలాంటి ఆందోళన లేదు. ఇషాన్ కిషన్, సూర్యకుమార్, పాండ్యా, దూబే తమ దూకుడైన బ్యాటింగ్‌ను ఇప్పటికే ప్రదర్శించారు. రింకూ సింగ్‌కు తగిన అవకాశం రాకపోగా, తిలక్ వర్మ కూడా రెండు సార్లు 25 పరుగులకే పరిమితమయ్యాడు. అయితే వీరిలో ఏ ఇద్దరు చెలరేగినా గత మ్యాచ్ తరహాలో భారీ స్కోరు ఖాయం. సుదీర్ఘ కాలం తర్వాత తన తొలి ప్రపంచ కప్ మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న సామ్సన్ మాత్రం విఫలమయ్యాడు. అభిషేక్ శర్మ అనారోగ్యంనుంచి పూర్తిగా కోలుకుంటే సామ్సన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చేస్తాడు. అమెరికాపై డకౌట్ అయిన అభిషేక్ తన స్థాయికి తగినట్లు విజృంభిస్తే పాక్ బౌలర్లకు కష్టాలు తప్పవు. ఒంటిచేత్తో అతను అందించే ఆరంభం భారత్ భారీ స్కోరుకు పునాది అవుతుంది. బౌలింగ్‌కు సంబంధించి తుది జట్టులో కచ్చితంగా మార్పు ఉండవచ్చు. ఇక్కడి పిచ్‌ను బట్టి చూస్తే భారత్ మూడో రెగ్యులర్ స్పిన్నర్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇప్పటికీ ప్రత్యర్థి బ్యాటర్లకు 'మిస్టరీ'గానే ఉన్న వరుణ్ చక్రవర్తి, అక్షర్‌లతో పాటు కుల్దీప్‌ను కూడా ఆడించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అర్ష్‌దీప్ స్థానంలో అతను ఆడతాడు. పాండ్యా, దూబే కూడా బౌలింగ్ భారం పంచుకుంటారు కాబట్టి రెగ్యులర్ పేసర్‌గా బుమ్రాకు మాత్రమే అవకాశం ఉంది. ఇటీవలి ఫామ్, బలాబలాలను చూస్తే పాక్‌కంటే టీమిండియా ఎంతో ముందుంది.

గంభీర్, సూర్యకుమార్

బాబర్ ఆజమ్ రాణించేనా...

అమెరికాపై భారీ విజయం సాధించిన పాకిస్తాన్ జట్టులో ఎలాంటి మార్పులు లేకపోవచ్చు. పాక్ ఇప్పటికే ఇద్దరు రెగ్యులర్ స్పిన్నర్లు అబ్రార్, తారిఖ్‌లతో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు నవాజ్, షాదాబ్‌లతో ఆడుతోంది. అవసరమైతే అయూబ్ కూడా స్పిన్ బౌలింగ్ చేయగలడు. వీరిలో తారిఖ్ మినహా మిగతా బౌలర్లందరిపై భారత్ గతంలోనే తమ ప్రతాపం చూపించింది. కొత్త తరహా, చర్చనీయాంశమైన యాక్షన్‌తో ఆడే ఆఫ్‌స్పిన్నర్ తారిఖ్ ఏమాత్రం ప్రభావం చూపుతాడనేది ఆసక్తికరం. భారత్ తమ సన్నాహకాల్లో దీనిపై కూడా దృష్టి పెట్టి ఉండవచ్చు. పేసర్ షాహిన్ అఫ్రిది చాలా కాలంగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. ఈ సారి కూడా భారత బ్యాటర్లను నిలువరించడం అతనికి కష్టం కావచ్చు. లైనప్‌లో టాప్-4 మాత్రమే రెగ్యులర్ బ్యాటర్లు ఉన్నారు. అయూబ్, కెప్టెన్ ఆగా ఆసియా కప్‌లో భారత్‌పై వరుసగా విఫలమవగా, ఫర్హాన్ ఒక్కడే రాణించాడు. కెప్టెన్ అయిన తర్వాత సల్మాన్ ఇప్పటి వరకు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. తమ జట్టుకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా స్టార్ బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న బాబర్ ఆజమ్ ఒక చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడి చాలా కాలమైంది. అతను తన సత్తాను ప్రదర్శించేందుకు ఇంతకంటే సమయం, వేదిక ఉండవని పాక్ అభిమానులు భావిస్తున్నారు.

> "మేం చక్కటి క్రికెట్ ఆడేందుకే ఇక్కడికి వచ్చాం. అది మాత్రమే ముఖ్యం. మిగతావన్నీ అనవసర విషయాలు. షేక్ హ్యాండ్ ఇచ్చే విషయంపై ఇప్పుడే ఏమీ చెప్పను. మ్యాచ్ ప్రారంభమైనప్పుడే మీరు చూస్తారు. పాక్‌పై పాత రికార్డు ఇక్కడ పనికి రాదు. మళ్లీ సున్నా నుంచి స్కోరు మొదలు పెట్టాల్సిందే'
> – సూర్యకుమార్ యాదవ్, భారత కెప్టెన్

13 భారత్, పాక్ మధ్య ఓవరాల్‌గా 16 మ్యాచ్‌లు జరగ్గా...13 గెలిచిన భారత్ 3 ఓడింది.

7-1 టి20 ప్రపంచ కప్‌లో భారత్, పాక్ మధ్య 8 మ్యాచ్‌లు జరగ్గా... భారత్ 7 గెలిచి ఒకటే ఓడింది.

తారిఖ్‌పై అందరి దృష్టి...

తన వైవిధ్యమైన బౌలింగ్ శైలితో పాక్ ఆఫ్ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ వార్తల్లో నిలిచాడు. 'చకింగ్' చేస్తున్నాడంటూ వినిపించినా...రెండు సార్లు అతని యాక్షన్‌కు ఐసీసీ అనుమతి ఇచ్చింది కాబట్టి నిబంధనల ప్రకారం తప్పు లేకపోవచ్చు. పలువురు మాజీ అంపైర్లు కూడా ఇదే చెప్పారు. అయితే బంతి విసిరే ముందు అతను కాస్త ఆగినట్లుగా ఉంటూ (పాజ్) వేయడం చర్చకు దారి తీసింది. ఇది బ్యాటర్‌ను గందరగోళంలో పడేయవచ్చని...బ్యాటర్ కూడా కాస్త జరిగి షాట్ ఆడటమే దీనికి ఉపాయమని అశ్విన్ విశ్లేషించాడు. అయితే తారిఖ్ యాక్షన్ ఎలా ఉన్నా...అతను సాధారణ ఆఫ్ స్పిన్నర్ మాత్రమేనని, భారత బ్యాటర్లు చెలరేగుతారని మాజీ కెప్టెన్ గంగూలీ అభిప్రాయపడ్డాడు.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. అయితే బౌలర్లూ ప్రభావం చూపించగలరు. మ్యాచ్‌కు ముందు రోజు మాత్రమే భారత్ ఇక్కడ సాధన చేసింది. పాక్ జట్టు కొలంబోలోనే ఉన్నా...తమ రెండు మ్యాచ్‌లను ఎస్ఎస్‌సీ మైదానంలో ఆడింది కాబట్టి తేడా ఉండకపోవచ్చు. అయితే మ్యాచ్‌ను వాన గండం వెంటాడుతోంది. ఆదివారం వర్షం కురిసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

తుది జట్లు (అంచనా):

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, పాండ్యా, దూబే, రింకూ, అక్షర్, కుల్దీప్, వరుణ్, బుమ్రా

పాకిస్తాన్: సల్మాన్ ఆగా (కెప్టెన్), ఫర్హాన్, అయూబ్, బాబర్ ఆజమ్, షాదాబ్, ఉస్మాన్, నవాజ్, ఫహీమ్, షాహిన్ అఫ్రిది, తారిఖ్, అబ్రార్

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X నేపాల్
వేదిక: ముంబై; ఉదయం 11 గంటల నుంచి

అమెరికా X నమీబియా
వేదిక: చెన్నై; మధ్యాహ్నం 3 గంటల నుంచి

మార్క్‌రమ్, యాన్సెన్ జోరు

దక్షిణాఫ్రికాకు మరో విజయం ● 7 వికెట్లతో న్యూజిలాండ్ చిత్తు ● టి20 ప్రపంచకప్

అహ్మదాబాద్: బౌలింగ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్కో యాన్సెన్ జోరు (4/40), బ్యాటింగ్‌లో కెప్టెన్ కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (44 బంతుల్లో 86 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుతో దక్షిణాఫ్రికా ఖాతాలో మరో విజయం చేరింది. గ్రూప్ 'డి'లో శనివారం జరిగిన ఈ లీగ్ మ్యాచ్‌లో సఫారీ జట్టు 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ నెగ్గిన మార్క్‌రమ్ ఫీల్డింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. మార్క్ చాప్‌మన్ (26 బంతుల్లో 48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసి గెలిచింది. ఫెర్గూసన్, నీషమ్, రచిన్ రవీంద్రలకు తలా ఒక వికెట్ దక్కింది.

టాపార్డర్ టపటపా...

ఇన్‌గిడి మూడో ఓవర్లో అలెన్ 3 ఫోర్లు, 1 సిక్స్‌తో కివీస్ శిబిరానికి జోష్ తెచ్చాడు. యాన్సెన్ తర్వాతి ఓవర్లో సీఫెర్ట్ (13) అవుటైనా... అలెన్ 4, 6తో జోరు కొనసాగించే ప్రయత్నం చేశాడు. మళ్లీ ఆరో ఓవర్ వేసిన యాన్సెన్ ఈ సారి రచిన్ రవీంద్ర (13), అలెన్ (17 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుకు చెక్‌పెట్టాడు. కివీస్ పవర్ ప్లే కష్టాల నుంచి కోలుకోకముందే కేశవ్ మహరాజ్... ఫిలిప్స్ (1)ను బౌల్డ్ చేయడంతో 64 పరుగుల వద్ద కివీస్ నాలుగో వికెట్ కోల్పోయింది. ఈ దశలో చాప్‌మన్ ధాటిగా ఆడి న్యూజిలాండ్ స్కోరు పెంచాడు. డారిల్ మిచెల్ (24 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), ఆఖర్లో నీషమ్ (15 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు) బౌండరీలతో న్యూజిలాండ్ పోరాడే లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. యాన్సెన్ సగటున ఓవర్‌కు 10 చొప్పున పరుగులిచ్చినా కీలక వికెట్లు తీశాడు.

యాన్సెన్

మార్క్‌రమ్

రఫాడించిన మార్క్‌రమ్

కివీస్ చేసిందేమీ తక్కువ స్కోరు కాదు. దీంతో ఈ గ్రూప్‌లో రెండు పోటీ జట్ల మధ్య ఆసక్తికర సమరం జరుగుతుందనుకుంటే మార్క్‌రమ్ ఏకపక్షంగా మార్చేశాడు. అతను ఆరంభం నుంచే భారీ షాట్లతో విరుచుకుపడటంతో దక్షిణాఫ్రికా మూడో ఓవర్లోనే 50 స్కోరుకు చేరుకుంది. జట్టు స్కోరు 62 పరుగుల వద్ద డికాక్ (14 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యాడు. కాసేపటికే మార్క్‌రమ్ 19 బంతుల్లోనే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా తరఫున వేగవంతమైన అర్ధశతకాన్ని సాధించాడు. రికెల్టన్ (11 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా కెప్టెన్‌లాగే కివీస్ బౌలర్లపై విరుచుకుపడటంతో దక్షిణాఫ్రికా 7.2 ఓవర్లలోనే వంద పరుగులు దాటింది. తర్వాత వచ్చిన బ్రెవిస్ (17 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్), మిల్లర్ (17 బంతుల్లో 24 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో ఇంకో 2.5 ఓవర్లముందే సఫారీ లక్ష్యాన్ని దాటేసింది.

మోలినే హర్మన్

మహిళల పోరులో పైచేయి ఎవరిదో!

● నేడు భారత్, ఆస్ట్రేలియా తొలి టి20
● మ.గం.1.45 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రసారం

సిడ్నీ: భారత మహిళల క్రికెట్ జట్టు కూడా కీలకమైన టి20 పోరుకు సిద్ధమైంది. భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు తొలి సమరం జరుగుతుంది. వన్డే వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత స్వదేశంలో శ్రీలంకతో టి20 సిరీస్ ఆడి క్లీన్‌స్వీప్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన ఇప్పుడు ఒక పెద్ద జట్టుతో ప్రత్యర్థి గడ్డపై తలపడుతోంది. కెప్టెన్ హర్మన్‌తో పాటు రెగ్యులర్ ఆటగాళ్లు స్మృతి మంధాన, షఫాలీ, జెమీమా, రిచా ఘోష్, దీప్తి శర్మ బ్యాటింగ్‌లో చెలరేగితే భారత్ పైచేయి సాధించేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డబ్ల్యూపీఎల్‌లో టాప్‌స్కోరర్‌గా నిలిచి అద్భుతమైన ఫామ్‌తో స్మృతి ఈ సిరీస్‌కు సిద్ధమైంది. గత టి20 వరల్డ్ కప్ తర్వాతి నుంచి 143.54 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధిస్తున్న స్మృతికి ఆసీస్ గడ్డపై కూడా మంచి రికార్డు ఉంది. క్రాంతి, అరుంధతి, శ్రీచరణి, శ్రేయాంక, రేణుకా సింగ్ బౌలింగ్ బాధ్యతలు తీసుకుంటారు. మరో వైపు కొత్త కెప్టెన్ సోఫీ మోలినే నాయకత్వంలో ఆసీస్ బరిలోకి దిగుతోంది. గత 19 టి20 సిరీస్‌లలో ఆస్ట్రేలియా ఒక్కటి మాత్రమే ఓడింది. అలీసా హీలీ ఈ ఫార్మాట్‌నుంచి రిటైరైనా... ఇతర స్టార్లు ఎలైస్ పెరీ, సదర్లాండ్, మూనీ, లిచ్‌ఫీల్డ్, వోల్, వేర్‌హామ్‌లకు జట్టును ఒంటిచేత్తో గెలిపించగల సత్తా ఉంది.

> ఆస్ట్రేలియాలో భారత పర్యటనను ప్రతీ ఫార్మాట్‌కు వేర్వేరుగా కాకుండా తొలిసారి మూడు ఫార్మాట్‌లలో ప్రదర్శనను బట్టి సిరీస్ విజేతను నిర్ణయిస్తారు. 3 టి20, 3 వన్డేలు, ఒక టెస్టు తర్వాత ఇది తేలుతుంది. పరిమిత ఓవర్లలో ఒక విజయానికి 2 పాయింట్లు, టెస్టులో విజయానికి 4 పాయింట్లు...టెస్టు డ్రా అయితే చెరో 2 పాయింట్లు కేటాయిస్తారు.

టకర్ ధనాధన్ షో

ఒమన్‌పై ఐర్లాండ్ ఘనవిజయం ● టి20 ప్రపంచకప్

కొలంబో: కెప్టెన్ లోర్కన్ టకర్ (51 బంతుల్లో 94 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగడంతో ఐర్లాండ్ 96 పరుగుల తేడాతో ఒమన్‌పై ఘనవిజయం సాధించింది. టి20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్ 'బి'లో శనివారం ఇక్కడ జరిగిన పోరులో టాస్ నెగ్గిన ఒమన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 235 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటివరకు ఇదే అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం! టకర్, గారెత్ డెలని (30 బంతుల్లో 56; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి ఐదో వికెట్‌కు 56 బంతుల్లోనే 101 పరుగులు జోడించాడు. ఆఖర్లో డాక్రెల్ (9 బంతుల్లో 35; 5 సిక్స్‌లు) మెరుపులతో జట్టు స్కోరు రాకెట్ వేగంతో 200 దాటేసింది. ఈ ముగ్గురి బ్యాటింగ్ వల్లే ఐర్లాండ్ 47/3 స్కోరు నుంచి ఏకంగా 235/5 స్కోరుకు చేరుకుంది. షకీల్ అహ్మద్ 3 వికెట్లు తీశాడు. అనంతరం కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. ఆమిర్ కలీమ్ (29 బంతుల్లో 50; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), హమద్ మీర్జా (37 బంతుల్లో 46; 6 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు పోరాడారు. మిగతా వారిలో సుఫియాన్ (10) మినహా అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. జోష్ లిటిల్ (4-0-16-3) ఒమన్‌ను చావుదెబ్బ తీశాడు. మాథ్యూ హంఫ్రెస్ (2/27), మెకార్తీ (2/32)లు కూడా ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు.

ఇంగ్లండ్‌ను గెలిపించిన బాంటన్

5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై విజయం ● టి20 ప్రపంచకప్

కోల్‌కతా: లక్ష్యఛేదనలో తడబడిన ఇంగ్లండ్‌ను టామ్ బాంటన్ (41 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో గెలిపించాడు. దీంతో ఐసీసీ టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ 'సి'లో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (32 బంతుల్లో 49; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మైకేల్ జోన్స్ (20 బంతుల్లో 33; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు రషీద్ (3/36), ఆర్చర్ (2/24), డాసన్ (2/34) స్కాట్లాండ్ బ్యాటర్ల పనిపట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 18.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి గెలిచింది. ఆరంభమైన తొలి ఓవర్లో సాల్ట్ (2), రెండో ఓవర్లో బట్లర్ (3)... ఇలా ఇద్దరు మేటి హిట్టర్లను 13 పరుగులకే కోల్పోయింది. ఈ దశలో బెథెల్ (28 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), బాంటన్ ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. అయితే జట్టు స్కోరు 79 వద్ద బెథెల్, కాసేపటికే కెప్టెన్ బ్రూక్ (4) వికెట్లు పారేసుకోవడంతో మళ్లీ 86/4 స్కోరు వద్ద ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. దీంతో జట్టును గెలిపించే బాధ్యతను పూర్తిగా తన భుజాన వేసుకున్న బాంటన్... సామ్ కరన్ (20 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు), జాక్స్ (16 నాటౌట్)లతో కలిసి ఇంకో 10 బంతులు మిగిలుండగానే పనిపూర్తి చేశాడు. మెక్‌ములెన్, క్యూరి, వీల్, లీస్క్ తలా ఒక వికెట్ తీశారు.

బాంటన్

బెల్జియం చేతిలో భారత్ ఓటమి

రూర్కెలా: ఎఫ్ఐహెచ్ ప్రొ హాకీ లీగ్‌లో భారత జట్టుకు వరుసగా మూడో పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన పోరులో బెల్జియం 4-2 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. బెల్జియం తరఫున హ్యూగో లబుషేర్ (11వ నిమిషం), అలెగ్జాండర్ హెన్‌డ్రిక్ (14వ ని., 17వ ని.), ఆర్థర్ స్లూవర్ (15వ ని.) గోల్స్ నమోదు చేశారు. భారత ఆటగాళ్లలో ఆదిత్య అర్జున్ (24వ ని.), హర్మన్‌ప్రీత్ సింగ్ (37వ ని.) గోల్స్ సాధించారు. తొలి క్వార్టర్‌లో 3 గోల్స్ సాధించి బెల్జియం సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో క్వార్టర్‌లో ఇరు జట్లు చెరో గోల్ చేయగా, మూడో క్వార్టర్‌లో భారత్ ఖాతాలో మరో గోల్ చేరింది. అయితే చివరి క్వార్టర్‌లో రాణించి ఓటమినుంచి తప్పించుకోవాలని భారత్ చేసిన ప్రయత్నం సఫలం కాలేదు. శనివారం జరిగిన మరో మ్యాచ్‌లో జర్మనీ 6-1 గోల్స్ తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. నేడు జరిగే పోరులో అర్జెంటీనాతో భారత్ తలపడుతుంది.

భారత్ X పాకిస్తాన్

మహిళల 'ఆసియా కప్ రైజింగ్ స్టార్స్'

బ్యాంకాక్: ఒక వైపు టి20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్లు తలపడుతుండగా... మరో వైపు మహిళల 'ఆసియా కప్ రైజింగ్ స్టార్స్' టోర్నీలో కూడా ఈ రెండు జట్ల మధ్య నేడు (ఆదివారం) పోరు జరగనుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లలో యూఏఈ చేతిలో భారత్ ఓడగా... నేపాల్‌పై పాక్ గెలిచింది. భారత సీనియర్ టీమ్ సభ్యురాలైన రాధ యాదవ్ కెప్టెన్సీలో ఆడుతున్న మన మహిళల బృందంలో అనుష్క శర్మ, తేజల్ హసబ్నిస్, మిన్ను మణి, నందిని శర్మవంటి ఉమెన్ ప్రీమియర్ లీగ్ స్టార్లు ఉన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

38 సం.గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు కుల ప్రసక్తి లేదు నో డౌరి. ఫోన్: 8008440189, 6301943220 [HA-15938]

రెడ్డి/34/6'/CA in Australia in Auditor Practice, వెల్ సెటిల్డ్ వరునికి, వధువు (Prefer Doctors) ఆస్ట్రేలియాలోనే ఉండేటట్లుగా కావలెను. డైరెక్ట్ ఫోన్: 9652778110 [HA-15939]

రెడ్డి 32/5'6"/CA-KPMG/12.5L. PA, గల వరునికి CA/Any PG Job చేస్తున్న వధువు కావలెను. Ph: 9381643859 [HA-801314]

CNB/రీసెంట్‌గా రిటైర్డ్ గవర్నమెంట్ Bank Manager, (Pensioner)కి విడో family pension వచ్చే వ్యక్తి కావలెను. age 41-50 details Ph: 9849072372 [HA-801314]

ఆర్యవైశ్య వధువు కావలెను. ఆర్యవైశ్య 55 సంవత్సరాల భార్య పిల్లలు లేని వరుడుకి సెకండ్ / విడో వధువు కావలెను. సంప్ర సెల్: 7013255850 [SCA26011762]

ఆర్యవైశ్య/28,5'8" B.Tech/Software Job (100 Cr బిజినెస్ Own Company Proposal) గల అందమైన వరునికి, సాంప్రదాయ కులప్రసక్తి లేని డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 8341742398 (డైరెక్ట్) [H-821112]

★★
Wanted Reddy Bride for the Divorced Boy, for Details Please Contact : 9849418870 [HA-783688]

వరుడు కావలెను

రెడ్డి/విడో/ఒంటరి/50Y/Hyd lo own hostels rents/సొంత క్లాత్ షోరూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్) (నో బ్రోకర్స్)/ 7799083500, 7386660643 [HA-15938]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి BE, MS, 31, 5' 11", Engineer, 170 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 8", SDE, 200 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5'10", SWE, 160K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyderbad. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 5", Engineer, 175 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 2", SWE, 140 K, 12 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 28, 5' 8", SWE, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", Amazon, 200 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd.9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 5' 10", SWE, 210 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 30, 5' 11", USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, MBA, 46, 5' 7", Manager, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 5", Sr. SWE, 120 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, Amazon, 200 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd.9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 25, 5' 2", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, MS, 28, 5' 2", 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyderabad. 9393311818, 9848011818.

LETTER

శ్రీ శ్రీరస్తు శుభమస్తు మ్యాట్రిమోని

The Ultimate Reddy's [VIPS & ELITE Matches]
Pro : G.P.R - 9966808059, 9059189869
– రెడ్డీస్ ప్రత్యేకం –

వధువు కావలెను

రెడ్డి : 1991/ 5'11"/ M.Tech/ 50 Lakhs Rental/300Crs/Own Business గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1990/ 5'11/ PHD/Own Pharma Company/500 Crs ప్రాపర్టీ గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1994 / 5'10/ M.Tech/ 10 Lakhs Rental / Job/ Business/ 200Crs ప్రాపర్టీ గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1995 / 5'9" / MD Ped/ 40Crs ప్రాపర్టీ గల వరుడునికి Doctors నుండి వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1991/ 5'8"/ DM Gastro/ Assistant Proceser/5Lakh Salary గల వరుడుకి Doctor వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1996/ 5'9"/ B.Tech/ MBA / Builder/ Rentals/ Business గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1995/ 5'10"/ MS/1Cr Rentals / 500 Crs ప్రాపర్టీ గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి : 1988/ 5'9"/ MS/Own Soft Ware Copany/100Crs ప్రాపర్టీ గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి డైవర్స్: 1994 /5'10'/ B.Tech/ Soft Ware Job/40Crs ప్రాపర్టీ గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి డైవర్స్ : 1996/5'10/ M.Tech/ Own Colleges/200 Crs ప్రాపర్టీ గల వరుడుకి తగిన వధువు కావలెను. 9059189869.

వరుడు కావలెను

రెడ్డి : 1996 / 5'4" / MBA / 100 Crs ప్రాపర్టీ గల వధువుకి Group I, IAS, IPS & Business వరుడు కావలెను. 9059189869.

రెడ్డి : 1998 / 5'6" / B.Tech/150 Crs ప్రాపర్టీ గల వధువుకి Well Settled Business వరుడు కావలెను. 9059189869.

రెడ్డి : 1998/ 5'5"/ MD (Gen med) / 100Crs ప్రాపర్టీ గల వధువుకి DM or MCH వరుడు కావలెను. 9177950666.

రెడ్డి :1996/ 5'4" / MD Radiology / 20 Crs ప్రాపర్టీ గల వధువుకి IIT or Doctors వరుడు కావలెను. 9059189869.

రెడ్డి : 1993/5'3"/MS ENT/30 Crs/ ప్రాపర్టీ గల వధువుకి Soft Ware or Doctors వరుడు కావలెను. 9059189869.

రెడ్డి : 1998 / 5'4" / MS Engg / USA/ USD/150K/30 Crs ప్రాపర్టీ గల వధువుకి USA లో వున్న వరుడు కావలెను. 9059189869.

రెడ్డి :1995 / 5'6"/MS Engg/ USA / 200K/ 50Crs ప్రాపర్టీ గల వధువుకి USA Citizen ఉన్న వరుడు కావలెను. 9059189869.

రెడ్డి డైవర్స్ : 1992 /5'5"/ MD General Medicine/10Crs/ Salary 3 Lakhs గల వధువుకి Soft Ware, Business or Doctors వరుడు కావలెను. 9059189869.

రెడ్డి డైవర్స్ : 1995 /5'4" / B.Tech, MBA/ 24 Lakhs/ 15 Crs ప్రాపర్టీ గల వధువుకి 1వ 2వ వరుడు కావలెను. 9059189869.

రెడ్డి డైవర్స్ : 1990 /5'4" / MBA/Own Startup Company/ 30 Crs ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9059189869.

[D-000]

రెడ్డి/విడో అన్ని వయస్సులు 1st & 2nd సంబంధాలు మావద్దన కలవు/కుల, ఆస్తి పట్టింపు లేదు /45yrs, డిగ్రీ/Govt.Job & స్థిరఆస్తీ గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok). Ph: 9063558878 [HA-801314]

రెడ్డి : 2nd/ కుల-ఆస్తి పట్టింపు లేదు /Age:44, Q: డిగ్రీ/ సొంత వ్యాపారం మంచి స్థిరఆస్తీ గల వధువుకి వరుడు కావలెను.(ఇల్లరికం Ok) అన్నీ వయస్సుల వారికి 1వ/ 2వ సంబంధాలు మావద్ద కలవు. Ph: 9030062353 [HA-801314]

రెడ్డి/35Y/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు, Qly: Private Job కలిగిన అందమైయిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) ఫోన్ : 6304161315 [HA-15938]

క్రిస్టియన్ మాల/24/5'4"/B.Tech, IIIT, MBA, IIM/Software Engineer/ అందమైన వధువుకి తగిన క్రిస్టియన్/హిందూ వరుడు కావలెను. ఫోన్ : 8919759359 [HA-15938]

FC/49Y/విడో/5'3"/Fair డిగ్రీ/ప్రైవేట్ జాబ్ 60KPM బిజినెస్/50,000/– PM సొంత ఇల్లు కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. ఫోన్: 9502169643 [HA-821233]

రెండోపెళ్ళి: 55Y/GUNTUR/Govt. R.T.D. Emp/ పెన్షనర్ /Own House/ Well Settled పిల్లలు లేని ఏ బాధరబందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [HA-801314]

SC మాదిగ, 29 సం॥, 5'4", B.Tech, Bio-Tech వధువుకు Govt./Software Job వరుడు కావలెను. (క్రిస్టియన్/హిందూ) నో బ్రోకర్స్ ✆ 98482 38549, 94945 32539 [B-1292386]

వేదికలు

ఆంధ్ర, తెలంగాణ, రజక వివాహ పరిచయ వేదిక 22.03.2026 రజక సంఘం కమ్యూనిటీ హాల్ మూసారంబాగ్, హైదరాబాద్ ముందుగా ఫోన్ చేసి మీరు పేరు నమోదు చేసుకోగలరు. 7660803720, 9515607936 [HA-15938]

అతి తక్కువ ఖర్చుతో My Wedding Help Forever మ్యాట్రిమోనీ సేవలతో మీకు సరైన జోడీని కనుగొనండి. 100% నిజమైన ప్రొఫైల్స్. ఫోన్ : 93800 01648, 81869 47035, e-mail : myweddinghelpforever@gmail.com [SCA26011756]

సాక్షి పెళ్ళిచూపులు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
ప్రకటనల కొరకు

AP+TS+Metros: (Chennai + Bengaluru + Delhi + Mumbai) 1800/- for 4 Lines 485/- Extra Line	Andhra Pradesh: (Incl. Hyd) 1350/- for 4 Lines 375/- Extra Line
Telangana: (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line	
* Color 25% Extra	
అనంతపూర్ - 9912220718	గుంటూరు - 9912220356
కర్నూలు - 9010825556	విజయవాడ - 7995554534
YSR కడప - 9951602932	తాడేపల్లిగూడెం - 9912220558
తిరుపతి - 9912220586	రాజమండ్రి - 9912220358
నెల్లూరు - 9951602861	విశాఖపట్నం - 9912220550
ఒంగోలు - 9912225431	శ్రీకాకుళం - 9912220343

సాగర తీరంలో 'మిలాన్' సందడి షురూ

నాలుగు రోజుల పాటు హార్బర్ ఫేజ్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళం ఆధ్వర్యంలో విశాఖ సాగర తీరంలో అంతర్జాతీయ నౌకల పండగ సందడి మొదలైంది. ఇప్పటికే వైజాగ్ తీరానికి విదేశీ యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్‌లు క్యూకట్టాయి. రష్యా, వియత్నాం, ఫిలిప్పీన్స్, మాల్దీవులు, శ్రీలంక, ఆస్ట్రేలియా, మయన్మార్, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన యుద్ధ నౌకలకు, ఆయా దేశాల రక్షణదళాలకు తూర్పు నౌకాదళ బృందం ఘన స్వాగతం పలుకుతోంది. మినీ ఐఎఫ్ఆర్‌గా పిలుచుకునే మిలాన్–2026 ప్రారంభంతో నేటి నుంచి కీలక కార్యక్రమాలు మొదలవ్వనున్నాయి. ఆదివారం ఉదయం ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన కార్యాలయం సమీపంలోని సాముద్రిక ఆడిటోరియం ఆవరణలో మిలాన్ విలేజ్‌ని ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ప్రారంభించనున్నారు. అనంతరం మిలాన్ హార్బర్ ఫేజ్ విన్యాసాలు మొదలు కానున్నాయి. 18వ తేదీ ఉదయం 8.30 గంటలకు సాగరతీరంలోని యాంకరేజ్ ఏరియాలో జరిగే ఫ్లీట్ రివ్యూని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమీక్షించనున్నారు. 19న ఆర్కే బీచ్‌లో జరిగే ఐఎఫ్ఆర్–2026 అంతర్జాతీయ సిటీ పరేడ్ కోసం నౌకాదళ సిబ్బంది విన్యాసాల రిహార్సల్స్ ఆకట్టుకుంటున్నాయి.

సముద్ర తీరంలో సాహసోపేత రెస్క్యూ

జపాన్ నావికుడిని రక్షించిన భారత నౌకాదళం

జపాన్ నావికుడిని హెలికాప్టర్‌లో తరలిస్తున్న ఇండియన్ నేవీ

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో పాల్గొనేందుకు వస్తూ అస్వస్థతకు గురైన జపాన్ నావికుడి(సెయిలర్)ని భారత నౌకాదళ బృందం సాహసోపేతంగా రక్షించింది. విశాఖకు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో ప్రయాణిస్తున్న జపాన్ నౌకాదళానికి (జేఎంఎస్‌డీఎఫ్) చెందిన నౌకలో ఒక సెయిలర్ శనివారం సాయంత్రం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. సమాచారం అందుకున్న తూర్పు నౌకాదళం ఐఎన్ఎస్ డేగా నుంచి సీ కింగ్ హెలికాప్టర్‌ను రంగంలోకి దించింది. సముద్రం మధ్యలోనే అతనికి వైద్య సహాయం అందిస్తూ ఎయిర్‌లిఫ్ట్ చేసి విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు చేర్చింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆ నావికుడిని నావల్ హాస్పిటల్ ఐఎన్ హెచ్ఎస్ కల్యాణికి తరలించారు. ఈ సమయానుకూల 'మెడెవాక్' ఆపరేషన్ భారత్–జపాన్ దేశాల మధ్య ఉన్న పటిష్టమైన సముద్ర భద్రతా భాగస్వామ్యాన్ని మరోసారి నిరూపించిందని ఇరుదేశాల నౌకాదళాధికారులు ప్రకటించారు. కాగా ఇది మెడికల్ ఎమర్జెన్సీ మాత్రమేనని ఎటువంటి ప్రమాదం జరగలేదని తూర్పు నౌకాదళం స్పష్టం చేసింది.

రోడ్డు ప్రమాదంలో కేరళ యువతి దుర్మరణం

రిషిక (ఫైల్)

వల్లూరు (చెన్నూరు): కడప పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేరళ యువతి రిషిక(23) దుర్మరణం చెందింది. వివరాల్లోకెళ్తే.. కేరళకు చెందిన రిషిక, ఎమీ సుజాన్, అభి, అనుగ్రహ, భావ్యతో పాటు విశాఖ పట్టణానికి చెందిన ఠాగూర్ రెడ్డి తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) కళాశాలలో బీఎస్ఎంఎస్ కోర్సు నాలుగో సంవత్సరం చదువుతున్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో వీరు రెండు ద్విచక్ర వాహనాల్లో శనివారం ఉదయం వైఎస్సార్ కడప జిల్లాలోని గండికోటకు విహారయాత్రకు బయలుదేరారు. కడప పట్టణం సమీపంలోని ఆలంఖాన్ పల్లె వద్ద ఉన్న ఇర్కాన్ సర్కిల్ వద్ద ఠాగూర్‌రెడ్డి నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఓ ట్యాంకర్ ఢీకొట్టింది. వెనుక కూర్చొన్న రిషిక రోడ్డుపై పడిపోగా ట్యాంకర్ ఆమెపై నుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు.

ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ అనుమానాస్పద మృతి

పాలేరు రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు

పవన్‌కళ్యాణ్ రాజకీయ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ పుస్తకం రచన

కారు నడిపిన వ్యక్తి ఒడ్డుకు చేరాక పరారవడంపై అనుమానాలు

బొగ్గుల శ్రీనివాస్ (ఫైల్)

రిజర్వాయర్‌లో పడిపోయిన కారు


పవన్ కళ్యాణ్‌పై శ్రీనివాస్ రాసిన పుస్తకం

కూసుమంచి (ఖమ్మం): తెలంగాణలోని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ (45) అనుమానాస్పద స్థితిలో దుర్మరణం పాలయ్యారు. శనివారం ఉదయం 7–8 గంటల సమయంలో కారు నీళ్లలో కొంతదూరం మునగగా.. వెనుక సీటులో కూర్చున్న శ్రీనివాస్ మృతి చెందగా.. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి పరారవడం అనుమానాలకు తావిస్తోంది. మృతుడు శ్రీనివాస్ కర్నూలు జిల్లా ఆల్లూరు గ్రామానికి చెందినవారు. సాహిత్య పరిశోధకుడిగా, యూట్యూబర్‌గానూ గుర్తింపు పొందారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసిన ఆయన పలు పుస్తకాలు రచించారు. 2014లో పవన్‌కళ్యాణ్ రాజకీయ రంగప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ 'పవన్‌కళ్యాణ్ హటావో.. పాలిటిక్స్ బచావో' పేరిట పుస్తకం రాశారు. ఈ పుస్తకం 8 లక్షలకుపైగా కాపీలు అమ్ముడుపోయిందని సమాచారం. పవన్‌కళ్యాణ్ అభిమానుల నుంచి ముప్పు పొంచి ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం అప్పట్లో ఆయనకు రక్షణ కూడా కల్పించింది.

ఏం జరిగిందంటే..

పాలేరు రిజర్వాయర్‌లోకి శనివారం ఉదయం ఏపీ 16 డీపీ 2345 నంబరు కారు దూసుకెళ్లింది. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు గుర్తించి స్థానికులకు సమాచారం ఇవ్వగా.. ట్రాక్టర్ సాయంతో ఒడ్డుకు లాగారు. కారు సీటులో కూర్చున్న స్థితిలో ఉన్న శ్రీనివాస్ మృతి చెంది ఉన్నారు. అయితే, కారు నీటిలో ఉండగా డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి బయటకు వచ్చి నాయకన్‌గూడెం వైపు వెళ్లిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ ఏసీపీ ఘటనాస్థలిని పరిశీలించారు.

బయటపడిన వ్యక్తి ఏమైనట్టు?

కారులో ఇద్దరు ఉండగా డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నీళ్లలో నుంచి ఒడ్డుకు రాగానే వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది. వెనుకాల సీటులో కూర్చున్న వ్యక్తిని కాపాడకుండా హడావుడిగా వెళ్లిపోవడం ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు మృతుని నుదురు, ముఖంపై గాయాలు ఉండగా కారు నీటిలో పడిన సమయాన తగిలాయా, ఎక్కడైనా హత్య చేసి కారులో తీసుకొచ్చారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌కళ్యాణ్‌పై పుస్తకం రాసిన దృష్ట్యా శ్రీనివాస్‌కు ఆయన అభిమానుల నుంచి ముప్పు పొంచి ఉండటంతో ప్రమాదంపై రక్షణ కల్పించాలని శ్రీనివాస్ స్నేహితులు 'సాక్షి'కి తెలిపారు. ఈనేపథ్యంలో శ్రీనివాస్ మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని వారు కోరారు. కారు రిజర్వాయర్‌లో పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తే హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వస్తున్నట్టు తెలుస్తోంది. ఖమ్మం చేరేందుకు హైవే ఉన్నప్పటికీ పాత సర్వీసు రోడ్డును ఎంచుకోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారు రిజర్వాయర్‌లో పడిపోయి ప్రమాదం జరిగినట్లు పోలీసులు, మృతుడి స్నేహితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కారు నీట మునిగాక ఒడ్డుకు చేరిన వ్యక్తి నాయకన్‌గూడెం వద్ద ఉన్న టోల్‌ప్లాజా సీసీ ఫుటేజీ ద్వారా కారు నంబర్ సేకరించి విచారిస్తున్నారు. కాగా, శ్రీనివాస్ మృతదేహం ప్రస్తుతం నేలకొండపల్లి ఆస్పత్రి మార్చురీలో ఉండగా, ఆయన సోదరుడు శనివారం అర్ధరాత్రి వరకు ఖమ్మం చేరే అవకాశముందని సమాచారం.

ఎస్వీయూలో ర్యాగింగ్ కలకలం

యూజీసీకి బాధితుడి ఫిర్యాదు

తిరుపతి సిటీ: తిరుపతిలోని ఎస్వీయూ లా కళాశాలకు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థి ర్యాగింగ్‌కు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల వర్సిటీలోని ఈ– బ్లాక్ బాలుర వసతి గృహంలో ఉంటున్న లా విభాగం సీనియర్ విద్యార్థులు మద్యం సేవించి ఓ జూనియర్ విద్యార్థిని గదికి పిలిపించుకుని ర్యాగింగ్ చేశారు. దీనిపై అతడు అధ్యాపకులకు ఫిర్యాదు చేయడంతో సీనియర్లు మరింతగా రెచ్చిపోయి ఆ విద్యార్థిని బెదిరించారు. వేధింపులు పెరిగిపోతుండటంతో బాధిత విద్యార్థి ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పి వారి సూచనల మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి ఈ నెల 10న ఫిర్యాదు చేశాడు. స్పందించిన యూజీసీ.. దీనిపై విచారణ జరపాలని యాంటీ ర్యాగింగ్ కమిటీకి ఆదేశాలిచ్చింది. వర్సిటీ పోలీసులు శుక్రవారం ఈ–బ్లాక్‌ను సందర్శించి సీనియర్లు, ప్రిన్సిపల్, డీన్, ఫస్ట్ ఇయర్ లా విద్యార్థులను విచారించారు. శివరాత్రి సందర్భంగా కొందరు హాస్టల్ విద్యార్థులు స్వస్థలాలకు వెళ్లడంతో మరోమారు పోలీసులు విద్యార్థులను విచారించనున్నట్లు తెలిసింది.

విద్యుత్ వెలుగుల్లేవు

విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ ఎన్నికల ముందు హామీ

- అధికారంలోకి వచ్చాక రూ.22 వేల కోట్లకుపైగా చార్జీల భారం
- విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం
- డిస్కం అప్పులకు రూపాయి కూడా విదల్చని ప్రభుత్వం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించింది రూ.13,600 కోట్లు
- కానీ ఉచిత, రాయితీ విద్యుత్‌కు ఇచ్చింది రూ.11 వేలకోట్లు మాత్రమే
- ఈసారి వ్యవసాయ విద్యుత్‌కు రూ.13,722 కోట్ల ప్రతిపాదన
- ఇంధన రంగం మొత్తానికి బడ్జెట్‌లో కేటాయింపు కేవలం రూ.13,934 కోట్లే!



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ రంగానికి మరోసారి మొండిచేయి చూపించింది. అధికారంలోకి వచ్చిన తరువాత 18 నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై రూ.20,135.50 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపి వసూలు చేస్తున్న చంద్రబాబు ఇంధన రంగానికి బడ్జెట్‌లో కేవలం రూ.13,934 కోట్లు మాత్రమే కేటాయించారు. అదికూడా వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్, వివిధ వర్గాలకు ఇచ్చే రాయితీల కోసం. కనీసం చార్జీల రూపంలో ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నంత కూడా బడ్జెట్‌లో ఇవ్వలేకపోయారు. ఆధునిక అభివృద్ధికి ఎనర్జీ ప్రాణాధారమని, ఎనర్జీ భద్రత అంటే ఆర్థిక భద్రతని, వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, విద్య, ఆరోగ్యం ఇలా ప్రతి రంగం అభివృద్ధి విద్యుత్‌పై ఆధారపడి ఉందని చెప్పిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విద్యుత్ రంగం అప్పులు తీర్చడానికి ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో విదల్చలేదు. గత ప్రభుత్వ పాలనలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలను) అస్తవ్యస్తంగా రద్దుచేయడం వల్ల అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని కేశవ్ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ట్రూ–అప్ చార్జీల రూపంలో ప్రజలపై భారం పడిందని మంత్రి అంగీకరించారు. నిజానికి గత టీడీపీ పాలనతో జరిగిన అనవసర, అధిక ధరల విద్యుత్ కొనుగోళ్ల కారణంగానే రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) అప్పుల ఊబిలో కూరుకుపోయాయి.

రూ.2,600 కోట్లు తక్కువే..

ప్రస్తుత సంవత్సరంలో వ్యవసాయ విద్యుత్ సబ్సిడీగా రూ.11 వేలకోట్లకు పైగా విడుదల చేసి 22.5 లక్షల మంది రైతులకు లబ్ధిచేకూర్చామని, అలాగే ఆక్వాటారిఫ్ సబ్సిడీగా రూ.890 కోట్లు విడుదల చేసి 48,500 మంది ఆక్వా వినియోగదారులకు మద్దతు ఇచ్చామని, బీపీఎల్ వృత్తిదారులకు సబ్సిడీ టారిఫ్‌లు కొనసాగిస్తున్నామని ఆర్థికమంత్రి చెప్పారు. నిజానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.13,600 కోట్లు కేటాయించారు. కానీ మంత్రి చెప్పినదాని ప్రకారం చూస్తే రూ.2,600 కోట్లు తక్కువే వెచ్చించారు. అంటే ఆ మేరకు అర్హులకు ఉచిత, రాయితీ విద్యుత్‌ను దూరం చేశారు. ఇక సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం కింద 2024 జూన్ నుంచి రూ.2.88 లక్షలకోట్ల విలువైన 55 ప్రాజెక్టులను మంజూరు చేశామని మంత్రి చెప్పారు. ఇందులో 15.56 గిగావాట్ల సౌరశక్తి, 4.86 గిగావాట్ల వాయుశక్తి, 17.7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, 1 ఎంఎంపీటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రాజెక్టులున్నాయని తెలిపారు.

అడిగింది ఎంత.. ఇచ్చింది ఎంత?

వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పిన లెక్కలకు, ఆర్థికమంత్రి చెప్పిన లెక్కలకు పొంతన లేదు. ఆంధ్రప్రదేశ్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం ద్వారా రాష్ట్రంలో 22.5 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు రోజుకు 9 గంటలపాటు నిరంతర పగటి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత డిసెంబర్ 31 నాటికి ఈ పథకానికి రూ.13,241.17 కోట్ల సబ్సిడీ వ్యయం జరిగిందని చెప్పారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.11 వేలకోట్లు ఖర్చుచేసినట్లు ఆర్థికమంత్రి తెలిపారు. ఈ ఇద్దరు మంత్రులు చెప్పినదాని ప్రకారం చూస్తే ఆ మేరకు నిధులు ఖర్చు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. అలాగే 2026–27లో వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ అవసరాలకే రూ.13,722 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి వెల్లడించారు. కానీ ప్రభుత్వం మొత్తం ఇంధన రంగానికి బడ్జెట్‌లో రూ.13,934 కోట్లు కేటాయించింది.

స్కూల్ భవనం స్లాబ్ కూలి 12 మందికి గాయాలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో నిర్మాణంలో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ భవనం స్లాబ్ కుప్పకూలి 12 మంది కార్మికులు గాయపడ్డారు. స్కూల్ భవన నిర్మాణం కోసం 100 మంది కూలీలు శనివారం స్లాబ్ పనులు చేస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో కేవలం రెండు పిల్లర్లు వేసి దానిపైన ఫస్ట్ ఫ్లోర్‌లో పొడవుగా పోర్టికో నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని పిల్లర్ల సామర్థ్యం సరిపోకపోవడంతో మొదటి అంతస్తులో వేస్తున్న పోర్టికో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో శ్లాబ్ వేస్తున్న కార్మికులు కుప్పకూలిన స్లాబ్‌పై పడిపోయారు. సహచర కార్మికులు స్పందించి.. గాయపడినవారిని హుటాహుటిన జంగారెడ్డిగూడెంలోని సాయి స్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 12 మంది గాయపడగా, వారిలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారికి చికిత్స చేస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన 12 మంది వివిధ గ్రామాలకు చెందినవారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications LimitedSakshi Press, Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division,Tirupati Dist - 517 520, and Printed at Jagati Publications Limited Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division,Tirupati Dist - 517 520
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act)Phone No.0877-2275378 Fax No. 0877-2271213, RNI Regn No. APTEL/2008/23805. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

apollo TYRES
LEAD SPONSOR
రండి చూద్దాం
ఎవరికి ఎంత దమ్ము ఉందో
ప్రతి ప్రయాణంలో దమ్ము ఉంది

నేడు శివరాత్రి

సినీ గళంలో నీలకంఠుడు

'కైలాసాన కార్తీకాన శివరూపం ప్రమిదే లేని ప్రమదాలోక హిమ దీపం' అని రాశారు వేటూరి 'సాగర సంగమం'లో.

తెలుగు సినిమాల్లో శివుడి ప్రస్తావన ఆది నుంచి ఉన్నా అనేక పాటల్లో శివుని ప్రస్తావనను, ప్రభావాన్ని ప్రేక్షకులకు అందించినవారిలో కె.విశ్వనాథ్, వేటూరి ఉంటారు.

'నటరాజ శత సహస్ర రవితేజా... నట గాయక వైతాళిక మునిజనభోజా' అని వేటూరి తాను కె.విశ్వనాథ్‌తో పని చేసిన తొలి హిట్ 'సిరి సిరిమువ్వ'లో శివుణ్ణి స్తుతించారు. ఆ తర్వాత 'శంకరాభరణం'లో 'ఓంకారనాదాను సంధానమౌ గానమే శంకరాభరణము' అని సకల కళలకూ మూలమైన నటరాజ స్వరూపం పరమశివుడిని పల్లవిగా చేశారు.

భగవంతుడ్ని చేరుకోడానికి సంగీతం కూడా ఒక అనుసంధాన మార్గమే కదా. అందుకే 'అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమే సోపానమూ' అని కూడా అన్నారు వేటూరి.

శివతత్వాన్ని పూర్తిగా తెలిసి రాసిన సాహిత్యం 'సాగర సంగమం'లోనూ విని పిస్తారు వేటూరి, విశ్వనాథ్‌లు. శివుడు లయకారుడు. సంగీతం లోనూ... సాహిత్యం లోనూ... గానంలోనూ కూడా లయే ప్రధానం. శివుడు మాట్లాడితే సాహిత్యం. మాట్లాడకపోతే వేదాంతం. అన్నీ శివుడే అని చెప్పటానికి వేటూరి, విశ్వనాథ్ కలసి చేసిన ప్రయోగం సాగరసంగమంలోని 'ఓం నమఃశివాయ' పాట. అందులో 'నీ లయలే ఈ కాలగమనమై' అంటారు. 'ప్రకృతి పార్వతి శివునితో కలిసి అడుగులు వేస్తాయి' అని కూడా అంటారు. 'జీవితమే చిర నర్తన మాయే' అనడం వేటూరి మాస్టర్‌స్ట్రోక్. ఇక బాపు 'భక్త కన్నప్ప'లో వేటూరి రాసిన 'కిరాతార్జునీయం' మరో కవికి సాధ్యం కానిది.

వెనక్కు వెళ్లి చూస్తే తెలుగు సినిమా సాహిత్యంలో పరమ శివుడికి ప్రత్యేక స్థానమే ఉంది. రావణ విరచిత 'శివ దండకాన్ని' సంపాదించి దాన్ని రావణ పాత్రతోనే పాడించేలా పరిశోధన చేసి సాధించారు సముద్రాల రాఘవాచార్యులు 'భూకైలాస్'లో. దాన్ని గాలి పెంచెల నరసింహా రావు స్వరసారధ్యంలో నిజంగానే రావణుడే పాడుతున్నారా అన్నంత ఎక్స్‌ప్రెసివ్‌గా గానం చేసి రక్తి కట్టించారు ఘంటసాల. తెరమీద రావణపాత్రలో ఎన్టీఆర్ అయితే ఇక చెప్పడానికేముంది. 'భూకైలాస్'లోనే శివుణ్ణి 'లోక శుభంకరుడు'గా వర్ణించారు సముద్రాల. 'అన్య దైవము గొలువ నీదు పాదము విడువ' అంటాడు రావణుడు శివభక్తితో 'నీలకంధరా దేవ' పాటలో. ఇక పింగళి గారు 'సత్య హరిశ్చంద్ర'లోని 'నమో భూతనాథ' పాటలో శివుణ్ణి 'సదా సుప్రకాశా' అన్నారు.



'అర్ధనారీశ్వర' తత్వాన్ని అర్థం చేసుకున్న వారెవరైనా శివపార్వతులను ఒకటిగానే చూస్తారు. అందుకే భయం కలిగినప్పుడు అభయం కోసం అమ్మవారైన పార్వతిని స్తుతిస్తుంది ద్రౌపది 'నర్తనశాల'లో. సముద్రాల రాసిన 'జననీ శివకామినీ' పాటను భక్తిరస స్ఫోరకంగా స్వరపరిచారు సుసర్ల దక్షిణామ్మూర్తి. అంతే గొప్పగా గానం చేశారు సుశీల.

ఆరుద్రకు ఏం తక్కువ. 'మారేడు నీవని ఏరేరి తేనా మారేడు దళములు నీ పూజకు' అని రాశారు 'భక్త కన్నప్ప'లో. 'గంగమ్మ మెచ్చిన జంగమయ్యవని' అనే పంక్తి ఎన్నిసార్లు విన్నా బాగుంటుంది. 'ఏకలవ్య'లో మల్లెమాల రాసిన 'మ్రోగింది ఢమరుకం మేల్కొంది హిమనగం' కూడా గుర్తు చేసుకోదగ్గది. 'అమెరికా అమ్మాయిలో'నూ ఓ శివభక్తి గీతం వినిపిస్తుంది. నారాయణరెడ్డి రాసిన సాహిత్యం చిదంబర నిలయుడి మూర్తిని మన కళ్లెదుట నిలుపుతుంది.

'వారణాసిని వర్ణించే నా గీతిక నాటి శ్రీనాథుని కవితై వినిపించగా' అంటూ 'ఇంద్ర' కోసం రాసిన 'భంభం భోలే' లో 'గంగలో నిత్యం కనలేదా శివ కారుణ్యమే' అని సిరివెన్నెల మాత్రమే రాయగలరు.

'భరత వేదముగ నిరత నాట్యముగ కదలిన పదమిది పరమేశా' అని 'పౌర్ణమి' లోని పాట తరచూ వినిపించే సిరివెన్నెల మరో రచన. ఆపదల్లో ఉన్న వారికి అభయం ఇచ్చి తన వారినిగా చేసుకునే సువిశాల శివతత్వ దర్శనమే 'ఖలేజా'లో వినిపించే రామజోగయ్యశాస్త్రి గీతం 'సదాశివ సన్యాసి'.

శివతత్త్వమే అత్యంత శుభకరము, భవహరము, హృదయంగమము. మరి ఈశ్వర సాయుజ్యం పొందేందుకు ప్రయత్నోన్ముఖులైన వారికి ఆనందం కాక మరేమిటి?

ఇంక ఇహలోక బంధాలనూ... జంజాటాలనూ పట్టించుకునే పరిస్థితి ఉంటుందా? విభూతిని ధరించని ఫాలభాగం, శివాలయం లేని గ్రామం, ఈశ్వరుని ధ్యానించని మానవ జన్మం వ్యర్థములు అంటారు.

శివ అంటే సంస్కృతంలో శుభము, సౌమ్యము అని అర్థాలున్నాయి.

ఈ ప్రపంచమూ అందరి జీవనమూ శుభ సౌమ్యాలతో గడవాలని కోరుకుందాం.

- భరద్వాజ

ఆయన జగం ఆమె సగం

బ్రహ్మానంద స్వరూపుడు, నిర్వికారుడు, నిత్యమూ శమాది గుణ సంపత్తి కలవాడు కనుక శివుడు అని 'శివ' పదానికి వ్యుత్పత్తి.'శివ' అంటే పరమేశ్వరుడు.'శివా' అంటే పార్వతి. పేర్లలో కూడా ఏక రూపత కలిగిన ఆది దంపతులు వారు

స్త్రీ పురుషులు కలిస్తేనే పరిపూర్ణత. వారిలో ఎక్కువ తక్కువలు లేవు. ఇరువురూ సమానమేనని వేదకాలం నుంచే నిరూపించిన స్వరూపం అర్ధనారీశ్వర రూపం.

'గౌరి సగం – శివుడు సగం – అర్ధనారీశ్వరమే అఖిల జగం' అంటూ అవినాభావమైన ఆ ఆదర్శ దంపతుల అద్వైత రూపాన్ని మహాకవి ఆరుద్ర కీర్తించారు. వాగర్థాలవలె కలిసిపోయిన వారని కాళిదాసు ప్రస్తుతించారు. ప్రకృతి – పురుషులే సృష్టికి మూలమని, అయితే ఇందులో ప్రకృతి స్వరూపిణి అయిన స్త్రీ పోషించే పాత్ర మరింత కీలకమైనదని చెప్పడానికి జగద్గురు ఆది శంకరులు తమ 'సౌందర్యలహరి' లోని తొలి శ్లోకంలోనే ఇలా చెప్పారు:'శివః శక్త్యా యుక్తో యది భవ తి శక్తః ప్రభవితుమ్ / నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి '.

శక్తి స్వరూపిణి అయిన జగదంబతో కూడినప్పుడే పరమేశ్వరుడు సమస్త సృష్టిని నిర్వహించడానికి సమర్థుడై ఉంటాడు. పార్వతితో కూడనినాడు అంతటి శివుడూ కాస్తంత కదలడానికి కూడా శక్తిలేనివాడే అవుతాడు. అంతే కాదు. ఆదిశంకరాచార్యులవారు మరొక అడుగు ముందుకు వేసి 'చితాభస్మమును దేహమంతా పులుముకొని, కంఠంలో గరళాన్ని ధరించి, దిగంబరుడై, జటాధారిగా, మెడలో పాములను వేసుకొని, పుర్రెను చేతిలో పట్టుకొని, యాచక వృత్తితో జీవిస్తూ, శ్మశానవాసిగా ఉన్న ఈశ్వరుడు ముజ్జగాలకే అధిపతి కావడం కేవలం పార్వతీదేవిని పెండ్లి చేసుకోవడం వలన లభించిన ఫలితమేనంటూ తమ 'దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం'లో నొక్కి వక్కాణించారు. ఇలా భర్త ఔన్నత్యానికి కారణభూతురాలు అతని ఇల్లాలే అని ఆదిశంకరులు జగతికి చాటి చెప్పారు. ఈ విషయాన్ని లోకానికి తెలియజేయడానికే పరమేశ్వరుడు జగన్మాత పార్వతిని తన దేహంలో సగభాగంగా స్వీకరించాడు. శివుడంటేనే శక్తిమయుడు. శక్తి అంటేనే శివుని అభివ్యక్తి. శివశక్తులు రెండూ విశ్వానికి ఆధారమైన మూల పదార్థాలు. ఆ అర్ధనారీశ్వరుని స్వరూపాన్ని మహా శివరాత్రి సందర్భంగా ఆవిష్కరించుకొందాం.

అర్ధనారీశ్వరత్త్వం

అర్ధనారీశ్వర స్వరూపంలో కుడిభాగం శివునిది. ఎడమభాగం పార్వతిది. శివుని మేని ఛాయ బంగారు వర్ణం కాగా, పార్వతీదేవిది కర్పూర సమ ధవళ వర్ణం. శివునిది జటలు కట్టిన రాగిరంగు కేశపాశం కాగా, అమ్మవారిది అందంగా అలంకరింపబడిన నల్లని కేశపాశం. విశాలమైన, పొడవైన, నీలోత్పలం వంటి నయనం జగన్మాతదైతే, వికసించిన ఎర్ర కమలం వంటి నేత్రం ఈశ్వరునిది. తన చెవికి ఆ తల్లి రత్నపు చెవిపోగు ధరించగా, సర్పాలనే ఆయన తన చెవికి ధరిస్తాడు. పార్వతి దివ్యాభరణాలను ధరించి ఉండగా, ఆయన నాగాభరణ శోభితుడు. అమ్మవారు దివ్యమైన పట్టువస్త్రాలను అలంకరించుకొంటే, ఆయన దిగంబరుడై దర్శనమిస్తాడు. కస్తూరి, కుంకుమ వంటి సౌభాగ్య ద్రవ్యాలను ఆమె అలదుకొంటే, దేహమంతా చితాభస్మాన్ని శివుడు పులుముకొని ఉంటాడు. ఆమె పాదం అందెలతోను, ఆయన పాదం నాగ కంకణాలతోనూ కనిపిస్తాయి.

ప్రపంచ సృష్ట్యున్ముఖ లాస్యకాయై
సమస్త సంహారక తాండవాయ
జగజ్జనన్యై జగదేక పిత్రే
నమశ్శివా యైచ నమః శివాయ

అమ్మవారి ముఖంలో వెల్లివిరిసిన చిరునవ్వుతో విశ్వసృష్టి ప్రారంభమవుతుంది. అయ్యవారి తాండవ నృత్యంతో విశ్వం మొత్తం శివునిలో కలిసిపోతుంది. జగత్తుకే మాతా పితరులైన శివపార్వతులు అర్ధనారీశ్వర రూపంగా కలిసి ఉన్న తత్త్వానికి నమస్కరిస్తున్నాను అని పై శ్లోకభావం.

రెండు విభిన్నమైన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు పరస్పర సమన్వయాన్ని సాధించిన వైనానికి సాకార రూపమే అర్ధనారీశ్వరం. విభిన్న లక్షణాలున్నప్పటికీ అన్యోన్యానురాగంతో దాంపత్య బంధాన్ని కొనసాగించాలన్నది అర్ధనారీశ్వరుడు ఇచ్చే సందేశం. ఈ తత్త్వాన్ని ఆకళింపు చేసుకోగలిగితే భూమిపై ప్రతి జంటా ఆ ఆదిదంపతుల లాగా అన్యోన్యతకు సాకార రూపమై నిలుస్తుంది. అలా ఉండే ప్రయత్నం మనమందరం చేయగలిగితే మన సంస్కృతిలో భాగమయిన వివాహధర్మం కలకాలం మనగలుగుతుంది !

- డాక్టర్ గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి

సాక్షి సినిమా

నెలాఖరులో విష్ణు విన్యాసం


• శ్రీవిష్ణు

విష్ణు, నయన్ సారిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'విష్ణు విన్యాసం'. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో హేమ అండ్ షాలినిల సమర్పణలో సుమంత్ నాయుడు .జి నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లుగా శనివారం రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, 'సత్యం' రాజేష్ నటించిన ఈ సినిమాకు సంగీతం: రథన్.

సరస్వతి సాహసం

• వరలక్ష్మి

వరలక్ష్మీ శరత్‌కుమార్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన సినిమా 'సరస్వతి'. ఈ హై కాన్సెప్ట్ థ్రిల్లర్ సినిమాను దోస డైరీస్ పతాకంపై వరలక్ష్మీ శరత్‌కుమార్, ఆమె సోదరి పూజా శరత్‌కుమార్ నిర్మించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరోయిన్ సమంత లాంచ్ చేశారు. ''సరస్వతి' జర్నీ నాకు ఎంతో ముఖ్యమైంది. ప్రతి కథకు ఓ లక్ష్యం ఉంటుంది. క్రూరమైన ప్రపంచానికి వ్యతిరేకంగా సరస్వతి ఎదురు నిలిచే సాహసం చేసిందే కానీ, లొంగిపోవాలనుకోలేదు'' అంటూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఉద్దేశించి, పేర్కొన్నారు వరలక్ష్మి. జీవా, ప్రకాశ్‌రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక, కిశోర్‌కుమార్, శ్రీకాంత్ అయ్యర్, రావు రమేష్, సప్తగిరి నటించిన ఈ చిత్రానికి సంగీతం: తమన్.

దసరాకు ఏమో ఏమో ఇది

• రోషన్
• ప్రీతీ ముకుందన్

రోషన్ మేక, ప్రీతీ ముకుందన్ హీరో హీరోయిన్లుగా నటించనున్న రొమాంటిక్ కామెడీ సినిమాకు 'ఏమో ఏమో ఇది' అనే టైటిల్ ఖరారైంది. మాస్ యాక్షన్ నేపథ్యంలో 'హిట్, హిట్ 2, హిట్ 3' చిత్రాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలను కాస్త ట్రాక్ మార్చి ఈ రొమాంటిక్ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్న ఈ సినిమా దసరా సందర్భంగా రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో అభయ్ పాత్రలో రోషన్, అపూర్వగా ప్రీతి నటించారు. శనివారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ 'ఏమో ఏమో ఇది' సినిమా టైటిల్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. నవతరం ప్రేమ బంధాలు, ఆధునిక వివాహాల గురించి ఓ తల్లి–కొడుకు మాట్లాడుకునే సంభాషణలతో ఈ సినిమా గ్లింప్స్ సాగింది. త్వరలో చిత్రీకరణ మొదలు కానున్న ఈ సినిమాకు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరకర్త.

హే భగవాన్ హృదయానికి హత్తుకుంటుంది

- వంశీ నందిపాటి



''హే భగవాన్' ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ. స్టోరీ లెవల్ నుంచే ఈ ప్రాజెక్టులో ఉన్నాను. ఇప్పుడు సమర్పకుడిగా ఉన్నాను. ఈ సినిమాలో బిజినెస్ అనే అంశం ఉంటుంది. ఒక కొడుకు తన తండ్రి గురించి అర్థం చేసుకోవడానికి ఆ అంశం ఉపయోగపడుతుంది. ఈ సినిమాలో వినోదంతో పాటు భావోద్వేగాలు ఉన్నాయి. ప్రేక్షకులను నవ్వించడంతో పాటు హృదయానికి హత్తుకునే సినిమా ఇది'' అని వంశీ నందిపాటి అన్నారు. సుహాస్, శివానీ నాగారం జోడీగా గోపీ అచ్చర దర్శకత్వం వహించిన చిత్రం 'హే భగవాన్'. బి. నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 20న రిలీజ్ కానుంది. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వంశీ నందిపాటి విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ సినిమాలో హీరో తండ్రి పాత్ర పేరు భగవాన్. అందుకే 'హే భగవాన్' టైటిల్ పెట్టాం. కొంతకాలం నుంచి సుహాస్ ఎదురు చూస్తున్న కమర్షియల్ సక్సెస్ ఈ సినిమాతో సాధించబోతున్నాడు. కథ పరంగా ఏవైనా మార్పులుంటే కన్విన్సింగ్‌గా చెబితే దర్శకులు కూడా ఒప్పుకుంటారు. అయితే కంటెంట్‌లో బలం ఉంటేనే మనం కూడా ఏమైనా చేయగలం. దర్శకుడు హ్యాపీ అయితే సినిమా బాగుంటుందనేది నా నమ్మకం. ఇక 'లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి' మూవీస్ తర్వాత చిన్న సినిమాలు పెరిగాయి. ఇటీవల ఫిల్మ్‌ఛాంబర్‌లో ఒక నెలలోనే 300 సినిమాల టైటిల్స్ రిజిస్టర్ అయ్యాయి. ఓటీటీ బిజినెస్‌లు కావడం లేదని ఓ క్లారిటీ వచ్చింది. అయితే కేవలం ఓటీటీ కోసం చేసే సినిమాలు పెరిగాయి. నిర్మాతగా మంచి చిత్రాలు అందించాలనేది నా లక్ష్యం. బన్నీ వాసు గారు నాకు బ్రదర్‌లాంటి వారు. మా ఇద్దరి అభిప్రాయాలు ఒకే విధంగా ఉంటాయి. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రాన్ని డిస్ట్రిబ్యూటర్‌గా మార్చి 6న రిలీజ్ చేస్తున్నాను. సత్యదేవ్‌తో పాటు శ్రీవిష్ణుతో సినిమాలు చేస్తున్నాను. 'పొలిమేర–3' షూట్‌ని ఏప్రిల్ లేదా మేలో ప్రారంభిస్తాం. ఈ మూవీని అన్ని దక్షిణాది భాషల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఈటీవీ విన్‌తో కలిసి ఓ ప్రాజెక్టు చేస్తున్నాను'' అని చెప్పారు.

బ్యాండ్ మేళం పెద్ద సౌండ్ చేస్తుంది

- బాబీ

• బీవీఎస్ రవి, సతీష్, బాబీ, హర్ష్, శ్రీదేవి, కోన వెంకట్

''బ్యాండ్ మేళం' గ్లింప్స్ చాలా బాగుంది. నా ప్రేమ కథ అంటే సుకుమార్‌గారికి చాలా ఇష్టం. 'నీ కథని నువ్వు తీస్తావా? నేను తీయాలా?' అంటే... 'నేనే తీస్తాను సార్' అని చెబుతుంటాను. నేను లవ్ స్టోరీ తీస్తే కచ్చితంగా రోషన్‌తోనే తీస్తాను. కోన వెంకట్‌గారు 'నిన్ను కోరి' టైమ్‌లో ఎంత కాన్ఫిడెంట్‌గా ఉన్నారో 'బ్యాండ్ మేళం'కి అంతే నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమా చాలా పెద్ద స్థాయిలో సౌండ్ చేస్తుంది'' అని డైరెక్టర్ బాబీ తెలిపారు. 'కోర్ట్' మూవీ ఫేమ్ హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్లా జంటగా నటిస్తున్న చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్య నిర్మిస్తున్న ఈ మూవీ మార్చి 13న విడుదల కానుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ని డైరెక్టర్ త్రివిక్రమ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాబీ, రచయిత బీవీఎస్ రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ– ''నేను రెగ్యులర్ ప్రొడ్యూసర్‌ని కాదు. మనసుకి నచ్చిన కథ వస్తేనే సినిమా తీస్తాను. జీవితాంతం గుర్తుండిపోయే సినిమాగా 'బ్యాండ్ మేళం' నిలుస్తుంది'' అని చెప్పారు. ''నా జీవితం అయిపోయిందని అనుకున్న టైమ్‌లో హీరోలా వచ్చి నన్ను సపోర్ట్ చేసిన కోన వెంకట్‌గారికి థ్యాంక్స్'' అన్నారు సతీష్ జవ్వాజీ. ''మా సినిమాని ప్రేక్షకులు సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం'' అని హర్ష్ రోషన్, శ్రీదేవి తెలిపారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్, ఆదిత్య మ్యూజిక్ నిరంజన్ మాట్లాడారు.

నాగబంధంలో భైరాగి

• గరుడ రామ్

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా 'నాగబంధం'. నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, జగపతిబాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్, 'కేజీఎఫ్' ఫేమ్ గరుడ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని భైరాగి పాత్రలో గరుడ రామ్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, శనివారం ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. నేడు మహా శివరాత్రి సందర్భంగా మహేశ్‌బాబు ఈ సినిమా టీజర్‌ను షేర్ చేయనున్నారు. ఈ సినిమాకు సంగీతం: అభే, జునైద్ కుమార్.

డేట్ ఛేంజ్

● తప్పని వాయిదా

ఎస్... ఫలానా డేట్‌కి థియేటర్స్‌కి వచ్చేస్తాం అంటూ యూనిట్ ఒక డేట్ ఫిక్స్ చేసి, ప్రకటిస్తుంది. అయితే కొన్నిసార్లు సెట్ చేసిన డేట్‌కి ఆ సినిమా రాదు... వాయిదా పడుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా వాయిదా వేస్తుంటారు. కొన్ని సినిమాల షూటింగ్ పూర్తి కాదు... కొన్ని పూర్తయినా గ్రాఫిక్స్ పూర్తి కావు... కొన్నయితే అన్నీ పూర్తయినా వేరే సినిమాతో క్లాష్ అయ్యే పరిస్థితిలో తప్పక వాయిదా పడతాయి. కారణాలు ఏమైనప్పటికీ ఈ మధ్య కొన్ని సినిమాలు వాయిదా పడ్డాయి. ఆ చిత్రాల పోస్ట్‌పోన్ స్టోరీ తెలుసుకుందాం.


● రామ్‌చరణ్

● చిరంజీవి


● నాని


● అడివి శేష్, మృణాల్ ఠాకూర్

● భాగ్యశ్రీ బోర్సే, అఖిల్

● నిఖిల్


● సాయిదుర్గా తేజ్

● వేసవిలో విశ్వంభర

చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' మూవీ ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. 'కుబేర' సుధారక్, కునాల్ కపూర్, ఇషా చావ్లా, రమ్య పసుపులేటి, రావు రమేశ్, రాజీవ్ కనకాల తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీకృష్ణ రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. ఈ సినిమాని 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే అనూహ్యంగా ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. ఇందుకు కారణం... చిరంజీవి తనయుడు రామ్ చరణ్ హీరోగా నటించిన 'గేమ్ చేంజర్' సినిమా. తనయుడి 'గేమ్ చేంజర్' కోసం తన 'విశ్వంభర' మూవీ విడుదలని చిరంజీవి వాయిదా వేసుకున్న సంగతి తెలిసిందే. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'గేమ్ చేంజర్' 2025 జనవరి 10న రిలీజ్ అయింది. 2025 సంక్రాంతికి వాయిదా పడిన 'విశ్వంభర' వేసవిలో విడుదలవుతుందని భావించి నప్పటికీ కాలేదు. ఇందుకు కారణం వీఎఫ్‌ఎక్స్ పనులు. ఈ కారణంగా చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకరవర ప్రసాద్‌గారు' మూవీ ఈ ఏడాది సంక్రాంతికి జనవరి 12న విడుదలైంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ మూవీలో నయనతార హీరోయిన్‌గా నటించగా, వెంకటేశ్ ముఖ్య పాత్ర పోషించారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఇక 2025 జనవరి 10న రిలీజ్ వాయిదా పడిన 'విశ్వంభర' కొత్త విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే ఈ వేసవికి ప్రేక్షకుల ముందుకు వస్తుందని చిరంజీవి ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి... విడుదల తేదీపై స్పష్టత రావాలి.

● మార్చి టు ఏప్రిల్

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ ఫిల్మ్ 'పెద్ది'. 'ఉప్పెన' మూవీ ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతిబాబు, శివ రాజ్ కుమార్, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ మూవీని రామ్‌చరణ్ బర్త్ డే కానుకగా మార్చి 27న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మార్చి నుంచి ఏప్రిల్ 30కి విడుదల వాయిదా వేశారు. ''రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్ ఇండియా స్పోర్ట్స్, యాక్షన్ డ్రామా 'పెద్ది'. హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ మూవీ కోసం రామ్‌చరణ్ ఫుల్ మాస్ లుక్‌లోకి మారిపోయారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉంది. మార్చి 27న ఈ సినిమాని విడుదల చేయాలని భావించాం. అయితే వేసవి సెలవుల్ని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 30కి మార్చాం. మా సినిమా ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్లతో పాటు ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'చికిరి చికిరి...' పాట అన్ని ప్లాట్‌ఫామ్‌లలో అద్భుతమైన స్పందనను అందుకుంది. ఈ పాట 200 మిలియన్ల వ్యూస్ దాటి సినిమాపై అంచనాలను భారీగా పెంచింది'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఇదిలా ఉంటే... ఈ సినిమా విడుదల వాయిదా పడటంతో ఏప్రిల్‌లో విడుదల కావాల్సిన పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' ముందుకు వచ్చి, మార్చి 26న రిలీజ్ కానుంది.

● మార్చి నుంచి ఆగస్టుకి...

'దసరా' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. మంచు మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే 'కిల్, గ్యారా గ్యారా' వంటి హిందీ చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకున్న రాఘవ్ జుయల్ 'ది ప్యారడైజ్'లో భాగమయ్యారు. ఓ కీలక పాత్రను సంపూర్ణేష్ బాబు చేస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమాలో జడల్ అనే పాత్రలో నాని నటిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. నానిపై 'ఆయా షేర్..' అంటూ సాగే ఇంట్రో సాంగ్ చిత్రీకరిస్తున్నారు. వందలాది డ్యాన్సర్లతో భారీ సెట్లో తెరకెక్కుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ హై వోల్టేజ్ మాస్ ట్యూన్ అందించారు. కొరియోగ్రాఫర్ సుధన్ మాస్టర్ భారీ విజువల్స్‌తో ఈ సాంగ్‌ని పూర్తి స్థాయి క్రౌడ్ ప్లీజర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో మార్చి 26న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ తొలుత ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే పోస్ట్‌పోన్ చేసి, ఆగస్టు 21న విడుదల చేయనున్నారు. ''మ్యాసివ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ మూవీ హాటెస్ట్ పాన్ ఇండియన్ రిలీజెస్‌లో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. మా సినిమాని ముందుగా మార్చి 26న విడుదల చేయాలనుకున్నాం. అయితే తాజాగా ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ రిలీజ్ డేట్‌కి మా సినిమాకు వరుసగా మూడు వారాల పండగలు కలిసి రానున్నాయి. మొదటి వారంలో ఓనం, మిలాద్-ఉన్-నబీ పండగలు, రెండో వీకెండ్‌లో రాఖీ, మూడో వారంలో జన్మాష్టమి ఉండటం వల్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'ది ప్యారడైస్'కి బాక్సాఫీస్ వద్ద బిగ్ అడ్వాంటేజ్ అవుతుంది. ప్లానింగ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉన్న నాని... ఈ నిర్ణయంతో మరోసారి తన మార్కెటింగ్ సెన్స్‌ని చూపించారు'' అని చిత్రబృందం ప్రకటించింది.

● ఫిబ్రవరి టు ఏప్రిల్...

'కార్తికేయ 2' వంటి పాన్ ఇండియా హిట్ తర్వాత నిఖిల్ నటించిన మరో పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటించారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో ఈ నెల 13న రిలీజ్ చేస్తామని యూనిట్ ఇప్పటికే అనౌన్స్ చేసింది. అయితే ఆ తేదీకి విడుదల వాయిదా పడి, ఏప్రిల్ 10న రిలీజ్ కానుంది. నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో రూపొందిన చిత్రం 'స్వయంభు'. ఈ సినిమాలో నిఖిల్ పవర్ ఫుల్ వారియర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు... ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్ ఇంకా పెండింగ్‌లో ఉన్నాయట. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని భావిస్తున్న యూనిట్... కొంచెం ఆలస్యమైనా సరే బెస్ట్ ఔట్ పుట్ ఇవ్వాలని నిర్ణయించుకుని ఫిబ్రవరి 13 నుంచి ఏప్రిల్ 10కి వాయిదా వేసినట్లు టాక్. ఈ మూవీ 2డీ, త్రీడీ ఫార్మాట్‌లో విడుదల కానుంది. 1000 ఏళ్ల క్రితం రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో కృష్ణ అనే యోధుడు ఉండేవాడు. అల్లరిగా తిరిగే అండర్ డాగ్ రాజ్యాలను శాసించే స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. 'సలార్' మూవీ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరిన్ని అంచనాలు పెంచింది. అదే విధంగా సెంథిల్ కుమార్ విజువల్స్ ఈ మూవీకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలవనున్నాయి.

● మే 1న లెనిన్ వస్తాడా?

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. 'వినరో భాగ్యము విష్ణుకథ' మూవీ ఫేమ్ మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, నాగవంశీ నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీలో అఖిల్ ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు. 'లెనిన్'ని మే 1న విడుదల చేయబోతున్నట్టు అధికారికంగా ప్రకటించారు మేకర్స్. అయితే... ఆ తేదీకి రిలీజ్ కాకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దానికి కారణం రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా అని ఫిల్మ్‌నగర్ టాక్. మార్చి 27న 'పెద్ది'ని విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మార్చి నుంచి ఏప్రిల్ 30కి విడుదల వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో 'లెనిన్' సినిమా వాయిదా పడే అవకాశం ఉందని టాక్. 'లెనిన్'ని మే 1న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అయితే కొత్త విడుదల తేదీపై మేకర్స్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరి... ముందుగా అనుకున్నట్లు 'లెనిన్' మే 1న ప్రేక్షకుల ముందుకు వస్తాడా? లేదా? లేకుంటే మరో కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తారా? అనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. 'లెనిన్' పై అక్కినేని ఫ్యాన్స్ చాలా ఆశలే పెట్టుకున్నారు. ఈ మూవీ తప్పకుండా భారీ విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నారు.

● మార్చి నుంచి ఏప్రిల్‌కి?

అడివి శేష్ హీరోగా రూపొందిన తాజా పాన్ ఇండియన్ ఫిల్మ్ 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ మూవీ నిర్మించారు. సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా 2025 డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ తేదీకి రిలీజ్‌ని పోస్ట్‌పోన్ చేసి, ఉగాది కానుకగా ఈ ఏడాది మార్చి 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇంటెన్స్ లుక్స్‌లో ఉన్న రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే ఈ మూవీ మరోసారి విడుదల వాయిదా పడనుందని ఫిల్మ్‌నగర్ టాక్. మార్చి నెలలో యశ్ 'టాక్సిక్', రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్ 2' వంటి సినిమాలు ఆడియన్స్ ముందుకి వస్తుండటంతో 'డెకాయిట్' విడుదల వాయిదా పడనుందని వార్తలు వినిపిస్తున్నాయి. వేసవి కానుకగా ఏప్రిల్ 10న రిలీజ్ కానుందనే చర్చ నడుస్తోంది. అయితే మార్చి 19న విడుదల వాయిదా గురించి చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ''ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'డెకాయిట్'. ఇప్పటికే విడుదలైన ఫైర్ గ్లింప్స్‌లోని ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌కి పాన్ ఇండియా స్థాయిలో మంచి స్పందన వచ్చింది. బాలీవుడ్ డైరెక్టర్, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపిస్తారు. ఆయన నటించిన తొలి తెలుగు చిత్రం మాదే. అంతర్జాతీయ స్థాయిలో తీసిన 'డెకాయిట్'ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం మా మూవీకి ప్లస్ అవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఇదిలా ఉంటే... యూనిట్ ముందుగా ప్రకటించినట్లు మార్చి 19న 'డెకాయిట్' సినిమా విడుదలవుతుందా? లేదా అనేది వేచి చూడాలి.

● సంబరాలు ఎప్పుడు?

సాయిదుర్గా తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సంబరాల ఏటి గట్టు (ఎస్‌వైజీ). ఐశ్వర్యా లక్ష్మి, జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ద్వారా రోహిత్ కేపీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి 'సంబరాల ఏటిగట్టు' నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 2025 సెప్టెంబరు 25న విడుదల చేయనున్నట్లు యూనిట్ తొలుత ప్రకటించినప్పటికీ పోస్ట్‌పోన్ అయింది. అయితే ఆ తర్వాత విడుదల తేదీపై యూనిట్ నుంచి ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ, మార్చి 14న థియేటర్లలోకి రానుందని టాక్. ''సంబరాల ఏటిగట్టు' చిత్రం రూ. 125 కోట్లకు పైగా బడ్జెట్‌తో భారీ స్థాయిలో రూపొందింది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌గా ఈ మూవీ నిలుస్తుంది. మా సినిమాలోని సీజీ వర్క్ ఆడియన్స్‌కి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. వెట్రి పళనిసామి విజువల్స్, బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అదనపు ఆకర్షణలు'' అని యూనిట్ పేర్కొంది.

– దేరంగుల జగన్ మోహన్

నాయకుడు వచ్చేదెప్పుడు?

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ సినిమా విజయ్ కెరీర్‌లో 69వ మూవీ. పూజా హెగ్డే కథానాయికగా నటించిన ఈ సినిమాలో మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్ర పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ సినిమా పొంగల్ కానుకగా ఈ ఏడాది జనవరి 9 విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే కొత్త విడుదల తేదీపై ఎలాంటి ప్రకటన రాలేదు.

విజయ్ ఇప్పటికే రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఈ కారణంగా ఆయన సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అందుకే విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకుడు'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన రావడంతో పాటు సినిమాపై అంచనాలు పెంచింది. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతానికి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం సెన్సార్ ఇబ్బందుల్లో ఉంది. మరి... అడ్డంకులు దాటుకుని 'జన నాయకుడు' ప్రేక్షకుల ముందుకు వచ్చేదెప్పుడు? అన్నది వేచి చూడాలి.

● విజయ్

ప్రభాస్ మెచ్చుకోవడం ఆనందం

– ధీరజ్ మొగిలినేని

● సంతోష్ శోభన్, మానసా వారణాసి, అశ్విన్ చంద్రశేఖర్, ధీరజ్ మొగిలినేని

సంతోష్ శోభన్, మానసా వారణాసి జంటగా నటించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది. అజయ్‌కుమార్ రాజు. పి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రాన్ని నిర్మాత-డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణల్లో రిలీజ్ చేశారు. హైదరాబాద్‌లోని గోకుల్ థియేటర్‌లో శనివారం ప్రేక్షకుల సమక్షంలో సినిమా చూసిన తర్వాత, సాయంత్రం నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''కపుల్ ఫ్రెండ్లీ' కంప్లీట్ లవ్‌స్టోరీ ఫిల్మ్. ప్రభాస్ అన్న సినిమా చూసి, నచ్చిందని చెప్పారు. ప్రభాస్ అన్న అప్రిసియేషన్‌తో నేను గెలిచాననే ఫీలింగ్ కలిగింది. ప్రేక్షకులు మా సినిమాను థియేటర్స్‌లో చూసి, సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''మా కపుల్‌ఫ్రెండ్లీ' సినిమాను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అని చెప్పారు అశ్విన్ చంద్రశేఖర్, మానసా వారణాసి. ''ప్రభాస్ గారు మా సినిమాను మెచ్చుకుని, తనకు 'వర్షం'లా, సంతోష్ శోభన్‌కు 'కపుల్ ఫ్రెండ్లీ' అని ఆయన పోస్ట్ చేశారు. సంతోషంగా ఉంది. సంతోష్ 2.ఓ స్టార్ట్ అవుతోంది. ఈ ఏడాది ఆయన పెద్ద హీరో అవుతారు. మానస పెర్ఫార్మెన్స్ గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. నేను ఈ సినిమా చూసి, కచ్చితంగా హిట్ అవుతుందని భావించి డిస్ట్రిబ్యూట్ చేశాను'' అన్నారు ధీరజ్ మొగిలినేని.

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో వొడా-ఐడియా లెర్నింగ్ ఫెస్ట్

హైదరాబాద్: టెలికం దిగ్గజం **వొడాఫోన్** ఐడియా సీఎస్ఆర్ విభాగమైన వీఐ ఫౌండేషన్ హైదరాబాద్‌లో 21వ శతాబ్దపు లెర్నింగ్ ఫెస్ట్ ఈ–విద్య పేరిట పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఇందులో 30 పైగా ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ స్కూల్స్ నుంచి టీచర్లు, స్టూడెంట్లు పాల్గొన్నారు. డిజిటల్ లెర్నింగ్ సాధనాలు, ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. రోబోటిక్స్, డిజిటల్ స్టోరీ టెల్లింగ్ ప్రాజెక్టులు మొదలైనవి ప్రదర్శించారు.

స్పానిష్ సంస్థలో ఇక్సిగోకి మెజారిటీ వాటాలు

న్యూఢిల్లీ: స్పెయిన్‌కి చెందిన ట్రెయిన్ బుకింగ్ ప్లాట్‌ఫాం అయిన ఆన్‌లైన్ ట్రావెల్ సొల్యూషన్స్ (ట్రెనెస్)లో మెజారిటీ వాటాలను ట్రావెల్ అగ్రిగేటర్ ఇక్సిగో కొనుగోలు చేయనుంది. 60 శాతం వాటాల కొనుగోలు ప్రతిపాదనకు సంస్థ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ డీల్ విలువ సుమారు రూ. 125 కోట్లుగా (11.70 మిలియన్ యూరోలు) ఉంటుంది. యూరోపియన్ ఓటీఏ మార్కెట్లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. మరోవైపు స్క్వాడ్ యాజ్ సర్వీస్ అనే ఇంకో స్పానిష్ సంస్థలో కూడా 45.02 శాతం వాటాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కూడా ఇక్సిగో బోర్డు ఆమోదం తెలిపింది. దీని విలువ రూ. 4.83 కోట్లుగా ఉంటుంది. ఎస్క్యూఏఏఎస్ సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ సంబంధ సేవలను అందిస్తోంది.

పిరమల్ ఫార్మాకు యూఎస్ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

హైదరాబాద్: పిరమల్ ఫార్మాకు చెందిన తెలంగాణా యూనిట్‌లో నాలుగు అభ్యంతరాలను అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ(యూఎస్ఎఫ్‌డీఏ) గుర్తించింది. ''సంగారెడ్డి దిగ్వాల్ యూనిట్‌లో యూఎస్ఎఫ్‌డీఏ బృందం ఈ ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా నాలుగు అభ్యంతరాలు ప్రస్తావిస్తూ ఫారమ్–483 జారీ చేసింది'' అని పిరమల్ ఫార్మా రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గుర్తించిన లోపాలు విధానపరమైనవే కానీ... డేటా సమగ్రతకు సంబంధించినవి కావని వివరణ ఇచ్చింది. లోపాలు సరిదిద్దుకొని, నిర్ణీత గడువులోపు యూఎస్ఎఫ్‌డీఏకు నివేదిక సమర్పిస్తామని పేర్కొంది. ఉత్పత్తి, సమాచార సమగ్రత విషయాల్లో నియంత్రణ సంస్థ నిబంధనలకు లోబడి, ప్రమాణాలకు కట్టుబడి ఉంటామని పిరమల్ ఫార్మా వెల్లడించింది.

గోద్రెజ్ ఆగ్రోవెట్ నుంచి టకై

న్యూఢిల్లీ: అగ్రి–బిజినెస్ సంస్థ గోద్రెజ్ ఆగ్రోవెట్ తాజాగా వరి పంటకి సంబంధించి కొత్త క్రిమిసంహారకం టకైని ప్రవేశపెట్టింది. ఐఎస్‌కే జపాన్‌కి చెందిన సైక్లాప్రిన్ టెక్నాలజీ దన్నుతో దీన్ని తయారు చేసినట్లు సంస్థ ఎండీ సునీల్ కటారియా తెలిపారు. ఆకు ముడత, కాండం తొలుచు పురుగుల్లాంటి వాటిపై ఇది సమర్థవంతంగా పని చేస్తుందని వివరించారు. సాధారణంగా పంట ప్రారంభ, మధ్య దశల్లో దాడి చేసే కాండం తొలుచు పురుగుల వల్ల 30–40 శాతం మేర దిగుబడి నష్టపోవాల్సి వస్తుందని, టకై వాడకంతో ఇలాంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. మిరప, క్యాబేజ్, సోయాబీన్ తదితర పంటలకు కూడా దీనికి ఆమోదం తీసుకునే ప్రక్రియలో ఉన్నామని సునీల్ చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-2-2026

విశాఖ	510–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	515–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

డిజిటల్ పారదర్శకతకు అంతర్జాతీయ కూటమి

- ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థల నేతృత్వంలో 'ట్రస్టెడ్ టెక్ అలయన్స్' ఏర్పాటు
- భారత్ నుంచి జియో ప్లాట్‌ఫామ్స్ ప్రాతినిధ్యం
- ఏఐ, క్లౌడ్, సెమీకండక్టర్లపై సమిష్టి దృష్టి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో విశ్వసనీయ సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆఫ్రికా, ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా ప్రాంతాలకు చెందిన 15 ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ కంపెనీలు 'ట్రస్టెడ్ టెక్ అలయన్స్ (టీటీఏ)' పేరుతో కూటమిని ఏర్పాటు చేశాయి. జర్మనీలో జరిగిన మ్యూనిక్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అలయన్స్‌ను ప్రకటించాయి. డిజిటల్ వ్యవస్థకు ఆధారమైన కనెక్టివిటీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సెమీకండక్టర్లు, సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధ (ఏఐ) తదితర అన్ని విభాగాలను ఏకతాటిపైకి తీసుకురావడంతో ఈ విభాగాల్లో పారదర్శకత, భద్రత, గవర్నెన్స్‌కు సంబంధించిన ఉమ్మడి ప్రమాణాలు రూపొందించడమే ప్రధాన ఉద్దేశమని అలయన్స్ సంయుక్త ప్రకటనలో పేర్కొంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఆంత్రోపిక్, కసావా టెక్నాలజీస్, కోహిర్, ఎరిక్సన్, గూగుల్ క్లౌడ్, హాన్వా గ్రూప్, జియో ప్లాట్‌ఫామ్స్, మైక్రోసాఫ్ట్, నోకియా, ఎన్‌స్కేల్, ఎన్‌టీటీ, రాపిడస్, సాబ్, సాప్ తదితర సంస్థలు ఈ అలయన్స్‌కు స్థాపక సభ్యులుగా ఉన్నాయి.

అలయన్స్‌లో జియో ప్లాట్‌ఫామ్స్ భాగస్వామ్యం

అలయన్స్‌లో భారతీయ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ భాగస్వామ్యం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'డిజిటల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలకు అనుగుణంగా కనెక్టివిటీ, క్లౌడ్, సెమీకండక్టర్లు, ఏఐ వంటి కీలక రంగాల్లో గ్లోబల్ స్థాయి ఉమ్మడి ప్రమాణాల రూపకల్పనలో భారత్ పాత్రను ఇది మరింత బలోపేతం చేయనుంది. టెక్నాలజీ ఏ దేశానికి చెందినదన్న అంశం కంటే, పారదర్శకత–భద్రత ఆధారిత ప్రమాణాలే విశ్వాసానికి పునాది కావాలన్న దృక్పథం భారత్‌కు వ్యూహాత్మకంగా అనుకూలంగా మారనుందని జియో ప్లాట్‌ఫామ్స్ సీఈవో కిరణ్ థామస్ తెలిపారు.

డిజిటల్ విశ్వసనీయతకు అంతర్జాతీయ కృషి

ప్రపంచ దేశాల మధ్య భౌగోళిక–రాజకీయ విభజన పెరుగుతున్న నేపథ్యంలో 'ట్రస్టెడ్ టెక్ అలయన్స్'ను ఏర్పాటు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సాంకేతిక మార్పులు వేగంగా జరుగుతున్న పరిస్థితుల్లో డిజిటల్ విశ్వసనీయతను బలోపేతం చేయడమే ఈ కూటమి ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థలు శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా, డిజిటల్ మౌలిక సదుపాయాలు జాతీయ భద్రత, ఆర్థిక పోటీ సామర్థ్యాలతో మరింత అనుసంధానం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో టెక్నాలజీ సప్లయిదారుల విషయంలో అధిక స్థాయి విశ్వసనీయత అవసరమని ప్రభుత్వాలు కంపెనీలు కోరుకుంటున్నాయని అలయన్స్ వెల్లడించింది. టెక్నాలజీ ఏ దేశానికి చెందినదన్న అంశం కంటే, ఉమ్మడి ఆపరేటింగ్ ప్రమాణాల ఆధారంగానే నమ్మకాన్ని నిర్మించవచ్చని చూపించేందుకే టీటీఏ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించినట్లు పేర్కొంది.

అయిదు నిర్దిష్ట సూత్రాలకు అంగీకారం

అలయన్స్ సభ్య సంస్థలు ఐదు కీలక సూత్రాలకు అంగీకారం తెలిపాయి. (1). పారదర్శక కార్పొరేట్ పాలన, నైతిక ప్రవర్తన (2). కార్యకలాపాల్లో స్పష్టత, సురక్షిత డెవలప్‌మెంట్, స్వతంత్ర అసెస్‌మెంట్ (3). బలమైన సప్లై చైన్, భద్రతా పర్యవేక్షణ (4). ఓపెన్, సహకారాత్మక, సమగ్ర, స్థిరమైన డిజిటల్ ఎకోసిస్టమ్ (5). చట్టపాలనకు, డేటా పరిరక్షణకు గౌరవం. ఈ అయిదు సూత్రాల ప్రకారం టెక్నాలజీ అభివృద్ధి నుంచి వినియోగం వరకు ప్రతి దశలోనూ భద్రత అమలు చేయాల్సి ఉంటుంది.

'బంగారం బాట'లో యువ భారతం

- పసిడిలో పెట్టుబడులకే ఆసక్తి
- స్మిట్టెన్ ప్లస్ఏఐ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నా... యువ భారతం బంగారంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. దేశవ్యాప్తంగా 18–39 ఏళ్ల మధ్య వయసు కలిగిన 5,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలతో 'స్మిట్టెన్ పల్స్ఏఐ' ఒక నివేదిక విడుదల చేసింది. సర్వేలో పాల్గొన్నవారిలో 62 శాతం మంది పెట్టుబడుల్లో తొలి ప్రాధాన్యతం బంగారానికి ఇచ్చారు. గతంలో బంగారం కొనాలంటే ఇంటి పెద్దల సలహా తీసుకునేవారు. కానీ ఇప్పుడు 66.7% మంది యువత స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయిదు గ్రాముల లోపే పసిడి కొన్నామని 62% మంది వెల్లడించారు. 2 గ్రాముల లోపు కొనుగోలు చేసిన వాళ్లు 27.5% మంది కాగా.. 2–5 గ్రాముల మధ్య కొనుగోలు చేసిన వాళ్లు 34.4% మంది ఉన్నారు.

- తమ మొదటి జీతం/సంపాదనతో తొలిసారి 24% మంది పసిడిని కొనుగోలు చేశారు. కేవలం పెట్టుబడిగా పసిడిని కొనుగోలు చేసినట్లు 23.9% మంది వెల్లడించారు. ఆర్థిక అనిశ్చితి సందర్భాల్లో, బ్యాంకు సేవింగ్స్, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలతో పోలిస్తే 65.7% మంది బంగారమే అత్యంత సురక్షితమైన సాధనంగా భావిస్తున్నామని తెలిపారు. సుమారు 65.7% మంది స్టాక్స్, మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్) కంటే పసిడినే అత్యంత సురక్షిత పెట్టుబడి మార్గంగా భావిస్తున్నారని సర్వేలో తేలింది.
- ఒకవేళ రూ.25,000 నగదు రూపంలో ఉంటే.., పసిడి కొంటామని 61.9% మంది పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్లకు 16.6%, డిపాజిట్లు 13%, షేర్లు 6.6%, క్రిప్టో 1.9% మంది ఆసక్తి చూపారు.

రత్నాలు, ఆభరణ ఎగుమతులు డీలా

గత నెల(జనవరి)లో రత్నాలు, బంగారు ఆభరణ ఎగుమతులు డీలా పడ్డాయి. 2025 జనవరితో పోలిస్తే 6% క్షీణించి 2,239 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. 2025 జనవరిలో ఇవి 2,376 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. రత్నాలు, ఆభరణ ఎగుమతుల ప్రోత్సాహక సమితి(జీజేఈపీసీ) వివరాలివి. ప్రపంచ వాణిజ్య సవాళ్లు, కీలక మార్కెట్లలో టారిఫ్ ఒత్తిళ్లు ప్రభావం చూపాయి. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి 10 నెలల(ఏప్రిల్ 2025–జనవరి 2026)నూ ఇవి నామమాత్ర వెనకడుగు వేశాయి. 0.6% తగ్గి 23,186 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో ఇవి 23,335 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రధానంగా దేశీ ఆభరణ ఎగుమతులకు ప్రధాన మార్కెట్‌గా నిలిచే యూఎస్‌కు షిప్‌మెంట్స్ 45% నీరసించడం ప్రభావం చూపింది.

క్యూ3 ఫలితాలు

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లాభం 14 శాతం డౌన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 14 శాతం క్షీణించి రూ. 174 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో ఇది రూ. 202 కోట్లుగా నమోదైంది. ప్రధానంగా వ్యయాలు పెరగడం లాభాల క్షీణతకు కారణమైంది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం రూ. 2,748 కోట్ల నుంచి రూ. 4,083 కోట్లకు ఎగిసింది. డిసెంబర్ త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ. 2,293 కోట్లకు చేరాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నిర్వహణలోని హైదరాబాద్, ఢిల్లీ తదితర ఎయిర్‌పోర్టుల్లో ప్యాసింజర్ల హ్యాండ్లింగ్ రికార్డు స్థాయిలో 3.19 కోట్లకు చేరింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల రద్దీ 2.08 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో జీఎంఆర్ గ్రూప్ సారథ్యంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (డీఐఏఎల్) కన్సార్షియం లాభాల్లోకి వచ్చింది. రూ. 231 కోట్ల ప్రాఫిట్ ప్రకటించింది. 2021–22 తర్వాత మూడో త్రైమాసికంలో ఇంత భారీ స్థాయిలో లాభం ఆర్జించడం ఇదే తొలిసారని సంస్థ తెలిపింది. గతేడాది డిసెంబర్ క్వార్టర్‌లో కంపెనీ రూ. 243 కోట్ల నష్టం నమోదు చేసింది.

కోల్ ఇండియా డివిడెండ్ రూ.5.5

లాభం రూ.7,157 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థ కోల్ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.7,157 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.8,505 కోట్లతో పోల్చితే 15.8 శాతం తగ్గిపోయింది. దేశీ బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం వాటా కలిగిన కోల్ ఇండియా ఆదాయం డిసెంబర్ త్రైమాసికంలో రూ.30,818 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆదాయం రూ.32,359 కోట్లుగా ఉండడం గమనార్హం. వాటాదారులకు ప్రతి ఒక్క షేరుకి రూ.5.5 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో 529 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. 2028–29 సంవత్సరానికి బొగ్గు ఉత్పత్తిని బిలియన్ టన్నులకు చేర్చాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు ప్రకటించింది.

లెన్స్‌కార్ట్ భారీ లాభాల విజన్

రూ. 133 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో కళ్లద్దాల కంపెనీ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 133 కోట్లకు చేరింది. కొత్త కస్టమర్లు జత కలవడం, మార్జిన్లు మెరుగుపడటం, అంతర్జాతీయ బిజినెస్ పుంజుకోవడం ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 2 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 38 శాతం జంప్‌చేసి రూ. 2,308 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 1,669 కోట్ల టర్నోవర్ అందుకుంది. దేశీ ఆదాయం 40 శాతం, విదేశీ ఆదాయం 33 శాతం చొప్పున ఎగసినట్లు కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో పన్నుకు ముందు లాభం(పీబీటీ) రూ. 48 కోట్ల నుంచి మూడు రెట్లు బలపడి రూ. 161 కోట్లకు చేరింది. విదేశీ మార్కెట్ల నుంచి రూ. 33 కోట్ల పీబీటీ ఆర్జించగా.. గత క్యూ3లో ఇది రూ. 42 కోట్ల నష్టంగా నమోదైంది.

ఇక మలేసియాలోనూ యూపీఐ పేమెంట్స్



న్యూఢిల్లీ: ఇకపై భారత్, మలేసియా మధ్య క్యూఆర్ మర్చంట్ చెల్లింపులకు తెరలేవనుంది. ఇందుకు అనుగుణంగా ఎన్‌పీసీఐ అంతర్జాతీయ విభాగం ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్(ఎన్ఐపీఎల్) తాజాగా పేమెంట్స్ నెట్‌వర్క్ మలేసియా ఎస్‌డీఎన్ బీహెచ్‌డీ(పేనెట్)తో చేతులు కలిపింది. పేనెట్.. మలేసియావ్యాప్త పేమెంట్స్ నెట్‌వర్క్ సంస్థకావడంతో రెండు దేశాల మధ్య క్యూఆర్ ఆధారిత చెల్లింపులకు వీలు చిక్కనుంది. అయితే దశలవారీగా ఇందుకు తెరతీయనున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) ఒక ప్రకటనలో వెల్లడించింది. తొలి దశలో భాగంగా మలేసియా సందర్శించే దేశీ ప్రయాణికులు తమ యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేపట్టేందుకు వీలు కల్పించనున్నట్లు తెలియజేసింది. డూయిట్‌నౌ క్యూఆర్ అనుమతించే టచ్‌పాయింట్ల ద్వారా ఇందుకు వీలుంటుందని పేర్కొంది. పేనెట్ నిర్వహించే డూయిట్‌నౌ మలేసియాలో ప్రామాణిక క్యూఆర్‌గా తెలియజేసింది. తదుపరి దశలో మలేసియన్లు సైతం భారత్ సందర్శనలో డూయిట్‌నౌ యాప్స్ ద్వారా యూపీఐ క్యూఆర్ కోడ్ సేవలను వినియోగించుకోవచ్చని వివరించింది.

రిలయన్స్‌కి వెనెజులా చమురు

నేరుగా దిగుమతికి అమెరికా నుంచి లైసెన్సు

న్యూఢిల్లీ: వెనెజులా నుంచి ముడి చమురు నేరుగా దిగుమతి చేసుకునేందుకు దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి అమెరికా నుంచి లైసెన్సు లభించింది. కంపెనీకి చెందిన జామ్‌నగర్ రిఫైనరీకి అనువైన ఈ క్రూడాయిల్‌ని డిస్కౌంటు రేటుకు పొందడం వల్ల రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లు మరింత మెరుగుపడతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా మాత్రమే విక్రయించడానికి అమెరికా అనుమతిస్తూ వస్తోంది. తాజాగా జనరల్ లైసెన్సు ఇవ్వడం వల్ల ఇప్పటికే ఆయిల్‌ని వెలికితీసిన సంస్థ నుంచి నేరుగా కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. వాస్తవానికి 2019–20 వరకు వెనెజులా నుంచి రిలయన్స్ క్రూడాయిల్‌ని కొనుగోలు చేసింది. ఆ దేశంపై అమెరికా ఆంక్షలతో కొన్నాళ్లు నిలిపివేసి, వాటిని సడలించాక 2024లో కొనుగోలు చేసింది. మళ్లీ ఈ ఏడాది ట్రేడర్ల ద్వారా వెనెజులా ఆయిల్ అమ్మకాలు ప్రారంభమయ్యాక 2 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురును కొనుగోలు చేసింది. వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించిన తర్వాత ఆ దేశ ఇంధన రంగంపై ఆంక్షలను అమెరికా సడలించింది.

బ్రయాన్‌స్టన్‌తో బొండాడ ఇంజినీరింగ్ ఎంవోయూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హరిత విద్యుత్ ఆధారిత డేటా సెంటర్ ప్యాకేజీలను సంయుక్తంగా అభివృద్ధి చేసే దిశగా బొండాడ ఇంజినీరింగ్ (బీఈఎల్), దుబాయ్‌కి చెందిన బ్రయాన్‌స్టన్ రెన్యువబుల్స్ ఎఫ్‌జెడ్‌సీవో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్‌తో పాటు నిర్దిష్ట అంతర్జాతీయ మార్కెట్లలో ఈ సెంటర్లను ఏర్పాటు చేయనున్నాయి. మరోవైపు మహారాష్ట్ర, తమిళనాడులో 69.51 ఎండబ్ల్యూపీ సామర్థ్యంతో సోలార్ పవర్ ప్రాజెక్టులను జనవరిలో విజయవంతంగా వినియోగంలోకి తెచ్చినట్లు కంపెనీ తెలిపింది. పారడైమ్ ఐటీ, మహాజెన్‌కో, ఎన్ఎల్‌సీ ఇండియా తదితర క్లయింట్ల కోసం ఈ ప్రాజెక్టులను నిర్మించినట్లు వివరించింది.

రుణాలపై టాటా క్యాపిటల్ అవగాహన కార్యక్రమాలు



ముంబై: 'సవాల్ కరో, ఫిర్ లోన్ లో' పే రిట రుణాలపై అవగాహనను పెంచేందుకు ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆర్థిక సేవల సంస్థ టాటా క్యాపిటల్ వెల్లడించింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం రుణాల ప్రక్రియ సరళతరంగా మారి లోన్స్ మరింత అందుబాటులోకి వచ్చాయని టాటా క్యాపిటల్ ఎండీ రాజీవ్ సబర్వాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్తి సమాచారంతో రుణం విషయంలో హడావిడి పడకుండా, సరైన ప్రశ్నలు వేసుకుని, తమ ఆర్థిక బాధ్యతలను పూర్తిగా అర్థం చేసుకుని ముందడుగు వేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. దీనితో దేశీయంగా రుణ వ్యవస్థ పటిష్టమవుతుందన్నారు.

టాప్ గేర్‌లో వాహన విక్రయాలు

- జనవరిలో పీవీల టోకు అమ్మకాలు 13 శాతం అప్
- 4.49 లక్షలకు చేరిక
- సియామ్ గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా జనవరిలో ప్యాసింజర్ వాహనాలు (పీవీ), టూ–వీలర్లు, త్రీ–వీలర్ల టోకు అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. గతేడాది జనవరితో పోలిస్తే రెండంకెల స్థాయిలో వృద్ధి చెందాయి. భారతీయ ఆటోమొబైల్స్ తయారీ సంస్థల సమాఖ్య సియామ్ గణాంకాల ప్రకారం పీవీల టోకు అమ్మకాలు 12.6 శాతం వృద్ధితో 4,49,616 యూనిట్లకు చేరాయి. గతేడాది జనవరిలో ఇవి 3,99,386 యూనిట్లుగా నమోదయ్యాయి. ఇక మొత్తం డీలర్లకు ద్విచక్ర వాహనాల డిస్పాచ్‌లు 26.2 శాతం వృద్ధితో 15,26,218 యూనిట్ల నుంచి 19,25,603 యూనిట్లకు పెరిగాయి. మొత్తం త్రీ–వీలర్ల అమ్మకాలు కూడా 30.2 శాతం పెరిగి 58,167 యూనిట్ల నుంచి 75,725 యూనిట్లకు చేరాయి. వివిధ కేటగిరీలన్నీ కలిపి మొత్తం టోకు విక్రయాలు వార్షికంగా 23.5 శాతం వృద్ధితో 24,50,944 యూనిట్లకు చేరాయి. గతేడా ఈ వ్యవధిలో వీటి పరిమాణం 19,83,771 యూనిట్లు. కొత్త సంవత్సరం సానుకూలంగా ప్రారంభమైందని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో గత త్రైమాసికంలో నమోదైన అమ్మకాల జోరు తాజాగా జనవరిలో కూడా కొనసాగిందని ఆయన వివరించారు. కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన చర్యలు దేశీయంగా తయారీ రంగాన్ని బలోపేతం చేయనుందని, ప్రస్తుత పాలసీలోని సానుకూలాంశాలు కూడా తోడైతే మధ్యకాలికంగా ఆటోపరిశ్రమ వృద్ధికి తోడ్పడతాయని, అలాగే దీర్ఘకాలికంగా ప్రయోజనాలు కూడా లభించగలవని మీనన్ చెప్పారు.

ఎగుమతులు జోరు

మూడు కేటగిరీల్లోనూ ఎగుమతులు రెండంకెల స్థాయిలో వృద్ధి చెందాయి.

మొత్తం పీవీల ఎగుమతులు 33.4 శాతం వృద్ధితో 57,585 యూనిట్ల నుంచి 76,822 యూనిట్లకు చేరాయి. ద్విచక్ర వాహనాల ఎక్స్‌పోర్ట్స్ 3,80,528 యూనిట్ల నుంచి 20 శాతం పెరిగి 4,56,435 యూనిట్లకు పెరిగాయి. అదే విధంగా మొత్తం త్రీ–వీలర్ల ఎగుమతులు 54.6 శాతం పెరిగాయి.

23,859 యూనిట్ల నుంచి 36,879 యూనిట్లకు చేరాయి. వివిధ విభాగాలవ్యాప్తంగా మొత్తం వాహనాల ఎగుమతులు 4,62,500 యూనిట్ల నుంచి 23.5 శాతం వృద్ధి చెంది 5,71,066 యూనిట్లకు పెరిగాయి.

ఎగుమతుల్లో మారుతీ టాప్

ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఎగుమతుల్లోనూ అగ్రస్థానంలో నిల్చింది. కంపెనీ ఎక్స్‌పోర్ట్స్ వార్షిక ప్రాతిపదికన 89 శాతం పెరిగాయి. గతేడాది జనవరిలో 26,781 యూనిట్లుగా ఉండగా తాజాగా 50,716 యూనిట్లకు చేరాయి. హ్యుందాయ్ ఎగుమతులు 21 శాతం పెరిగినప్పటికీ మొత్తం ఎగుమతుల మార్కెట్లో వాటా 20 శాతం నుంచి 18 శాతానికి పడిపోవడం గమనార్హం. అటు నిస్సాన్, ఫోక్స్‌వ్యాగన్ ఎగుమతులు కూడా 36 శాతం, 78 శాతం క్షీణించినట్లు సియామ్ గణాంకాల్లో వెల్లడైంది. భారత్ నుంచి మొత్తం పీవీల ఎగుమతుల్లో తమ సంస్థ వాటా 66 శాతంగా ఉన్నట్లు మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భారతి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి పది నెలల్లో కంపెనీ దాదాపు 3.6 లక్షల ప్యాసింజర్ వాహనాలను ఎగుమతి చేసినట్లు వివరించారు. ఇవి మొత్తం పీవీల ఎగుమతుల్లో 48 శాతమని రాహుల్ చెప్పారు. పరిశ్రమ ఎక్స్‌పోర్ట్స్ 7 శాతం పెరగ్గా, తమ ఎగుమతులు 32 శాతం వృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. తమ తొలి బీఈవీ అయిన ఈ–విటారా ఎగుమతులు గతేడాది ఆగస్టు నుంచి ప్రారంభం కావడం ఎక్స్‌పోర్ట్స్‌కి ఊతమిస్తోందని రాహుల్ తెలిపారు. ఇప్పటివరకు ప్రధానంగా యూరప్‌లోని 36 దేశాలకు దాదాపు 16,000 యూనిట్లను ఎగుమతి చేసినట్లు వివరించారు. 2030 నాటికి ఎగుమతుల్లో 30 శాతం వాటాను దక్కించుకోవాలని నిర్దేశించుకున్నట్లు హ్యుందాయ్ మోటర్స్ ఇండియా ఎండీ తరుణ్ గర్గ్ చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో కొత్త అవకాశాలు లభించగలవని తెలిపారు.

ఇటలీలో శీతల పరిస్థితులను తట్టుకునే రక్షణ దుస్తులతో కొర్టినా డిఅంపెజోలోని షాపింగ్ వీధిలో యజమాని వెనుక దర్జాగా వెళ్తున్న శునకం

శ్రీలంక రాజధాని కొలంబోలో ఆదివారం జరిగే భారత్-పాక్ టీ20 క్రికెట్ మ్యాచ్‌కు ప్రేమదాస స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు మీసం, గడ్డానికి భారత జెండాలోని మూడు రంగులతో కనిపించిన ఓ వీరాభిమాని

నింగి నుంచి నేల గురించి..

ప్రతి 12 రోజులకు 100 మీటర్ల రెజల్యూషన్‌తో ఫొటోలు

యావత్ భారతదేశ భూసార సమస్త సమాచారం అందజేత | కీలక క్రతువులో తలమునకలవుతున్న నైసర్ ఉపగ్రహం | వివరాలు వెల్లడించిన ఇస్రో

బెంగళూరు: భారత్, అమెరికా అంతరిక్ష ప్రయోగ సంస్థలు ఇస్రో, నాసాల మానసపుత్రికగా తయారై గగనతలంలో చక్కర్లు కొడుతున్న నాసా-ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్(నైసర్) ఉపగ్రహం నుంచి ప్రతి 12 రోజులకు ఒకసారి యావత్ భారతదేశ పర్యావరణ, జీవావరణ, హిమానీ నదాలు, జలరాశులకు సంబంధించిన సమస్త తాజా సమాచారం అందనుంది. ఈ వివరాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ''ఎస్-బ్యాండ్, ఎల్-బ్యాండ్‌ల మేలు కలయికగా జంట ఫ్రీక్వెన్సీల సింథటిక్ అపర్చర్ రాడార్‌లను నైసర్ ఉపగ్రహంలో అమర్చారు. వీటి సాయంతో నేలలో తేమ వంటి అత్యంత కీలక వివరాలు సైతం 100 గీ 100 మీటర్ల అత్యధిక రెజల్యూషన్‌తో ఛాయాచిత్రాల రూపంలో అందనుంది. 100 మీటర్ల రెజల్యూషన్ చిత్రపటం అంటే అందులోని ఒక్కో పిక్సెల్ లేదా డేటా అనేది భూమిపై 100 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని నేల సమాచారాన్ని పట్టిచూపుతుంది. నేలలో తేమ అనేది నీటిపారుదల, కరువుల సమస్యకు పరిష్కారాలు చూపిస్తూ భారత సాగు, నీటి నిర్వహణ విధానంలో కీలకభూమిక పోషిస్తోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వర్షం, పొగమంచు, మేఘాల వంటి పరిస్థితుల్లోనూ నేల ఫొటోలను అత్యంత స్పష్టంగా తీసి పంపుతుంది. దీంతో నీటిపారుదల సదుపాయం ఉన్న ప్రాంతాలతోపాటు వర్షాధార నేలలు, వర్షాభావ ప్రాంతాలు, అత్యధిక వర్షపాతమున్న ప్రాంతాల్లో ప్రతి రోజూ నేలలో తేమ ఎంత శాతముందనే వివరాలు తెలుస్తాయి. దీంతో సాగునేలకు ఎంత మేర నీరు అవసరం, ఏస్థాయిలో నీటిని సరఫరా చేయాలి? అనే వివరాలపై రైతలకు ఒక స్పష్టత వస్తుంది''అని ఇస్రో తన ప్రకటనలో పేర్కొంది.

నైసర్ ఉపగ్రహం

నేల సమస్త సమాచారం అందుబాటులోకి..

''నేలపై సెంటీమీటర్ పరిధిలో కూడా నిశితమైన ఫొటోలను తీసి పంపుతాయి. నైసార్‌కు ఉన్న రెండు రాడార్లలో ఒకటి ఎల్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీతో, మరోటి ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీతో పనిచేస్తాయి. నేలతేమను పట్టిచూసే భౌతిక శాస్త్ర ఆధారిత అల్గారిథమ్‌ను స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎస్‌ఏసీ-ఇస్రో)లో అభివృద్ధిచేశారు. ఇది శాస్త్రీయంగా నేల ఆరోగ్యాన్ని కనిపెడుతూ అత్యంత ఖచ్చితత్వంతో నిర్ణయాలు తీసుకోవడానికి సాయపడుతుంది. రెండు బ్యాండ్‌ల కారణంగా 12 రోజులకు ఒకసారి రాడార్లు భూమిని చుట్టేస్తూ నేల స్వభావ, స్వరూపాల సమస్త సమాచారాన్ని మనకు అందిస్తాయి. ఈ సమాచారాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఐఎంజీఈఓఎస్/ఎన్ఆర్ఎస్‌సీ) సేకరిస్తుంది. ఈ డేటాను భూనిధి పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెస్తుంది. ప్రతి 12 రోజులకు ఒకసారి మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమాచారం అప్‌డేట్ అవుతూ ఉంటుంది. ఈ సమాచారంతో రైతులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వేతర కంపెనీలు తమ పరిధి మేర నిర్ణయాలు తీసుకునే సువర్ణావకాశం దక్కుతుంది''అని ఇస్రో ఒక ప్రకటనలో పేర్కొంది. మధ్య భారతదేశం మొదలు సింధూ-గంగా మైదాన ప్రాంతాల్లోని పంటభూముల దాకా ప్రతిచోటా నేలలో తేమ శాతం ఎంత ఉంది? ఎంత ఉండాలి? ఏంత మేర అదనంగా నీటి సరఫరా అవసరం? అనే వివరాలు అందటంతో ఆ మేరకు విధానపర నిర్ణయాలు తీసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం చిక్కుతుంది. ఎల్-బ్యాండ్ రాడార్ అనేది అడవీప్రాంతాలు, ఎడారులు, మంచుమయ ప్రాంతాల్లోని నేల స్వభావాన్ని విశ్లేషిస్తుంది. భూగర్భంలో మార్పులనూ పసిగట్టగలదు. ఎస్-బ్యాండ్ రాడార్ అనేది పంట పొలాలు, నీటి వనరుల తాజా స్థితిని తెలియజెప్తుంది. సమిష్టిగా ఈ రెండు బ్యాండ్‌లు కలిసి భారతీయ నేలల ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తూ నీటి వనరుల లభ్యతపై పరిశోధకులకూ స్పష్టమైన అవగాహన పెంపొందిస్తాయి. భారతదేశం అంతటా ఒకేలా వర్షాలు పడవు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో వాతావరణం ఉంది. ఒక్కోసారి జిల్లా జిల్లాకు మధ్య వాతావరణ వ్యత్యాసం ఉంది. దీంతో చిన్న చిన్న క్లస్టర్లుగా విభజిస్తూ వేర్వేరుగా డేటాను సమీకరించాల్సి వస్తోంది. అందుకోసమే నైసర్‌ను నింగిలోకి పంపారు. నీటి నిర్వహణతోపాటు వాతావరణ మార్పుల వంటి అంశాలూ స్పష్టంగా తెలియనున్నాయి. గత ఏడాది జీఎస్ఎల్‌వీ 16 ప్రయోగం ద్వారా నైసర్‌ను నింగిలోకి పంపిన విషయం విదితమే.

ట్రాఫిక్ ఉల్లంఘనను అడ్డుకున్న మహిళకు సన్మానం

కోజికోడ్: రహదారి నిబంధనలను ఉల్లంఘించిన ఓ వాహనదారుడిని అడ్డుకున్న 73 ఏళ్ల మహిళను కేరళ అధికారులు సన్మానించారు. ఇటీవల కోజికోడ్‌లోని ఎరంగిపాలంలో ఘటన చోటుచేసుకుంది. ఫుట్‌పాత్‌పైకి ద్విచక్ర వాహనంతో దూసుకువచ్చిన ఓ వ్యక్తిని పద్మావతి అమ్మ అడ్డుకున్నారు. వాహనదారుడితో వాదులాటకు దిగారు. ఫుట్‌పాత్‌పైకి వాహనాలు వస్తే, పాదచారులు రోడ్డుపై నడవాలా అంటూ నిలదీశారు. అతడిని తిరిగి రోడ్డుపైకి దిగి వెళ్లేలా చేశారు. తప్పును తప్పుగా ఎత్తి చూపేందుకు వయస్సుతో పని లేదని రుజువు చేశారు. వాహనదారుడిని రెండు చేతులు చాపి పద్మావతి అమ్మ అడ్డుకున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలయ్యింది. కేరళ మోటారు వాహనాల విభాగం(ఎంవీడీ) సహా ఆమె చొరవను అందరూ ప్రశంసించారు. ఎంవీడీ అధికారులు శనివారం ఆమె నివాసానికి వెళ్లి, శాలువాతో గౌరవించారు. వారికి ఆమె ఏం చెప్పారంటే.. 'ఆరోజు నేను దుకాణానికి ఫుట్‌పాత్‌పై నడిచి వెళ్తున్నాను. ఇంతలోనే స్కూటరిస్తు నా వైపు దూసుకొచ్చాడు. అడ్డు తప్పుకొమ్మని అనగా, ఎక్కడికి వెళ్లాలి? రోడ్డుమీద నడవాలా? అని అడిగాను. ఫుట్‌పాత్ ఉన్నది పాదచారుల కోసం, రోడ్డు వాహనదారుల కోసమని చెబుతూ రెండు చేతులు చాపి అడ్డుగా నిల్చున్నా. చట్టాన్ని గురించి మీరు నాకు చెబుతున్నారా అని రుసరుసలాడుతూ అతడు తిరిగి రోడ్డుపైకి వాహనాన్ని మళ్లించుకుని వెళ్లిపోయాడు'అని ఆమె వారికి ఆరోజు జరిగిన ఘటనను వివరించారు. ఘటన వివరాలు తెలుసుకున్న అధికారులు..ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడి, ప్రజల భద్రతకు ప్రమాదం కలిగించినందుకు గాను ఆ వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేయడం కొసమెరుపు.

ధన్‌ఖడ్‌ను అందుకే తప్పించారు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రైతులకు మద్దతుగా నిలిచినందునే ఉపరాష్ట్రపతి పదవి నుంచి దిగిపోయేలా జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై మోదీ ప్రభుత్వం ఒత్తిడి చేసిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు.రైతు బిడ్డ అయినందునే ధన్‌ఖడ్‌కు ప్రభుత్వం ఇప్పటికీ గౌరవప్రదంగా వీడ్కోలు చెప్పలేదని విమర్శించారు. జైరాం రమేశ్ శనివారం 'ఎక్స్'లో..రైతు బిడ్డ అయిన ధన్‌ఖడ్ రైతులకు మద్దతుగా మాట్లాడటాన్ని మోదీ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. అందుకే ఆయన 2025 జూలై 21వ తేదీన పదవికి రాజీనామా చేసేలా ఒత్తిడి చేసింది. ప్రధాని మోదీ అసలు స్వరూపం దీన్నిబట్టి అర్థమవుతోంది'అని పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి అంగీకరించడం ద్వారా ప్రధాని మోదీ దేశంలోని లక్షలాది మంది సాధారణ రైతుల ప్రయోజనాలను గాలికొదిలేశారని మండిపడ్డారు.

చొరబాటుదార్ల కోసమే కుట్ర: ప్రధాన్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో అక్రమ చొరబాట్లు తీవ్రమైన అంశంగా మారాయని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. మమతా బెనర్జీ సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రాన్ని చొరబాటుదార్లకు అప్పగించేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరిందని, ఇది దేశంపైనే ప్రభావం చూపుతోందని తెలిపారు. మరోసారి 'బంగ భంగ'పరిస్థితిని మమత ప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు. శనివారం కోల్‌కతాలో బీజేపీ టీచర్ల సెల్ సదస్సులో ఆయన మాట్లాడారు. అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని, బీజేపీ సారథ్యంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు కలిసి పనిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత బెంగాల్ వార్షిక బడ్జెట్‌లో సాధారణ ప్రజానీకం కంటే చొరబాటుదార్లు, మదర్సాలకే ఎక్కువ చోటుదక్కిందని వ్యాఖ్యానించారు. పాఠశాలల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఉద్దేశించిన మధ్యాహ్న భోజన పథకం నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు.

డ్రగ్స్ బోటుపై దాడి.. ముగ్గురు మృతి

వాషింగ్టన్: కరీబియన్ సముద్ర జలాల్లో డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఓ బోటుపై దాడి జరిపినట్లు అమెరికా మిలటరీ సదరన్ కమాండ్ ప్రకటించింది. శుక్రవారం డ్రగ్స్ తరలిస్తున్న ఓ బోటు నార్కోస్మగ్లర్లు సాధారణంగా వెళ్లే మార్గంలో ఉండగా గుర్తించినట్లు తెలిపింది. దీంతో, ఈ మేరకు తాము జరిపిన దాడిలో బోటు పేలిపోగా అందులోని ముగ్గురు మరణించారని సోషల్ మీడియాలో సదరన్ కమాండ్ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను షేర్ చేసింది. తాజా దాడితో, అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ నుంచి కరీబియన్ సముద్రం, పసిఫిక్ జలాల్లో ప్రయాణించే బోట్లపై జరిపిన కనీసం 28 దాడుల్లో 133 మంది మృతి చెందినట్లయింది. ఈ దాడుల ఫలితంగా కరీబియన్ జలాల్లో మాదక ద్రవ్యాలను తరలించే ముఠాలు కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశాయని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇటీవల ప్రకటించడం గమనార్హం.

డ్రగ్స్ పార్సిల్ జారవిడిచిన పాక్ డ్రోన్

జమ్మూ: అంతర్జాతీయ సరిహద్దుల వెంట పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను దేశంలోకి దొంగచాటుగా తరలించేందుకు జరిగిన ప్రయత్నాన్ని ఆర్మీ విజయవంతంగా నిర్వీర్యం చేసింది. ఆర్ఎస్‌పురా సెక్టార్‌లో శనివారం రూ.40 కోట్లకు పైగా విలువ చేసే 6.5 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ నెల 13వ తేదీ రాత్రి వేళ అనుమానాస్పద డ్రోన్ కదలికలపై ఆ ప్రాంత పోలీసులకు సమాచారం అందింది. అదేవిధంగా, పాక్ భూభాగం వైపు నుంచి వచ్చిన డ్రోన్ ఒకటి ఏదో వస్తువును జార విడిచిపెట్టిందంటూ అందిన సమాచారంతో సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) అప్రమత్తమైంది. ఈ మేరకు బస్పూర్ ప్రాంతంలోని నయా బస్తీ కరోతానా గ్రామం వద్ద పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టింది. అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలోని పంట పొలాల్లో 6.582 కిలోల బరువున్న హెరాయిన్ ప్యాకెట్లను జవాన్లు కనుగొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. సరిహద్దులకు సమీపంలోని కథువా జిల్లాలో పాకిస్తాన్ నుంచి డ్రోన్ ద్వారా హెరాయిన్‌ను స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసిన రెండు రోజుల్లోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

పుల్వామా అమరులకు ప్రధాని నివాళి

న్యూఢిల్లీ: ఏడేళ్ల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనశ్రేణిపై జరిగిన ఉగ్రదాడిలో వీరమరణం పొందిన సైనికులకు ప్రధాని మోదీ నివాళులర్పించారు. ఈ మేరకు ప్రధాని శనివారం తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''2019 పుల్వామాలో తమ ప్రాణాలను దేశంకోసం అర్పించిన అమరులను స్మరించుకుందాం. దేశ సేవలో వాళ్లు చూపిన అంకితభావం, తెగువ, సాహసం మనందరి మదిలో సదా నిలిచిఉంటాయి. వాళ్ల వీరత్వం నుంచి ప్రతి ఒక్క భారతీయుడు స్థైర్యాన్ని స్ఫూర్తిగా పొందాలి'' అని అన్నారు. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సైతం అమరులకు నివాళులర్పించారు. ''పుల్వామా ఉగ్రదాడిలో అసువులుబాసిన ధైర్యవంతులకు నా నివాళులు. వాళ్ల త్యాగం భారతీయుల స్మృతిపథంపై సదా నిలిచి ఉంటుంది. మరింత సురక్షితమైన దేశ నిర్మాణానికి వాళ్ల త్యాగం స్ఫూర్తిగా నిలుస్తుంది'' అని ఆయన అన్నారు.

కాంగ్రెస్ అగ్రనేతల నివాళులు

పుల్వామా మృతులకు కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నివాళులర్పించారు. ''ముష్కరుల దాడిలో వీరమరణం పొందిన ధైర్యవంతులైన సైనికులకు నా హృదయపూర్వక నివాళులు. భరతమాత కోసం త్యాగం చేసిన వాళ్లకు భారతీయులు సదా రుణపడి ఉంటారు'' అని రాహుల్‌గాంధీ తన 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''భరతమాత వీరులకు మేం మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నాం. వీరుల ధైర్యసాహసాలు సదా మా అందరి మదిలో ప్రతిధ్వనిస్తుంటాయి'' అని ఖర్గే అన్నారు. ''వీరుల ధైర్యసాహసాలు, దేశ సేవ మాకు సదా స్మరణీయాలు'' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు. 2019 ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామా రహదారిపై వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బస్సులపై కారు నిండా బాంబులతో ఒక ఆత్మాహుతి బాంబర్ మెరుపుదాడి చేయడంతో సీఆర్‌పీఎఫ్ బస్సు తునాతునకలైంది. ఈ ఘటనలో మొత్తం 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఆగ్రహించిన భారత సర్కార్ కొద్దిరోజులకే పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని బాలాకోట్ ఉగ్రశిక్షణా శిబిరంపై వైమానిక దాడులుచేసి పలువురు ముష్కరులను మట్టుబెట్టడం తెల్సిందే.

ఉక్రెయిన్, రష్యా డ్రోన్ దాడులు..

జెనీవాలో శాంతి చర్చలు జరగనుండగా పరిణామం

కీవ్: ఉక్రెయిన్, రష్యాల మధ్య డ్రోన్ దాడుల పరంపరకు అడ్డుకట్టపడేలా లేదు. నల్ల సముద్ర తీర నగరం ఒడెసాపై శనివారం రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ఒకరు చనిపోగా, సరిహద్దులకు సమీపంలోని రష్యాలోని బ్రియాన్స్క్‌లో ఓ కారుపై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఈ నెల 17, 18వ తేదీల్లో వియన్నాలో ఉక్రెయిన్- రష్యాల మధ్య శాంతి చర్చలు జరగాల్సి ఉండగా ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. శుక్రవారం రష్యాలోని బెల్గొరోడ్‌పై జరిగిన ఉక్రెయిన్ క్షిపణి దాడిలో ఇద్దరు మృతి చెందగా ఐదుగురు గాయపడినట్లు ఆ ప్రాంతం గవర్నర్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై రష్యా మొదలు పెట్టిన దండయాత్రకు నాలుగేళ్లవుతోంది. రెండు దేశాల బలగాలు 1,250 కిలోమీటర్ల మేర ఉన్న యుద్ధక్షేత్రంలో హోరాహోరీగా పోరాడుతున్నాయి. ఉక్రెయిన్‌లోని పౌర ఆవాసాలపైకి రష్యా నిరంతరాయంగా బాంబులు కురిపిస్తుండగా, ఉక్రెయిన్ మాత్రం శత్రుదేశం చమురు వనరులే లక్ష్యంగా నిత్యం దీర్ఘశ్రేణి డ్రోన్ దాడులను కొనసాగిస్తోంది. యుద్ధాన్ని విరమింపజేసేందుకు అమెరికా మధ్యవర్తిత్వంతో యూఏఈ రాజధాని అబుధాబిలో ఇటీవల రెండు విడతలుగా చర్చలు ఏ ఫలితమూ లేకుండానే ముగిశాయి. ఉక్రెయిన్‌లోని అత్యంత కీలకమైన పారిశ్రామిక ప్రాంతం డోన్బాస్‌ను వదిలేయడం వంటి రష్యా ప్రధాన డిమాండ్లకు ఉక్రెయిన్ ససేమిరా అంటోంది. దీంతో, ఒప్పందం విషయం ముందుకు సాగడం లేదు.

ముందుగా భద్రతా హామీ ఇవ్వాలి: జెలెన్‌స్కీ

రష్యాతో శాంతి ఒప్పందం కంటే ముందుగా తమకు భద్రతా హామీ ఇవ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా, యూరప్‌దేశాలను కోరారు. శనివారం ఆయన జర్మనీలోని మ్యూనిక్ నగరంలో జరుగుతున్న వార్షిక భద్రతా సదస్సులో ప్రసంగించారు. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో నాలుగేళ్లుగా సహాయ సహకారాలు అందిస్తున్న అమెరికా, యూరప్ దేశాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమకు గగనతల రక్షణ వ్యవస్థలను, విద్యుత్ ప్లాంట్లు వంటి మౌలిక వనరులను సమకూరుస్తూ విలువైన ప్రాణాలను కాపాడుతున్నాయన్నారు. 'ఉక్రెయిన్‌పైకి దాదాపు ప్రతి రాత్రి రష్యా దాడులకు దిగుతోంది. వారంలో కనీసం ఒకసారి భారీగా విధ్వంసం సృష్టిస్తోంది. అమెరికన్లు, యూరోపియన్ల మద్దతే లేకుంటే రష్యా దాడులను తట్టుకుని నిలువగలిగే వారం కాదు'అని చెప్పారు.

సిరియాలోని ఐఎస్ లక్ష్యాలపై అమెరికా దాడులు

వాషింగ్టన్: సిరియాలోని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)కు చెందిన పలు లక్ష్యాలపై అమెరికా మిలటరీ వరుస దాడులకు పాల్పడింది. ఈ నెల 3-12వ తేదీల మధ్య ఐఎస్‌కు చెందిన 30 లక్ష్యాలపై పది దాడులు జరిపి ఆయుధాల గోదాములు, ఇతర మౌలిక వ్యవస్థలను ధ్వంసం చేశామంది. అదేవిధంగా, 50 మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలిపింది. డిసెంబర్‌లో ఐఎస్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఒక అమెరికా పౌరుడు చనిపోయారు. ఈ ఘటనకు ప్రతీకారంగా ఇప్పటి వరకు 100కు పైగా ఐఎస్ లక్ష్యాలను నేలమట్టం చేశామని వివరించింది.

కుక్కల దాడిలో చిన్నారి మృతి

గోండా: వీధి కుక్కల గుంపు దాడిలో ఓ అయిదేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. యూపీలోని గోండా జిల్లా ధనీపూర్‌లో శనివారం ఈ దారుణం చోటుచేసుకుంది. కల్యాణ్‌నగర్‌లోని మాధవ్‌గంజ్‌కు చెందిన బిషుణ్ లాల్ కుమార్తెలు మెహక్(6), ముస్కాన్(5), నైతిక్, సునైనా అనే పిల్లలతో కలిసి ఉదయం తమ ఇంటికి సమీపంలో స్కూల్ వద్దకు వచ్చారు. అక్కడే ఉన్న వీధి కుక్కల గుంపు చిన్నారులపైకి దూసుకొచ్చింది. మిగతా వారు పరుగెత్తగా చిన్నారి ముస్కాన్ మాత్రం తప్పించుకోలేక కుక్క కాట్లతో తీవ్ర గాయాలతో చనిపోయింది.

విష ప్రయోగంతో నవాల్నీ హత్య

ఈ పాపం పుతిన్ ప్రభుత్వానిదే

- ఐదు యూరప్ దేశాల విదేశాంగ మంత్రుల ఆరోపణ

అలెక్సీ నవాల్నీ (ఫైల్)

లండన్: రష్యా ప్రతిపక్ష నాయకుడు, దేశాధినేత పుతిన్ ప్రత్యర్థి అలెక్సీ నవాల్నీ మరణం వెనుక పెద్ద కుట్ర ఉందని ఐదు యూరప్ దేశాల విదేశాంగ మంత్రులు ఆరోపించారు. విష ప్రయోగంతో ఆయనను హత్య చేశారని వెల్లడించారు. ఇది ముమ్మాటికీ పుతిన్ ప్రభుత్వం చేయించిన హత్యేనని తేల్చిచెప్పారు. నవాల్నీ 2024 ఫిబ్రవరి 16న జైలులో శిక్ష అనుభవిస్తూ మృతి చెందిన సంగతి తెలిసిందే. అధిక రక్తపోటు కారణంగానే అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు రష్యా ప్రభుత్వం ప్రకటించింది. అయితే, నవాల్నీ మృతదేహం నుంచి సేకరించిన నమూనాల విశ్లేషణపై యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ విదేశాంగ మంత్రులు శనివారం ఒక ఉమ్మడి ప్రకటన విడుల చేశారు. ఎపిబాటిడైన్ అనే విషం కారణంగా నవాల్నీ మరణించినట్లు ఈ విశ్లేషణలో తేలిందని పేర్కొన్నారు. దక్షిణ అమెరికాలో కనిపించే డార్ట్ కప్పల చర్మంలో ఈ విషం ఉంటుందని తెలిపారు. ఇలాంటి కప్పలు సాధారణంగా రష్యాలో కనిపించవని వెల్లడించారు. అంటే దక్షిణ అమెరికా కప్పల నుంచి సేకరించిన విషాన్ని నవాల్నీపై ప్రయోగించి హత్య చేశారని ఆరోపించారు. ఇదంతా రష్యా ప్రభుత్వ ప్రోద్బలంతోనే జరిగినట్లు మండిపడ్డారు. రసాయన ఆయుధాల ఒప్పందాన్ని రష్యా ఉల్లంఘించిందని స్పష్టంచేశారు. దీనిపై రసాయన ఆయుధాల నియంత్రణ సంస్థకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పుతిన్‌లో నవాల్నీ భయం

రష్యాలో పుతిన్ ప్రభుత్వం అలెక్సీ నవాల్నీని ఒక ముప్పుగా గుర్తించిందని, ఆయనను అడ్డు తొలగించుకోవాలని ఎప్పుడో నిర్ణయించిందని యూకే విదేశాంగ మంత్రి యెవిట్ కూపర్ పేర్కొన్నారు. అందుకే విష ప్రయోగంతో అంతం చేసిందని వెల్లడించారు. నవాల్నీ జీవించి ఉంటే ఎప్పటికైనా అధికారం నుంచి కూలదోస్తాడన్న భయంలో పుతిన్‌లో ఉండేదన్నారు. రష్యాలో ప్రభుత్వ అవినీతిపై నవాల్నీ గళమెత్తారు. పుతిన్‌కు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఆయనకు ప్రజాదరణ లభించింది. ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్రలు సాగిస్తున్నారని ప్రభుత్వం అభియోగాలు మోపింది. న్యాయస్థానం 19 ఏళ్ల జైలుశిక్ష విధించింది. మరణానికి ముందు తన భర్తపై విష ప్రయోగం జరిగినట్లు రెండు స్వతంత్ర ప్రయోగశాలలు నిర్ధారించాయని ఆయన భార్య యూలియా నవాల్నీ గతేడాది వెల్లడించారు. నవాల్నీ మృతి వెనుక పుతిన్ హస్తం ఉందంటూ వస్తున్న ఆరోపణలను రష్యా ప్రభుత్వం ఖండిస్తోంది. ఇందులో ఎలాంటి కుట్ర లేదని, అనారోగ్యం వల్లే ఆయన ప్రాణాలు కోల్పోయారని చెబుతోంది.

ఇండిగో విమానానికి ల్యాండింగ్ కష్టాలు

రాయ్‌పూర్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఉన్న స్వామి వివేకానంద విమానాశ్రయ ఎయిర్‌పోర్ట్‌ను సమీపించిన ఇండిగో సంస్థకు చెందిన ఏటీఆర్ రకం ప్రయాణికుల విమానం ల్యాండింగ్ అయ్యేందుకు చేసిన తొలి ప్రయత్నం విఫలమైంది. దీంతో, అధికారుల ఆదేశాల మేరకు పైలట్ విమానాన్ని కొద్దిసేపు గాల్లోనే చక్కర్లు కొట్టించారు. కొన్ని నిమిషాల తర్వాత మరోసారి ల్యాండింగ్‌కు యత్నించారు. రెండో ప్రయత్నం విజయవంతమైంది. సురక్షితంగా నేలను తాకడంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ''భోపాల్ నుంచి వచ్చిన విమానం రాయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేను తగిలినట్టే తగిలి మళ్లీ వెంటనే గాల్లోకి లేచింది. దీంతో మేమంతా భయపడి పోయాం'' అని విమానంలోని ఒక ప్రయాణికుడు వెల్లడించాడు. తొలి ల్యాండింగ్ యత్నం ఎందుకు విఫలమైందనే వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. శనివారం మధ్యాహ్నం 2.50 గంటలకు రాయ్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. రెండుమార్లు ల్యాండింగ్ ఘటన నేపథ్యంలో విమాన పనితీరు, సామర్థ్యాన్ని సమీక్షించేందుకు దానిని తదుపరి సర్వీస్‌కు వెళ్లకుండా నిలిపేశారు. దీంతో భోపాల్‌కు విమానసర్వీస్ రద్దయిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు స్పష్టంచేశారు.

రాజస్తాన్‌లో డ్రగ్స్ ల్యాబ్ సీజ్

రూ.కోటి విలువైన మెఫెడ్రోన్ స్వాధీనం

జైపూర్: పంట పొలంలోని ఓ గుడిసెలో నడుస్తున్న డ్రగ్ తయారీ యూనిట్ గుట్టురట్టు చేయడంతోపాటు, అందులోని రూ.1.60 కోట్ల విలువైన డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రాజస్తాన్‌లోని ప్రతాప్‌గఢ్ పోలీసులు శనివారం తెలిపారు. ప్రతాప్‌గఢ్ వాసి మురాద్‌ఖాన్ పఠాన్(28), గుజరాత్‌కు చెందిన మహ్మద్ జునైద్(48)లను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు ఘటనాస్థలి నుంచి పరారయ్యార న్నారు. అసవాటా-కుల్థానా రహదారిలోని మారుమూల ప్రాంతంలో వీరు సింథటిక్ డ్రగ్ మెఫెడ్రోన్(ఎండీ)ని తయారు చేస్తున్నారని చెప్పారు. స్వాధీనం చేసుకున్న 1.897 కిలోల ఎండీ విలువ రూ.1.60 కోట్ల వరకు ఉంటుందన్నారు. రెండు రోజులుగా వీరు తయారు చేస్తున్నట్లు తేలిందన్నారు. ఒక పిస్టల్‌తోపాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ డ్రగ్స్ రాకెట్‌కు గుజరాత్, మధ్యప్రదేశ్‌తో లింకులున్నాయని, దర్యాప్తు జరుగుతోందని వివరించారు.

ముంబైలో మెట్రో వంతెన గోడ కూలి..

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

ముంబై: ముంబైలో నిర్మాణంలో ఉన్న మెట్రో రైల్వే లైన్ వంతెన గోడ కూలి వాహనాలపై పడటంతో ఒకరు చనిపోగా, ముగ్గురు గాయపడ్డారు. ములుంద్ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. ఘటనలో ఒక ఆటో, కారు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు చనిపోగా, ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. మృతుడి కుటుంబానికి ఫడ్నవీస్ ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ప్రకటించింది. ఘటనపై దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. బీజేపీ పాలనలో ముంబై వాసుల ప్రాణాలకు విలువే లేకుండా పోయిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. నిర్మాణంలో లోపాలున్నాయంటూ ముందే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని అధికార బీజేపీ ఎమ్మెల్యే మిహిర్ కొటేచా ఆరోపించారు.

‘భారత రాజ్యాంగం సుదీర్ఘమైంది’ కారణం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

రాజ్యాంగ అవలోకనం, ముఖ్య లక్షణాలు, ప్రవేశిక

మాదిరి ప్రశ్నలు

1. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
   ఎ) బ్రిటిష్ రాణి / రాజు
   బి) ఇంగ్లండ్ పార్లమెంట్
   సి) సమాఖ్య శాసనసభ
   డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
2. బ్రిటిషర్లు బెంగాల్‌లో సుప్రీంకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1776 బి) 1775 సి) 1777 డి) 1774
3. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఎలా వ్యవహరిస్తారు?
   ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
   సి) క్రౌన్ చట్టాలు డి) ఏవీకాదు
4. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
   ఎ) 2 బి) 3 సి) 5 డి) 6
5. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
   ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
   సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
6. భారత ప్రభుత్వ చట్టం 1919లోని ప్రధాన అంశం / అంశాలు?
   ఎ) రాష్ట్రాల కార్య నిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
   బి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను నిర్వచించడం
   సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికారాన్ని సంక్రమింపజేయడం
   డి) పైవన్నీ
7. మొదటిసారిగా ఏ బ్రిటిష్ చట్టం భారతీయులకు పాలనలో భాగస్వామ్యం కల్పించడానికి ఉద్దేశించింది?
   ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
   బి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1862
   సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1909
   డి) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం, 1919
8. ‘గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం’ అని నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
   ఎ) కేబినెట్ ప్లాన్
   బి) మౌంట్‌బాటన్ ప్లాన్ సి) వేవెల్ ప్లాన్
   డి) 1935 భారత ప్రభుత్వ చట్టం
9. మత ప్రాతిపదిక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
   ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ బెంటింక్
   సి) వారెన్ హేస్టింగ్స్ డి) రాబర్ట్ క్లైవ్
10. భారతదేశంలో ఏ చట్టం ద్వారా తొలి అధికారిక శాసనసభను ఏర్పాటు చేశారు?
    ఎ) చార్టర్ చట్టం, 1833
    బి) చార్టర్ చట్టం, 1853
    సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
    డి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1892
11. మౌంట్ బాటన్ ప్రణాళిక లక్ష్యం?
    ఎ) సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం
    బి) రాజ్యాంగ సభ ద్వారా భారత రాజ్యాంగ రూపకల్పనకు మార్గదర్శకాలు ఇవ్వడం
    సి) బ్రిటిషర్ల నుంచి భారతీయులకు అధికారాన్ని బదిలీ చేసే పద్ధతి
    డి) ఆ కాలంలో చెలరేగిన మతకల్లోలాలను నివారించడానికి ప్రణాళిక
12. ద్వంద్వ పరిపాలనను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
    ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం - 1892
    బి) భారత ప్రభుత్వ చట్టం - 1909
    సి) భారత ప్రభుత్వ చట్టం - 1919
    డి) గాంధీ-ఇర్విన్ ఒప్పందం
13. రాజ్యాంగ వాదాన్ని మొదటిసారి శాస్త్రీయంగా వివరించిన తత్వవేత్త?
    ఎ) అరిస్టాటిల్ బి) రూసో
    సి) చార్లెస్ డార్విన్ డి) ప్లేటో
14. కింది వాటిలో ఏ చట్టాన్ని మొదటి లిఖిత రాజ్యాంగంగా అభివర్ణిస్తారు?
    ఎ) పిట్ ఇండియా చట్టం - 1784
    బి) రెగ్యులేటింగ్ చట్టం - 1773
    సి) చార్టర్ చట్టం - 1313
    డి) చార్టర్ చట్టం - 1853
15. మొదటిసారిగా మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజక గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
    ఎ) 1909 బి) 1919
    సి) 1935 డి) ఏవీకాదు
16. రాష్ట్రాల్లో ద్విసభా పద్ధతికి అవకాశం కల్పించిన చట్టం?
    ఎ) 1935 బి) 1919
    సి) 1909 డి) ఏదీకాదు
17. కింది వాటిలో భారత ప్రభుత్వ చట్టం - 1935లో సరికాని అంశం?
    ఎ) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
    బి) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
    సి) ఆర్.బి.ఐ. ఏర్పాటు
    డి) సార్వజనీన ఓటుహక్కు
18. కింది వాటిలో ఏ చట్టం ద్వారా ‘గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్’ పదవిని ‘గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా’గా మార్చారు?
    ఎ) 1833 బి) 1813 సి) 1861 డి) 1858
19. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
    ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
    బి) రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించడం
    సి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
    డి) పైవన్నీ
20. కింది వాటిలో ఏ ప్రతిపాదనను భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మాగ్నా కార్టాగా పేర్కొంటారు?
    ఎ) వేవెల్ ప్రతిపాదన బి) క్రిప్స్ ప్రతిపాదన
    సి) కేబినెట్ రాయబార ప్రతిపాదన
    డి) విక్టోరియా రాణి ప్రకటన
21. మహాత్మా గాంధీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం?
    ఎ) మొదటి రౌండ్ టేబుల్ సమావేశం
    బి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం
    సి) మూడో రౌండ్ టేబుల్ సమావేశం
    డి) ఏదీకాదు
22. భారత ప్రభుత్వ చట్టం - 1935ను బానిసత్వానికి నూతన పత్రంగా పేర్కొన్నవారు?
    ఎ) కె.టి. షా బి) జవహర్ లాల్ నెహ్రూ
    సి) మహాత్మాగాంధీ డి) సర్దార్ పటేల్
23. కింది వాటిలో ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటయ్యింది?
    ఎ) కేబినెట్ ప్రతిపాదనలు
    బి) మౌంట్ బాటన్ ప్రతిపాదనలు
    సి) క్రిప్స్ ప్రతిపాదనలు
    డి) ఏవీకాదు
24. భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు?
    ఎ) 1946 సెప్టెంబర్ 2
    బి) 1946 అక్టోబర్ 2
    సి) 1946 నవంబర్ 1
    డి) 1947 నవంబర్ 1
25. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
    ఎ) అమెరికా రాజ్యాంగం
    బి) బ్రిటిష్ రాజ్యాంగం
    సి) ఐరిష్ రాజ్యాంగం
    డి) భారత ప్రభుత్వ చట్టం
26. జతపరచండి.
    1. పోర్ట్ పోలియో పద్ధతి — ఎ. లార్డ్ మెకాలే
    2. సివిల్ సర్వీస్ సులభతరం — బి. లార్డ్ కార్న్‌వాలిస్
    3. మత నియోజక వర్గాలు — సి. లార్డ్ కానింగ్
    4. భారత న్యాయ సంస్కరణలు — డి. లార్డ్ మింటో
    ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
    బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
    సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
    డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
27. కింది వాటిని ప్రవేశపెట్టిన కాలానుగుణంగా క్రమంలో రాయండి.
    1. ప్రత్యేక నియోజకవర్గాలు
    2. శాసన అధికారాల బదలాయింపు
    3. ద్విసభా విధానం 4.డొమినియన్ ప్రతిపత్తి
    ఎ) 1, 2, 3, 4 బి) 2, 1, 3, 4
    సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 2
28. రాజ్యాంగ వికాసానికి సంబంధించి సరైన క్రమాన్ని గుర్తించండి.
    ఎ) మాగ్నాకార్టా, యు.ఎస్. రాజ్యాంగం,బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం
    బి) మాగ్నాకార్టా, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
    సి) బిల్ ఆఫ్ రైట్స్, మాగ్నాకార్టా, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
    డి) పైవేవీ కాదు
29. ప్రభుత్వానికి ఉండే అధికారం కింది వాటిలో దేనికి ఉదాహరణ?
    ఎ) సంప్రదాయ అధికారం
    బి) సమ్మోహన అధికారం
    సి) చట్టబద్ధ - హేతుబద్ధ అధికారం
    డి) పైవన్నీ
30. కింది వాటిలో భారత రాజ్యాంగానికి ఏ లక్షణాన్ని ఆపాదించలేం?
    ఎ) శాసన శాఖ ఆధిక్యత
    బి) న్యాయ శాఖ ఆధిక్యత
    సి) కార్య నిర్వాహక శాఖ ఆధిక్యత
    డి) పైవన్నీ
31. భారత సమాఖ్య స్వభావం?
    ఎ) సిద్ధాంత సమాఖ్య బి) అర్ధ సమాఖ్య
    సి) విశిష్ట సమాఖ్య డి) బేరసారాల సమాఖ్య
32. పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?
    ఎ) కేబినెట్ ప్రభుత్వం
    బి) ప్రధానమంత్రి ప్రభుత్వం
    సి) పై రెండూ డి) ఏవీ కాదు
33. ‘భారత రాజ్యాంగం సుదీర్ఘమైంది’ కారణం?
    ఎ) ఇతర రాజ్యాంగాల ప్రభావం
    బి) భారతదేశ వైవిధ్యం
    సి) రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకపోవడం
    డి) పైవన్నీ
34. కింది వారిలో ఎవరి జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో పేర్కొనలేదు?
    ఎ) పార్లమెంట్ సభ్యులు
    బి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్
    సి) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
    డి) గవర్నర్
35. భారత రాజ్యాంగానికి, అమెరికా రాజ్యాంగానికి పోలిక?
    ఎ) సమాఖ్య వ్యవస్థ బి) న్యాయ సమీక్ష
    సి) ప్రాథమిక హక్కులు డి) పైవన్నీ
36. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
    ఎ) రాజ్యాంగం బి) పార్లమెంట్
    సి) ప్రజలు డి) రాష్ట్రపతి
37. భారత రాజ్యాంగ పీఠికలో ఉండే పదాల క్రమం?
    ఎ) సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, సామ్యవాద, గణతంత్రరాజ్యం
    బి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యం
    సి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక
    డి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం
38. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే?
    ఎ) రాజ్యాంగ లక్షణాలు చాలా ముఖ్యమైనవి. వాటిని సవరించడానికి వీలులేదు
    బి) ప్రాథమిక హక్కులను కుదించడం గానీ, తొలగించడం గానీ కుదరదు
    సి) 368 ప్రకరణ ప్రకారం తప్ప రాజ్యాంగాన్ని సవరించడానికి వీలులేదు
    డి) కొన్ని అంశాలను సవరించడానికి పార్లమెంట్‌కు అధికారం ఉండదు
39. ప్రవేశికను భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం, ఒక ఆభరణంగా వర్ణించినవారు?
    ఎ) మహాత్మాగాంధీ బి) అంబేద్కర్
    సి) వల్లభ్‌భాయ్ పటేల్
    డి) ఠాకూర్‌దాస్ భార్గవ
40. రాజ్యాంగ ప్రవేశిక?
    ఎ) సూచనాత్మకమైంది
    బి) విషయసూచిక లాంటిది
    సి) పై రెండూ డి) పైవేవీ కాదు
41. ప్రవేశిక నుంచి ఏయే అంశాలు తెలుసుకోవచ్చు?
    ఎ) రాజ్యాంగ ఆమోద తేది
    బి) రాజ్యాంగ ఆధారాలు
    సి) రాజ్యాంగ ఆశయాలు
    డి) పైవన్నీ
42. ‘సమగ్రత’ (ఇంటిగ్రిటీ) అనే పదాన్ని 1976లో 42 రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికకు చేర్చారు. దీని ఉద్దేశం?
    ఎ) వేర్పాటువాద శక్తులను అరికట్టడం
    బి) భౌగోళిక సామీప్యతను సాధించడం
    సి) మతకలహాలను నియంత్రించడం
    డి) పైవన్నీ
43. భారత ‘సామ్యవాదం’ (సోషలిస్ట్) అనే భావ జాలం ఎవరి భావాలను ప్రతిబింబిస్తుంది?
    ఎ) మార్క్స్, మహాత్మాగాంధీ
    బి) గాంధీ, నెహ్రూ సి) మార్క్స్, మావో
    డి) మార్క్స్, వినోభా బావే
44. కింది వాటిలో ప్రవేశికకు సంబంధించి సరైంది?
    ఎ) రాజ్యాంగంలోని ప్రకరణలతో సంబంధం ఉంటుంది
    బి) ప్రత్యేకంగా ప్రవేశికకు ఉనికి ఉండదు
    సి) సవరణకు అతీతం కాదు
    డి) పైవన్నీ సరైనవే
45. కింది వాటిలో ఏయే అంశాలను వ్యాఖ్యానించడానికి ప్రవేశికను ఆధారంగా తీసుకోవచ్చు?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) ఆదేశిక సూత్రాలు
    సి) ప్రభుత్వ అధికారాలు
    డి) పైవన్నీ
46. ప్రవేశికలో పేర్కొన్న ‘సమానత్వం’ కింది వాటిలో దేనికి హామీ ఇస్తుంది?
    ఎ) హోదా బి) అవకాశాలు
    సి) ఉపాధి డి) ఎ, బి
47. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ప్రవేశిక అధికారానికి ఆధారం, పరిమితి కాదు
    బి) ప్రవేశిక సవరణకు అతీతం కాదు
    సి) ప్రవేశికను రాజ్యాంగ రచన తర్వాత చేర్చారు. ఆఖరున ఆమోదించారు
    డి) పైవన్నీ సరైనవే
48. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) అత్యంత దృఢ రాజ్యాంగం - అమెరికా
    బి) పరిమాణాత్మక రాజ్యాంగం - ఇంగ్లండ్
    సి) చట్టీకృత రాజ్యాంగం - ఇండియా
    డి) పైవన్నీ సరైనవే
49. రాజ్యాంగ వాదన అంటే?
    ఎ) పరిమిత అధికారాలతో కూడిన పరిపాలన
    బి) పరిమిత ప్రభుత్వ వ్యవస్థ
    సి) రాజ్యాంగ వికాస దశ
    డి) పైవేవీ కాదు
50. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చేర్చిన అంశాలు?
    ఎ) ప్రాథమిక విధులు బి) ట్రైబ్యునల్
    సి) సహకార సంస్థలు డి) పైవన్నీ

సమాధానాలు

1) డి; 2) డి; 3) ఎ; 4) బి; 5) బి;
6) డి; 7) ఎ; 8) డి; 9) ఎ; 10) బి;
11) సి; 12) సి; 13) ఎ; 14) బి; 15) ఎ;
16) ఎ; 17) డి; 18) ఎ; 19) ఎ; 20) డి;
21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) డి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) సి; 30) డి;
31) సి; 32) సి; 33) డి; 34) ఎ; 35) డి;
36) సి; 37) డి; 38) డి; 39) డి; 40) ఎ;
41) డి; 42) ఎ; 43) ఎ; 44) డి; 45) డి;
46) డి; 47) డి; 48) డి; 49) ఎ; 50) డి.

ఆమ్ల వర్షానికి కారణమయ్యే ప్రధాన ఆక్సైడ్లు ఏవి?

చమురుశుద్ధి కర్మాగారాలు విడుదల చేసే సల్ఫర్, నైట్రోజన్‌ల డై ఆక్సైడ్‌లే తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి ప్రధాన కారణం. తాజ్‌మహల్‌ను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం 1995లో ఆగ్రా, ఫిరోజాబాద్, మధురా, భరత్‌పూర్ (వీటిని ‘తాజ్ ట్రెపీజియం’గా వ్యవహరిస్తారు) పట్టణాల్లోని 200కు పైగా పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించింది. వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్ పరిరక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

రసాయన శాస్త్రం

వాయు కాలుష్యం

క్లోరిన్ (Cl_2)

వాతావరణాన్ని కలుషితం చేస్తున్న వాయువుల్లో క్లోరిన్ ఒకటి. ఇది అతి తక్కువ పరిమాణంలో ప్లాస్టిక్ పరిశ్రమలు, నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల నుంచి వాతావరణంలోకి విడుదలవుతోంది. కాగితం తయారీ పరిశ్రమల్లో కలప గుజ్జును విరంజనం చేయడంలో క్లోరిన్‌ను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా కూడా క్లోరిన్ వాయువు వాతావరణంలోకి చేరుతోంది. క్లోరిన్ విషపూరిత, హానికర వాయువు. ఇది వాతావరణంలోని నీటి బిందువులతో కలిసి హైడ్రోక్లోరికామ్లం, హైపోక్లోరస్ ఆమ్లంగా మారుతుంది.

ఫ్రియాన్‌లు

వివిధ క్లోరో ఫ్లోరో కార్బన్లను సాధారణంగా ఫ్రియాన్లు అంటారు. వీటి ఆవిష్కరణతో శీతలీకరణ (రిఫ్రిజిరేషన్) పరిశ్రమ కొత్త పుంతలు తొక్కింది. రంగులేని, విషపూరితం కాని, మండే స్వభావం లేని ఈ ఫ్రియాన్‌లను ఎయిర్ కండిషనింగ్‌లో శీతలీకరణులుగానే కాకుండా ఏరోసోల్ చోదకాలు (ప్రొఫెల్లెంట్స్), డ్రైక్లీనింగ్‌లో ద్రావణిలు (సాల్వెంట్స్), నురుగు ఏర్పరిచే కారకాలు (ఫోమింగ్ ఏజెంట్స్), మంటలనార్పే పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్ ప్యాకింగ్ పదార్థాలుగా వినియోగించారు. సర్జికల్ పరికరాలను క్రిమి రహితం (స్టెరిలైజేషన్) చేయడానికి ఉపయోగించడం వల్ల వీటిని పరిశ్రమలకు వరాలుగా భావించారు. కానీ ఇవి హరిత గృహ ప్రభావానికి, ఓజోన్ పొర క్షీణతకు కారణమవడం వల్ల వీటిని పర్యావరణానికి ‘శాపం’గా పరిగణిస్తూ నిషేధించారు. ఇవి ఇతర కాలుష్యాల మాదిరిగా కాకుండా చాలా స్థిరమైనవి. ఇవి ట్రోపోవరణంలో దాదాపు ఒక శతాబ్దానికిపైగా స్థిరంగా ఉంటాయి.

కణ స్వభావ పదార్థాలు (Particulate matter)

సాధారణంగా 0.001 నుంచి 10 మి.మీ. పరిమాణం ఉన్న దుమ్ము, ధూళి కణాలు మాత్రమే గాలిలో తేలియాడుతూ కంటికి కనిపిస్తాయి. ఇంతకంటే తక్కువ పరిమాణం ఉన్నవి కంటికి కనిపించవు. ఇవి గాలిలో తెరలు తెరలుగా ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి మసి (కార్బన్ కణాలు), లోహాలు, లోహ లవణాలు, సిమెంట్, ఫ్లై యాష్, ఖనిజాలు, హైడ్రోకార్బన్‌లు మొదలైనవి. లోహాల్లో ముఖ్యమైనవి లెడ్, మెర్క్యూరీ, క్రోమియం, ఆర్సెనిక్, జింక్, కాడ్మియం, నికెల్, ఐరన్. కణ స్వభావ పదార్థాలు శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతానికి కారణమవుతున్నాయి.

వాహనాల ఇంధనం పెట్రోల్‌కు శబ్దం చేయకుండా సున్నితంగా మండటానికి ‘టెట్రా ఇథైల్ లెడ్(టీఈఎల్) అనే సీసం (లెడ్) సమ్మేళనాన్ని కలిపేవారు. ప్రస్తుతం దీన్ని నిషేధించారు. దీనివల్ల వాతావరణంలోకి లెడ్ విడుదలై అనేక మానసిక రుగ్మతలను కలిగిస్తుందని గుర్తించారు. పట్టణాల్లో కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల ఇది ఎక్కువగా ఉండేది.

ఫ్లై యాష్

నేల బొగ్గును మండించినప్పుడు చివరగా మిగిలే బూడిదనే ‘ఫ్లై యాష్’ అంటారు. ఇది ప్రధానంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి విడుదలవుతోంది. కొంతవరకు దీన్ని ఇటుకల తయారీ, సిమెంట్ పరిశ్రమల్లో వాడుతున్నప్పటికీ.. మిగిలింది పర్యావరణానికి గుదిబండగా మారుతోంది. ఫ్లై యాష్‌లో ప్రధానంగా సిలికాన్ డై ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్, కాల్షియం ఆక్సైడ్‌లు ఉంటాయి. వీటితో పాటు కొద్ది పరిమాణంలో ఆర్సెనిక్, బెరీలియం, బోరాన్, క్రోమియం, కాడ్మియం, మెర్క్యూరీ, లెడ్, సెలీనియం లాంటి కొన్ని లోహాలుంటాయి. వీటిలో కొన్ని హానికరమైనవి.

పాలీ ఎరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు

కోల్, పెట్రోలియం పదార్థాలను మండించడం (ఆక్సీకరించడం) వల్ల కర్బన రసాయన కణ స్వభావ పదార్థాలు వాతావరణంలోకి చేరుతున్నాయి. బెంజీన్, టోలీన్‌తోపాటు అధిక వలయ ఎరోమాటిక్ సమ్మేళనాలైన నాఫ్తలీన్, ఆంథ్రసీన్ లాంటివి గాలిలో చేరి ‘కేన్సర్’ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయి.

స్మాగ్ (Smog)

Smoke + Fog → Smog

ప్రాథమికంగా పొగ, దుమ్ము-ధూళితో కూడిన మంచునే ‘స్మాగ్’గా వ్యవహరిస్తారు. స్మాగ్ రెండు రకాలు. అవి..

1. సాంప్రదాయిక స్మాగ్: దుమ్ము, సల్ఫర్ డై ఆక్సైడ్‌తో కూడిన మంచు.. పొగతో కలిసినప్పుడు సాంప్రదాయిక స్మాగ్ ఏర్పడుతుంది. నైట్రోజన్, సల్ఫర్ ఆక్సైడ్‌లు అధికంగా ఉన్న చల్లని తేమతో కూడిన పారిశ్రామిక ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. దీన్నే ‘రసాయన స్మాగ్’, ‘క్షయకరణ స్మాగ్’గా వ్యవహరిస్తారు. 1962లో మొట్టమొదట లండన్‌లో కనిపించిన ఈ స్మాగ్ దాదాపు ఐదు రోజులపాటు ఉండి అనేక మంది మరణానికి కారణమైంది.

2. కాంతి రసాయన స్మాగ్: ఈ రకమైన స్మాగ్ ప్రధానంగా వెచ్చని, పొడి వాతావరణంతోపాటు ధారాళంగా సూర్యరశ్మి ఉన్నప్పుడు ఏర్పడుతుంది. పొగ, దుమ్ము, ధూళితోపాటు, కాంతి రసాయన ఆక్సీకరణులు అధికంగా ఉన్న వాతావరణంలో ఇది ఏర్పడుతుంది.

ఈ కాంతి రసాయన స్మాగ్ ప్రధానంగా ఓజోన్, నైట్రిక్ ఆక్సైడ్ (NO), హైడ్రోకార్బన్లు, ఫార్మాల్డిహైడ్, ఎక్రైల్ ఆల్డిహైడ్ (ఎక్రోలిన్), పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ (పీఏఎన్) లాంటి సూర్యరశ్మి లేదా అతినీలలోహిత (UV) కాంతి సమక్షంలో స్వేచ్ఛా ప్రాతిపదికలు (ఫ్రీ ర్యాడికల్స్) ఉత్పత్తి చేసే సమ్మేళనాల చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది.

కాంతి రసాయన స్మాగ్ దుష్ప్రభావాలు

- ఇందులో ఉండే ‘ఓజోన్’ శ్వాస సంబంధ వ్యాధులను కలిగిస్తుంది, రబ్బర్‌ను పెలుసుగా, త్వరగా పాడయ్యేట్లు చేస్తుంది. పంటలకు నష్టం కలుగజేస్తుంది. భూగోళ తాపానికి కారణమవుతుంది.
- ఆల్డిహైడ్లు, హైడ్రోకార్బన్లు కళ్లలో మంటను కలిగిస్తాయి.
- పీఏఎన్ ఊపిరితిత్తులతోపాటు గుండె, కళ్లకు హాని కలిగిస్తుంది. మొక్కల ఆకులు పాలిపోయేలా చేస్తుంది.
- స్మాగ్‌తో దారులు మసకగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి.

ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)

నేలబొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల్లో కార్బన్‌తోపాటు సల్ఫర్, నైట్రోజన్ సమ్మేళనాలుంటాయి. వీటిని మండించినప్పుడు ప్రధానంగా కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) విడుదలవుతుంది. ఇది నీటిలో కరిగి బలహీన ఆమ్లమైన కార్బోనికామ్లాన్ని ఇస్తుంది. అందుకే స్వచ్ఛమైన నీటి pH (ఆమ్లత్వాన్ని కొలిచే పద్ధతి) విలువ ఏడు అయినప్పటికీ వర్షపునీటి pH 5 నుంచి 6 మధ్య ఉంటుంది (బలహీన ఆమ్ల అవధి). వర్షం pH విలువ ఇంతకంటే తగ్గితే దాన్ని ‘ఆమ్ల వర్షం’అంటారు. సాధారణంగా శిలాజ ఇంధనాలను మండించినప్పుడు వెలువడే సల్ఫర్ ఆక్సైడ్‌లు, నైట్రోజన్ ఆక్సైడ్‌లు సూర్యరశ్మి సమక్షంలో వివిధ చర్యలకు లోనై వర్షపు నీటితో కలిసి సల్ఫ్యూరికామ్లం (H_2SO_4), నైట్రిక్ ఆమ్ల(HNO_3)గా ఆమ్లవర్ష రూపంలో భూమిని చేరతాయి.

ఆమ్ల వర్షం దుష్ప్రభావాలు

- చలువరాయి (మార్బుల్), సున్నపురాయి, స్లేట్ లాంటి పదార్థాలతో నిర్మించిన కట్టడాలు దెబ్బతింటాయి. తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి చమురుశుద్ధి కర్మాగారాలు విడుదల చేసే సల్ఫర్, నైట్రోజన్‌ల డై ఆక్సైడ్‌లే ప్రధాన కారణం.
- ఆమ్ల వర్షం సరస్సుల నీటిలోని జీవ జాలానికి నష్టం కలిగిస్తుంది.
- లోహ నిర్మాణాలు త్వరగా క్షయం కావడానికి కారణమవుతుంది.
- ఆమ్ల వర్షం నేలలు, శిలల్లోని సీసం (లెడ్), పాదరసం(మెర్క్యూరీ), రాగి(కాపర్), అల్యూమినియం లాంటి లోహ అయాన్‌లను జలాశయాల్లోకి చేర్చి వాటిని విషపూరితం చేస్తుంది.
- ఆమ్ల వర్షం వల్ల నేలల సారం తగ్గుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్లై యాష్‌కు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   ఎ. ఇటుకల తయారీలో వాడతారు
   బి. పోర్ట్‌లాండ్ సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా కొంతవరకు వాడవచ్చు
   సి. ఫ్లై యాష్‌లో కాల్షియం ఆక్సైడ్, సిలికాన్ డై ఆక్సైడ్‌లు మాత్రమే ఉంటాయి. విషపూరిత మూలకాలుండవు
   1) ఎ, బి మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, సి మాత్రమే 4) సి మాత్రమే
2. వాతావరణంలో మానవ కార్యకలాపాల వల్ల కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ కార్యకలాపాల్లో ముఖ్యమైన వాటిని గుర్తించండి.
   ఎ. శిలాజ ఇంధనాల దహనం
   బి. వ్యవసాయం సి. చెట్ల నరికివేత
   డి. హరితహారం
   1) ఎ, బి, డి మాత్రమే
   2) ఎ, డి మాత్రమే
   3) ఎ, బి, సి మాత్రమే
   4) ఎ, సి మాత్రమే
3. వాహనాల నుంచి వెలువడే 2.5 మైక్రాన్ల పరిమాణంలో ఉండే కణ స్వభావ పదార్థాలు (Particulate matter) ఊపిరితిత్తుల్లోకి అత్యంత సునాయాసంగా ప్రవేశిస్తాయి. వీటి వల్ల కలిగే జబ్బులేవి?
   1) శ్వాస సంబంధిత వ్యాధులు
   2) గుండె జబ్బులు 3) పక్షవాతం
   4) పైవన్నీ
4. కిందివాటిలో కేన్సర్ కారక పదార్థాలు ఏవి?
   1) కార్బన్ డై ఆక్సైడ్‌లు
   2) ఎరోమాటిక్ సమ్మేళనాలు
   3) ఎలిఫాటిక్ హైడ్రోకార్బన్‌లు
   4) జడవాయువులు
5. ఆమ్ల వర్షానికి కారణమయ్యే ప్రధానమైన ఆక్సైడ్‌లు ఏవి?
   ఎ. కార్బన్ ఆక్సైడ్‌లు బి. సల్ఫర్ ఆక్సైడ్‌లు
   సి. నైట్రోజన్ ఆక్సైడ్‌లు
   1) బి, సి మాత్రమే 2) ఎ, బి మాత్రమే
   3) ఎ, సి మాత్రమే 4) పైవన్నీ
6. వరి పొలాలు ఏ విధంగా భూగోళ తాపానికి కారణమవుతున్నాయి?
   1) నైట్రోజన్ డై ఆక్సైడ్ విడుదల చేయడం ద్వారా
   2) మీథేన్ వాయువు విడుదల చేయడం ద్వారా
   3) సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదల ద్వారా
   4) పైవన్నీ
7. కాంతి కాలుష్యం అంటే?
   1) రాత్రివేళలో పెద్ద పెద్ద నగరాలను ఆవహించి ఉండే కాంతి పుంజం
   2) ఫ్రియాన్ల వల్ల కలుషితమైన కాంతి
   3) అడవులు మండటం వల్ల వెలువడే కాంతి
   4) వాహనాల లైట్ల వల్ల వెలువడే కాంతి
8. కాంతి రసాయన స్మాగ్‌కు కారణమైనవి?
   1) హైడ్రోకార్బన్‌లు
   2) ఆల్డిహైడ్‌లు
   3) పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్
   4) పైవన్నీ
9. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరగడం వల్ల కలిగే దుష్ప్రభావం?
   1) ఆమ్ల వర్షాలు కురుస్తాయి
   2) హరిత గృహ ప్రభావం ఏర్పడుతుంది
   3) జలచరాలు చనిపోతాయి
   4) కిరణజన్య సంయోగ క్రియను నిరోధిస్తుంది

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2; 5) 1;
6) 2; 7) 1; 8) 4; 9) 2.

మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్

1. బెంజిమన్ హిగ్గిన్స్ అల్పాభివృద్ధి దేశాలకు సంబంధించిన ఏ అంశం గురించి పేర్కొన్నారు?
ఎ) సామాజిక ద్వంద్వత్వం
బి) సాంకేతిక ద్వంద్వత్వం
సి) అల్పస్థాయి సమతౌల్య స్తంభన
డి) వస్తుమార్పిడి విధానం
2. ఆధునిక అభివృద్ధిలో సాంకేతిక ప్రగతి ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నవారు?
ఎ) కుజ్‌నట్స్ బి) హరాడ్ – డోమార్
సి) మాథుర్ డి) షుంపీటర్
3. రోస్టో వృద్ధి సిద్ధాంతం ప్రకారం స్వయం సమృద్ధి సాధించిన దశగా దేన్ని భావించవచ్చు?
ఎ) అధిక వినియోగ దశ బి) ప్లవన దశ
సి) ప్లవన దశకు ముందున్న పరిస్థితి
డి) పరిపక్వ దశకు గమనం
4. కార్ల్‌మార్క్స్ కింది వాటిలో దేనికి ప్రాముఖ్యం ఇచ్చారు?
ఎ) మూలధన ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు – మూలధన నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
5. రోస్టో రచించిన **"The stages of Economic Growth"** గ్రంథాన్ని ఏ విధంగా వ్యవహరిస్తారు?
ఎ) కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
బి) నాన్ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
సి) మూలధన సంచయనం డి) పైవన్నీ
6. ప్రపంచంలో అధిక జనాభా వల్ల కలిగే దుష్పరిణామాలను మొదటగా వివరించింది?
ఎ) డాల్టన్ బి) థామస్ మాల్దస్
సి) రాబిన్‌సన్ డి) డ్యూసెన్‌బరి
7. 2013–14లో దేశంలో స్థూల దేశీయ పొదుపు రేటు ఎంత?
ఎ) జీడీపీలో 30.6 శాతం
బి) జీడీపీలో 32 శాతం
సి) జీడీపీలో 33 శాతం
డి) జీడీపీలో 34 శాతం
8. **"The problems of Industrialization in Eastern & South Eastern European Nations"** గ్రంథకర్త?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) రొసెన్‌స్టిన్ రోడాన్ డి) థామస్ మన్రో
9. రాగ్నర్‌నర్క్స్ సిద్ధాంతం ప్రకారం డిమాండ్ కోణంలో విష వలయాన్ని ఛేదించడానికి పేద దేశాల్లో వేటికి డిమాండ్ పెరగాలి?
ఎ) పెట్టుబడి బి) పొదుపు
సి) ఆదాయం డి) వస్తువులు, సేవలు
10. 2016–17లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ప్రపంచ బ్యాంకు ఎంత శాతంగా అంచనా వేసింది?
ఎ) 7.7 బి) 7.8 సి) 7.9 డి) 8.0
11. మూడో ప్రపంచ దేశాలు అనే పదాన్ని మొదటి సారిగా ఉపయోగించినవారు?
ఎ) ఆల్‌ఫ్రెడ్ సవి బి) మార్షల్
సి) ఫిషర్ డి) జాన్ రాబిన్‌సన్
12. స్థిర మూల ధనానికి, చర మూలధనానికి మధ్య నిష్పత్తిని తెలిపేది?
ఎ) మూలధన – ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు – మూలధన ఉత్పత్తి నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
13. అభిలషణీయ జనాభా సిద్ధాంతాన్ని మొదటగా చెప్పిన శాస్త్రవేత్త?
ఎ) మాల్దస్ బి) ఎడ్వర్డ్ వెస్ట్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) షుంపీటర్
14. 'జనాభా పెరుగుదల సమాజంలో ఆదర్శవంతమైన మార్పునకు సహకరిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) డ్యూసెన్‌బరి
సి) గౌతమ్ మాథుర్ డి) మాల్దస్
15. బలహీన **Spread effects** గురించి వివరించినవారెవరు?
ఎ) హరాడ్ బి) ఫీల్డ్‌మన్
సి) గున్నార్ మిర్దాల్ డి) ఎడ్వర్డ్ వెస్ట్
16. వనరులతో పోలిస్తే తక్కువ పెట్టుబడులు ఉన్న దేశాలను అల్పాభివృద్ధి దేశాలుగా అభిప్రాయపడినవారు?
ఎ) ఫీల్డ్‌మన్ బి) హెబర్లర్
సి) మార్షల్ డి) రాగ్నర్‌నర్క్స్
17. కమ్యూనిజం, సోషలిజం ఆధారిత దేశాలను ఏ దేశాలుగా వర్ణించవచ్చు?
ఎ) మొదటి ప్రపంచ దేశాలు
బి) రెండో ప్రపంచ దేశాలు
సి) మూడో ప్రపంచ దేశాలు
డి) నాలుగో ప్రపంచ దేశాలు
18. అంతర్జాతీయ వాణిజ్యం అల్పాభివృద్ధి దేశాల పారిశ్రామికీకరణకు అవరోధమని భావించింది?
ఎ) గున్నార్ మిర్దాల్ బి) హర్ష్‌మన్
సి) డాల్టన్ డి) హెబర్లర్
19. విద్యా ప్రమాణాలు, శ్రామిక నైపుణ్యం పెరిగితే మూలధన – ఉత్పత్తి నిష్పత్తి?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది
డి) పెరుగుదలలో పెరుగుదల రేటు ఎక్కువ
20. మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం ఏది?
ఎ) శ్రమ బి) మూలధనం
సి) వ్యవస్థాపన డి) తక్కువ సాంకేతిక ప్రగతి
21. ద్వి అంతర నమూనాను ప్రతిపాదించింది?
ఎ) చినరీ బి) కార్ల్ మార్క్స్
సి) మహలనోబిస్ డి) ఫీల్డ్‌మన్
22. 'శ్రమ విభజన ప్రత్యేకీకరణను పెంపొందిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) ఆడమ్ స్మిత్
సి) మహలనోబిస్ డి) గౌతమ్ మాథుర్
23. 2013–14లో స్థూల దేశీయ పొదుపులో ప్రభుత్వ రంగం వాటా ఎంత?
ఎ) జీడీపీలో 1% బి) జీడీపీలో 1.3%
సి) జీడీపీలో 1.5% డి) జీడీపీలో 1.6%
24. అంతర్జాతీయ వాణిజ్యం వెనుకబడిన దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నది?
ఎ) మార్షల్ బి) హెబర్లర్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) గౌతమ్ మాథుర్
25. **Incremental Capital - Output Ratio (ICOR)**ను ఎలా రాబట్టవచ్చు?
ఎ) (పొదుపులో మార్పు) ÷ (పెట్టుబడిలో మార్పు)
బి) (మూలధనంలో మార్పు) ÷ (ఉత్పత్తిలో మార్పు)
సి) (పెట్టుబడిలో మార్పు) ÷ (శ్రమలో మార్పు)
డి) ఏదీకాదు
26. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి ప్రధాన పాత్ర పోషించిన కారకం ఏది?
ఎ) మూలధన సంచయనం
బి) జనాభా పెరుగుదల
సి) సహజ వనరుల లభ్యత డి) పైవన్నీ
27. మాల్దస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా వృద్ధిరేటును తగ్గించేది?
ఎ) ప్రకృతి బి) తక్కువ ఉపాధి
సి) తక్కువ ఆదాయం డి) పైవన్నీ
28. **"Towards A dynamic Economics"** గ్రంథకర్త?
ఎ) డోమార్ బి) హరాడ్
సి) రాబిన్‌సన్ డి) ఫీల్డ్‌మన్
29. ట్రికిల్ డౌన్ వ్యూహాన్ని ప్రతిపాదించింది?
ఎ) ఫీల్డ్‌మన్ బి) రాబిన్‌సన్
సి) షుంపీటర్ డి) మహలనోబిస్
30. అల్పాభివృద్ధి దేశాలను ప్రపంచ మురికి వాడలుగా పేర్కొన్నవారు?
ఎ) మార్షల్ బి) ఆడమ్‌స్మిత్
సి) రాబిన్‌సన్ డి) కైరన్‌క్రాస్
31. 'అదృశ్య హస్తం' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించినవారు?
ఎ) మార్షల్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) ఆడమ్ స్మిత్ డి) మీడ్
32. అల్ప స్థాయి సమతౌల్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు చాలా కాలం చిక్కుకొని ఉన్నాయని పేర్కొన్నవారు?
ఎ) నెల్సన్ బి) లూయిస్
సి) డాల్టన్ డి) జె.బి. సీ
33. అల్పాదాయం అనేది అల్పాభివృద్ధి దేశాల్లో విష వలయాలకు కారణమవుతోందని పేర్కొన్నవారు?
ఎ) డాల్టన్ బి) రాబిన్‌సన్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) హెబర్లర్
34. వెనుకబడ్డ దేశాల్లో అమల్లో ఉన్న సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి నిరోధకాలుగా ఉంటాయి. వీటిని ఏమంటారు?
ఎ) సాంకేతిక పూర్వక నిరోధకాలు
బి) వ్యవస్థాపూర్వక నిరోధకాలు
సి) మార్కెట్ సంపూర్ణతలు డి) పైవన్నీ
35. ఆసియా దేశాల్లో ఉద్యమత్వం లోపించడానికి మూలధన కొరత లేదా ముడి సరకుల కొరత కారణం కాదని పేర్కొన్నది ఎవరు?
ఎ) గున్నార్ మిర్దాల్ బి) ఆడమ్ స్మిత్
సి) జె.బి. సీ డి) హెబర్లర్
36. అధిక స్థాయి తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన జనాభా స్థాయిని అభిలషణీయ జనాభాగా పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్, జె.బి. సీ
బి) మార్షల్, ఆడమ్ స్మిత్
సి) డాల్టన్, ఎడ్విన్ కానన్ డి) ఏదీకాదు
37. 'పొదుపును ప్రోత్సహించడం ద్వారా లభించే మూలధనాన్ని గుర్తించిన రంగాల్లో పెట్టుబడులుగా మార్చాలి' అనేది ఏ రకమైన వృద్ధి వ్యూహం?
ఎ) ప్లవన దశ బి) సంతులిత
సి) అసంతులిత డి) పరిపక్వ దశకు గమనం
38. **"Rate of Growth and Employment"** గ్రంథకర్త?
ఎ) హరాడ్ బి) డోమార్
సి) రాబిన్‌సన్ డి) రాగ్నర్‌నర్క్స్
39. మహలనోబిస్ నాలుగు రంగాల నమూనా ఏ సిద్ధాంతంపై ఆధారపడి ఉంది?
ఎ) ట్రికిల్ డౌన్ వ్యూహం బి) సోలో సిద్ధాంతం
సి) డోమార్ సిద్ధాంతం
డి) అధిక పెట్టుబడుల సిద్ధాంతం
40. ఆదాయం, డిమాండ్ పెరగడం వల్ల లాభోద్దేశంతో సమకూరే పెట్టుబడి?
ఎ) స్వయం ప్రేరిత పెట్టుబడి
బి) ప్రేరిత పెట్టుబడి
సి) స్థూల పెట్టుబడి డి) నికర పెట్టుబడి
41. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ పోటీ, స్వేచ్ఛా వ్యాపారం, వేతన సరళత ఉండాలని పేర్కొన్నవారు?
ఎ) కీన్స్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) ఫ్రీడ్‌మన్ డి) సాంప్రదాయ ఆర్థికవేత్తలు
42. 'అభివృద్ధి లక్ష్యం అభిలషణీయ స్వర్ణయుగాన్ని సాధించడం' అని పేర్కొన్నవారు?
ఎ) గౌతం మాథుర్ బి) ఆడమ్ స్మిత్
సి) రాబిన్‌సన్ డి) జె.బి. సీ
43. 'ఆర్థికాభివృద్ధి నిత్యం కొనసాగే అంతులేని ప్రక్రియ' అని పేర్కొన్నవారెవరు?
ఎ) మార్షల్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) హెగల్ డి) డాల్టన్
44. ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ ఒక స్థాయి నుంచి పై స్థాయికి కదలడాన్ని ఆర్థికాభివృద్ధిగా అభివర్ణించినవారు?
ఎ) షుంపీటర్ బి) గున్నార్ మిర్దాల్
సి) కీన్స్ డి) డ్యూసెన్‌బరి
45. 'ఆర్థికాభివృద్ధి ప్రారంభంలో శ్రమ సాంద్రత పద్ధతులు, ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న తర్వాత మూలధన సాంద్రత పద్ధతులు ఉపయోగించాలి' అని పేర్కొన్నవారు?
ఎ) ఐక్యరాజ్య సమితి నిపుణులు
బి) ప్రపంచ బ్యాంకు
సి) IMF డి) WTO
46. చిరకాలంలో వాస్తవిక తలసరి ఆదాయం పెరుగుదలను ఆర్థికాభివృద్ధిగా పేర్కొన్నది?
ఎ) డాల్టన్ బి) కానన్
సి) హెగల్ డి) ఆచార్య ఎల్లిస్
47. భారీ పరిశ్రమలు స్థాపించడం వల్ల దశల వారీగా వాటి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులోకి వచ్చి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని చెప్పినవారు?
ఎ) ఆడమ్‌స్మిత్ బి) ఫీల్డ్‌మన్
సి) డాల్టన్ డి) హెగల్
48. **"Business cycles, Capitalism, Socialism and Democracy"** గ్రంథకర్త?
ఎ) షుంపీటర్ బి) కానన్
సి) హెగల్ డి) ఎల్లిస్
49. పొదుపు, పెట్టుబడుల మధ్య అంతరాన్ని పూరించడానికి అల్పాభివృద్ధి దేశాలు సాధారణంగా ఏ సాధనాన్ని ఉపయోగిస్తాయి?
ఎ) పన్నుల రేటు పెంచడం
బి) లోటు బడ్జెట్ సి) విదేశీ సహాయం
డి) అంతర్గత రుణాలు
50. **"An Operational Research Approach to Indian Planning of 4 sector model"** పుస్తక రచయిత?
ఎ) ఆడమ్ స్మిత్ బి) కార్ల్‌మార్క్స్
సి) మహలనోబిస్ డి) మార్షల్

సమాధానాలు

1) బి;	2) ఎ;	3) డి;	4) సి;	5) బి;
6) బి;	7) ఎ;	8) సి;	9) డి;	10) బి;
11) ఎ;	12) సి;	13) బి;	14) ఎ;	15) సి;
16) డి;	17) బి;	18) ఎ;	19) సి;	20) బి;
21) ఎ;	22) బి;	23) డి;	24) బి;	25) బి;
26) ఎ;	27) ఎ;	28) బి;	29) ఎ;	30) డి;
31) సి;	32) ఎ;	33) సి;	34) బి;	35) ఎ;
36) సి;	37) సి;	38) బి;	39) ఎ;	40) బి;
41) డి;	42) ఎ;	43) సి;	44) బి;	45) ఎ;
46) డి;	47) బి;	48) ఎ;	49) బి;	50) సి.

How is 'TRAIL' written in that code?

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Read the following information carefully to answer the given questions.

In a global environment summit, eight representatives, viz P, Q, R, S, T, V, W and Z are representing different countries, viz Australia, Canada, France, Iran, China, Korea, Nepal and Britain, but not necessarily in the same order. All of them are sitting around a circular table facing the centre. V sits third to the left of T. R and Z and also their immediate neighbours do not represent France. Only one person sits between W and the representative of France. The representatives of Iran and Canada are immediate neighbours of each other. R represents neither China nor Iran. Only one person sits between P and the one who represents Korea. P does not represent either France or Canada. R sits third to the right of Z. Z represents Britain. T is not an immediate neighbour of either R or Z. The one who represents Australia is an immediate neighbour of T. Three people sit between Z and the representative of Nepal. Q is not representing either France or Australia. W is not representing Korea.

1. Who among the following represents Canada?
1) Q 2) R 3) T
4) V 5) Cannot be determined
2. Who among the following represent immediate neighbours of V?
1) P, Q 2) P, S 3) T, W 4) P, R
5) P and the representative of China
3. Which of the following is true regarding W?
1) W sits second to the right of P.
2) W represents Iran.
3) W sits between Q and the representative of Britain.
4) Only one person sits between W and the representative of Canada.
5) None is true
4. How many persons sit between S and the representative of Iran, when counted anticlockwise from S?
1) None 2) One 3) Two
4) Three 5) Four
5. Which of the following is true?
1) S represents France.
2) Only one person is sitting between the representatives of Iran and China.
3) The representative of Canada is an immediate neighbour of W.
4) One person sits between Z and the representative of France.
5) None is true

Directions (Q. No. 6 -10): Study the following information carefully and answer the questions given below:

Following are the conditions for selecting a Finance Manager in an organisation: The candidate must

(i) be a graduate in any discipline with at least 50% marks.
(ii) have completed Postgraduate Degree/Diploma in Management with specialisation in Finance with at least 65% marks.
(iii) have post- qualification work experience of at least 4 years in the finance department of an organisation.
(iv) be at least 26 years and not more than 36 years as on 1.12.2011.

In the case of a candidate who fulfils all the conditions **except**

(a) at (ii) above, but has secured at least 60% marks in post-graduate degree/diploma in management with specialisation in Finance and at least 70% marks in graduation, his/her case is to be referred to the DGM-Finance.
(b) (iii), but has post qualification work experience of at least two years as Assistant Finance Manager, his/her case is to be referred to the GM-Finance.

In each question below, details of one candidate are provided. You have to take one of the following courses of action based on the conditions and sub-conditions given above and the information provided in each question and mark the number of that course of action as your answer. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 1.12.2011. ***Mark answer:***

1) If the candidate is to be selected.
2) If the data provided are inadequate to take a decision.
3) If the candidate is not to be selected.
4) If the case is to be referred to DGM - Finance.
5) If the case is to be referred to GM-Finance.

Now, read the information provided in each question and mark your answer accordingly.

6. Hemant Shah was born on 19 March 1981. He has been working in the finance department of an organisation for the past six years. He has scored 65% marks in B.Com and 75% marks in his postgraduate degree in management with finance as specialisation.
7. Subodh Sahay was born on 7 November 1982. He has been working for the past four years as Assistant Finance Manager in an organisation after completing his post-graduate degree in Finance management with 66% marks. He has scored 52% marks in BSc.
8. Neera Bhagat has been working in the finance department of an organisation for the past seven years after completing her post-graduate degree in management with specialisation in Finance with 62% marks. She has scored 75% marks in BSc. She was born on 12 January 1983.
9. Sudha Malhotra was born on 26 July 1984. She has been working as Assistant Finance Manager for the past three years in an organisation after completing her Postgraduate diploma in management with finance as specialisation with 68% marks. She has scored 55% marks in BA.
10. Atul Khemka has been working in Finance department of an organisation for the past five years after completing his post-graduate degree in management with finance as specialisation with 60% marks. He has scored 60% marks in BCom. He was born on 4 November 1985.
11. In a certain code, 'BEAMING' is written as 'BFCMHOJ' and 'CLEAR' is written as 'MDESB'. How is 'TRAIL' written in that code?
1) USAMJ 2) USAJM
3) SUAMJ 4) SUAJM
5) None of these
12. If it is possible to make only one meaningful English word with the third, fourth, sixth and seventh letters of the word COURTESY, using each letter only once in the word, which of the following will be the third letter of that word? If no such word can be formed, give "N" as your answer, If two words can be formed give "P" as your answer and if more than two such words can be formed, give "M" as your answer.
1) R 2) P 3) S 4) N 5) M
13. How many digits in the number 5279143 will be as far away from the beginning of the number as they will be when the digits are rearranged in ascending order from left to right within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
14. How many such pairs of digits are there in the number '5391246' in both forward and backward directions, each of which has as many digits between them in the number as when the digits are arranged in ascending order within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
15. In a certain code, 'TASK' is written as 'BUJR' and 'BIND' is written as 'JCCM'. How is 'SUIT' written in that code?
1) VTSH 2) VSTH 3) TRUJ
4) TRJU 5) None of these

Directions (Q. No. 16-20): Study the following information carefully and answer the questions given below:

M, N, A, D, J, V and R are sitting around a circular table facing the centre but not necessarily in the same order. V is third to the right of J. N is fourth to the left of R. R is on the immediate right of J. A is fourth to the right of D. D is not an immediate neighbour of V.

16. Who is second to the left of N?
1) V 2) J 3) A
4) M 5) Data inadequate
17. What is M's position with respect to R?
1) Fourth to the right
2) Third to the left
3) Fifth to the right
4) Third to the right
5) None of these
18. Who is fourth to the right of R?
1) V 2) N 3) M
4) A 5) None of these
19. Who is second to the right of J?
1) N 2) A 3) V
4) D 5) None of these
20. Who is on the immediate right of D?
1) M 2) J 3) N
4) Data inadequate
5) None of these

ANSWERS WITH EXPLANATION

(1-5):



1. 4 **2.** 4 **3.** 5 **4.** 3;
Only two persons, i.e W and Z
5. 2
(6-10):
6. 1 **7.** 1 **8.** 4 **9.**5
10. 3
11. 3; As,



And



Similarly,



12. 5; Third, fourth, sixth and seventh letters are U, R, E and S respectively. Words that can be formed with these letters are SURE, USER and RUSE.
13. 2;
Given number: 5 2 7 9 1 4 3
Ascending order: 1 2 3 4 5 7 9
There is only one such digit, i.e 2.
14. 5;
Given number: 5 3 9 1 2 4 6
Ascending order: 1 2 3 4 5 6 9
Such pairs: 1–2, 1–3, 4-9 & 5-9.
15. 1; As,



Similarly,



ie VTSH
(16-20):



16. 3 **17.** 3
18. 5;
D is fourth to the right of R.
19. 2 **20.** 1